


చెన్నపట్టణము ౧౯౨౭ అక్టోబరు

248

సంపుటము ౪ ప్రభవ సంవత్సరము ఆశ్వయుజమాసము సంఖ్య ౧౦

# గులాబి

మండపాక పార్వతీశ్వరశాస్త్రి గారు, బి. ఏ.

ప్రకృతి సౌందర్యంబుఁ బరికించువేళఁ
బురుషుని మహిమంబుఁ బాడిచూపుచుండుఁ
బురుషుని మహిమంబుఁ బరికించువేళఁ
బ్రకృతిసౌందర్యంబు రహిఁ నించుచుండుఁ;
బ్రకృతిపూరుషు లేక భావంబునొంది
యద్వయానందంబు నందించు వేళ
నడ్డంకు లెన్నియో యవతారమంది
యనుభవింపఁగనీక యారటపెట్టు;
గురువాక్యమే దానిఁ గొనసాగఁ జేయు
ననుభవించినవాఁడె సాక్షి దీనికిని.

* * * *

శ్రీమించుమించులం జెన్నారుఘనులు
జీవనంబులొసంగి చింతఁ దోల్పుచ్చి
సరసులఁ బోషించు సమయ మేతెంచె
నసమర్థులైనట్టి యఖిల భూజనులు
వసులాభ మొందు భవ్యదినంబులయ్యె
కడుపార నన్నంబుఁ గల్గింపఁ జాలి
కన్నుపండువుగాఁగఁ గన్పట్టుచున్న
వరలక్ష్మిఁ బూజించి భక్తిఁ జూపించు
శ్రావణీ శుక్రవారం బేగుదెంచె.
భక్తిపై ననురక్తి శక్తిపై భక్తి
నొక్కరీతిగఁ జిత్త ముప్పొంగులూరఁ
పిండివంటలతోడ విసువులేకుండ
భుజియించి యాయాసమును బోవనాడ
నిలువీడి దవ్వుగా నెందేని తిరిగి
సాంధ్యకృత్యంబులు సరవిఁ గావించి

పరమేశనామ సంస్మరణంబుతోడఁ
బ్రణవజపంబుతో వడివడిగాఁగ
నింటికి నొక్కండ నేతెంచుచుంటి.

దరియవ్వ మాయిల్లు; ద్వారంబునందుఁ
దివ్యమామిడిబంటు తేఁకువ నిల్చి
భయమును జూపి కావలిఁగాచుచుండె;
మామిడిబంటు నేమంబు నెఱింగి
ద్వారంబుదాటిలోపలి కేగుచుంటిఁ
గన్నుపండువుగాఁగఁ గన్పట్టె నెదుటఁ
గూర్మిమీఱఁగ నొక్క కొల్వుకూటంబు.

* * * *

ఇరుగెలంకులను గన్నెరు కన్నెబంట్లు
పూలమైమఱువు లింపులుగుల్కఁ దాల్చి
సారంగరాగ విస్తారంబుమీఱఁ
గైవారములు ప్రీతిఁ గావించుచుండ,
విరివింటిజోదులౌ బిరుదొందుబంట్లు
మల్లియల్ బారులై మన్ననల్ సేయ,
నాతపత్రము కేల నంగుగాఁబూని
పోకబోదియ సేవ పూన్కిమైఁ జేయఁ,
దెలిపూల చామరంబులు సేతఁబూని
గరుడవర్ధనములు పరిచర్య సేయ
సంపెంగ, విరజాజి, సన్నజాజులును,
పారిజాతము నందివర్ధనంబులును,
జేమంతి మొదలైన శృంగారవతులు
పూవులాకులును జేఁబూని నిల్చుండ,
నారికేళాంగనల్ వల్లడంబట్టు
నుల్లభంబన నొప్పి, తెల్లఁజుక్కలను
గొనబులుగుల్కు నల్లని యంబరంబు
క్రిందవెన్నెలలీను చందురుండన్న
కాచవిద్యుద్దీప కళిక వెల్గునను
రంగుఁబూవుఁతోడ రాణ నొప్పారు
నాకుఁ బచ్చనిచీర హాసుమైఁ దాల్చి
తనతావి, తనయీవి, తనఠీవి యలర,
రాణులు తలఁదాల్చు రాణివాసంబు
లలితపల్లవపాణి యలినీలవేణి
విరులకెల్లనురాణి పరమకళ్యాణి
యభయముద్రనుదాల్చి యానందమొప్పఁ
గొల్వుండె నాకొల్వుకూటంబు నందు.

* * * *

కొల్వున్న విరిరాణి చెల్వువీక్షించి
భయవినయములు సంభ్రమమునుగూడి
ముప్పిరిగొనుచుండ, ముందుకువచ్చి
సాష్టాంగముగ నమస్కారంబు నేసి,
సభయెల్ల నొకసారి సంతసంబొప్పఁ
దిలకించి, యెదుటనే చెలఁగుచునున్న
పచ్చికపఱుపై భద్రాసనమున
భక్తిమైఁ గూర్చుండి, పరమమోదమునఁ
జేమోడ్చి, యేమియో చింతించుచుంటి;
ఇంచుకసేపు చింతించుచునుండ
స్వాంతంబు విరిరాణిపై నిల్చిపోయె.

* * * *

కొలువునందంతటం గూడియున్నట్టి
పరివారముల్ స్మృతిపథమును దప్పె;
విమలసాంద్రంబైన వెల్గునెన్నడుమ
విరిరాణియొక్క ఛవి విలసిల్లుచుండె.
చెదరు పాటింతేని చేరంగనీక
విరిరాణియొక్కటే వీక్షించుచుంటి.

* * * *

వీక్షింపవీక్షింప విరిరాణిపైని
నాదుచిత్తంబు లగ్నంబు కాఁజొచ్చె.

చిన్నారిపొన్నారి చిగురువ్రేల్గములు
కదలాడుచుండఁ జక్కనిచిక్కనైన
వేణురావము మెల్ల వినఁబడుచుండె.

మంచుఁదుంపురులతో మలసిమందముగ
విరిగందవాడిఁబూని పిల్ల తెమ్మెరలు
గంతులాడుచును జెంగటనాడుచుండ్రి.

ఆపాటలాయాట లరయుచునుంటి
నింద్రియంబుల వెల్ల నేకత్వమందె;
కనులతో వినుచుంటిఁ గనుచుంటిఁ జెవుల;
నాలుకతో వాసనలు చూచుచుంటి
ముక్కుతోఁ దాఁకుచు మురియుచు నుంటి;
తనువుతో వినుచుంటిఁ గనుఁగొంచునుంటి
నేయింద్రియమ్ముతో నేమేమి పనులు
సేయుచునుంటినో చెప్పంగఁ జాలఁ
గనుముక్కు చెవులును దనువు నాలుకయు
నన్నియు నొక్కటై యానంద మొనఁగ.

* * * *

విరిరాణియందంబు వీక్షించుచుండి
నిశ్చలధ్యాన నిర్నిద్ర భావమునఁ
గొంతసే పీరీతిఁ గూర్చుండియుండ
విరిరాణి వేఱొక్క విధముగాఁ దోఁచె.

వేణుదండముచేత వింతగాఁబట్టి
యంగుళులార్చుచు నందంబుమీఱ
నూదుచుఁ బ్రణవంబు పాడుకొల్పుచును
మంద్ర మధ్యమతార మహిమముల్ సూపి
తాన మానమ్ముల గానమ్ము సేయు
తతదీప్యమాన సుందరవిగ్రహంబు
కనుపట్టుచుండె నాకన్నులయెదుట
విరిరాణి యీరీతి వింతగా మాఱె
యనసనుభూతానందమందు నక్షముంచ.

ఆదివ్యవిగ్రహం బటుసూచుచుండి
యాఁడుదో మగవాఁడో యనుకొంచునుంటి
అనుకొనుచున్నప్పు డంతలోపలనె
రాధరూపం బట్లు రాజిల్లె నదియు;
అహహా, రాధా, యంచు ననుచున్నయంతఁ
గృష్ణరూపంబట్టె యెదుటఁగన్పట్టె;
అహహా, కృష్ణా, యంచు ననఁబోవుచుండ,
మరల రాధగరూపు మాఱె కన్పట్టె
రాధయో కృష్ణుఁడో రహిఁజూడలేక,
కృష్ణుఁడో రాధయో యెఱుఁగంగలేక,
చిత్త మిట్టట్టులు చెదరుచునుండ,
నొకమార్పునాలోన నుదయంబునందె,
రాధనైదృశ్యంబు రాజిల్లుచుండ,
నేనె కృష్ణుండన్న యెఱుక కన్పట్టె;
కృష్ణుఁడైదృశ్యంబు ప్రీతినింపంగ
నేనెరాధనటన్న యెఱుకకన్పట్టె;
వేణువునాచేత వెలుఁగుచునుండె.

మంద్రమధ్యమతార మహిమముల్ వెలయఁ
దానమానముల ననూన్యానంబుగాఁగ
దృశ్యంబానర్చెడు దివ్యగానంబు
ననుకరించుచుదాన నైక్యంబునొందు
చందాన గానంబు సలుపుచునుంటి.

దృశ్య మీరీతిని దివ్యగానంబు
గావించికావించి కడకుఁ దానొక్క
యానందనృత్యంబుఁ బూనెఁ గావింప.
ఆనృత్యమునకు నేయనురూపమైన
నృత్యంబుగావింప నేమొదలిడితి.

దృశ్యంబు నేనును బ్రేమమిళితంగ
ననురూపమైన నృత్యము సేయుచుండఁ
దనవైపు దృశ్యంబు నను లాగఁజొచ్చె.
దృశ్యంబు రాధయై, యేను కృష్ణుఁడుగ,
దృశ్యంబు కృష్ణుఁడై యేను రాధగను,
నొండొరులను వీడియుండంగలేక,
విమలసాంద్రానంద విభవంబుగాఁగ
నాలింగన మొనర్చు నట్లు కన్పట్టె.
ఆలింగనంబు దృశ్యంబుతో నిట్లు
కావించి, నిర్మలాఖండనిశ్చలమ
హాద్వైతమైన బ్రహ్మానందమందు
మునుఁగుచుఁ దేలుచు మునుఁగుచునుంటి.

* * * *

ఎంతసేపుంటినో యెఱుఁగనిమ్మాడ్కి-
ఇంతలో-అక్కటా-యేకతంబున నొ
యెవ్వరో వెనుకకు నీడ్చినట్లైనఁ
జప్పున నొక్కింత చైతన్యమబ్బె.
చైతన్యమబ్బిన సమయంబునందు
గాఢాంధకారంబు గప్పెనద్దెసల.
లేవయ్యెఁ జుక్కలు లేఁడయ్యె రాజు-
వెన్నెల లేదయ్యె-వెలుఁగు లేదయ్యె-
నాకాశమంత మేఘావృతంబయ్యె
నలుగెలంకులను గన్పట్ట దేమియును.
చిటపటపడుచుండెఁ జినుకులగములు-
విరిబోణికౌఁగిలి వీడుచునుంటి.

కాలసర్పమొకండు కాలఁదాఁకుచును
బ్రాకిపోవుచునున్న పగిదిఁ గన్పట్టె
నెవ్వరు నన్నిట్లు లీడ్చిరోయంచు
వెనుకకుఁ దిరిగి నే వీక్షింపఁ బోవ
మింటఁ దళుక్కని మెఱపొండు మెఱసె.
మెఱపు వెల్గునఁ గనుల్ మిఱుమిట్లు గొల్ప
దేదీప్యమానమహా దేహంబుతోడ
ఋషివతంసుండైన కృష్ణదాసుండు
కనుపట్టుచుండెను గన్నులయెదుట-
కనుపట్టుచున్నట్టి క్షణములోపలనె
పలుకొండు చెవులకుఁ బండువొనర్చె.
"చచ్చియుండుదువు నేఁడు చచ్చియుండుదువుర
బాలుఁడా, కొన్నాళ్లు బ్రతికియుండుముర,
చనిపోవ నీకింక సమయంబు కాదు-"
పలికిట్లు మత్కర్ణపర్వం బొనర్చ
దృక్పథంబును బాసెఁ గృష్ణదాసుండు
సంపూర్ణమైనట్టి చైతన్యమబ్బె.

* * * *

వర్షంబు భోరనఁ బడుచుండె; నాదు
బట్టలన్నియుఁ దడిపాతలైపోయె-
కాని, లోనికిఁ బోవఁ గాంక్షింపనైతి.
ప్రకృతిపూరుషులైన రాధికాకృష్ణు
లద్వైతమైన బ్రహ్మానందమిచ్చి
ననుఁ బ్రోచుచున్న సుంతయుఁ జూడలేక,
మచ్చరంబున నన్ను మాయింపఁ జూచి,
కాలసర్పము చెంతఁ గన్పట్టియుండఁ
గృపఁ బూని నాపైని గృష్ణదాసుండు
ప్రతివతంసుండు కారణదేహచారి
కాపాడె ననుఁగోరి-కాకయున్నప్పు
డీహాన నాగతి, యీశ్వరా యంచుఁ.
దలపోసి, తలపోసి, తలఁకంగ నేల
గురుకృపచే సమకూరఁగా రాదె
యింకొక్కపరియంచు నింటిలోపలికిఁ
దడియార్చుకొన, మెల్లఁ దరలిపోయితిని.

* * * *

ప్రకృతిపూరుషులేకభావంబు నొంది
యద్వయానందంబు నందించు వేళ
ననుభవింపఁగనీయ వర్షముల్ పెక్కు-;
గురువొక్కఁడే దానిఁ గోచరింపఁజేయు,
ననుభవించినవాఁడు సాక్షియొక్కండె.

# సూర్యరాయాంధ్రనిఘంటువు

## మచ్చుపదములు

చిలుకూరి నారాయణరావుగారు, యమ్. ఏ., యల్. టి.

1. శ్రీశ్రీశ్రీ పీఠికాపురాధీశ్వరుల ఆదరణము వల్ల ఆంధ్రసాహిత్యపరిషత్తువారు నెరవేర్చ ప్రయత్నిస్తూఉన్న బృహన్నిఘంటునిర్మాణము ఎట్లు సాగుతూ ఉన్నదీ తెలుసుకోవలసినబాధ్యత ఆంధ్రులందరికీ ఉన్నది. ఇది [illegible] కాదు. ధన మిచ్చేవారు శ్రీమహారాజావారైనన్నూ, పనిచేస్తూఉన్నవారు పరిషత్తువారైనన్నూ అయిఉండగా, ఈలేనిపోనిగొడవ మన కెందుకని ఊరకొనడము ఆంధ్రులకు ధర్మము కాదు. నిఘంటునిర్మాణఫలమును పొందవలసినవారు ఆంధ్రులు; నిఘంటువును మెచ్చుకోవలసినవారు ఆంధ్రులు. నిఘంటునిర్మాణముమీద ఎంతధనము ఎక్కువగాఅయితే, నిఘంటువుకూడా అంతఎక్కువ అవుతుంది. ఆనిర్మాణము ఎంతఆలస్యమయితే అంతకాలమూ ఆంధ్రులు [illegible] కూర్చోవలసి ఉంటుంది. అంతపెద్దప్రయత్నమును శ్రీమహారాజావారివంటివారు పూనవలసినదేకాని, ఇతరులకు సాధ్యముకాదు. పోనీ, డబ్బుమాట దేవుడెరుగునుగాని, ఆపనిని ఉత్సాహవంతులూ, సమర్థులూ అయిన ఇతరులు చేయడమునకు వెనుకతీయవలసివస్తున్నది. గనుక పదిహేనేండ్లనుంచీ జరుగుతూ [illegible] ఈబృహన్నిఘంటునిర్మాణము ఏఅవస్థలో ఉన్నదీ [illegible]మము ఆలోచించవలెను.

2. రెండుసార్లు ప్రూఫులు అయినవి. చెన్నపట్టణములో పరిషత్తు ఉన్నప్పుడు ఒకమచ్చుపదములపట్టికను పంపినారు. పిఠాపురము వచ్చినతరువాత తత్సమపదముల మచ్చుపట్టిక నొకదానిని పంపినారు. ఈరెండింటిమీదా విమర్శనములను కోరినారు. కొందరు పంపినారు. వాటితో నిఘంటునిర్మాణము వెనుకకు పోయినది. రక్షవచ్చినవాడు తిరిగీ ఆక్రమించినట్టు అయినది. ఇప్పుడు వచ్చినది మూడోపట్టిక: దీనిమీదకూడా విమర్శనమునుకోరినారు. కోరేవారేగాని వినేవారెవరనే ఉద్దేశముతో కొందరు ఊరకొన్నారు. ఆరునెలల క్రిందట చెన్నపట్టణములో కొందరు సభచేసి నిర్బంధించగా, కొంతమంది తమకు తోచినవిమర్శనమును చేసినారు. అంతటితో ఎవరి మట్టుకు వారు ఊరకొన్నారు. సభలలో ఏవో నాలుగు ముక్కలు చెప్పడమువల్ల ఏమిలాభముకే? లిఖితరూపముగా అభిప్రాయములను ప్రకటిస్తే ఆంధ్రులకందరికీ తెలుస్తుంది. నిఘంటువును నిర్మిస్తున్న వారికీ ఉపయోగిస్తుంది. అందుచేత కొంచెము విపులముగా వ్రాసి 'భారతి'లో ప్రకటించుమని నామిత్రులు ప్రోత్సాహముచేసినందువల్ల ఈవ్యాసమును వ్రాయవలసివచ్చినది.

3. నిఘంటునిర్మాణము ఆరంభము కాకముందు ఇప్పటి ప్రధానసంపాదకులు నిఘంటునిర్మాణపద్ధతిని గురించి ఒకవ్యాసమును వ్రాసినారు. ఇంగ్లీషుభాషకు ముర్రేగారి ఆధిపత్యమున వెలువడిన 'ఆక్సుఫర్డాంగ్లనిఘంటువు' తమకు పరమలక్ష్యమయినా, అంత పెద్దప్రయత్నముచేయడము సాధ్యముకాదనిన్నీ, [illegible] కిట్టెలు దొరగారి కన్నడనిఘంటువున్నూ, గండర్టుగారి మళయాళనిఘంటువున్నూ తమకు లక్ష్యములుగా ఉంటే చాలుననిన్నీ తృప్తిపొందినారు. అంటే, ఆరెండునిఘంటువులకంటె తాము నిర్మించబోయే నిఘంటువు కొంచెము మిన్నగా ఉండవలెనని వారి అభిప్రాయము.

4. అయితే, పైని చెప్పిన కన్నడ, మళయాళ నిఘంటువులను లక్ష్యములుగా పెట్టుకొన్నవారు, ఆ నిఘంటువులను వారు ఏరీతిగా నిర్మించినారో తెలుసుకొనవలసి ఉంటుంది కదా. వారు తమనిఘంటువులకు వ్రాసిన పీఠికలలో తాము అవలంబించినవిధానమును సూచించియే ఉన్నారు. వారివాక్యములను ఈక్రింద సంగ్రహముగా తెనుగులో ఇస్తున్నాను.

### గండర్టుగారు

(1) పదములు అన్ని తరగతులు, అన్నివర్ణములు, అన్నివృత్తులవారినోళ్లనుండి బయలువెడలునట్టివి గ్రహింపబడినవి. అనేకజిల్లాలవారి వివిధములైన ఉత్తరములు, రికార్డులనుంచి ఎత్తి వ్రాయబడినవి. అన్నియుగములనాటి గద్యపద్యవాఙ్మయమునుంచి పదములు తీసుకోబడినవి.

(2) ఇప్పుడు వ్యవహారములో లేకపోయినా, తమిళమునకును, మళయాళమునకును అంత భేదములేని అవస్థలో, అనగా మళయాళవాఙ్మయము ఆరంభించక పూర్వము ఉండినపదములుకూడా ఇవ్వబడినవి. ఇవి ప్రాచీనములని చూపబడినవి.

(3) మళయాళనిఘంటువు సంస్కృత విద్యార్థుల ఉపయోగముకోసము కాదు. గనుక మళయాళభాషలోను, గ్రంథములలోను ఏదో సంస్కృతపదము లున్నవో అవిమాత్రము వ్రాయబడినవి. పురాణాదిగ్రంథములలో మాత్రము కనబడి అర్థము సరిగా నిర్ణయించడమునకు సాధ్యముగాని వృక్షాదులనామములు పరిహరింపబడినవి. మళయాళభాషలో స్థిరముగా నిలబడిన పదములుమాత్రమే తీసికోబడినవి.

(4) ఉత్తరకేరళము, దక్షిణకేరళములలోకూడ మాండలికముగా ఏర్పడినపదముల అర్థములు ముఖ్యముగా జాగ్రత్తతో సేకరింపబడ్డవి.

(5) మడికట్టుకొన్నవారికి కష్టముగా ఉన్నా, దేశచరిత్రమునుబట్టి భాషలో చేరిన అరబ్బీ, పారసీ, హిందూస్తానీ, బుడతకీచు, ఇంగ్లీషు మొదలయిన భాషలలోని పదములు చూపబడినవి.

(6) మాండలికపదములనూ, గ్రామ్య(భాషాగ్రామ్య) పదములనూ విడువలేదు.

(7) ప్రతిపదమునకున్నూ వ్యుత్పత్తిని చూపడమునకు ప్రయత్నము చేయబడ్డది. సజాతీయములయిన ఇతర ద్రావిడభాషాపదములు చూపబడినవి.

(8) ప్రతిపదమునకున్నూ సాధ్యమయినంతవరకూ ధాతువున్నూ, దాని ఉత్పత్తియున్నూ చూపబడ్డవి. తొలుత పదమునకేఅర్థముండేదో, ఆలంకారికముగా దానిఅర్థము ఏతీరుగా మారుతూ వచ్చినదో ఉదాహరణసహితముగా చూపబడినది. సందర్భానుసారముగా అర్థములో పదములు పొందే మార్పులూ, ఆపదమునకు సంబంధించినంతమట్టుకు గాథలు, జనులనమ్మకములు, సామెతలు– ఈవిషయముల ననుసరించి ఆయా ఉదాహరణము లివ్వబడినవి. సమస్తపదములున్నూ, ప్రధానపదమునుంచి పుట్టిన ఇతరపదములున్నూ ప్రధానపదముక్రిందనే చూపబడినవి.

(9) ఒకపదముక్రింద వివిధప్రాంతములలో అ[illegible] పొందిన ఉచ్చారణభేదములున్నూ చూపబడినవి. ఆభేదములకు ఉదాహరణములు ఇవ్వబడినవి.

(10) గ్రంథములోనిపుటలసంఖ్య కావలసినంతకంటె ఎక్కువ కాకుండా ఉండేటట్లు చేయబడ్డది. ఏపదమునకు ఎంతప్రాముఖ్యము ఇవ్వవలెనో అంతే ఇవ్వబడ్డది. అందుచేత సంస్కృతభాగము తక్కువపుటల నాక్రమించుకొన్నది.

(11) గ్రంథము పెరగకుండా ఉండడమునకు సంకేతములు విరివిగా ఉపయోగింపబడినవి. సంస్కృతములో ఒకపదము ఏలింగములో, ఏవాడుకలో ఉన్నా, అది మళయాళ భాషలోనికి వచ్చినతరువాత ఏలింగములో, ఏవాడుకలో ఉన్నదో అది మాత్రము చూపబడినది.

### కిట్టెలు

గండర్టు అనుసరించిన విధానము కాక, వి[illegible]గా ఉన్న సంగతులుమాత్రము మన తెనుగునిఘంటువునకు ఉపయోగించేటంతమట్టుకు ఇక్కడ చూపుతున్నాను.

(1) పదములపట్టికలను నేనే స్వయముగా వ్రాసుకొన్నాను. వ్రాయసకాండ్రకు ఆపనిని విడిచిపెట్టలేదు.

పదములవ్యుత్పత్తులు, భాషాచరిత్రసంబంధించినవిషయములు, మొదలయినవి నేనే వ్రాసుకొన్నాను. సాధారణవ్యవహారములో ఉండేపదములను చేర్చుకొన్నాను.

(2) కన్నడపదములు స్పష్టముగా కనబడేటందుకు వాటిని పెద్దచ్చులో ముద్రించినాను. తక్కినవాటికి చిన్నచ్చునే ఉపయోగించినాను.

(3) ఒకపదము కన్నడభాషలో ఏయేరూపములుగా మారినదో చూపేటందుకు = అనుగురుతు పెట్టి, ఆ రూపములనన్నిటిని చూపినాను.

(4) పైని వ్రాసినదానినిబట్టి కిట్టెలు, గండెర్టు గార్లు ఎంతజాగ్రతగా తమపనిని నిర్వహించినారో తెలియగలదు. వారు గమనించినవిషయములు (i) గ్రంథము కురుచగానుండి, పుటలసంఖ్య ఎక్కువ కాకుండా ఉండేటందుకు ఏర్పరచుకొన్న నియమములు; (ii) పదములవ్యుత్పత్తికిన్నీ, అర్థనిర్ణయమునకున్నూ కావలసినసామగ్రిని చూపడమునకు ఏర్పరచుకొన్నవిషయములు: అని రెండు విధములుగా ఉన్నవి. ఈరెండువిషయములందును శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటునిర్మాతలు ఏపాటిజాగ్రత్త తీసుకొన్నారో కొంచెము చూతాము.

(౫) (అ) మచ్చుపదములు 54 పుటలగ్రంథమయినది. వీటిలో ప్రూఫు సరిగా చదువనందువల్ల పడిన అచ్చుతప్పులు: పీఠిక, పుట ౧-పంక్తి ౯ - సాధనసామగ్రి; పుట ౨౦, * పంక్తి ౨౯- ద్వి. త్రి. శబ్దముల (ఇచట సంపూర్ణవిరామ చిహ్నము లక్కరలేదు); పుట ౨౪, పంక్తి ౮- అంటరాసేల్పు (అంటరానివేల్పు); పంక్తి ౩౦- విరోధను (విరోధము).

(ఆ) గ్రంథములకు కొన్నిసంకేతము లీయబడినవి. "మచ్చుపదములయుదాహరణములకై గ్రంథసంకేతాదులు పైని చూపఁబడినవి" అని పట్టికక్రిందను వ్రాయబడినది. ఈసంకేతములను తాము నిఘంటువులో అనుసరించడమునకు వ్రాసినారో, ఎందుకో తెలియదు. తాముదాహరించిన కొన్నిటికిసంకేతము లివ్వలేదు; తాము చూపిన కొన్నిగ్రంథములనుంచియుదాహరణము లివ్వలేదు. ఇందుకు నిదర్శనములు:—

| గ్రంథముపేరు | ఇచ్చినసంకేతము | వాడినసంకేతము | ఏపదముక్రింద |
|---|---|---|---|
| హరివంశము | హరి | హరి. ఉ. | అ. (౨ అర్థము) |
| విజయవిలాసము | విజ. వి. | విజయ | అంకపాళి; అంగము; |
| ,, | ,, | విజ | అందు ౨ (౫ అర్థము) |
| రామాభ్యుదయము | రామా | రామాభ్యు | అంకావలోకములు; అంతుపార్వణము |
| | | ,, | కథ; కాక; |
| సారంగధరచరిత్రము (ద్విపద) | ద్వి, సారం | ద్వి. సారం | అంకించు |
| నిర్వచనోత్తరరామాయణము | నిర్వ | నిర్వ, రామా | అంకించు (౪ అర్థము) |
| సీతావిజయము, అను శతకంఠరామాయణము | సీతా. వి. | సీతా. వి. | అంకించు (౪ అర్థము) |
| | ,, | ,, | ,, |
| జైమినీభారతము | జై. భా. | జై. భార. | అంకించు (౪ అర్థము) అంటు (౪ అర్థ) |
| కృష్ణాభ్యుదయము | కృష్ణాభ్యు | కృష్ణా | అంకించు (౬ అర్థము) |
| ...కల్పము | క్షేమ | క్షేమ. జ | అంకురిలు |
| చంద్రా...ంగదచరిత్రము | చంద్రాంగ | చంద్రా | అంగడి (౩. అర్థము); అంగు (౧. |
| భాస్కరశతకము | ,, | ,, | అర్థము) అంచు; అంచనుక ; |
| యయాతిచరిత్రము | భాస్కర. శ. | భాస్కర. శత. | అంక చంద్రాంగ, ఇనుమాను |
| చమత్కారమంజరి | యయా | యయాతి | అంగు (౨. అర్థము) |
| నలచరిత్రము (ద్విపద) | చమ | చమత్కా | అంచించు |
| హరిశ్చంద్రోపాఖ్యానము | ద్వి. నల | ద్వి. నలచ | అంచలము |
| | హరిశ్చం | హరిశ్చ | అంజు |

| | | | |
|---|---|---|---|
| దేశ్యనామార్థకోశము | దేశ్య | దేశ్యనామార్థకోశ | అండై |
| నైషధము | నైష. | నైషధ | అంత (౧. అర్థము) |
| బహులాశ్వచరిత్రము | బహు | బహులా | అందు (౩. అర్థము) |
| భర్తృహరి | భర్తృ | భర్తృహరి | అను (౯. అర్థము) |
| రుక్మిణీపరిణయము | రుక్మి. ప. | రుక్మిణీ | కడకే |
| బసవపురాణము | బస. పు. | బస. పురా | కాంకేయము |
| అష్టమహిషీకళ్యాణము (ద్విపద) | అ. మ. క. ద్వి. | అ. మ. క. | కాని=కాన్ |
| సంపూ. రామాయణము | సంపూ. రా. | సంపూరా | అనిక |
| చెన్న బసవపురాణము | చెన్న. పు. | చెన్నబ | అనుకల్ల |
| పాండురంగమాహాత్మ్యము | పాండురంగ | పాండురం | ఇదు (౨. క. అర్థము) |
| ” | ” | పాండురంగ | ఇదు (౬. అర్థము) |

(i) ఇచ్చినసంకేతమునకు విలక్షణముగా ఉండుట:—

(ii) పట్టికలో కొన్ని సంకేతములు లేకుండుట:

అవిరాన్ తామ్రశాసనము. శ. సం. (చూ. అంగరంగభోగములు); వ్యాక., నాటక., జ్యోతి (చూ. అంకము); అలం. (చూ. అంజనము); వ్. (చూ. అంకె); ఇ. (చూ. అంకపాలి); బు. (చూ. అంగసంస్కర్త); ఈ. (చూ. అంకన); అ. ఆ. అ. (చూ. అంకకుండు); అ. (చూ. అంకకరణము); అ. (౫ అర్థముక్రింద); భా. (చూ. అంకకాండు ౧ అర్థము); కో. భాగ. (చూ. అంటుతాయి;) సం. (చూ. కాని=కాన్).

ఇట్లే గ్రంథములలోని భాగములకును, ఆశ్వాసములకును సంకేతములు తెలుపనిదే మచ్చుపదముల అర్థవివరణములో ఉపయోగించినారు: ఉ. (హరి. ఉ.); పూ. (హరి. పూ.)(హరిశ్చ. ద్వి. పూ.); ఆది., ఉద్యో., ద్రోణ., మౌ. (భార.—ఆది., ఉద్యో., ద్రోణ., మౌ.); వాద., మహి., దీక్షా., మౌ. (పండితా. వాద., మౌ.); యు. (అచ్చ. రా. యు.); ప్రా. (విజ్ఞా. ప్రా.); అర., సుం., మౌ. (భా. రా.—అర., సుం.—మౌ.); మొదలయినవి ఉదాహరణములు.

(iii) పట్టికలో సంకేతము లిచ్చిన కొన్ని గ్రంథములు ఉదాహరింపబడకుండెను:

ఇచ్చినపట్టిక మచ్చుపదముల ఉదాహరణములకే అని చెప్పినప్పుడు, సంకేతింపబడిన గ్రంథములన్నీ ఉదాహరింపబడి ఉండునని అనుకొందుము. కాని, పట్టికలో ఇవ్వబడ్డ అధ్యాత్మరామాయణము, ఘటికాచలమాహాత్మ్యము, నరసభూపాలీయము, రుక్మాంగదచరిత్రము, శశాంకవిజయము, సీతారామాంజనేయసంవాదము, సుమతిశతకము— ఈ గ్రంథములనుంచి ఉదాహరణములు లేవు.

(iv) ఉదాహరింపబడ్డ కొన్ని గ్రంథములు పట్టికలో లేకపోవడము:

కో. భాగ. (చూ. అంటుతాయి); అవిరాన్ తామ్రశాసనము (చూ. అంగరంగభోగములు); గుంటూరుజిల్లా ఈపూరుశాసనము (చూ. అంగరక్ష)

(౩) మచ్చుపదములమొత్తము ఇంచుమించు 300. వీటిలో సంస్కృతపదములసంఖ్య ఇంచుమించు 224. దేశ్యపదములు 70. ఈదేశ్యపదములలో 'అంకుసము' మొదలయిన తద్భవములును, 'అంగరకా', 'అంగరేకు' మొదలయిన అన్యదేశ్యభవములున్నూ ఉన్నవి. మిశ్రమములకే సంజ్ఞలో 6 పదము లున్నవి. సెట్టి పేరు, లింగము పతి పేరు లన్నట్లు తెనుగుకోశము సంస్కృతశబ్దములతో నిండిపోయేటట్లు కనబడుతుంది. కిట్టెలు, గండెర్టుగార్లు తమ నిఘంటువులలోనికి తద్భవభాషలలోనికి అన్యముగా చేరిన సంస్కృతపదములనే తీసుకొన్నారు. బ్రౌన్‌దొర గారు తమ తెనుగునిఘంటువులో అనుసరించిన పద్ధతి కూడా ఇదే. శబ్దరత్నాకరములో కొంతవర[illegible] శబ్దములసంఖ్య పెరిగినా, మొత్తముగా[illegible] సంపాదించు కొన్నాము. కాని, బృహన్నిఘంటువు[illegible]నే ఉన్నదను సంస్కృతనిఘంటువులోని శబ్దములతో[illegible] ఆప్టేగారి సం. బోలు. బ్రౌన్యాదులలోగాని, శ[illegible] నిండిపోతుందికా[illegible] రత్నాకరములోగాని

లేని కొన్ని సంస్కృతశబ్దములు ఈబృహన్నిఘంటువు లోని కెక్కినవి. ఉదా. అంకకరణము, అంకకుడు, అంకతలము, అంకధారణ, అంకన, అంకిని, అంగదవిర్యాహము, అంగనాప్రియము, అంగపాలిక, అంగపాళి, అంగప్రత్యంగము, అంగప్రాయశ్చిత్తము, అంగభువు, అంగవర్ణము, అంగారకమణి, మొ. అంకనీయము, అంకినీ, అంకితవ్యము, అంక్యము అనేపదములు ఆప్తేనిఘంటువులోకూడా లేవు. 'అంగీకుర్వత్', 'అంచత్' అనే శత్రంతరూపాలను ఎందుకు వ్రాసినారో తెలియదు.

తెనుగుభాషకు సంస్కృతము (పదముల విషయములో) ముఖ్యాధారముగా ఉన్నది; అందుచేత, సాధ్యమయినన్ని సంస్కృతశబ్దములు తెనుగునిఘంటువులలోనికి ఎక్కడము మంచిదే అని పండితులు చెప్పతారు. పూర్వకాలములో అటువంటిఅవస్థ తెనుగుకు పట్టిఉన్నా, దానిలోని కిప్పటివరకూ వచ్చిన సంస్కృతశబ్దములు చాలును. ఇ[illegible] సంస్కృతశబ్దాలు కావలిస్తే, అవి తెనుగులోనికి వ[illegible]త, భాషలో స్థిరపడినతరువాత వాటిని కోశములలోనికి ఎక్కించుకొందాము. ఆలాగయితే మన భాషలోనికి ఇంగ్లీషు, ఫ్రెంచి, బుడతకీచు, అరబ్బీ, పారసీ, హిందూస్తానీ, మహారాష్ట్రము మొదలయిన భాషలలోనిపదాలు వచ్చినవని, ఆభాషలలోని శబ్దాలన్నీ మనకు ఎప్పుడో ఒకప్పుడు పనికిరాకపోతవా అన్నకారణముచేత ఆయాభాషలనిఘంటువులను తెనుగుచేసి, మన బృహత్కోశములోనికి ఎక్కించుకోవలసినదేనా? తాము నిర్మించబోతున్నది సంస్కృతనిఘంటువా తెనుగుకోశమా? ఆప్తేకోశములోని పదములకు డు, ము, వు, లు తగిలించడమునకు ఇంతప్రయాస మెందుకు? అని కొందరడుగుతున్నారు. దీనికి సమాధాన మేమని వస్తుందో.

పోనీయండి, ఆప్తేనిఘంటువును ఆంధ్రీకరించినవారు ఆకోశములో శబ్దముల కీయబడ్డ కొన్ని అర్థములను ఎందుకు వదలివేయవలెను. ఉదా. 'అ' అనేదానికి అన్ని అర్థాలూ (మన కక్కర ఉన్నా లేకపోయినా), వైశ్వానరుడు అనే అర్థమును ఏల వదలిపెట్టినారో?

(ఈ) నిఘంటునిర్మాతలు ముఖ్యముగా తమనిఘంటువును కొనుటకు డబ్బు తక్కువగా ఉన్నవారివిషయములోనూ, దానిని ఉంచుకొనుటకు ఎక్కువగా స్థలము లేనివారివిషయములోనూ, దానిని మోయడమునకు బలము చాలనివారి విషయములోనూ ఆలోచించవలసిన సంగతి తాము చేయబోయే నిఘంటువుపుటలసంఖ్య అనవసరముగా పెంచకుండడమని మనవిచేస్తున్నాను. తా మనుసరించదలచుకొన్న ఆప్తే, కిట్టెలు, గండెర్టుగార్లున్నూ, ఇతరభాషాకోశనిర్మాతలున్నూ ఈవిషయమై చాలా శ్రద్ధ తీసుకొన్నారు. గనుక, వారిపుస్తకములను కుదురుగా, గుత్తముగా చేసికొని, చెప్పవలసినది సంపూర్ణముగా చెప్పివేసి, చెప్పనక్కరలేనిది చెప్పక, కొన్నిపట్ల ఎంత చెప్పవలెనో అంతేచెప్పి, సర్వజనోపయోగకరముగా చేయడమునకు ఎంతో తంటాలుపడినారు. బృహన్నిఘంటునిర్మాతలకు ఈలక్షణము లేవీ ఉన్నట్టు కనబడదు. ఇందుకు నిదర్శనములు:—

(i) ప్రతిశబ్దముక్రిందను ఎక్కువగా ఎడములను వదలివేయడము.

ఈలోపము ఇంచుమించు అన్నిశబ్దములక్రిందను కనబడుతున్నది. ఉదాహరణములను ప్రత్యేకపంక్తులలో వ్రాయనవసరము లేదు. ఒకపంక్తిలో ఒకఉదాహరణము అంతమయినయెడల దానివెంటనే మరి ఒకఉదాహరణము వ్రాయవచ్చును. మొట్టమొదటి 'అ'ను చూడండి: 'ఉకారమున కాదేశముగావచ్చు వర్ణము' అన్నవాక్యము వెనువెంటనే 'ఉదా. చేయుడు, చేయుమి' అని వ్రాయవచ్చును. అందువల్ల ఒక పంక్తి కలిసివచ్చును. దానితరువాత ౨ అర్థమునకును ౩ అర్థమునకును మధ్య నిష్కారణముగా ఒకపంక్తిపట్టదగిన ఎడమును వదలిపెట్టినారు. ఈరీతిగా నాలుగుపంక్తులలో ఇముడవలసినవిషయము ఆరు పంక్తులవరకు ఆక్రమించినది. ఇట్లు మొదటిపుటలోని 56 పంక్తులను సుమారు 40 పంక్తులలో ఇముడింపవచ్చును. ఇందువల్ల ఎంతలేదన్నా నాలుగోవంతుస్థలము చెడకుండ ఉంచవచ్చును.

(ii) ఒకపదమునకు అనేకార్థములున్నప్పుడు ౧, ౨, ౩, అని ఒకఅర్థము అయినతరువాతస్థలము మిగులుతే దానిని విడిచిపెట్టి, వేరొకపంక్తిలో ఆరంభించడము:

ఒకఅర్థమున్నూ దాని ఉదాహరణములున్నూ కాగానే, ఆపంక్తిలోనే తరువాతి అర్థము సంఖ్యవేసి

ఆరంభించవచ్చును. ఇందువల్లకూడా చాలాస్థలము కలసి వస్తుంది.

(iii) ఒకపదమునుంచి పుట్టిన ఇతరపదములను ప్రత్యేకపంక్తులలో వ్రాయడము:

ఇదికూడా అనవసరమే. ప్రధానపదముక్రిందనే కొట్టులుకొరకు చేసినట్లు–(hyphen) సంజ్ఞ ఉంచి ఉపపదములను వ్రాయవచ్చును. ఇట్లే సమస్తపదములనుకూడా ప్రత్యేకపంక్తులలో వ్రాయక, సమాసములోని మొదటి పదముక్రిందనే వరుసగా వ్రాయవచ్చును. ఇందువల్ల మరి ఒకలాభముకూడా ఉన్నది: ఏకార్థసంబంధములైనపదములన్నీ ఒక్కచోట కనబడుతవి. ఉదాహరణమునకు— 'అంకము' అనేపదమునకు 'ఒడి' అని అర్థమున్నది దీనిని 'అంకము1' అని వ్రాసి, దానిక్రిందనే 'అంకతలము, అంకపాలి, అంకపాళి' మొదలయిన 'ఒడి' అని అర్థము వచ్చే పదములను, వాటిఅర్థములను వ్రాయవచ్చును. తరువాత 'అంకము=అంకె' అనేదానిని 'అంకము2' అని వ్రాసి దాని క్రింద అంకతంత్రము, అంకపూరణము, అంకలోపము, అంకవిద్య,' మొదలైన పదములను ఉదాహరింపవచ్చును. తరువాత 'అంకము3=గురుతు' అని వ్రాసి, దానిక్రింద 'అంకకరణము, అంకకుడు, అంకధారణ, అంకన, అంకనీయము, అంకబంధము, అంకితము, అంకితవ్యము, అంకిని' మొదలైనపదములను చేర్చవచ్చును. 'అంకము4=నాటకములో ఒకభాగము' అని వ్రాసి, దానిక్రిందనే 'అంకముఖము, అంకావతారము, అంకాస్యము' మొదలయినవాటిని చూపవచ్చును. ఇట్లే ఇతరార్థములందును చేస్తే, ఏకార్థసంబంధములు ప్రధానపదములున్నా, సమస్తపదములున్నా ఒక్కచోటనేకనబడడమేకాకుండా చాలాస్థలముకూడా కలసివస్తుంది. ఇట్లే 'అంగము', 'అంగుళి' అనే ప్రధానపదములక్రింద వాటితోకూడిన సమస్తపదములను చేర్చవచ్చును. ఈరీతిగా అన్నిపదములవిషయములోను చేస్తే, నాలుగోవంతుస్థలమయినా కలిసివస్తుందని నానమ్మకము.

(iv) అనవసరములయిన వ్యాఖ్యానములు చేయడము:

చూ. 'అంకెవన్నియ' అనేపదముక్రింద 'ఈపదమునకు...గ్రహింపబడినది' అని పెద్దవ్యాఖ్యానము చేయబడినది. కాని, తె. క. లలో "అంక... తె. అంకెము. కొన్నిప్రతులలో 'అంకెవన్నియ.' అందుచేత 'అంకవన్నియ, అంకెవన్నియ' అని రెండురూపములును ఉన్నవి" అని వ్రాసిన చాలును. ఇట్లే మరికొన్నిశబ్దములక్రిందను చూచుకొనేది.

(v) ఉదాహరించిన పద్యభాగములను కావలసినంతకంటె ఎక్కువగా వ్రాయడము:

ఈలోపము ఇంచుమించు అన్ని ప్రయోగములందును కనబడుతున్నది. దీనిని మారిస్తే, చాలాస్థలము కలసి వస్తుంది.

(vi) సంస్కృతశ్లోకములను ఉదాహరించడము:

తెనుగులో పదములవాడుకను తెలుపడమునకు సంస్కృత శ్లోకముల నుదాహరించడము పాండిత్యప్రకర్షమును చూపుకొనడము కాక, తెనుగుకోశములో నిరుపయోగము. చూ. అంకపాలి, అంచితము.

(vii) సర్వలక్షణసారసంగ్రహాదులవలె 'అనుటకు' 'తెలుపుటకు' అని గురుతుకు మారుగా మాటలతో వ్రాయడము: చూ. 'కాని' మొ.

(viii) చిన్నసంకేతములతో సరిపోవువాటికి పెద్దసంకేతములు చేయడము:

ఉదా. 'కవిరాజ' (కవిరా. అంటే చాలును); 'కాశీ శత'. కాశీశ అంటే చాలును; 'కుచేలు' (కుచే అంటే చాలును.) ఇట్లే ఇతరములనన్నీ చేస్తే, కొంతస్థలము కలసివస్తుంది.

(ix) విరామములు మొదలయినగురుతులను సరిగా వాడకపోవడము:

'ఉదా:—' అని వ్రాయడముకంటె 'ఉ.' అంటే చాలును. 'మొదలగునవి' అని వ్రాయడముకంటె 'మొ.' అంటే సరిపోతుంది. ఇట్లే తక్కినచోట్లను.

ఈరీతిగా గ్రంథమును సంక్షేపించడమునకు ఎన్ని ఉపాయములయినా ఉన్నవి. వాటిని ఇతరభాషానిఘంటుకారులు అవలంబించినారు. ఇవన్నీ సాధారణజనులకు స్వల్పవిషయాలుగా కనబడవచ్చును. కాని, నిఘంటు

నిర్మాణము ఒక శాస్త్రమువంటిది. ఈకులువులన్నీ తెలియకపోతే అచ్చువేసేవారికి కష్టము, కాగితము ఖర్చు ఎక్కువ, పెట్టుబడి పెట్టేవారికి కష్టము, గ్రంథము కొనేవారికి కష్టము. పైనిచూపిన లోపములు లేకుండా ఉంటే 64 పుటలునిండిన మచ్చుపదములను 30 పుటల లోనికయినా దింపవచ్చునని నా అభిప్రాయము.

**7.** ఇంతవరకూ నిఘంటువు బహిరాకారమును గురించి ముచ్చటించినాము. ఇంక దాని లోపలివిషయమును పరిశీలించుదాము.

### (i) అర్థనిర్ణయము

(అ) నిఘంటువుకు అర్థము ప్రాణమువంటిది. అర్థమును స్థూలముగా నిర్ణయించకూడదు. అర్థచ్ఛాయలను మాప్రతేసేకాని ప్రయోజనముండదు. 'అంగ' అనే పదమును చూడండి. దీనికి 'పూర్తిగాచాచియుంచిన రెండడుగులకును నడిమిప్రదేశము, దాని పరిమా[illegible] అనే అర్థమును వ్రాసినారు. శబ్దరత్నాకరములో '[illegible]లు చాచి పెట్టినయడుగు' అని అర్థమున్నది. ఈఅర్థమే కొంచెముబాగున్నట్టున్నది. 'అడుగు' అనగానే ముందు కొక కాలున్నూ, వెనుక కొక కాలున్నూ వేయుడమని స్ఫురిస్తున్నది. 'పూర్తిగా చాచియుంచిన రెండడుగులకును నడిమిప్రదేశము' అంటే ఆ అడుగులను ముందుకును, వెనుకకును చాచడమో, కుడియెడమలను చాచడమో సందిగ్ధముగా ఉన్నది. 'అంగ' అంటే ముందువెనుకలకు చాచిన అడుగులఅంతరము. కుడియెడమలకు చాచితే 'పంగ'అవుతుంది. 'అంగ'కు రూపాంతరము 'అంజ.' 'అడుగులఅంతరము' అనేఅర్థమునుంచి 'దాటు'అనే అర్థము వచ్చినది. 'అంగ'క్రింద ఇచ్చిన ఉదాహరణములో 'అంగగొను'అనేదానికి 'దాటుచేయు' అని అర్థము. ఇట్లే, 'నాలుగంగలు(వేసి)' అంటే 'నాలుగుదాట్లు' అని అర్థము.

'అంగలార్చు' అనేపదమును చూడండి. దీనికి 'ధ[illegible]లచేత ఆర్చు; దుఃఖించు' అని అర్థము వ్రాసినారు. 'అంగలార్చు'లో 'ఆర్చు'కు అంగతో ఏట్టిసంబంధమున్నూ లేదు. 'తెగటార్చు, ఓదార్చు' మొదలయినపదములలోని 'ఆర్చు'వంటిదే ఈ'ఆర్చు'కూడాను. 'అంగలార్చు' అంటే 'గంతులువేయు' అని అర్థము. 'దుఃఖించు' అనే అర్థము ఆలంకారికము.

'అంగవించు' అనేక్రియకూడా 'అంగ' నుండిపుట్టినదే. 'అంగ + ఇచు' కన్నడములో 'అంగవిసు' అవుతుంది. అదే తెనుగులో 'అంగవించు' అనిఅవుతుంది. ఉదాహరణములోని 'అంగవించిరేని' అనేదానికి 'కదియు, సమీపించు' అనేఅర్థముకంటె 'విజృంభించు' అనేఅర్థము బాగుంటుందేమో.

(ఆ) ఈరీతిగానే ఇతరపదముల అర్థములనుకూడా విచారించుదాము:—

అ 1(౨ అర్థము) "వ్యతిరేకార్థక ప్రత్యయము పరమగునపుడు ధాతువుల తుది ఉకారమున కాదేశముగా వచ్చువర్ణము: ఉదా. చేయడు, చేయక, చేయమి" అని వ్రాసినారు. పైఉదాహరణములలో వ్యతిరేకార్థకప్రత్యయమేది,? 'అ' అనేదే అని చెప్పవలెనుగదా. కాని, పై అర్థములో ఏదో మరిఒకప్రత్యయ మున్నట్లు ధ్వనిస్తున్నది.

అ 1(౫ అర్థము) "ప్రశ్నించునపుడు తద్ధర్మార్థకమున ఉత్తమపురుషప్రత్యయములు పరమగునపుడు వచ్చు దుగాగమమునకు వికల్పముగావచ్చునది" అని ఉన్నది. తద్ధర్మార్థ 'క' మున అంటే ఏమిటో? 'ఏమని చెప్పన్', 'ఏమనన్', 'ఏమని నుతింపన్' — అనేచోట్ల 'చెప్పన్', 'అనన్' 'నుతింపన్' అనేవి దుగాగమమునకు వికల్పముగా వచ్చినవి కావు. 'చెప్పుట', 'అనుట', 'నుతించుట' అనేఅర్థములలో వచ్చిన తుమున్నంతరూపములు.

అ1 (౬ అర్థము) "విధిత్రైకనసనము"— ఇచట సంధి ఎట్లు సిద్ధించినదో.

అ3 (౩ అర్థము) తిట్టుటయందు 'అక్' అని ద్రుతసహితముగా ఉండును.

అ4 (౪ అర్థము) ప్రార్థనార్థ 'క' మందు అంటే?

అ4 (౬ అర్థము) 'నిల్వరయేని' అనుచోట 'అ' కారము ఆలంకారికము కాదు. 'నిల్వనేనిల్వరేని' అని అర్థము.

అ5 'ఆ' అనుదానికి కొన్నిచోట్ల వచ్చెడి యాదేశము అనిచెప్పినతరువాత 'అట్లాదేశముగా వచ్చినప్పుడు పైవర్ణమునకు ద్విత్వమువచ్చును అనివ్రాయవలెను.

అ[1] ఆప్తేనుండి అన్ని అర్థములను గ్రహించి నారుకాని, 'వైశ్వానరుఁడు' అనే అర్థమును దిగవిడిచినారు.

అ[2] ఆప్తేనుండి అన్ని అర్థములను ఎత్తుకొన్నారుగాని, 'అనుత్తమ' మొదలగువాటిలో 'అ' అర్థభేదము నుకలిగించదు అనే ముక్కను వదలివేసినారు.

అంకపాలి (౧ అర్థము)-'ఒడిలో నుంచుకొని పాలించునది, దాది, ఉపమాత' అనేఅర్థము ఆప్తేలో లేదు. శబ్దరత్నాకరములో ఉన్నదానిని సవిమర్శకముగా ఎక్కించినారు. ప్రయోగమైనా ఇచ్చినారుకారు.

అంకపాలి-దీనికి 'తోడ' అనేఅర్థము ఏనిఘంటువులోనూ కనబడదు.

అంకము-దీనికి 'తోడ' అనేఅర్థములో ప్రయోగము లున్నవా?

అంకశాంకములు, అంకాశాంకములు—మిక్కిలిబాధపెట్టువేడిమి, తీక్ష్ణత అని ఈపదాలకు వ్యుత్పత్తి. 'అంకె' అనగా 'భారము, బాధ, దుఃఖము' (చూ. కిట్టెలు: అంకె 15 అర్థము.) 'శాంకము' అనేది 'శాక్కు' అనేధాతువునుంచి పుట్టినది. "బిడ్డకు ఒళ్లు (జ్వరముచేత) శాక్కుపోతున్నది", "అంకాశాంకాలుగా జ్వరమువచ్చినది." 'అంకము' అనేది 'అక్కు' అనేధాతువునుండి పుట్టియుండవచ్చును. దీనికి 'ఆకస్మికముగా' అని అర్థము. "వాడు అక్కునక్కున విరాదపడ్డాడు. అక్కునక్కున లిగిపోయినాడు." ఉదాహరణములలోని "అంకాశాంకాలు దరికొనంగ" అనేదానిలో 'దరికొనంగ' అనేపదములన్నైనా "అంకాశాంకాలు" అంటే "తీవ్రత, ఉష్ణత్వము" అని స్ఫురిస్తూనేఉన్నది. కవిసర్పగారుడమునుంచి ఇచ్చినఉదాహరణము కొంచెము పూర్తిగాఉంటేబాగుండేది. ఇచ్చినభాగము అర్థనిర్ణయమునకు చాలదు. ఈపదముక్రింద వ్రాసినదంతా శబ్దరత్నాకరమునుంచి అవిమర్శకముగా సంగ్రహించినారు. శ. ర. లో కుదురుగా ఉన్నది. ఇందులో ఎక్కువస్థలము నాక్రమించినది.

అంకించు- "గుబ్బపాలిండ్ల నంకింపుమ గౌఁగిట," "అంకించి తనలోన నఖిలప్రపంచంబు," "మోహ మంకింతురు మునులకైన", "మహిమ లంకించుమను" అనేఉదాహరణములలో 'అంకించు' అనగా 'గురుతుపడునట్లు చేయు (Impress) అనియే అర్థము.

అంకురము.—(౨ అర్థము) ముసలము, ముగ్గ- ఈఅర్థము శబ్దరత్నాకరములో లేదు. ఇందుకు ప్రయోగము ఇస్తే బాగుండును.

అంకె. (౧ అర్థము)—సంఖ్యను తెలుపురేఖ. దాఁ. అంకియ- అని వ్రాయవలెను. (౨ అర్థము) కన్నడములో 'అంకె'కు 'ఆజ్ఞ, అధికారము, నిరోధము, ఆనకొనుట, అనుగ్రహ, విశ్వాసము' అనే అర్థములున్నవి. 'సామీప్యము' 'చేరిక' అని లేవు. సామీప్యము, చేరిక అనే అర్థాలకు ప్రయోగాలు ఇవ్వవలసిఉంటుంది.

అంక్యము.—కరక్కాయవలె నుండెడి యొకానొకవృక్షంగము. కరక్కాయ, వాక్కాయ, పోక్కాయ, వెలక్కాయ, ఏలక్కాయ- మొదలయినరూపాలు పరివర్తువారికిష్టములేవా?

అంగజాలలు- 'జా'పైని ౨ అంకె … 'అంగ' మొదలగుపదములలో వేయలేదు. "సం. అంగ + జాలం = శరీరకవచము" అని వ్రాసినారు. 'జాలము' అని వ్రాయవలసినది. ఇది సంస్కృతశబ్దమయితే పుష్పగురుతు ఎందుకిచ్చినారుకారు? సంస్కృతములో ఈఅర్థములేనందువల్ల ఆగురుతు ఇవ్వలేదంటారా? 'అంకము'క్రింద 'వీణాంకమాలికల' అని ప్రయోగమిచ్చి, అందులోని 'అంక'శబ్దము సంస్కృతముకాదని వ్రాసినా, 'అంకము'నకు పుష్పగురుతు ఎందుకు ఇచ్చినారో? 'అంగజాలలు' అనేదానికి 'ఏకవచనప్రయోగము కనబడలేదు' అని వ్రాసినారు. అయితే ఇది నిత్యబహువచనమంటారా? బ్రౌణ్యములో "అంగజాలవాఁడు = a village drudge" అనివ్రాసి ఉన్నదికదా.

అంగదట్టము.—దీనికి "శరీరముకప్పు … బట్ట" అని అర్థము వ్రాసినారు.

ఈఅర్థము శబ్దరత్నాకరములో లేదు. ఈఅర్థములో ప్రయోగమున్నదా? ఈపదము మిశ్రమన్నారు. కాని, చూ. అంగము(శ. ర.).

అంగన్యాసము.—"విహితమగు మంత్రభాగములను హృదయాదిస్థానములయం దుంచునట్లు సూచించు

టకై యాయాస్థానములు స్పృశించుట." ఆ యాస్థానములంటే హృదయాదిస్థానములా? వానిని స్పృశించుటే 'యాచించుట' ఎందుకు? 'ఆ యాస్థానములు' హృదయాది లకంటె వేఱయినవయితే ఆస్థానము లేవో చెప్ప ను గదా.

అంగపాళి=కౌఁగిలి. అంకపాళి, అంకపాలి, అంగపాలిక-అనేపదాలకు కూడా ఇదే అర్థము. అందుచేత ఆయాపదాలవద్ద తక్కినరూపాంతరములను చూపవలెను.

అంగబిల్ల=అంగబిళ్ల- అని వ్రాసినారు. 'అంగబిళ్ల' అనేపదమును ప్రత్యేకముగా వ్రాయలేదు.

అంగమచ్చము.—ఇది 'మి.' అనగా మిశ్రము అని వ్రాసినారు. శ. ర. లో 'దే.' అనగా దేశ్యము అని ఉన్నది. 'అంగ' అనేది సంస్కృతమని అభిప్రాయపడి ఇట్లు వ్రాసిఉండవచ్చును. అందుచేతనే 'ఒడలిగుఱుతు' అని అర్థము వ్రాసినారు. ఈఅర్థము శ. ర. లో లేదు. దీనికి 'కాలిగుఱుతు' అనియే అర్థము. చూ. ఆంధ్ర. అధికపాఠము, జాడ, అన్నా కాలిగురుతే.

అంగము.—ఈపదముక్రింద శ. ర. లో చతురంగములు, అంగపంచకము, పంచాంగములు, షడంగములు, సప్తాంగములు, అష్టాంగములు-అనునవి వివరింపబడినవి. ఈ నిఘంటువులో పరిహరింపబడినవి. ఈ వివరణము చాలా ముఖ్యమయినది. ఈశబ్దము దేశ్యమయినప్పుడుండే అర్థములను వ్రాసినారుకారు. కాని 'అంగు' అనేమాటకు 'అంగము, విఘ్నము'అని అర్థము వ్రాసినారు.

అంగరక్షుఁడు- 'రాజాదుల శరీరాదులను రక్షించువాఁడు' అని అర్థము వ్రాసినారు. రాజులకుకాక ఇంకెవ్వరికి అంగరక్షులుంటారు? 'శరీరాదులను' అనగా శరీరమునుకాక ఇంకావేటిని రక్షిస్తారు?

అంగరపూరియ—(సం. అంగారపోళికా) అని వ్రాసినారు. 'పూరియ' శబ్దము పోళికాశబ్దభవమని వీరి అభిప్రాయమేమో. 'నిప్పులపైఁగాల్చిన యొకవిధమగు పిండివంట' అని అర్థము వ్రాసినారు. పాత్రలో పిండి ఉంచి క్రిందను,మీదను నిప్పులువేసి కాల్చిన పిండివంటయేమో!

అంగరేకు—(హిం. అంగరేఖు) అని వ్రాసినారు హిందూస్థానీలో 'అంగరేఖు' అనేపదమున్నదా. 'అంగరఖా' అనేది ఉన్నదని మనకు తెలుసును. ఇది మిశ్రమెట్లయినదో?

అంగరోలై—గ్రాంథ్యములోను, శ. ర. లోను 'అంగరోలైలు' అని బహువచనాంతముగా ఉన్నది. ఏకవచనమునకు ప్రయోగ మున్నదా!

అంగలార్చు—ఇక్కడకూడా 'ఆర్చు' కున్నూ, 'అఱపు' కున్నూ సంబంధము లేకపోయినా, అట్లే అర్థము వ్రాసినారు. ఇచ్చిన ఉదాహరణములలో 'అంగలార్చుచున్', 'అంగలార్పఁగన్'అనే దాలకు 'గంతులువేయు' అనియే అర్థము. ఇట్లే 'అంగలార్పు.'

అంగవస్త్రము="శాల్లాయుపద్ధ, చిన్నబట్ట. ఈయర్థము తెనుఁగువనే కలదు." అని వ్రాసినారు. ఈయర్థము సంస్కృతములో లేదు అని వీరిఅభిప్రాయమై ఉంటుంది. కన్నడములో ఈపదము ఈయర్థములో ఉన్నది.

అంచె-ఇది నవీనరూపము. దీనికి తుళు, తమిళ, మళయాళభాషలలో 'అంజల్, అంచల్' అని రూపములున్నవి. హళగన్నడములోనూ 'అంచెల్' అనియే రూపము. హొసగన్నడములోనూ, ఆధునికాంధ్రములోనూ 'అంచె' అయినది. 'అంచెల్'లోని 'ల'కారము బహువచనప్రత్యయమనుకొని దానికి 'అంచె' అనే ఏకవచనరూపమును కన్నడులున్నూ, తెనుగువారున్నూ కల్పించుకొన్నారు. ఇట్లే మరికొన్ని శబ్దములనున్నూ చేసుకొన్నారు. తెనుగులోని ప్రాచీనకావ్యములలో 'అంచెలు' అనే రూప మున్నది. 'అంచె' ఉన్నట్టు తోచదు. 'అంచెలు', 'అంచెల' అనే వాటిలో ఏది సరియైనరూపమో నిర్ణయించవలెను. 'అంచెలు' అంటే 'వరుస,బారు' అనేఅర్థములే కాని, 'గుంపు' అనేఅర్థము పొసగదు.

అంచుకమ్మలు.—ఇది బహువచనమని వ్రాసినారు. 'కమ్మల్' అనునది ఏకవచనము. దీనికే తెనుగులో 'కమలాలు' అని బహువచనములో వాడుతారు. 'అంచుకమ్మలు' అని అచ్చు పొరపాటుపడినది.

అంచుకయించుక.—అనగా 'అక్కడ కొంచెము, ఇక్కడ కొంచెము'అని అర్థము. కాని, కేవలము 'కొంచెము' అనికాని, 'ఇంచుక' అనికాని అర్థము కాదు.

అంజలిగుంజలి — దీనికి "క్షోభపడునట్లు, సీకాకుపడునట్లు, బాధ కలుగునట్లు" అని అర్థము కాదు. 'అంజ' అనగా ముందుకువేసినఅడుగు, 'గుంజ' అనగా వెనుకకులాగినఅడుగు. అందుచేత 'అంజలిగుంజలి' అంటే 'ముందుకును వెనుకకును లాగు' అని అర్థము. తక్కిన అర్థములు ఆలంకారికములు.

అంటు — (౧౦-అర్థము) "నూనె మొదలగునవి రాచు" అని అర్థము వ్రాసినారు. నూనె రాచుట వేరు, అంటుట వేరు.

అంటుకత్తియ, అంటుకాడు — ఈ పదములు 'నంటుకత్తియ, నంటుకాఁడు' అని ఉండవలెనేమో! యతిస్థానములో చూచి ఈ రూపములను నిర్ణయింపవలెను. దీనికి రూపాంతరము "నంటుకత్తియ, నంటుకాఁడు" అని శ. ర. లో ఉన్నదిగాని, అది విచార్యము. కన్నడములో 'నంటు, నెంటు' అని ఈ అర్థముండే కనబడుచున్నవి.

అంత — "సం. తావత్; ప్రా. తెత్తులు" అని ఇచ్చినారు. 'అంత' అనేది 'తావత్' నుండి కాని, 'తెత్తులు' నుండి కాని పుట్టినదని వీరి అభిప్రాయమా? 'తెత్తులు' అనే ప్రాకృతరూపము వీరికెక్కడ దొరకినదో. 'తావత్' అనే సంస్కృత పదమునకు మహారాష్ట్రీ ప్రాకృతములో 'తా, తావ, తత్తిఅం' అనే రూపము లున్నవి. శౌరసేనీప్రాకృతములో 'దావ' అని అగును. అపభ్రంశ ప్రాకృతములో 'తవహుఅం, తావ, తాఉం, తాహిం, తేత్తుల' అనేరూపము లున్నవి. కాని 'తెత్తులు' ఎక్కడా కనబడదు. 'తేత్తుల' అనేఅపభ్రంశరూపమే కాబోలు, నిఘంటునిర్మాతలనోటిలోపడి 'తెత్తులు' అని మరింతఅపభ్రంశమయినది. ఇక 'అంత'ను గురించిన వ్యాఖ్యానమును కొంచెము చూదాము. దీనిలో 'అ' సర్వనామమయిన 'ఆ'కును హ్రస్వరూపము, 'ంత' అనేది పరిమాణవాచకమయిన ఒకానొక శబ్దము యొక్క లుప్తశేషమట. ఇంక తక్కిన వ్యాఖ్యానమటుండనీయండి. ఈవిషయమై కాల్డువెల్లుగారేమి చెప్పినారో చూడండి: "తమిళములో అంద=అది, ఇంద=ఇది, ఎంద=ఏది, అనే సర్వనామరూపము లున్నవి. ఇవి ఇతరద్రావిడభాషలలో లేవు. కాని ఇటువంటిరూపములే, బహుశః దాని ఉత్పత్తినే కలిగిఉన్న సర్వనామములు తెనుగు కన్నడములలో 'అంత, ఇంత, ఎంత' అనిఉన్న[illegible] కాని వీటిఅర్థము తెనుగు కన్నడములలో కొంచె[ము మా]రినది. వీటికి కొన్ని మాండలికరూపభేదము లున్నవి[illegible], అవి అంతముఖ్యములయినవి కావు. వీనిమొదటిరూపములు 'అంద్', 'అంత్' అనేవి. వీనిపైనిచేరిన 'అ' కారము సంబంధార్థక క్రియావిశేషణమును కల్పించేదిన్నీ, షష్ఠీవిభక్తిలో వచ్చేదిన్నీ అయిన 'అ' కారమగుట స్పష్టము. ఈ 'అ' కారమువల్లనే చాలా ఇతరవిశేషణరూపము లున్నా యేర్పడుచున్నవి." శబ్దోత్పత్తిని నిర్ణయించేటప్పుడు ఈరీతి నవలంబించవలెను కాని, 'ంత' అనేది ఒకానొకశబ్దము యొక్క లుప్తశేషమని కల్పింపరాదు. 'అంత' అనేది తచ్ఛబ్దార్థకమని నిఘంటుకారులున్నా ఒప్పుకొన్నారు. చూ. అంత (౨. అర్థము), ఉదా. 'అంతకంటెన్, అంతలోడన్' మొద. అందుచేత వీరు "'అంత' అనునది 'అద్' అనే సర్వనామమునుంచి పుట్టినది. 'అ' అనేది 'ఆ' అనే సర్వనామముయొక్క హ్రస్వరూపము. 'ద్' అనేది నపుంసకలింగమున వచ్చే ప్రత్యయము. అది 'అంద్' అని సానునాసికముగా కొన్ని ద్రావిడభాషలయం దుచ్చరింపబడును. దానిపై ఉన్న 'ంద్' కారము విశేషణమును కల్పించే ప్రత్యయము. 'ద' కారమునకు తెనుగు కన్నడములలో పరుషోచ్చారణము వచ్చినది. అందుచేత 'అంత' అనేరూపమేర్పడినది. తొలుత తచ్ఛబ్దార్థము కలిగిఉండిన ఈపదమునకు ఇతరార్థములును కలిగినవి" అని వ్రాయవలసినది.

అంతదనుక — దీనిని 'అంత + దనుక' అని పదచ్ఛేదము చేసినారు. అంత + తనుకన్ అని చేయవలసినది. 'తనుకు' శబ్దమే 'తొఁక' గా మారినది.

అందు — దీనిపై నిఘంటుకారులు చేసిన ఉ[ప]న్యాసము చూడండి. "మొదట ఇది కళగానుండె"—[illegible] అనగా ఎప్పుడు? "సప్తమ్యర్థక ద్వితీయావిభక్తిప్రత్యయము 'ను' చేర్పఁగా"—ద్వితీయావిభక్తిప్రత్యయమునకు 'ను'కు సప్తమ్యర్థ మెట్లువచ్చినది? 'ను' చేరినతరువాత ఇది ద్రుతాంతమయినదా? అంతకు పూర్వమా? అయినను, దానిని ద్రుతాంతముగా శబ్దముఖమున వ్రాసినారేల?

వెంటనే 'మొదట ఇది కళగానుండి' అని రెండును వ్రాసినారు! ఇది మొదటినుండినీ అవ్యయమా! లేక, [illegible]త అవ్యయమయినదా? 'అందు'కు 'ను' చేర్పక [illegible] 'ఆకోటను' అని అర్థమిస్తుందా, ఇవ్వదా? "తీయర్థములందే" అంటే నన్నయభట్టు 'అందు'ను తచ్ఛబ్దార్థకముగా వాడలేదని అభిప్రాయమా! 'అందుల' అనేదానిలో 'ఉల' అనేదేకదా తరువాత 'లో'గా మారినది! అప్పుడు 'అందు' తచ్ఛబ్దార్థక మవుతుందా, కాదా? "తర్వాత కవుల ప్రయోగములలో కళయై"- అంటే నన్నయలో కళగాను, ద్రుతాంతముగాను కూడా ఉండి, అతనికి తరువాతికవులలో తిరిగీ కేవలము కళ అయినదా? (అన్నట్టు 'భట్టారకు'డెవరు! ఇట్లే ఈముచ్చ పదాలలో వరిఒకచోట కూడా (చూ. అందుల) భట్టారకు డుదాహరింపబడినాడు. భట్టారకుడనగా నన్నయ అని వీరిఅభిప్రాయము. కాని, నన్నయ నెవ్వరూ కేవల భట్టారకశబ్దముతో సూచించి ఉండలేదు. ఇప్పుడు వీరొక క్రొత్తసంప్రదాయమును తెచ్చినారు. దానికేమిలెండి. ఈ 'అందు' యొక్క తత్త్వమును తెలుసుకొన ప్రయత్నింతాము. 'అందు' అనేది ఎప్పుడూ కళగానే ఉన్నది. 'అందును' అన్నప్పుడు 'ను'అనేది సముచ్చయార్థకము; కాని, సప్తమ్యర్థకద్వితీయాప్రత్యయము కాదు. దీనికి తమిళములో 'అంద్రు' అనిన్నీ, కన్నడములో 'అందు' అనిన్నీ రూపములు. 'అదు' అనే సర్వనామమును సానునాసికముగా ఉచ్చరించడముచేత 'అందు' అనేరూప మేర్పడినది. మొదటినుంచీకూడా దీనికి తచ్ఛబ్దార్థమున్నది. తెలుగులో 'అక్కడ' అనేఅర్థమున్నూ వచ్చినది. తమిళకన్నడములలో దీనికి 'అప్పుడు.' అనే అర్థము వచ్చినది.

అందుల="అందు ౧. ఆచోటు"అని అర్థము వ్రాసినారు. కాని, ఇది 'అందు'కు విశేషణరూపము. 'అందు+ఉల'అని పదచ్ఛేదము. 'ఉల'అనేది కొంతకాలమునకు 'లో'గా మారినది. 'ఆచోటు' అనేఅర్థములో ప్రాయికముగా 'వు' వర్ణములో కూడియుండునన్నారు. 'ప్రాయికముగా' అంటే ఏమయినా కావచ్చును. కాని,' అందుల' అనేదికూడా "ప్రాయికముగా"నే ఉండును. ఇదెంతప్రాయికమో అదీ అంతప్రాయికమే.

అగు- (తర అర్థముక్రింద) "సంఖ్యావాచకములపై పూరణార్థమున వచ్చు 'అవ' ఆగమమునకు పూర్వరూపము. దీనికి 'అవు' అనురూపమును గలదు. ప్రాచీనశాసనములందు 'అవ'కు మారుగా ఈరూపములే కనంబడుచున్నవి. దీనికి కవిత్రయప్రయోగములును కొన్నిప్రతులయందుఁ గలవు. తర్వాతికవులగ్రంథములలో 'అవ' అనియే కలదు." అని వ్రాసినారు. ప్రాచీనశాసనములన్నిటిలోనూ 'అగు' 'అవు' అనికనబడుతూఉండగా, రెండుమండలమీఁదను పైబడని "కొన్ని" ప్రతులలోని 'అవ' రూపములా వీరికి ప్రమాణములయినవి! ప్రాచీనపాఠనిర్ణయమును ఈనిఘంటుకారులు చేయ సామర్థ్యము లేనివారని ఇందువల్ల స్పష్టమవుతున్నది. ప్రాచీనపాఠములను నిర్ణయించనిదే, ఇట్టినిఘంటునిర్మాణప్రయత్నము నారంభింపకూడదు. అచ్చుప్రతులను ఇదివరలివారు చాలామట్టుకు తమఅభిప్రాయానుసారముగా దిద్దినారన్నసంగతి అందరికీ తెలిసినదే. ఇట్లే, తాళపత్రగ్రంథాలను వ్రాసినవారున్నూ చేసినారు. గనుక, ప్రాచీనపాఠనిర్ణయమునకు ఆయాకాలముల శాసనములలోని పాఠములు పరమప్రమాణ మవుతున్నవి. వాటిని విడిచిపెట్టితే, భాషాచరిత్రమే ఏర్పడదు. 'అవ' అనేరూపము శాసనాలలో సుమారు శతాబ్దమునుంచీ కనబడుతున్నది. అంతకుపూర్వము 'అగు' 'అవు' అనియే ఉన్నది. కవిత్రయమువారు తప్పక 'అగు' 'అవు'అనియే వాడినారుకాని, 'అవ' అని వాడలేదని ఘంటాపథముగా చెప్పవచ్చును. 'అగు' కు ఇంకను అర్థము లున్నవి. 'ఈభూమిలో పరి అవుతుంది, కాదు.'

అగుడెంచు = 'అగు' అనివ్రాసినారు. 'గతించు, కడచు' అని అర్థము వ్రాసినారు. 'ఏనేఁడు లగుడెంచె', 'సరోరుహాప్తుఁ డుదయం బగుడెంచె' అంటే 'ఏనేఁడులు గతించినవి,'సరోరుహాప్తుడుదయించెను'అని ఏపాటిభాషాజ్ఞానము కలవారూ చెప్పరు. 'ఏనేఁడు లయినవి''ఏనేఁడులు కానచ్చినవి' అనేవి ఏకార్థకములు కావు. 'అగుడెంచె' అంటే,'ఇంకా కాలేదు కాని, కొంచెముకాలములో అవుతుంది' అని అర్థము.

కాదుఁగూడదు=ఎంతమాత్రము కాదు- అని వ్రాసినారు.'ఒక్కరుఁడును గాదుఁగూడదు దనఁగర్తె' "అని [illegible]

హరణము. ఇచ్చట వారిచ్చిన అర్థము సరిపడదు. 'కాదు' అంటే 'ధర్మముకాదు' అనిన్నీ, 'కూడదు' అంటే 'చేయకూడదు' అనిన్నీ అర్థము చెప్పకోవలెను.

ii. కొన్నిమాటలకు అంతకంటె కఠినములయిన మాటలతో అర్థము చెప్పడము:—

ఉదా. అంకణము = చొవ్వరము; అంగమచ్చము = అవీచీగాంలము; అంగవిధి = ప్రధానవిధిచేత విహితమైన కర్మమునకు అంగకర్మమును తెలుపు విధి; అంగారవల్లికము = హింతాళి యనెడి రోగౌషధి; అంగారము=హింతాళియనుఓషధి; అంగిటిగుంట = ౧. గళగర్తము, వాలిక; అంగిటిముల్లు = ఉపజిహ్విక, ౨. ఉపజిహ్వికారోగము, గళాంకురము; అంగుళి=గజకర్ణిక; అంగుళీయము=ఊర్మిక; అంజె=గుబ్బతోలు మొదలగు సేవనాయంత్రము; అంటు=లగ్నము- మొద.

iii. 'ఒకానొకవిశేషము' అనిచెప్పి అర్థమును సరిగానిర్ణయించకపోవడము:—

ఉదా. అంకిణి, అంకుడు, అంకులు, అంకెన, అంగరొల్లె, అంజనకి, అంజె- మొద.

iv. ఆయాపదములతో సంబంధించిన ఇతరభాషా పదములనుచెప్పుట:—

(అ) సాధారణముగా కన్నడమునుంచియే అట్టి పదములను ఇచ్చినారు. ఇవ్వగలిగిన చోట్లకూడా ఇతర ద్రావిడభాషలనుంచి ఇవ్వలేదు:—

ఉదా. అంకకాడు (క. అంకకాఱ)- కాని, త. మ. అంగగారన్ అనికూడా వ్రాయవచ్చును; అంకణము-దీనికి తుళురూపముకూడా 'అంకణ' అనిఉన్నది; అంగడి-దీనికి మలయాళములో 'అఙ్ఙాడి' అని రూపము; అంగలార్చు-దీనికి మలయాళరూపము 'అంగలాయ్క్క'; అంగి-మలయాళములోకూడా 'అంగి'; అంజె- మలయాళములోకూడా 'అంజల్'; అండగొను-కన్నడము "అండగొళ్"; 'అండ'కు 'పార్శ్వము' 'ప్రక్క' అనే అర్థములో క. అండె, త. అణ్డై, అణ్టెయ్; అంటు త. లోకూడా 'అంటు', మ. 'అంటు'; అండె-తు. క. అండె; అగు- తు. ఆగు; ఇడు-క. త. మ. తు. ఇడు- మొదలయినవి.

(ఆ) ఇతరభాషాపదములను సరిగా ఇవ్వకపోవడము:—

ఉదా. అంకపన్నియ (త. అంగపడి) అని వ్రా[...]సినారు. తమిళములో 'అంగప్పడి' అనికాని, 'అ[...]' అనికాని ఉంటుంది: 'అంగపడి' అని ఉండదు.

(ఇ) చాలామాటలకు అసలే ఇతరభాషాపదములను చూపకపోవడము:—

ఉదా. అంకపొంకములు, అంకించు, అంకిలి, అంకు అంకుడు అంకుశము, అంకులు, అంకెము, అంగబిల్ల, అంగమచ్చము, అంగరొల్లె, అంగారుదొల్లె, అంగన, అంగలము, అంచు, అందుకమ్మలు, అందుక యించుక, అంజి, అంజ, అంజలిగుంజలి, అంటు, అండె, ఇడు—మొద.

8. కొన్నిపదాలకు ప్రయోగాలివ్వకుండా గ్రంథము, ఆశ్వాసము, పద్యసంఖ్యమాత్ర మిచ్చి ఊరకొన్నారు: ఉదా. అంకిలి-జాహ్నవీ. ౨. ౧౩౬; అంకటము-కళా. ౧. ౧౬౭; అంటు-రుక్మాం. ౧ ౬; ఆం. భా. ౨. ౫౪; అగు (౨౫ అర్థము)-వరాహ. ౪. ౬౬; అగు (౨౮ అర్థము)-వరాహ. ౩. ౧౭౧; ఇడు (౧. అర్థము. చ.)-ఆము. ౫. ౧౦౫; మొద.

9. పైనవ్రాసినదానినిబట్టి సూర్యరాయాంధ్రనిఘంటునిర్మాణము ఏరీతిగాజరుగుతున్నదీ స్పష్టపడగలదు. నిఘంటునిర్మాతలకు ఆంధ్రభాషాపద్ధతిగాని, దానిచరిత్రముగాని సరిగా తెలిసినట్లు కనబడదు. వీరు సరియైనపాఠములను నిర్ణయించలేరు. తమకిష్టముయిన కొన్నిగ్రంథములనే ఆధారముగాపెట్టుకొన్నారు. తక్కినగ్రంథములలోనిది ఆంధ్రభాష కాదని వీరిఉద్దేశమేమో. శాసనాలనుంచి అక్కడక్కడ ఉదాహరించినారు. తెనుగులో ఉన్న శాసనాలన్నీ వీరికి ప్రమాణములవుతవో, కావో తెలియదు. తెనుగులో నిరికార్థులు, ఉత్తరాలు, మాండలికపదములు, వృత్తులకు సంబంధించిన పదములు, మొదలం[...] వీరిదృష్టిపథములోనికి వస్తవో, రావో తెలియదు. [...] నిఘంటువు ఆంధ్రభాషఅంతటికిన్నీ నిఘంటువుగా ఉండవలెనుగాని, సంపాదకుల యిష్టమువచ్చిన పదాలకు మాత్రము నిఘంటువై ఉండకూడదు. శబ్దరత్నాకరములో నుంచిన్నీ, గ్రాంథ్యములోనుంచిన్నీ అనేకపదాలను ఉన్నపాళముగా అర్థాలతోసహా ఎక్కించుకొన్నారు. కొన్ని

టిని వదలివేసినారు. వ్యుత్పత్తులను ఇష్టమువచ్చినవాటికి ఇచ్చినారు; తక్కినవాటికి ఇవ్వలేదు. ఆంధ్రపదాలతో సంబంధించిన ఇతర ద్రావిడభాషాపదములను కొన్నిటికి ఇచ్చినారు; కొన్నిటికి ఇవ్వలేదు. ఇచ్చినవాటికి సంపూర్ణముగా ఇవ్వలేదు. అంతకుమించి గ్రంథమును అనవసరముగా పెంచినారు. నిఘంటునిర్మాణములో ఎట్టి జాగ్రత్తనూ వీరు తీసుకోలేదనిన్నీ, ఇది కేవలము వెట్టి పనిగా ఉన్నదనిన్నీ వేరే చెప్పనక్కరలేదు.

10. మరి ఒకమాటచెప్పి విరమిస్తాను. నియమములు అని ఇరవైనాలుగువాక్యములు వ్రాసినారు. (అ) అందులో ఈవాక్యములపొందికను, అన్వయమును చూడవచ్చును. "ఆప్రయత్నమునుమాని...సంకేతాకారబిందువులు ఉంచఁబడినవి;" "అర్థసంఖ్యను గ్రహించినతరువాతనే ద్రావిడాదిపదములు...గ్రహింపఁబడినవి;" "ఆపదములో ముఖ్యములని తోఁచినవి..."ప్రా." అని వ్రాయఁబడినవి;" "...పదమును స్వతంత్రపదముగానే గ్రహించి ...ప్రకృతియనుకొనిన పద మీయఁబడినది." (ఆ) "అవి వర్ణక్రమానుసారముననే గ్రహింపఁబడినవి." ఇచ్చట 'అవి' అంటే సంస్కృతసమములని వీరి ఉద్దేశము. వాటిని నిఘంటువులో వర్ణక్రమానుసారమున గ్రహించక మరొకరీతిగా గ్రహించవలచినారా? అట్లు తలంచకపోతే వీటికోసము ప్రత్యేకముగా ఈవాక్యమెందుకు? (ఇ) "ప్రాకృతసమ, వైకృత, దేశ్యాన్యదేశ్యాది భేదములు నిర్ణయించుటకుఁ గావలసిన సాధనసామగ్రి చాలదు," అని వ్రాసినారు. ఆంధ్రభాషాపదములు తత్సమ, తద్భవ, దేశ్య, గ్రామ్యములుగా పూర్వవ్యాకరణములలో విభజింపబడి ఉన్నవి. అందులో తత్సమములు సంస్కృతసమములు, ప్రాకృతసమములు అనిన్నీ, తద్భవములు సంస్కృతభవములు, ప్రాకృతభవములు అనిన్నీ, దేశ్యములు శుద్ధదేశ్యములు, అన్యదేశ్యములు అనిన్నీ వారు విభజించినారు. పైవాక్యములో 'వైకృత' అనేపదము 'తద్భవ' శబ్దమునకు పర్యాయపదముగా వ్రాయబడినట్లు తోస్తున్నది. 'వైకృత' మంటే వికారమును పొందినది అని కదా అర్థము? అప్పుడు ప్రాకృతసమములుకూడా 'వైకృత'పదవాచ్యములే అవుతవికదా. అందుచేత ఆంధ్రశబ్దాలకు వీరు చేసినవిభాగము సమంజసముగా ఉన్నట్లు తోచదు. ఆయాభేదములను నిర్ణయించడమునకు వీరికి సాధనసామగ్రి చాలదట. ఈవిషయమై ఈపదిహేను ఏండ్లనుంచీ వీమి ప్రయత్నము చేసినారు? 'చాలదు' అంటే కొంతసామగ్రి ఉన్నదికాని, అది చాలని కారణముచేత దానిని ఒకచోట చేర్చడమునకు వీరు ప్రయత్నించలేదు అని అయినా అర్థమవుతుంది. లేదా, ఉన్నంతమట్టుకు సేకరించినారు గాని, అది చాలనికారణముచేత దానిని ఈనిఘంటునిర్మాణమునకు ఉపయోగించలేదు అని అయినా అర్థమవుతుంది. వీరు కొంచెమయినా సేకరించిఉంటే ఆకొంచెమే ఉపయోగించుకోవచ్చునుగదా? "అప్రయత్నమును మాని" అని నిరాశచేసుకోవడ మెందుకు? వీరి ప్రాకృతజ్ఞానము "అంత" ప్రా. తెలుగు-అని వ్రాసినప్పుడే తెలిసినది. ఎందు కీబూటకము?

(ఈ) పరిషన్నిఘంటుకారులు అర్థవివరణములోనూ, ఇతరస్థలములయందునూ విసంధిని ఒప్పుకొన్నారు. పరుషాక్షరాలకు సరళాదేశమున్నా, గసడదవాదేశమున్నా చేయకపోవడమును ఒప్పుకొన్నారు. పరిషత్తువారు ఇంతమట్టుకు అనుగ్రహించినందుకు వారికి ఆంధ్రలోకము ఎంతో కృతజ్ఞత చూపవలసి ఉన్నది.

(ఉ) కాని, వీరికి అరసున్నలమీదమాత్రము మోహము పోలేదు. కావలసినచోట్ల అరసున్నలు ఉంచుతే వారి వెర్రి వారిది అనుకోవచ్చును. కాని, ౨౫-పుటలో 'అంటు' ౨ అర్థమును చూడండి. అంటుఁగట్టుఁగాఁ బయలుదేఱిన మొక్క.' ఇచ్చట 'బయలు' పూర్వమందు అరసున్న ఎందుకో! ఇది ఇకముందు రాబోయే సంపూర్ణనిఘంటువులో ఉపయోగించే అరసున్నలకు 'మచ్చు'

11. పైని వ్రాసినదానిలో చురుకుపాలు కొంచెము ఎక్కువగాపడినది. ఇందుకు క్షమించవలెనని కోరుకున్నాను. 'చురుక్కు'మంటేకాని చురుకు పుట్టదనే ఉద్దేశముతో అట్లు వ్రాసినానుగాని మరిఒకటి కాదు. పరిషత్తువారుపూనుకొన్నది గొప్పపని. వారాపనిని ఎంతజాగ్రత్తగా, ఎంతవిమర్శతో చేస్తే ఆంధ్రలోకమునకు అంతమేలు కలుగుతుంది. వారేదో చేస్తున్నారు, మనకేల అని భాషాభిమానులు ఊరుకోకూడదు. ఇటువంటివిమర్శనములను వ్రాసి ప్రకటిస్తే వారికి ఉపయోగకరముగా ఉంటుం

ది. “ఈవిమర్శనమును అందరికీ తెలిసేటట్టు ప్రకటింపవ లెందుకు? పరిషత్తువారికే పంపితే, వారు ఉపయోగిం చుకొంటారు” అని కొందరుమిత్రులు ఉపదేశించినారు. నేను వారితో ఏకీభవింపజాలకుండుటకు విచారిస్తున్నాను. దేశములోని భాషాభిమానులందరూ ఈవిషయమై ఆలో చింపవలసియున్నది. నేను వ్రాసినదానిలో కూడా పొరపా ట్లు ఉండకపోవు. ఇట్టి విషయములో ఎవరికీ అభిమాన ముండకూడదు. సత్యాన్వేషణమే కదా మనకు కావల సినది!

# మురళిమ్రోయించు మోహనమూర్తియెవరు?

విన్నకోట వెంకటరత్నశర్మ గారు

౧

ఆవనము, ముముక్షువుల, బృందావనమ్ము
హాయినించెడునది యుత్తరాయణమ్ము
పక్షములలోననది శుక్లపక్షమందు
నది శరద్రాత్రి; గీతగానామృతమ్ముఁ

జల్లుచున్నాడు ప్రేపల్లె నల్లనయ్య
మోహనాకారుఁడై పైఁడిమురళిఁ దాల్చి,
అబలులై మగవాండ్రు దేహములుమరచి
ముగ్ధులైపోయి రాతరువుల మొదళ్ల!

౨

తరువుల మొదళ్ల మూర్ఛల్క దవిలియున్న
గోపకులు తెప్పిరిలి తలలూఁపనున్న
మందమలయానిలుండు చెంపలనుగొట్టె
తలలు ప్రేలాడఁబడియె, భూతలమునట్టె!

౩

“నల్లనయ్య కంటెమనకు
లేఁడోయి! లేఁడోయి!
నల్లనయ్య వంటివాఁడు
రాఁడోయి! రాఁడోయి!”

౪

పాంథులిర్వురు పైపాటఁ బాడుకొనుచుఁ
గనుల నానందబాష్పముల్ గార్చుకొనుచు,
నీలకంఠాలవోలె నృత్యాలొనర్చి
తరువుమూలమ్ముఁ జేరిరాత్రమున!—.

(1) పాంథుఁడు

ఏఁడినాముద్దుగోపాలుఁ డేఁడి? యేఁడి?
మురళిమ్రోయించు మోహనమూర్తియెవరు?
ఎవ్వరువసింతు రేస్థలంబది వయస్య?
ఏపదార్థంబులిందు లభించుఁ జెపుమ?

(2) పాంథుఁడు

ఏదికోరినదదియె లభించుఁగాని
ఆకలియుడప్పియుండ దీప్రాంతమందు

చ. కులుకు మెఱుంగులన్ గుసుమ
 కోమలుఁగాంచితివే నయస్య ? నీ
 తలఁపుననున్న వాఁడతఁడె !
 తాల్చె శరీరము మానిమిత్తమై.

౫

ఇచటనే ! ఇచటనె ! యిచ్చటే ! అతండు
మూఁడు వేళలఁ గాపురంబును బొనర్చు
నితనిదర్శించుటకు నేఁగుదెంచువార
...లలసిదళము భక్తినొసఁగుచుంద్రు.

౬

మురళిమ్రోయించు మోహనమూర్తి, అంత
లోనమూర్ఛిల్లె; వేణునల్లీనవాద్యబు
ధార గురియించుచుండెఁ గాంతారభూమి !
పాంథు లాశ్చర్యమగ్నులై పడిరి తూలి!

౭

ఏనువృక్షాగ్రమునన వీక్షించుచుంటి;
నప్పుడేదిగి ఆసమయమ్ముఁ గాంచి
...వుల్ బట్ట నూహించితైనఁ గాని
...యునుఅందనట్లయ్యె_నచటఁబడితి !
మురళిమ్రోయించు మోహనమూర్తిఁగాంచి
నేను బాడుటకై దొడంగితిని బండి !
 "నల్లనయ్య కంటెమనకు
 లేఁడోయి ! లేఁడోయి !
నల్లనయ్యవంటివాఁడు
 రాఁడోయి! రాఁడోయి!"

౮

పాడితిన్ భక్తికొలఁదిని; వాడితిన్ శ్ర
మ; మొగమునఁ జెమ్మటలుపోసె మాటలేదు
గొంతుకఁ బెకల్చుకొని యెట్లొ "గొల్లపిల్ల
వాని మాహాత్మ్యమెఱుఁగంగనౌ న నా"క
టంచు నార్చుచుఁ బడిపోతి నవనియందు.

౯

మ. యమునాద్వీపవతీ తటాంచలము రెం
 డై చీలె నాలోనఁ దో
 యము మెండై ప్రవహించె నెల్లయెడలన్
 హాహా నినాదమ్ము ని
 డెనుసింగెన్ సకలమ్ము బృంద!

౧౦

మురళిమ్రోయించు మోహనమూర్తి యెవరు?
పాంథులెవ్వరు? అమగవార లెవరు?
ఏనెవండను? ఏదియేమైననఁగాని
ఎవ్వరున్ గానరాకపోయిరి! అదేమొ?
 వెన్నెల రాత్రి!

# భారతాంధ్రీకరణము-ఎఱ్ఱాప్రెగ్గడ

కోరాడ రామకృష్ణయ్య గారు, యం. ఏ.

ఆంధ్రభాషానుశాసనుఁడని ప్రసిద్ధిఁ గాంచిన నన్నయభట్టారకుఁడు చాళుక్యకులావతంసుండగు రాజరాజనరేంద్రుని ప్రోత్సాహమునఁ బంచమవేదం బనఁబరగిన కృష్ణద్వైపాయనముని వృషభాభిహితమహాభారతము నాంధ్రీకరింప మొదలిడి సుమారు మూఁడుపర్వముల గ్రంథమును దరించునప్పటికేకారణముచేతనో సదుమ నామహోద్యమమునకు విఘ్నము వాటిల్లెను. ఈవిఘ్నమునకుఁ గారణములు పలువిధములుగాఁ జెప్పఁబడుచున్నవి. కాని యీగాథ లెంతవఱకు విశ్వాసపాత్రములో బాగుగఁ బరిశీలించినఁ గాని నిర్ణయింప వీలులేదు. ఈతని దుస్స్వభావమే యీవిఘ్నమునకు ముఖ్యకారణంబని చెప్పుగాథలు కొన్ని గలవు. కాని, 'యవిరళజపహోమతత్పరుఁడు, సంహితాభ్యాసుఁడు, బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాననిరతుఁడు, సద్వినుతావదాతచరితుఁడు, లోకజ్ఞుఁడు, సత్ప్రతిభాభియోగ్యుఁడు, నిత్యసత్యవచనుఁడు' నగు నన్నపార్యుఁడు, 'భూదేవకులాభి'తర్పణమహీనః ప్రీతియుక్, "పార్వతీపదాబ్జధ్యానపూజామహోత్సవముక్', సంతతదానశీలతయు, శశ్వత్సాధుసాంగత్యముక్" గలిగి 'చాళుక్యకులైకభూషణుఁ'డని చెప్పంబడుచున్న రాజనరేంద్రుని కరుణకుఁ బాత్రుఁడైయున్న నన్నపార్యుఁడు, కవితారంగమునఁ బరోత్కర్షనేమాత్రమును సహింపలేక ఘోర[illegible]ములు కొడిగట్టిన పరమదుశ్శీలుఁడని చెప్పుట యంతసమంజసముగాఁ గనఁబడదు. పైని జెప్పఁబడిన విశేషణములన్నియు నాతఁడు తన్నుఁ గూర్చి తానే చెప్పుకొనినవి కావున నాత్మశ్లాఘాపరుఁడగు నీతనిమాటలను నమ్మఁగూడదని చెప్పుటయుఁ దగదు. ఏలయన! నావిశేషణము లాత్మశ్లాఘాసూచకము లగునేమో యను సందేహముచేతనే కావలయు, సహజవినయసంపన్నుఁడగు నీతఁడు "నన్నపార్యుఁ జూచి" యని ప్రథమ పురుషలోనే చెప్పెనుగాని యుత్తమపురుషలోఁ జెప్పలే[దు]. ఇదియే యీతని సౌశీల్యమును, సద్వినుతా[వ]దాత చరిత్రను దెలుపుచున్నది. మఱియు నీతని దుశ్శీలమునుగూర్చి కాని, భీమనాథర్వణులతో నీతనికిఁ గలిగిన సంబంధమును గూర్చి

కాని తెలుపుటకు 16 వ శతాబ్దియం దప్పకవి యాంధ్రశబ్దచింతామణి తనకు లభించిన విధమునుగూర్చి చెప్పుచు రచించిన,

"ఆంధ్రశబ్దచింతామణి వ్యాకరణము
ముందు రచియించి తత్సూత్రములఁ దెనుంగు
బాసచేఁ జెప్పె నన్నయభట్టు తొల్లి
పర్వములుమూఁడు శ్రీమహాభారతమున."

"భారతముఁ దెనిఁగించుచుఁ దా రచించి
నట్టి రాఘవపాండవీయము నడంచె
ఛందము నడంప నీఫక్కి సంగ్రహించె
ననుచు భీమన యొంతయు నడఁచె దాని."

అనుపద్యములలోని గాథ కెక్కడ మఱి గ్రంథస్థమగు నిదర్శనమేదియుఁ గానవచ్చుట లేదు. అప్పకవి చెప్పినకథ కల్పితమనియు, నది యెంత మాత్రము విశ్వాసపాత్రము కాదనియు సర్వవిదితమే. ఇఁక భీమనయు, నథర్వణుఁడును నన్నయ సమకాలికులు కారని తెలియవచ్చుచుండుటచే నన్నయ వీరియెడలఁ గావించిన యపకారమే యాతని మతిభ్రమణమునకును, భారతమసంపూర్తిగా విడువఁబడుటకును గలకారణమని చెప్పుట సమంజసముగా లేదు. అథర్వణుఁడు నన్నయ రచించినాఁడని చెప్పఁబడుచున్న మూఁడుపర్వములను వదలి తరువాతిదగు విరాటపర్వమునుండియే రచియించి ట్లగపడుచుండుటచేతను. ఈతనిచే రచింపఁ డిన యథర్వణకారికలనఁబడు వ్యాకరణకారికలు నన్నయ రచించిన యాంధ్రశబ్ద చింతామణికిఁ బూరణగ్రంథముగాఁ గనఁబడుచుండుటచేతను ఈగ్రంథములు నన్నయకుఁ దరువాతనే రచింపఁబడియుండుననియు, సామాన్యముగాఁ బూరణగ్రంథములు మూలగ్రంథకర్తలయందు ద్వేషబుద్ధిగలవారిచే రచింపఁబడియుండవుగావున నన్నయాథర్వణు లొకవేళఁ గొంతవఱకు సమకాలికులే యైనను, ద్వేషకథ కల్పితమే కాని వాస్తవమైయుండదనియు మనము నిశ్చయింపవచ్చును. కావున నన్నయమరణమున కథర్వణున కాతఁడొనర్చిన యపకారమే కారణమనుట సమంజసము గాదు. జనులమరణమున కేదో తాత్కాలికమగు నొకకారణము చెప్పుచుండుట లోకమునకు స్వాభావికము గాన నన్నయ తరువాతఁ జిరకాలమువఱకు భారతాంధ్రీకరణము కొనసాగకుండుటను జూచి, దానికిఁ గారణముగా భీమనాథర్వణులతో నీతనికి సంబంధము గలిపి మతిభ్రమణకథ నొకదానిని గల్పించి యుందురు. ఈకారణము మూలమైన భయముచేతనే తరువాతివారెవ్వరు తిక్కనకుఁ బూర్వము చేపట్టలేదను నమ్మకముకూడఁ బ్రబలియుండును. కావున నన్నయతరువాత భారతాంధ్రీకరణ మంత కాలము, అనఁగా తిక్కనకాలమువఱకు, నెందుకు కొనసాగియుండలేదు అను విషయము విమర్శింపఁదగియున్నది.

నన్నయ భారతాంధ్రీకరణము వైదికమతాభిమానులగు చాళుక్యరాజులు వైదికమతవ్యాపనము కొఱకుఁగాఁ బ్రోత్సహించుటచేఁ బ్రారంభింపఁబడినది. రాజనరేంద్రుని తరువాత నాతనికుమారుఁడగు మొదటి కుళోత్తుంగచోడదేవుఁడు క్రీ.శ. 1063 మొదలుకొని 1112-వ సంవత్సరమువఱకుఁ బరిపాలనము

చేసెనుగానియీతనికి చోడులతో సంబంధము
కలుగుటచే చోళదేశముమీఁద నేయధికారము
కలవాఁడయి రాజధానిని చోళదేశమునకు
మార్చుకొని యీ వేఁగిదేశరాజ్యాధికారమును
దాను నియమించుచువచ్చిన పాలకులకు వదలి
వేసెను. మొత్తముమీఁద నీతఁడు శివభక్తుఁ
డైనను బ్రాహ్మణద్వేషి. కాకుండుటచే నీతని
కాలమునఁగూడ బ్రాహ్మణమతము వర్ధిల్లు
చునేయుండెను. రామానుజుని వైష్ణవమత
మున కీతనిరాజ్యమునఁ జోటు దొరకకుం
డుటేకాక యీతఁడు రామానుజునిఁ బట్టి
బంధించు నుద్దేశము కలవాఁడగుటచే నాతఁ
డా దేశమును విడిచి గాంగవాడి దేశమునకుఁ
బోయి యచ్చటిరాజులయవలంబనంబునుబడసి
వైష్ణవమత ప్రచారమును, బౌద్ధ జైన మత
నిర్మూలమును గావించుచుండెనని తెలియ
వచ్చుచున్నది. పిదప నీ దేశము పశ్చిమచాళు
క్యుల వశమై మరి కొంతకాలమునకుఁ గాక
తీయరాజుల యధీనమయ్యెను. రాజనరేంద్రుని
తరువాత నచిరకాలములోనే యీ వేఁగి దేశ
మున సారస్వతాభివృద్ధికిఁ దగిన రాజపోష
ణమును, శాంతియు, స్థిరప్రభుత్వమును లేకుం
డెను. మొత్తముమీఁద నీ 12-వ శతాబ్దమున
నీదేశము భిన్నమతకల్లోలములకుఁ దావలం
బయ్యెను. చోడచాళుక్య సామ్రాజ్యములు
క్షీణించుటచే దేశమున స్థిరప్రభుత్వము లేక
కొంతవఱ కరాజకమై యుండెను. ఒకవైపున
వైష్ణవమతము విజృంభించి వీరవైష్ణవమై
తక్కినమతములనణఁగఁద్రొక్క యత్నించు
చుండెను. మఱియొకవైపున వీరశైవమతము బ
యలుదేరి జైనబౌద్ధమతములతోపాటు వైదిక
మతమునుగూడ ఖండించి తద్వ్యాపనము నరి
కట్టుచుండెను. పండ్రెండవశతాబ్ది మధ్యభాగ
మున చాళుక్యరాజ్యము నాక్రమించుకొనిన
బిజ్జలుఁడు వీరశైవమతమగు లింగాయత మత
మును బయలుదేరఁదీసిన బసవేశ్వరునికి మంత్రి
పదవి నిచ్చి,యాతని సైన్యాధ్యక్షునిఁగను ధనా
గారాధ్యక్షునిఁగను నియమించుటయు, నీయధి
కారముతో నీతఁడు మతవ్యాప్తికై రాజ్య
మందలి ధనాధికారముల నుపయోగించుటచే
బిజ్జలునికి,నీతనికినిగలిగిన వైషమ్యము కారణ
ముగా దేశ మొకఘోరమగు మతయుద్ధమున
మునుంగవలసి వచ్చెను. ఇట్టి మతకల్లోలము
లతో నిండి శాంతిలేని యీకాలమున వైదిక
మతమున కవలంబనము తగ్గుటచే నన్నయ
మొదలుపెట్టిన వ్యాసభారతాంధ్రీకరణమును
మరలఁ జేపట్టువారు లేకపోయిరి. భారతాంధ్రీ
కరణప్రయత్నము సామాన్యకార్యము కాదు.
ఏచిన్నకావ్యమునో తెనిఁగించుటవంటిదికాదు.
అది యపారమైన గ్రంథము. దానికి రాజావలం
బనము, మనశ్శాంతి, చిత్తస్థైర్యము, భాషాపాట
వము, మిత్రుల ప్రోత్సాహము మొదలగున
వెన్నియో సమకూడుటచే నన్నయ యద్దా
నిని నిర్వహింపఁగలిగెను. చాళుక్యుల యధి
కారము సన్నగిలుట, వైదికమతమున కవలం
బనముతగ్గుట,అన్యమతములు దేశమునఁ బ్రబ
మత వైషమ్యములకు మతయుద్ధములకుఁ గార
ణమగుట,సామ్రాజ్యాధికారులదుర్బలత్వముచే
జిన్నచిన్న మండలాధికారు లందఱు దేశాధి
కారము నాక్రమింపవలయునని చేసెడి ప్రయ

త్నములమూలమున దేశ మల్లకల్లోలముగా నుండుట—ఈమొదలగు కారణములచే 11వ శతాబ్ది మధ్యభాగమునుండి 12 వ శతాబ్దాంతభాగము వఱకు సారస్వతాభివృద్ధి కనువగుపరిస్థితులు దేశమున నేర్పడలేదు. మన మెఱింగిన యాకాలమునాఁటి కవులైనను వేఁగి దేశమందలివారు గాక దక్షిణదేశ మందలి వారో లేక కాకతీయరాజ్య ప్రాంతమందలి వారో యయియున్నారు. ఇంతేకాక పలువురు రాజులో, మండలాధిపతులో లేక మంత్రులో నైయున్నారు. నన్నెచోడుఁడు కావేరీతీరమందలి యొరయూరు రాజధానిగా జోళమండలమునేలినవాఁడుగాఁ జెప్పఁబడుచున్నాఁడు. ఈతఁడచ్చటివాఁడైనను శైవమతాభినివేశము కలవాఁడై మల్లికార్జునుని గురువుగాఁ బడసి గురువునే సర్వేశ్వరుఁడుగా భావించి, యట్టియభేదబుద్ధితో 'కుమారసంభవ'మును రచించినవాఁ డగుటచే కొంచెము తరువాతి కాలమున పాల్కురికి సోమనాథునిచే వృద్ధి నొందింపఁబడిన యాంధ్రదేశమునందలి శైవవాఙ్మయశాఖ కీతఁడు మూలముగాఁ గనఁబడుచున్నాఁడు. ఈతఁడు నన్నయకుఁ దరువాతివాఁడనియే తలంపఁబడుచున్నను వీరశైవుఁడగుటచే నీతనికి వైదిక మతమందుఁగాని, తద్వ్యాప్తికొఱకుఁగాఁ బ్రారంభింపఁబడిన భారతాంధ్రీకరణమునఁగాని యితని కాదరము లేకుండెనని తలంపఁ దగును.

ఇఁక నన్నయ తిక్కనలమధ్య కాలమున నున్న వారిలోఁ బ్రసిద్ధపురుషుఁడని చెప్పఁదగిన వాఁడు మంత్రిభాస్కరుఁ డొకఁడు. ఈతనిఁ గూర్చి కవిబ్రహ్మయగు తిక్కన చేసిన ప్రశంసను బట్టియు, కేతనాదులు చేసిన వర్ణనమునుబట్టియు నీతఁడొక ప్రసిద్ధకవి యనుమాట నిశ్చయము. తిక్కనాదులు చెప్పకపోవుటచే రామాయణకర్తృత్వ మీతనియం దారోపించుట విషయమున భిన్నాభిప్రాయములు కలవు. అయినను ఇట్టి ప్రసిద్ధకవి యగువాఁడు నన్నయమొదలుపెట్టి మధ్యను విడిచినేసిన భారతామ్నాయమునే కైకొని తెనిఁగింపక, యద్దానిని దనమనుమనికి వదలివేయఁదలఁచినవాఁడువలెఁ దాను రామాయణమును జేపట్టుటకుఁ గారణ మేమైయుండును? మతవైషమ్యములు విశేషముగాఁ బెరిగియున్న యాకాలమున వైదికమతమున కంతప్రాబల్యము లేకపోవుటచే నన్నయభారతమునకుఁగూడ దేశమున విశేషప్రచారము లేకపోయియుండవచ్చును. కావున నాంధ్రీకృతభారతము నీతఁడు చూచియుండెనో లేదో, చెప్పలేము. ఇంతేకాక మంత్రిభాస్కరుని కుమారుఁడగు తిక్కభూపాలుఁడు వైష్ణవమతావలంబకుఁడై, పాకనాడు, కమ్మనాడు మొదలగు దేశములలో వైష్ణవమతవ్యాపనమునకుఁ దోడ్పడుచు, కాంచీపురమునందలి వరదరాజస్వామియం దత్యంతభక్తి కలవాఁడై, యనేక విష్ణ్వాలయములను నెలకొల్పినట్లు తెలియుచుండుటచే, నీతనితండ్రి యగు మంత్రిభాస్కరుఁడు కూడఁ గొంత వఱకు వైష్ణవమతాభిమానము కలవాఁడై యుండెనని తలంపఁదగియున్నది. ఆకారణముచేతనే యితఁడు వైదికమతవ్యాప్తికిఁ దోడ్పడు భారతమును విడిచి, వైష్ణవమతోద్బోధకంబగు

రామాయణము నాంధ్రీకరింపఁ దొడఁగియుండ వచ్చును. తిక్కభూపాలుఁడైనను వైష్ణవమతము నం దభిమానము కలవాఁడైయున్నను, తిక్కన మతములందు ద్వేషబుద్ధి లేక పరమతసహనము కలవాఁడువలెనే కనఁబడుచున్నాఁడు. కవితిక్కన యన్ననో హరి హరులకు భేదమే లేదని తలంచినవాఁ డగుటచే నద్వైతభావమే కలవాఁడై, మరల నన్నయభారతమును జేపట్టి తెనిఁగింప దొరకొనెను. దేశమున నూతన మతకర్తలు బయలుదేరి నూతనమతములను వ్యాపింపఁ జేయుచున్న కాలమున వారిబోధనలచే నాకర్షింపఁబడినవారిలోఁ గొందఱు వైష్ణవమతాభిమానమును, గొందఱు శైవమతాభిమానమును గలవారై యుండుట తటస్థింపవచ్చును. కావుననే మంత్రి భాస్కరుఁడును, తిక్కభూపాలుఁడును వైష్ణవమునం దభిమానము కలవారై యుండ తిక్కనసోమయాజి ప్రాచీనంబగు వైదికమతమందే తాత్పర్యము కలవాఁడై యుండినచో నాకాలమున నది యొక గొప్పవిశేషముగా నెన్నఁదగినది కాదు. ఇట్లు భారతము పూర్తిగాకుండ రామాయణాంధ్రీకరణము ప్రారంభింపఁబడుటకు దేశస్థితి, మతభేదములే కారణముగా గ్రహింపఁ దగియున్నవి. భాస్కరుఁడు తీవ్రముగ వైష్ణవమతాభిమానియై రామాయణమును దెనిఁగించుటం జేసియే "సారకవితాభిరాముఁడై" యను ఆతని యీగ్రంథమును తిక్కన పేర్కొనలేదేమో?

ఆకాలములో, ననఁగా దిక్కనకు సమకాలికులలో గొంచెము తరువాతివారో యనఁదగు, కోనబుద్ధభూవిభుఁడును, అతని కొడుకులుగాఁ జెప్పికొన్న కాచవిభుఁడు, వి[illegible]జును రామాయణమునంతను అనఁగాఁ బ[illegible]త్తర రామాయణములను, ద్విపద కావ్యముగాఁ గూడ రచించిన ట్లగపడుచున్నది. ఇట్లు భారతమును వదలి రామాయణమును జేపట్టినవారు పెక్కురుగూడఁ గనఁబడుచున్నారు.

ఈకోనబుద్ధరెడ్డి తండ్రి విఠ్ఠలధరణీశుఁడని ద్విపదరామాయణముననే కన్పడుచున్నది. ఈ విఠ్ఠలనాథుఁడు రుద్రమదేవి కాలములో కాకతీయసామ్రాజ్యమునం దొకభాగమున కాధిపత్యము గలవాఁడైన కోనగన్నారెడ్డికి సోదరుఁడై యాతనియొద్ద సేనాధిపతిగా నుండినట్లు తెలియుచున్నది. కాని యాత[illegible] శైవమతాభిమానముకలవాఁడై యుండ, నీతఁడు తన పేరునకుఁ దగినట్లుగా వైష్ణవ మతాభిమానము కలవాఁడువలెఁ గనఁబడుచున్నాఁడు. ఈ కారణముచేఁ గావలయు నీతని కుమారుఁడగు బుద్ధారెడ్డికూడ వైష్ణవమతాభిమానముకలవాఁడై, ద్విపదరామాయణమును దనతండ్రి పేరఁ బనిపూని చెప్పుట తటస్థించి యుండును. కాకతీయరాజ్యము మొదట జైనమతమునకుఁ బట్టుకొమ్మయై, కొంతకాలమైన పిదప వీరశైవమున కవలంబనంబై యుండుట సుప్రసిద్ధమే కాని వైష్ణవమతమున కెప్పుడుగాని చోటిచ్చినట్లు కనుపడదు. కాని మొదటి ప్రతాపరుద్రుని కాలములో గురుమల్లికార్జున పండితారాధ్యుల శిష్యుఁడైన పాల్కురికి సోమనాథుఁడు బసవపురాణము, పండితారాధ్యచరిత్రము, వృషాధిపశతకము మొదలగు గ్రంథము రచించి వైష్ణవమునకును,

260



రాజప్రతినిధి ఇర్విన్ ప్రభువు



రాజప్రతినిధి ఇర్విన్ ప్రభువు సతీమణి

వైదికమతమునకును గూడ విరుద్ధం బగు వీరశైవమును సామాన్యజనుల కందఱకు [illegible]ోధం బగునటుల సంస్కృతవృత్తంబులను [illegible]దలి దేశీయంబగు ద్విపదలలో రచించి బోధించినవాఁడగుటం జేసి, యుద్దానిఁ బోకిటిగానించుక తరువాతి కాలమున రంగనాథుఁడను కవీశ్వరుఁ డొకఁడు వైష్ణవమతోద్బోధకంబగు రామాయణమును రచించి కొంత వైష్ణవాభినివేశము గల బుద్ధరాజు పేరునఁ బ్రకటించెనేమో యను సందేహము కలుగక మానదు. ఇట్లు ప్రసిద్ధులు, పేరుప్రతిష్ఠలు గలకవులందఱు మతాభినివేశమునకు లోఁగినవారై యేదోయొక విధముగ వైదికమతముపైఁ గత్తికట్టినవారేయగు [illegible] నన్నయతరువాత సుమారు రెండువందల [illegible]ముల వఱకు భారతాంధ్రీకరణము పూర్తియగుట తటస్థింపలేదు.

ఈమధ్యకాలమున మిగిలిపోయిన ప్రసిద్ధకవులలో నథర్వణుఁ డొకఁ డున్నవాఁడు. ఈతఁడు తిక్కనకుఁ గొంచెము పూర్వుఁడో, సమకాలికుఁడో యని చెప్పఁదగియున్నాఁడు. నన్నయ తరువాత నన్నయయంతవాఁ డీతఁడని లోకప్రసిద్ధి కావుననే ద్వితీయాచార్యుఁడని ప్రసిద్ధి గలిగినది. ఈప్రసిద్ధికిఁ దగినకారణములు లేకపోలేదు. ఎలయన, నన్నయ తరువాత నాతఁడు మొదలుపెట్టిన యుద్యమములను, లేదా గ్రంథములను కొనసాగింప వలయునని తలఁచి కృషిసల్పినవాఁడు తిక్కనకుఁ బూర్వ మీతఁడొక్కఁడే కనఁబడుచున్నాఁడు. భారతమున నన్నయ రచించిన మొదటి మూఁడుపర్వములును గాక తరువాతి విరాటోద్యోగ భీష్మపర్వము లీతఁడు రచించిన ట్లగపడుచుండుట చేతను, ఈతనిచే రచింపఁబడెనని లోకమునఁ దలంపఁబడుచున్న వికృతివివేకము, లేక యథర్వణకారికావళి యను లక్షణగ్రంథము నన్నయ చెప్పిన యాంధ్రభాషాలక్షణముకంటె విశేషాంశములతోఁ గూడి, దానికి పూరకగ్రంథముగాఁ గనఁబడుచుండుటచేతను ఈతఁడు నన్నయయుద్దేశములను గొనసాగింపఁ బూనుకొనినవాఁడువలె నున్నాఁడు. ఈతనిపుట్టుక పూర్వోత్తరములను గూర్చి తెలుసుకొనుట కాధారము లేమియు విశేషము లేవుగాని, యీతఁడు జైనుఁడై యుండుననిమాత్రము కొందఱు తలంచుచున్నారు. కాని యీకారికావళి యాంధ్రశబ్దచింతామణియందుఁ దెలుపంబడిన యాంధ్రభాషాలక్షణముకంటె విలక్షణములగు కొన్ని విశేషములను జేర్చి వ్రాయఁబడిన పూరకగ్రంథమగుటచేతను, అథర్వణుఁడు త్రిలింగశబ్దానుశాసనమను మఱియొకలక్షణగ్రంథము రచించినట్లు తెలియవచ్చుచుండుటచేతను కారికావళి యిటీవలికాలమున బయలుదేరిన గ్రంథమేమో యనుసందేహమున కవకాశము లేకపోలేదు. ఈ త్రిలింగశబ్దానుశాసనమైనను కొంచెమించుమించుగాఁ దనకుసమానకాలమున రచింపఁబడినదగుటచేఁ గాఁబోలు, కేతనదృష్టిపథమునఁ గూడఁబడినట్లు కనుపడదు. ఈతఁడు రచించిన భారతమైనను వ్యాసముని ప్రణీతభారతపంక్తి ననుసరించినదిగాక, జైనమతానుకూలంబై యుండినదగుటచేఁ గావలయు, విశేషప్రచారము లేకయుండెను. ఇంతలో నద్వైత

మతానుకూలముగఁ దిక్కనసోమయాజి రచించిన భారతభాగము పైకి వచ్చుటచే దాని కాదరము లేక కాలక్రమమున నది రూపుమాసిపోయియుండును. మొత్తముమీఁద విచారింపఁగా నన్నయ యాంధ్రీకరింప మొదలుపెట్టిన భారతమును బూర్తిచేయవలయునను తలంపు ఆతని తర్వాత సుమారు రెండువందలయేండ్లవఱకు నెవ్వరికిఁ గలిగినట్లు కనఁబడదు. మఱి విశేష మేమనఁగాఁ, బదుమూఁడవశతాబ్ది మధ్యభాగము ప్రాప్తించునప్పటికి భారతాంధ్రీకరణవిషయకమగు తలంపొక్క తిక్కనకే కాక మఱియొక యథర్వణునికిఁగూడ ననువగు పరిస్థితు లేర్పడియుండునని యూహింపఁదగియున్నది. దేశములో బయలుదేరిన భిన్నమతముల పరస్పరవైషమ్యము, స్పర్థ కొంతవఱకు తగ్గి యద్వైతమతమునందుఁ గొంత యభిమాన మేర్పడుకాలము వచ్చినది. దేశమునందు మతసాంఘికస్థితి మాఱిపోవుటకుఁ బ్రారంభించినది. పౌరాణికమతము మఱలఁ దలయెత్తి మొదలుపెట్టినది. ప్రాచీనమైన దేవతార్చనము పొడసూపసాగినది. న్యాయధర్మశాస్త్రవిషయకములగు నిబంధనగ్రంథములనేకములు వ్రాయఁబడవలసివచ్చినది. కావుననే విజ్ఞానేశ్వరుఁడు మొదలగువారి గ్రంథము లాంధ్రములోనికిఁ గూడ దిగినవి. ఈకాలముననే కదా కేతన విజ్ఞానేశ్వరము నాంధ్రభాషయందు రచించుట తటస్థించినది. ఇట్టిసమయముననే తిక్కనసోమయాజి నన్నయ రచించిన వ్యాసభారతమును మరలఁ జేపట్టి యాంధ్రభాషలో రచించుటయుఁ దటస్థించినది. హరిహరులకభేదబుద్ధి గలిగి సోమయాజియై తిక్కన రచించిన భారతము బయలుపడుటచే నథర్వణభారతము వెనుకఁబడినది. రాజరాజ[illegible]ద్రుని తరువాతవచ్చిన చాళుక్యచోడచక్ర[illegible]లు వేఁగిదేశమున నుండక ద్రావిడదేశమునందున్నవారగుటచే వారి కాంధ్రభాషయందుకంటె ద్రావిడభాషయందభిమానము హెచ్చయ్యెను. కావున రాజరాజనరేంద్రుని వెనువెంటనే భారతాంధ్రీకరణోద్యమము కొనసాగించుటకు వారొకవేళ కొంత ప్రయత్నము సలిపినను అన్యమతవిజృంభణము ప్రబలినయాకాలమున వారిప్రయత్నములు సఫలములు కాలేదు. తరువాత వారికి దీనియందంతయుత్సాహము [illegible]యినది. వారు ప్రయత్నములు చేసినప[illegible] నన్నయరచించినభాగములోని యుత్తమములగు కొన్నిపద్యములను తాటాకులమీఁద వ్రాయించి యాపద్యములతో సమానముగఁ గవిత్వము చెప్పఁగలవారెవరైన నన్నయ విడిచిన భారతభాగమును పూర్తిచేయఁబూనుకొందురా యని కొందఱు మనుష్యులచే నాపద్యముల దేశదేశములఁ ద్రిప్పినట్లు వాడుకయొకటి కలదుగదా! ఈకథలో నేమేని సత్యమున్నచో, నాకాలమున నన్నయరచించిన భారతభాగముయొక్క ప్రతులు విశేషముగా వ్రాయఁబడి దేశమున వ్యాప్తిఁ జెందియుండలేదనియు, రాజరాజు గతించినవెంటనే భారతమును బూర్తిచేయింపఁ దలంచినవారు. కొన్నిమాదిరి పద్యములను మాత్రము వ్రాయించి, "నన్నయకవిత్వ మి

ట్లున్నది. ఆతఁడు వ్యాసభారతము నాంధ్రీక రింప మొదలిడి కొంతవఱకు రచించి గతించి [illegible] దీనిని గొనసాగింపఁగలవా రెవరైనఁ గలరా?" యని దేశమునందలి ప్రసిద్ధములగు నాస్థానములకుఁ గబురుపంపియుందురనియు నూహింపఁదగియున్నది. కాని దానికిఁ దిక్కనాధ్వానుల కాలమువఱకుఁ దగిన ప్రత్యుత్తరము వచ్చియుండలేదు.

దేశమున వైదికమతమం దాదరము తగ్గుటచే వెంటనే యీకార్యమును జేపట్టువారు లేకపోయిరి. పిదప దేశము మతవైషమ్యములకు, నూతనమత ప్రచారమునకుఁ దావలం బగు [illegible]నీ నన్నయభారతభాగమునకు విశేష ప్ర[illegible]మునగాని, ప్రత్యంతరములు వ్రాయఁబడుట కవకాశముగాని లేకుండెను. కావుననే నన్నయనుగూర్చికాని, యాతనిభారతమును గూర్చికాని యాతనితరువాత సుమారు రెండు వందలసంవత్సరములవఱకుఁ అనగా, తిక్కన కాలమువఱకుఁ, బ్రశంసించినవారెవరుఁ గనఁబడరు. చూచినవారు, చదివినవారు నంతకంటెను గనఁబడరు. తిక్కనయైనను ప్రథమమునఁ దాను రచించిన నిర్వచనోత్తరరామాయణమున నన్నయప్రశంస యేమియుఁ జేసినవాఁడు కాఁడు. ఆంధ్రభాష కాదికవియని, ఆంధ్రభాషావాగనుశాసనుఁడని తరువాత నంతప్రసిద్ధి గాంచిన నన్నయపేరైన నెత్తలేదు.

"హరిహరపద్మగర్భులను
నాదికవీంద్రుల నూత్నసత్కవీ
శ్వరులను భక్తిఁగొల్చి మఱి
వారికృపం గవితావిలాసవి
స్తరమహనీయుఁడైన నను"

అని ఆదికవీంద్రులను, నూత్నకవులను నెన్నెనే కాని, యీనూత్నకవులలోనైన నన్నయకూడ నుండెనో లేదో అతఁడు చెప్పలేదు. దీనిని మనము నిర్ధారణచేయుట కవకాశమును లేదు. ఆకాలమునకు నన్నయరచించిన భారతభాగము విశేషప్రచారములో నుండి, యందఱచేఁ జదువఁబడుచు, నాంధ్రావళికి మోదమును గూర్చుచునే యున్నచో, తిక్కన తాను స్వయముగా నద్దాని జదువుటచేతనే కవితావిలాసవిస్తర మహనీయుఁడై నెగడినచో, నాయాదికవియగు నన్నయనామమునైన నొకసారి తన మొదటి గ్రంథమున స్మరింపకుండునా? మఱియు నన్నయ భారతభాగమును ఉత్తరరామాయణరచనకుఁ బూర్వమే తిక్కన చదివియే యున్నచో కొఱవడియున్న యీ పంచమవేదమును ముందు పూర్తిచేయఁదొడంగక రామాయణము నేల రచింపఁబూనుకొనును? ఇంకను దానుయజ్ఞము చేయకుండుటచే యజ్ఞము చేసికాని మొదలుపెట్టఁదలంపలేదనికాని, లేదా అతనికింకను భారత రచనను జేపట్టుటకుఁ దగినకవితాసామర్థ్యము చిక్కలేదనికాని చెప్పుట అంత యుక్తిసహితముగాఁ గన్పడదు. అట్లే అయినను ఉత్తర రామాయణమున నాతనిఁ జేర్కొనకుండుటకుఁ గారణ మగపడదు. ఇఁకఁ దాను భారత రచనకుఁ గడంగినప్పుడైనను నన్నయ భారత భాగమును స్వయముగాఁ జదివి యాతని కవితాపద్ధతులందును, రచనావిశేషములందును అత్యంతాదరము కలవాఁడువలె నాభారతరచ

ననుగూర్చికాని, తద్రచయిత యొక్క గొప్పదనమునుగూర్చి కాని విశేషముగా నేమియుఁ జెప్పక మహాభారతము చాలగొప్పదని దానిని విశేషముగాఁ బొగడుచు నది

"ఆదరణీయసార వివి
ధార్థగతిస్ఫురణంబు గల్గి య
ష్టాదశ పర్వనిర్వహణ
సంభృతమై పెనుపొంది యుండు"

నని పద్యమున రెండు పాదములతో భారత ప్రశంసచేసి,

"అం, దాదిఁ దొడంగి మూఁడుకృతు
లాంధ్రకవిత్వ విశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితా
త్ముఁడు నన్నయభట్టు దీక్షతోన్."

ఆభారతమున మూఁడుకృతులు-పర్వములు-ఆంధ్రకవిత్వ విశారదుం డగు నన్నయభట్టు ఆంధ్రభాషయందు రచించెనని చెప్పినాఁడు. ఆంధ్రభాషయం దంతకుఁ బూర్వ మంతప్రసిద్ధమైనకవిత్వము లేకుండుటచే నా భాషలో నొక యుద్గ్రంథమును వ్రాసినాఁడుగనుక ఆంధ్రకవిత్వవిశారదుఁ డనువిశేషణము వేసిన ట్లగపడుచున్నదిగాని నన్నయకవితయందుఁ గాని, యాతని కృతియందుఁగాని యాతనికిఁగల విశేషాదరమునువ్యక్తపఱచుట లేదు. "విద్యాదయితుఁడు, మహితాత్ముఁడు" అనునది నన్నయను గూర్చిన విశేషణములుగాని యాతని కృతిని గూర్చినవి కావు. అంతకుఁబూర్వ మాంధ్రమున భారతమంతటి యుద్గ్రంథము నెవ్వరు వ్రాయఁబూన లేదు. కావున నెట్టియభ్యంతరములను నరకుఁగొనక వైదికమత ప్రతిపాదకమగు వ్యాస భారతాంధ్రీకరణమును "దక్షతతో" నిర్వహించినాఁడు గావున నా విశేషణ[illegible] వేసినాఁడు. కాని యాతనికృతినిగూర్చిన ప్రశంస యేమియును లేదు. తాను రచింపఁబూనిన గ్రంథమును గూర్చి యెట్లు చెప్పుకొనినాఁడో చూడుఁడు:

"హృదయాహ్లాదిచతుర్థ మూర్జితకథో
పేతంబు నానారసా
భ్యుదయోల్లాసి విరాటపర్వ మట యు
ద్యోగాదులుం గూడఁగాఁ
బదునేనింటఁ దెనుంగుబాస జనసం
ప్రార్థ్యంబులై పెంపునం
దుదిముట్టన్ రచియించు టొప్పు
బుధసంతోషంబు నిండారఁగన్.
కావున భారతామృతము
కర్ణపుటంబుల నారఁ గ్రోలి యాం
ధ్రావళి మోదముం బొరయు
నట్లుగ"

రచింప బూనినాఁడు.

నన్నయభాగముకూడఁ జదివి యాంధ్రావళి యట్టియానందమును బొందుచున్నదో దానిని గూర్చి యించుకంతైనఁ జెప్పఁడా? నన్నయభాగమును జదివి తా నట్టియానందమును బొందితి ననియైనఁ జెప్పఁడా? ఏమి యుఁ జెప్పలేదు. తనకు వైదికమార్గము[illegible] గల యభిమానమును, తనకుఁ బ్రత్య[illegible]లు యిష్టదేవత చెప్పినట్లుగా, ఇట్లు చెప్పినాఁడు.

"వైదికమార్గనిష్ఠమగు
వర్తనముం దగ నిర్వహించుచు

నైష్ఠికములేని భక్తిమతి
నిర్మలవృత్తిగఁ జేయుచుండ మ
నాం[illegible]ప్రదనిరంతరస్మరణ
తత్పరభావముకల్మి నాత్మన
మ్మోదముఁబొందఁ గావ్యరస
ముంగొనిచూడుచునుండు దెప్పుడున్."

ఇట్లీవైదికమార్గమునందలి ప్రీతియు, పంచమవేదంబగు భారతము మూలమున నామతమును వ్యాపింపఁజేయు నుద్దేశమును, చాళుక్య ప్రభువు లొనరించిన మహాత్కార్యమునందలి గౌరవమును, వారిప్రోత్సాహమున భారతాంధ్రీకరణకార్యమునకుఁ బూనిన నన్నయ్య [illegible]దలి భక్తియును గారణములుగా, నన్నయ [illegible]చ్చిన మూఁడుకృతులను వదలి, తిక్కన తక్కినపర్వముల నాంధ్రమున రచింపఁబూనెనని తలంపఁదగియున్నది. అంతేకాని నన్నయ రచించిన భాగమును సంపాదించి, చూచి, చదివి, మిగిలినభాగమును బూరించినట్లు తోఁపదు.

తిక్కన నన్నయవ్రాసిన గ్రంథభాగమును జూచియున్నాఁ డనినచో నన్నయ మూఁడు కృతులు సంపూర్ణముగా వ్రాసియుండిన బాధ లేదు కాని, యట్లుగానిచో, రాజ్యతంత్రము [illegible]లగ నడపి పరదేశముల కేఁగి రాజుల [illegible]ప్పించి పరమతముల ఖండించి దిగ్విజయ [illegible]చి యత్యంత మేధావంతుఁడును, ధైర్య [illegible]ములుగలవాఁడునునని పేరుగాంచినతిక్కన యరణ్యపర్వభాగమును బూర్తిచేసినచో మృత్యువువాతఁబడు నేమోయనుభయముచే భీతికిపండవలె వెనుదీసినాఁడని చెప్పవలసివచ్చును. తిక్కన నన్నయభారతమున మూఁడుకృతులు సంపూర్ణముగ నుండుటను జూచి, నాలవకృతి ప్రారంభించినాఁ డన్నచో, రాజమహేంద్రవరమునఁగల మూలప్రతి నీతఁ డెట్లో విశేషప్రయత్నముచేసి సంపాదించి ప్రత్యంతరము వ్రాయించకుండఁ దిరిగిపంపినాఁడనియో, లేదా, యేగణపతిదేవుసియాస్థానమునకుఁ బోవుసమయముననో రాజమహేంద్రవరమునకుఁబోయి యాప్రతినిజూచివచ్చినాఁడనియో చెప్పవలెను. కాని దేశమున ననేకప్రతు లున్నవనియు, నా ప్రతు లన్నిటిలో మూఁడుకృతులు సంపూర్ణముగా నున్నవని చెప్పినచో, తిక్కన తరువాత నేఁబదియిరువదిసంవత్సరములలో నెఱ్ఱాప్రెగడ చూచునరికే దేశమునఁగల ప్రతులన్నిటిలో నొక్కభాగముమాత్రమే హఠాత్తుగా శిథిలమైనదనుట విశ్వాసపాత్రమెంతమాత్రము కాదు. ఎఱ్ఱాప్రెగడకు దొరకినప్రతిలోనే కొంతభాగము పోయియుండినచో నన్నయ వ్రాసిన సంపూర్ణభాగము తరువాతనైన దొరకవలసినదే. దీనినిబట్టి, నన్నయ యరణ్యపర్వము పూర్తిగాకుండ వ్రాయఁగా, దక్కన యాభారతప్రతిని జూడనేలేదనికాని, దేశమున దానికిఁ బ్రచారము లేకుండుటచే నొక్కటేప్రతి యుండఁగా నద్దాని నెట్లో తిక్కన చూచి, యందు మూఁడుకృతులు సంపూర్ణముగా నుంటచే నాలవపర్వమును మొదలుపెట్టి పూర్తిచేయఁగాఁ, గొంతకాలమున నాప్రతియందలి చివరభాగము శిథిలమైపోఁగా నెఱ్ఱాప్రెగడ దాని బూరించెననికాని, లేదా,

తిక్కన యసంపూర్ణగ్రంథమునే చూచినను మతిభ్రమణభయముచే నాభాగమును బూర్తి చేయక వదలివేసెననికాని, మూఁడువిధములుగా మనము తలంపవచ్చును. ఇందు మూఁడవదానికంటె మొదటి రెండుయుక్తులే కొంతవఱకు సంభావ్యములుగఁ గనఁబడుచున్నవి. అందును రెండవదానికంటె మొదటిది బలవత్తరముగా నున్నట్లు తోఁపకపోదు. ఏది యెట్లున్నను, అరణ్యపర్వమును నన్నయ సంపూర్ణముగా రచించెననియు, మూఁడుపర్వములు సంపూర్ణముగా నున్న ప్రతిని తిక్కన చూచి నాలవపర్వము మొదలు భారతమునంతను బూర్తిచేసినపిదప నలుబది యేఁబది యేండ్లకు నరణ్యపర్వమునఁ దుదిభాగ మచ్చటచ్చట క్రిమిదష్టమైనందున శిథిలముకాఁగా, నెఱ్ఱాప్రెగ్గడ నన్నయపేరుపెట్టి ఆ శిథిలభాగముల నచ్చటచ్చట పోయినవర్ణములను, పదములను, పాదములను స్వీయముగా నతికి, "తద్రచనయకా నారణ్యపర్వశేషముఁ బూరించె"ననుట యెంతమాత్రము సమంజసముగాఁ గనఁబడదు. నన్నయభావములు, పదగుంఫనములు, వాక్యవైఖరి మొదలగు రచనారీతులు ఎన్నియేని యీభాగమునఁ గనఁబడుచున్నవి గావున నీభాగమునుగూడ నన్నయయే వ్రాసియుండవలెను; వర్ణపదపాదముల పూరణమే యెఱ్ఱాప్రెగ్గడచేసిన పూరణమనుటయు నెంతమాత్రము యుక్తియుక్తము కాదు. ఏలయన నెఱ్ఱాప్రెగ్గడయే "తద్రచనయకా" పూరించితినని వ్రాసికొనియున్నాఁడు. అనఁగా, నిది నన్నయ రచనయే యని చూచినవారందఱు ననుకొను నట్లాభాగమును రచించుటకుఁగూడ నాతఁడు పడవలసిన పాట్లన్నియుఁ బడినాఁడని తలంపఁదగియున్నది. రచనావిషయమున న[illegible]య ననుకరించుట కెంత ప్రయత్నమైనఁ జేసినాఁడు. కావున నన్నయ రచనావిశేషములు ఎఱ్ఱాప్రెగ్గడ భాగములోఁ గనఁబడుచున్నవి. కనుక నిది నన్నయరచించినదే యనువాద మొంతయు యుక్తివిరహితముగాఁ గనఁబడుచున్నది. ఇప్పుడు మనముచూడవలసిన దేమనఁగా, నీయనుకరణప్రయత్నములో "తద్రచనయకా" నన్నయరచనయే అని చూపించుటలో నెఱ్ఱాప్రెగ్గడ యెంతవరకు నెగ్గినాఁడు? ఎక్కడనే భేదము లేక నన్నయ రచనాపద్ధతి నంతను [illegible]యిచట నిలిపినాఁడా యని పరిశీలించి[illegible] నిది శిథిలగ్రంథ పూరణమా, లేక అనుక[illegible] పద్ధతిమీఁదఁ జేయఁబడిన స్వతంత్రరచనయా యనువిషయము నిర్ధారణచేయుట కవకాశము కలుగును. అటుపైని ఈ యరణ్యపర్వభాగపూరణము 'తద్రచనయకాఁ' జేయుటకుఁ గారణము నన్నయఃదుస్వభావదుర్విపాకము కారణముగా నాతనికిఁ గలిగినదని తరువాతివారు బయలుదేరఁదీసిన మతిభ్రమణరూపకథామూలకమగు భయమా, లేక నన్నయతిక్కనలు తలపెట్టిన యుద్యమమందలి భక్తియా యనువిషయముకూడ తేలఁగల[illegible]

ఈసందర్భమున నన్నయ భా[illegible]మునను (అనఁగా మొదటి రెండుపర్వము[illegible] మూఁడవపర్వము 4 ఆ. వఱకు), తరువాత నెఱ్ఱాప్రెగ్గడ రచించిన యరణ్యపర్వశేషభాగమునను గలఅక్కరపద్యములను, వానిలక్షణ

మును గొంచెము పరిశీలించినచో నది యే తద్విషయనిర్ణయమునఁ గొంతవఱకుఁ దోడ్ప డఁగ[illegible]నని నానమ్మకము. ఆంధ్రవాఙ్మయకర్తలలో నన్నయ భారతకవులే అక్కరలను రచించినవారుగా నున్నారు. అందున తిక్కన అక్కరలను రచింపలేదు. ఇఁక మిగిలిన యిద్దరగు నన్నయయెఱ్ఱాప్రెగ్గడలు రచించినమధ్యాక్కరలలోఁ గొంత లక్షణభేదము కనఁబడుచుండుటయొకవిశేషము. నన్నయ మధ్యాక్కరలలోఁ బ్రతిపాదమునను నాలుగవగణము తరువాత యతి పాటించినాఁడు. కాని యెఱ్ఱాప్రెగ్గడ మూఁడవగణము తరువాతనే యతి పాటించినట్లగపడుచున్నది. వీరిద్దరికి నీయొక్క [illegible]చన విషయముననే యిట్టిభేద మగపడు [illegible]ఁ దెనుఁగు లాక్షణికులందఱు నీపద్యమునకు లక్షణము చెప్పుటలో నన్నయరచించిన పద్యముల లక్షణమును గ్రహించి చెప్పక, యెఱ్ఱాప్రెగ్గడరచించిన పద్యముల లక్షణమునే గ్రహించి, అనగా ప్రతిపాదమునను రెండింద్రగణములు, ఒకసూర్యగణము గలిగి మూఁడవ గణము తరువాతనే యతి అని యిట్లు మధ్యాక్కరకు లక్షణము చెప్పినట్లు కనుపడుచున్నది.

"పజతో నిద్ద ఱింద్రులును
నొక్క యాదిత్యుండు మఱియు
[illegible]జితంబుగ నిద్దఱమర
రాజులు నొక్కసూర్యుండు."

—అనంతుఁడు.

"మునుపుగాఁ బ్రాసంబుఁ గూర్చి
మూఁటిపై విరమంబు నిల్పి
చన నింద్రయుగళంబు మీఁద
జలజాప్తు నొక్కనిఁ జేర్చి
యినుమడించిన నాలుగణము
లెనసిన నొక్కపాదంబు
దనర వక్కాణించినంతఁ
దగు నిట్లు మధ్యాక్కరంబు."

—అప్పకవి.

ఆదికవియగు నన్నయపద్యముల లక్షణమునుగైకొనక యెఱ్ఱాప్రెగ్గడ పద్యములలక్షణమునేలాక్షణికులందఱు గ్రహించిచెప్పుటకుఁగారణమేమైయుండునని విచారించినచో,నప్పటికే యిప్పటివలె దెనుఁగులాక్షణికులకు నన్నయ మధ్యాక్కరలలక్షణము కుదురకపోయియుండునేమో యని సందేహింపవలసివచ్చుచున్నది. ఇప్పుడు పాఠభేదము లనేకము లుండుటంజేసి యన్నిపద్యముల కొకలక్షణము పట్టుటలేదు. ఇది పాఠభేదములనుబట్టి వచ్చినచిక్కో, లేక నన్నయయవలంబించిన యా కాలమునాఁటి లక్షణమందే భేదమున్నదో చెప్పుట కవకాశము లేకున్నది. దీనివిషయమై పండితులు భిన్నాభిప్రాయులై యున్నారు. యుద్ధమల్లుని శాసనములోని యక్కరలలో నాలవగణము తరువాతనేయతి కనఁబడుచుండుటనుబట్టి నన్నయ యీ ప్రాచీనసాంప్రదాయమునే యవలంబించియుండెనని తలంపఁదగియున్నది. ఎఱ్ఱాప్రెగ్గడయు నన్నయవలెనే "తద్రచనయకా" రచించినవాఁడుగావున నరణ్యపర్వశేషమున నక్కరలను రచించియున్నను, ఏకారణముచేతనో నన్నయలక్షణమునకు భిన్నంబగు లక్షణముతో నాపద్యములను రచించియుండు

టచే నీవిషయమున మాత్రము నన్నయమార్గమునం బోక, తనప్రత్యేకతను, స్వాతంత్ర్యమును జూపినవాం డయ్యెను. తక్కినరచనారీతు లన్నిటిలో నన్నయనే యనుకరించి, తద్రచనయే యగునట్లు పూరించినను, ఈ యక్కరల రచనావిషయమునమాత్రము తన మొండిచేతిని బయలు వెట్టక తీరినదిగాదు. నన్నయ యక్కరలలోని లక్షణము తరువాతి లాక్షణికులకు సరిగాం గిట్టకపోవుటచేం గాంబోలు, వారు దానిని వదలివేసి యెఱ్ఱాప్రెగ్గడ లక్షణమునే గ్రహించినారు. తక్కినలక్షణము విషయముమాట యెట్లున్నను, వీరియక్కర పద్యములలో యతిస్థానవిషయమగు భేదము స్పష్టముగం గన్పడుచునేయున్నదికదా? ఈ భేదమే యీభాగములు భిన్నకవికర్తృకము లని వ్యక్తముచేయుచున్నది. నన్నయయే యీభాగమునందలి యీపద్యములలో లక్షణము మార్చి యతిస్థానమును భిన్నముగాం జేసెననుట పొసంగదుగదా? శిథిలభాగపూరణకథనే నమ్మినచో నీభాగములందలి మధ్యాక్కరలును నన్నయవే కావలయును. అతండే లక్షణముమార్చి వ్రాసెనని చెప్పవలసివచ్చును. అరణ్యపర్వము 4 ఆశ్వా. 144 పద్యముతో నన్నయకవిత ముగిసినదనియు, 145-వ పద్యముతో ఎఱ్ఱనకవిత ప్రారంభించినదనియుం గదా చెప్పంబడుచున్నది. ఒక్క యాశ్వాసముననే పూర్వభాగమందలి నన్నయకవిత్వమని చెప్పంబడుదానిలోని మధ్యాక్కరలకును, ఉత్తరభాగమందలి యెఱ్ఱనకవితలోని వానికిని భేదము కనంబడుట కీభాగములే కేవలము భిన్నకవికర్తృకములని చెప్పుటతప్ప వేఱుకారణ మగపడదు.

అరణ్య. 3 ఆ. మధ్యాక్కర:—

"మాయావిమాయాయుధములు మాకిచ్చి
మాతోడ రణము
సేయు మివ్విధమునం బోవంజన దంచుం
జెప్పి యయ్యసుర—"

4-వ ఆ.న రెండు మధ్యాక్కరలు గలవు.

"ఏనేఁడు లగుడెంచె నర్జునుం డరిగి
యింత కేతెంచుం
బాని దివ్యాస్త్రముల్ వడసి యమ్మహా
భుజుభూరిసత్వ—"

—ఆరణ్య

"పదివేలగజములు బలము గలవా
పౌలస్త్యతోడం
గదనంబుం జేసి యనేక యక్షరా
క్షసుల నిర్జించి—"

—ఆరణ్య. 4-105.

ఎఱ్ఱాప్రెగ్గడకవిత్వములో 4-వ ఆశ్వాసమునందే:

"అనద్యశతేజుండు బ్రాహ్మ
ణానీకసహితుండై కడంగ
వసుమతియందు సధర్మ
వర్తులై యున్న మ్లేచ్ఛులను—

—ఆరణ్య. 12.

నన్నయ మూండవ యాశ్వాసములో:

"అరుణసరోరుహదళ మృదులంబు
లైన యుత్తరుణి—"

—ఆరణ్య. 3-299.

"పరఁగ నాకారణమున నిట్టిదుఃఖ
　　భారంబుఁ దాల్చె"
న[illegible] నీశానుదిక్కునకు నీ యనుజుఁ
　　డనిలవేగమున—"

—ఆరణ్య. 3-378.

ఇట్టివి లాక్షణికులు చెప్పిన లక్షణమునకును, తరువాతి భాగములోని యెఱ్ఱాప్రెగ్గడ చెప్పిన వాని లక్షణమునకును భిన్నముగా నుంటచే నరణ్యపర్వశేషకవిత్వము నన్నయది కాదని చెప్పుటకుఁ దగిన ప్రబలాధారము గానవచ్చుచున్నయది.

దీనినిబట్టి తెలియున దేమనగా, నన్నయ [illegible]ు మూఁడుకృతులు సంపూర్ణముగా [illegible]యే కాలధర్మము నొందెను. అతని [illegible] చాళుక్యప్రభుత్వమునకును, వైదికమతమునకుగూడఁ బట్టు తగ్గుటచేను, నాతని గ్రంథమునకు దేశమునఁ బ్రచారము లేకుండెను. మతవైషమ్యములచేఁ దరువాతికవు లెవరు దానిని జేపట్టలేదు. మతవైషమ్యములు తగ్గి పౌరాణికమతమునకు మరల నాదరము కలిగినకాలమునఁ దిక్కన నన్నయ మూఁడు కృతులు రచించినాఁడని విని, యాతనియందలి గౌరవముచేఁ దరువాతిభాగమును రచించెను. మఱికొంతకాలమునకు ఎఱ్ఱాప్రెగ్గడ రాజమహేంద్రవరమునందలి ప్రతినిజూచి, అందరణ్యపర్వము కొంతవడియుండుటను జూచి, నన్నయయందలి గౌరవముచే నాభాగము నాతఁడు రచించినట్లే పూరించెను. ఈభాగ మింతకాలము పూర్తికాకుండుటకుఁ గారణమును దెలియక తరువాతివారు నన్నయకు మతిభ్రమణకథను కల్పించి యుందురు. తిక్కనాదులు మూఁడుకృతు లున్నప్పుడు వారు వినియున్న దానినిమాత్రమే వ్రాసిరి. ఇట్లు భారతారణ్యపర్వశేషము శిథిలభాగపూరణముగాక ఎఱ్ఱాప్రెగ్గడ స్వతంత్రరచన యనియే చెప్పఁదగియున్నది.

---

# మా య మ్మ చ ల వ

[illegible]ల్లకుండచలవ మాయమ్మచలవ
　　పైడిపావుపిలుపు మాయమ్మపిలుపు
అమ్మయమ్మపెట్టు మాయమ్మపెట్టు
మలయమారుతమధరంబె మాయమ్మముద్దు
నిండులో నుండేటి నమ్రతే మాది.
కష్టపడెదు కాపె మాయమ్మకుఱ్ఱ
'పాటుపడినపాట్ల' మాయమ్మపాట
పారునీటిపలుకులే మా లాలిపాట
తాగిచూచిన తెలియు, నాపాటమహిమ
గానగీతములోనె మా గాతమిా ఘనత.

'వాసు'

---

# పుష్పాంజలి

మానవల్లి రామకృష్ణకవి గారు, యమ్. ఏ.

## కవికంఠపాశము

ఆంధ్ర ఛందోగ్రంథములలో నన్నయభట్టవిరచిత మగు లక్షణసారమును, నధర్వణవిరచిత మగు లక్షణదీపికయు గ్రంథపాతములతో స్వల్పభాగములుగా లభించుచున్నవి. తిక్కన కవివాగ్బంధ మల్పగ్రంథము. పూర్ణముగా నున్నను మిక్కిలి ప్రయోజనకారి కానేరదు. అతిప్రాచీనాంధ్రఛందోగ్రంథములఁ గవిజనాశ్రయమే మనకు లభించువానిలోఁ బ్రాఁతది. దానిలో—

"జయదేవాదిచ్ఛందో
నయమున సంక్షేపరూపునం జెలువుగ మ
ల్లయ రేచన సుకవిజనా [యన్."
శ్రయుఁ డీచందంబుఁ జెప్పె జనులకుఁ దెలి

అనుపద్యమునఁ జెప్పఁబడిన 'జయదేవచ్ఛందము' సంస్కృతభాషకొఱకుఁ దద్భాషలో రచింపఁబడినది. జయదేవచ్ఛందములోని వని కస్తూరి రంగకవి మొదలగువారు కొందఱు కొన్ని పద్యము లుదాహరించిరి. అది ప్రాయశః సంస్కృతమున కనువాదమై యుండునని తోఁచుచున్నది. భీమన సూచించినది సంస్కృతమై యుండును.

ఆంధ్రభాషకు సంస్కృతభాషలో వ్యాకరణము వ్రాయఁబడినట్లే ఛందోగ్రంథములు కూడ విరచింపఁబడి యుండుట చిత్రముగా నున్నది. ఆకాలమున సంస్కృతభాషలో శాస్త్రకావ్యపాండిత్యము ప్రధానమై దేశభాషాజ్ఞాన మంగరూపముగా వెలయుచుండె ననుట నిక్కము. ఎట్లున్నను భాషాఛందోగ్రంథములలో "ఆంధ్రభాషాయాం ఛందసి", "కవికంఠపాశే", "కవిగజాంకుశే" అనియు సంస్కృతములోని వ్యాఖ్యామర్యాద ననుసరించి యుద్ధృతభాగములు గలవు. లక్షణదీపిక యను గౌరనార్యవిరచితచ్ఛందోగ్రంథములో "యథా కవిగజాంకుశే—

శునీదుగ్ధమివ త్యాజ్యం
పద్యం శూద్రకృతం బుధైః,
గవామివ పయో గ్రాహ్యం
కావ్యం విప్రేణ నిర్మితమ్."

అనుశ్లోక ముదాహరింపఁబడియున్నది. భైరవు
మాహాత్మ్యము ముద్రించునపుడు ప్రమాదవశ
యుదాహరించిన కవిగజాంకుశశ్లోకము తప్పుగాఁ దను భైరవుని కవిరాజగజాంకుశములోనిపద్య మని భ్రమించి, భైరవుఁడు గౌరనపుత్రుఁ డనునో కాఁడో యనుసంశయమున నీయుదాహరణము బాధక మగునని పీఠికలో వ్రాసియుంటిమి. కం. వీరేశలింగముపంతులు కూడ దానినే గ్రహించి తనకవులచరిత్రములోఁ దాను సంపాదించినఫలము చెప్పక యే దోషము నెక్కించుకొనిరి. ఇప్పుడు గౌరన యుదాహరించిన కవిగజాంకుశశ్లోక మొకసంస్కృతగ్రంథమునఁ గానవచ్చుచున్నది. సుమారిన్నూఱుశ్లోకములు గలదైన నయ్యది యపూర్ణ మనియే చెప్పఁదగు. భైరవుని కవిరాజగజాంకుశ మాంధ్రగ్రంథము. అది ముద్రితము గాకున్నను సర్వత్ర లభించుచున్నది.

ఛందోగ్రంథములలో నుదాహరింపఁబడుపద్య
లేలక్షణగ్రంథములోని వని గ్రంథకర్త చెప్పునో యా లక్షణగ్రంథములో నాపద్యములు వెదకి చూచినఁ గానరాక మఱియొకపుస్తకమున నుండునట్లు కొన్ని యెడలఁ దటస్థించుచున్నది. మఱియు ఛందోగ్రంథములలో న్యూనాధికత్వములు లేక శుద్ధము లగు నాదర్శములు లభించుట

దుర్లభముగా నున్నది. సాహిత్యపరిషత్తువారి కవిజనాశ్రయములోఁ గవి వని తలఁపఁబడిన పద్యములు ప్రక్షిప్తములుగాను ప్రక్షిప్తములు గ్రంథములోని వనియు నిర్ణయింపఁబడినవి. కం. వీరశైలింగముగా రుపయోగించిన కవిజనాశ్రయపుఁ బ్రతిలోఁ గావ్యాలంకారచూడామణివే కాక మధ్యకాలకవుల కావ్యప్రయోగములుకూడ నుదాహరణముల క్రిందఁ జేర్పఁబడెను. ఆనందరంగరాట్ఛందము, గణపవరపు వేంకటకవికృత లక్షణశిరోమణి, తిమ్మనార్యుని లక్షణదీపిక మొదలగు గ్రంథములలో పఠితము కవిజనాశ్రయములోని వని యుదాహరింపఁబడిన పద్యములనంతుని ఛందోదర్పణమునను,—గోకర్ణఛందములోనివి, యథర్వణచ్ఛందములోనివి—అని యుదాహరింపఁబడినవి ఛందోదర్పణ కవిజనాశ్రయాదులలోను గానవచ్చుట సంభవించుచున్నది. కావున నాంధ్రలక్షణగ్రంథములలో నుదాహరింపఁబడిన పద్యములు, లేక శ్లోకములు తద్గ్రంథక[illegible] చేర్చుచున్న గ్రంథములలోనివే యనుట కించుక [illegible]పవలయు.

[illegible] ఇప్పుడు మనకు లభించిన సంస్కృతరచిత మగు నాంధ్రచ్ఛందమునకుఁ బేరు గానరాదు. దానిలోఁ బ్రారంభ మిట్లున్నది:—

"విప్ర ఏవ కవిర్హ్యాస
　మత్రోదాహరణం శ్రుతిః,
శునీదుగ్ధం యథా త్యాజ్యం
　కావ్యం శూద్రకృతంబుధైః.
గవామివ పయో గ్రాహ్యం
　పద్యం విప్రేణ నిర్మితమ్."

అని యాశీర్నమస్క్రియావస్తునిర్దేశములు లేక యేకదేశముగా గ్రంథము ప్రారంభించుచున్నది. ఒకవేళ మనకు లభించినప్రతి యాద్యంతములు లేనిదై యుండునేమో! పైపొర్గశ్లోకములో "శునీదుగ్ధ" మిత్యాదిశ్లోకము గౌరనలక్షణదీపికలోఁ గవిగజాంకుశములోని దని యుదాహరింపఁబడెను. కావున నీలక్షణగ్రంథము కవిగజాంకుశమగునా యనుసందియము పొడముచున్నది. మనకు లభింపఁదగిన ఛందోగ్రంథములలో సంస్కృత కవిగజాంకుశమునకుదాహృతమైన స్థల మిది యొక్కటియే. ఇందు "అత్రోదాహరణం శ్రుతిః" యన్నప్పుడు "శునీదుగ్ధ" శ్లోకము, శ్రుతశ్రుతిశబ్దములు శాస్త్రార్థమునఁ గూడఁ బ్రయోగింపవచ్చుఁ గావున గ్రంథాంతరములోనిదా యను సందేహము కలుగుచున్నది. ఇఁక గ్రంథ మంతయుఁ బరిశోధింపఁగాఁ దేటపడినయంశ మేమన, నయ్యది కవికంఠపాశమై యుండనోపు నని.

"యథా కవికంఠపాశే—
　"పర్వతానాం యథా మేరుః
　　సురాణాం శంకరో యథా,
　మృగాణాం చ యథా సింహో
　　గణానాం నగణ స్తథా."

అనియు,

"దేవనృతిర్యగ్రౌరవ
　భేదా గతయ శ్చతుర్విధా వర్గాః,
తత్ర తు లఘవో దేవాః
　కచటతపాః స్థితా నరా దీర్ఘాః."

మఱియు,

"దేవతావాచకాః శబ్దా
　యే చ భద్రాదివాచకాః,
తే సర్వే నైవ నింద్యాః స్యు
　ర్గణతో లిపితోఽపి వా."

అనియు,

"వ్యోమ శూన్యం వితనుతే-"

అని మొదలుగా రంగరాట్ఛందములోను, గౌరనలక్షణదీపికలో నుదాహరింపఁబడినభాగము లిందుఁ గలవు. గౌరన "సాహిత్యసంద్రోపయే—

నగణాదౌ ప్రయోగే తు
　దుఃఖవర్గః శుభో భవేత్,
అయః కాంచనతా మేతి
　స్పర్శాద్వై స్పర్శవేదినః."

అనుశ్లోకమును,

"యథా సాహిత్యచూడామణౌ—
న గ్రహో న చ నక్షత్రం
న రాశిర్న చ మిత్రతా,
నాక్షరా న హి చింతాస్యా
త్ప్రయోగే నగణస్య తు."

అనువదియు నీగ్రంథమున నున్నవి. అట్లున్న యెడల నిది నానాఛందోగ్రంథశ్లోకములతో సంచితమగు గ్రంథమేమో యని తలంపవచ్చును. కాని విషయవిభాగక్రమమును, గ్రంథాంతరప్రశంస యొక్కెడఁగానరామియుఁ బరికింప నేకకర్తృకత్వమే దీనిలో వెలయుచున్నదని చెప్పఁదగు. ఇప్పటికిఁగల యాధారములఁబట్టి యిదియే కవికంఠపాశ మని తలంచుచున్నాము.

దీనిరచనాకాలము స్పష్టముగాఁ దెలియరాదు. క్రీ. శ. 1400 కాలములో నుండినగౌరన దీని నుదాహరించుటవలన నిది యప్పటికిఁ బ్రాచీనతర మగుట నిస్సంశయము.

దీనిలోని—

"పర్వతానాం యథా మేరుః..."

అను శ్లోకమున కాంధ్రానువాద మథర్వణాచ్ఛందములో నుండి కస్తూరిరంగకవి యుదాహరించుచున్నాఁడు:

"తే. పర్వతములందు మేరువుభాతి యగుచు
సర్వసురలందు శంకరునంద మగుచు
నరయ మృగములయందు సింహంబుకరణి
గణములందెల్ల నగణంబు గరిమ గాంచు."

ఇది నిశ్చయమైనచో నవకవికంఠపాశ మథర్వణాచ్ఛందముకంటెఁ బ్రాచీనతర మని తలంపవచ్చును.

కవికంఠపాశము సంస్కృతభాషలో రచియింపఁబడినను బ్రాయశః భాషాచ్ఛందోరూపముఁ దెలుపుచుండును.

ఈగ్రంథమునఁ బై నుదాహరించిన సార్ధశ్లోకమునకుఁ బిదప షడ్వింశచ్ఛందస్సులు, నక్షరహటదేవతాలక్షణములును, గణలక్షణములును జెప్పఁబడియె. సంస్కృతభాషలో వైదికచ్ఛందము గాక కావ్యచ్ఛందము రెండుదెఱఁగుల లక్షణకారులచే వివరింపఁబడియె. పింగళబృహత్పృతికాశ్యపాదులమత మనియు, శైవాచార్యమత మనియు ఛందశ్శాస్త్రమునఁ బ్రస్థానభేదములు రెండు గలవు. పింగళమతమే సాధారణముగా సంస్కృతచ్ఛందోగ్రంథములను, గర్ణాటాంధ్రలక్షణగ్రంథములను వాడఁబడియున్నది. శైవాచార్యమతమున మ,య,భ,జ,స,నాదిగణవిభాగము కానరాదు. పద్యపాదమునకు మధ్యమునో, యంతమునో విశ్రాంతి, లేక విదారి (Caesura) యనఁబడు సంహిత యేర్పడుటంజేసి తదనుగుణముగా ద్వ్యక్షర త్ర్యక్షర చతురక్షర పంచాక్షర షడక్షర సప్తాక్షరగణముల నియమించి తల్లక్షణకారులు శాస్త్రమును నడపిరి. భరతుఁడు నాట్యశాస్త్రమున (దాక్షిణాత్యపాఠానుసారము) గురులఘుస్థానసంఖ్యల బేర్కొనియెఁ గాని భజసనాద్యక్షరగణములతో లక్షణము ప్రవచింపఁడు. శైవాచార్యమతమున జనాశ్రయచ్ఛంద మను సంస్కృతగ్రంథము ముకుటాయమానమై యున్నది. విష్ణుకుండినవంశవర్ధనేంద్రుఁ డగు జనాశ్రయుఁడు తన్మతమవలంబించి మూల సూత్రములు రచింపగా గణస్వామి తదా[illegible] గూర్చె. ఆంధ్రములోని కవిజనాశ్రయ మను[illegible] గానే సంస్కృతములోని జనాశ్రయచ్ఛందము [illegible]నకు రాకతక్కదు. అయినను సంస్కృతజనాశ్రయము క్రీ. శ. 600 పూర్వము విరచింపఁబడియె. కవికంఠపాశకారుఁడు పింగళమతమునే యనుసరించె.

దీనిలో గణలక్షణమునకుఁ బూర్వము వర్ణస్థానములును, తత్ఫలములును, దజ్జాతులును, సద్గతిక్షేపములును, బీజాక్షరలక్షణంబును, నాందీముఖాక్షరప్రయోగవిధియును, పిదప సాధ్యాదినక్షత్రవిధానమును, బ్రహ్మమాక్షరగ్రహమైత్రియుఁ, గృతిపతికర్తృనామాక్షరములకుఁ బొంతనములును, పిదప గణముల కావ్యారంభగణనియతియుఁ, దత్ఫలములును గావ్యారంభకాలనిర్ణయమును వివరింపఁబడియె. పిదప—

"దోషస్వల్పగుణాధిక్య
వశాత్తత్రాపి నిర్ణయః,
శుభవర్ణగుణోపేతా
నాందీపద్యాన్వితా కృతిః;
స్వీకార్యా విభునే త్యుక్తం
కృతే ర్లక్ష్మోచ్య తేఽధునా."

అని గ్రంథకారుఁడు వర్ణారంభలక్షణాంతరము కావ్యలక్షణము గ్రిందిశ్లోకములఁ జెప్పె:

"గుణై రీతిరసైర్వృత్తి
పాకశయ్యాభిరేవ చ,
అలంకారచమత్కారై
ర్యుతా సా కృతిరుచ్యతే."

గుణములు పదియు, రీతులు గౌడీవైదర్భీపాంచాలీలాటు లను నాల్గును, నవరసంబులును, కైశిక్యాదివృత్తులును, ద్రాక్షానారికేళపాకద్వయమును జేర్చికొని, గ్రంథకర్త శయ్య "శయ్యా పదవినిమయా సహా వా పదమైత్రీ పదదాం పత్యమితి యావత్" అని లక్షించి నలువదియలంకారములఁ సూచించె. చమత్కారము లన—

"పద్మబంధశ్చక్రబంధః
ఛురికాబంధ ఏవ చ,
...గా గోమూత్రికాబంధో
మురజాందోళికాభిధా.

కంకణం సర్వతోభద్రం
తథారోహావరోహయోః,
వృత్తైక్యం వృత్తభేదశ్చే
త్యేవమాద్యాశ్చ మత్క్రియాః.

వృత్తైక్యం కేషు చిద్భేదః
కేషు స్యాదవరోహిణీ,
ఉపాయో వా కథం తత్ర
భవేదిత్యత్ర కథ్యతే."

అని చెప్పుచుఁ గవి యారోహావరోహిణీ చమత్కృతుల వృత్తభేదములతోఁ గ్రిందిశ్లోకముల వివరించుచున్నాఁడు; అదియుఁ జమత్కారియే కావున విపులముగా నుదాహరించెదము:

ఇంద్రవజ్రోపేంద్రవజ్రా
వుపజాతీ రథోద్ధతా,
శాలినీ స్వాగతా శాంతా
సైనికా స్రగ్విణీ తథా,
చామరం శశికలా హ్య
శ్వగతిర్మంజుభాషిణీ.

సుమంగలీ త్వమీషాంచా
వరోహా హి స్యురేవ తే,
కాంతా జలోద్ధతగతిః
సైనికా చ రథోద్ధతా.

ఇంద్రవజ్రోపేంద్రవజ్రా
ముక్తామాలా చ తోటకమ్,
దోధకోపస్థితే మంజు
భాషిణీ ప్రమితాక్షరా.

సుమంగలీ త్వమీషాం స్యా
ద్వృత్తిభేదేఽవరోహిణీ.
వృత్తైకత్వం భవేద్యేషాం
తత్రోపాయః ప్రదర్శ్యతే.

ప్రాతిలోమ్యే హ్యైంద్రవజ్రా
దిత్యే షష్ఠాక్షరస్య తు,
ఏవమేవోపేంద్రవజ్రా
పాదాంతే లఘుచేద్భవేత్.

ఉపజాతిం ప్రాతిలోమ్యే
ఽప్యేనం నియత మిశ్రణాత్,
చతుర్థాష్టమయో ర్లఘ్వో
ర్దీర్ఘత్వం స్యాచ్చ రథోద్ధతా.

చతుర్థాష్టమయోర్గుర్వో
ర్దీర్ఘత్వం చేచ్ఛాలినీ భవేత్,
త్రిషష్ఠనవమద్విత్వే
స్యాత్కాంతే వాపరోహిణీ.

సైనికాస్రగ్విణీ స్యాతాం
తే ఏవ ప్రతిలోమతః,

చామరం చామరం హి స్యా
త్ప్రాతిలోమ్యేన పాఠతః.
ప్రాతిలోమ్యే శశికళా
సైవస్యా దంత్యలాఘవే,
పాఠమాత్రేణాశ్వగతిః
సద్యః స్యాదవరోహతః.

స్యాన్మంజుభాషిణీ సైవ
రోహిణీత్యంతలాఘవే,
ఆద్యాబ్ధిదశమాంత్యానాం
ద్విత్వే సైవ సుమంగళీ.

ఇత్థం వృత్తైకత్వమార్గో
దర్శితో హ్యవరోహిణీ,
అవరోహే వృత్తభేద
మార్గః కేషు ప్రదర్శ్యతే.

కాంతా తు ప్రాతిలోమ్యేన
పఠితా దోధకం భవేత్,
జలోద్ధతగతే రంత్య
లాఘవే నవమాలినీ.

ఆద్యమధ్యాష్టమద్విత్వే
సైనికా స్వాగతా భవేత్,
రథోద్ధతా సైనికా స్యా
త్తుర్యద్విత్వే ఽవరోహిణీ.

ఇంద్రవజ్రోపేంద్రవజ్రే
షష్ఠద్విత్వే ఽంత్యలాఘవే,
లఘుత్వే పంచమస్యైవ
మేషా సా నాంత్యలాఘవే (?).

కాంతా మౌక్తికమాలాయాః
షష్ఠద్విత్వే భవేద్ధ్రువమ్,

ఆద్యపంచమయో ర్ద్విత్వే
శిఖండివిరుతం చ సా.

తోటకం ప్రాతిలోమ్యే ఽంత్య
లఘుద్రుతవిలంబితమ్,
తదేవ హీంద్రవంశో వా
చతుర్థే సప్తమే తథా.

దశమే చ భవేద్ద్విత్వం
వంశస్థా వాంత్యలాఘవే,
దోధకం ప్రాతిలోమ్యే స్యా
దాద్యద్విత్వే ఽప్యుపస్థితా.
ద్విత్వాభావే తు కాంతా స్యా
దాద్యవర్ణస్య నిశ్చయః,
ఉపస్థితేంద్రవజ్రా హి
భవేద్ద్విత్వే త్రిషష్ఠయోః.
భవేదుపేంద్రవజ్రా వా
యది స్యాదంత్యలాఘవమ్.

మితాక్షరా త్రిపూర్వాంత్య
లఘ్వీ చేత్స్యాత్ప్రియంవదా,
లలితా వా భవేత్సైవ
ద్విత్వం చే ద్దశమాక్షరే.

ద్విత్వే తుర్య ద్వయో ర్మంజు
భాషిణీ స్యాత్సుమంగళీ,
సుమంగళ్యా భవేత్సా వా
ద్విత్వేచ దశమాంత్యయోః.

ఊర్ధ్వాధఃస్థితయో ర్ద్విత్వా
ద్గురులఘ్వోస్తు నిత్యయోః,
కాదాచిత్కత్వసిద్ధ్యర్థం
ద్విత్వాజ్ఞానీహ యత్కృతమ్.

"ఇత్థం వృత్తైక్యతద్భేదా
దారోహీ చావరోహిణీ,
[illegible]మద్భిరూహితుం శక్య
ఇతి మత్వోపరమ్యతే."

అని లఘుగురువులమార్పుచే వృత్తములు భేదిల్లునట్టి చమత్కారము విస్తరించి వర్ణించె. ఇది సామాన్యముగా ఛందోగ్రంథములఁ గానరాదు. కావునఁ బాఠకుల కెప్పుడైన వినియోగపడవచ్చు నని పూర్ణముగా నుదాహరించియుండుక విరసత్వదోషము నాపాదించితిమి.

తరువాత దీనిలో మహాకావ్యలక్షణము చెప్పఁబడినపిదప నాంధ్రఛందోవిధాన మింతుక సూచింపఁబడిరి.

"షడ్వింశతిభ్యశ్ఛందోభ్యో
జనితం శ్లోకలక్షణమ్,
యత్తదేవాంధ్రభాషాయాం
వృత్తపద్యేషు నో పృథక్."

అని, పిదప లయగ్రాహి, లయవిభాతి, లయహారి, త్రిభంగి, దండకము, మాత్రావృత్తములలోఁ గందమును నిర్వచింపఁబడిరి. ఇంద్రచంద్రసూర్యగణములఁ జేర్కొన్నవెను[illegible]గ్రంథకారుఁడు యతిప్రాసలక్షణ మిట్లు చెప్పెను:

"భవేత్పాదాద్యవర్ణేన
యతిస్తత్సదృశేన వా,
ప్రాసః పాదద్వితీయేన
తత్తత్పాదద్వితీయకే.
ప్రాయశః కథితం హ్యేత
త్తయోర్భేదస్తు కథ్యతే
భవేత్తత్ర యతిస్సప్త
దశధా లక్ష్మభేదతః.
కథ్యంతే లక్షణేష్వేవ
తేషాం నామాని నో పృథక్."

అని లక్షణములలోఁ బదునేడుయతులఁ జేర్కొనిరి: స్వరయతి, వర్గవడి, సవర్గయతి, అఖండవడి, అజ్ఝలోర్వడి (ప్రాదియతి), అనుస్వారవడి, ప్లుతయతి, సంయుక్తవడి, యకారవడి, ఉభయోర్వడి, సరసవడి, వ్యంజనస్వరవడి, వృద్ధివడి, ఆదేశవ్యంజనవడి, అభేదవడి, గూఢస్వరవడి, సమాసవడి.

అంత.

"వడిప్రభేదః కథితః
ప్రాసశ్చాష్టవిధోమతః
తేషాం నామాని కథ్యంతే
లక్షణేష్వేవ నో పృథక్."

అని గ్రంథకారుఁడు దుష్కర, ద్వి, త్రి, చతు, రంత్య, వర్గప్రాసముల నాలింటికిని లక్షణోదాహరణములఁ జేర్చెనిరి. తరువాత సూర్యేంద్రచంద్రగణోపయోగము వివరించుచు నుత్సాహాదిలక్షణ మిట్లు వచించె:

"ఉత్సాహ స్త్రివిధో గీతిః
పంచధైవ ప్రకీర్తితా,
చతుర్దశవిధః సీస
స్తేషాం లక్షణ ముచ్యతే—"

అని ఉత్సాహలక్షణానంతరము,

"ఆటవెలఁదీచ విజ్ఞేయ
స్తేటగీతిశ్చ మేళనః,
ఎత్తుగీతి రితి హ్యేతే
గీతికాః పంచధా మతాః."

అన్నను నాలుగుగీతలక్షణములే వివరింపఁబడిరి.

సీసలక్షణమునఁ దెక్కులు గ్రంథపాతములు పడినవి.

"యత్ప్రాసనసీసం సవడి
సమసీసం తదుచ్యతే,
యత్ప్రాసవడినిష్ప్రాసం
తచ్చావకలిసీసకమ్.

గీతియుక్తాకలిప్రాస
సీసే ప్రాసవడిం త్యజేత్,
వడిస్థానేషు..........
న్యసేత్ప్రాసం ద్వయోర్ద్వయోః.
సర్వతఃప్రాససీసం స్యా
దక్కలిప్రాసతుల్యతా,
ఇయా నత్ర విశేషః స్యా
త్ప్రాసః సర్వత్ర న ద్వయోః.
త్రిపాత్రిపాత్ప్రాసవడిః
శేషస్తు వడిమాత్రయుక్,
విషమాంఘ్రిప్రాససీసం
తదేవ స్యాన్న చేతరే.
ప్రత్యంఘ్ర్యేకైకాక్షరేణ
కుర్యాత్ప్రాసవడిం యది,
తం నిష్ప్రాసం పాదపాదై
కాక్ష.......................
వడిమాత్రం పూర్వఖండ
ప్రాససీసం తదుచ్యతే
పూర్వఖండే ప్రాససీసం
రణితం వ్యత్యయేన చేత్.
తదేవాపరఖండాఖ్యం
ప్రాససీసం న సంశయః,
అంఘ్రిష్వేకైకవర్ణేన
వడిం కుర్యా చ్చతుర్థకే.
భిన్నవర్ణాద్విషమపద
వడిసీసం తదుచ్యతే..."

అనునట్టి సీసలక్షణములో గ్రంథ మసంపూర్ణముగా లభించుచున్నది.

ఇందుఁ బదునేడువిధములుగా యతులు నిర్ణయింపఁబడియె. కవిజనాశ్రయకారుఁడు పదింటి, నాంధ్రజయశేవుఁడు తొమ్మిదింటి, నుత్తమగండఁడు పదునెనిమిదింటిఁ బేర్కొనిరి. ఈసంఖ్య ననుసరించి కవికాలనిర్ణయము సేయఁదగదు. ఏల యనఁగా నన్నయభట్టు ... ణసారమున నిరువదేడుయతులను, (1600 క్రీ. శ. ...) ముద్దరాజు రామన పండ్రెండుయతులను బేర్కొనిరి.

కంద మనునది ప్రాకృతములో స్కంధక మనఁబడును. కందము స్కందశబ్దమునకుఁ దద్భవము. సీసము శీర్షకశబ్దతద్భవము. కందలక్షణము పింగళుఁ డిట్లు చెప్పెను.

"చఉమత్తా అట్ఠగణా
పువ్వద్ధే ఉత్తరద్ధ హోఇ సరూఆ,
సో ఖంధఅ విఆణహు
పింగళ పభణేఇ ముద్ధి బహుసంభేఅ."

[చతుర్మాత్రా అష్టగణాః పూర్వార్ధే
ఉత్తరార్ధే భవంతి సరూపాః,
తం స్కంధకం విజానీత పింగళః
ప్రభణతి ముగ్ధే బహుసంభేదమ్.]

స్కంధకము 29 విధములుగా గానశిక్షాకారులచే విభజింపఁబడియె.

సీస మనునది సామవేదమున బ్రహ్మగీతములవలనఁ బుట్టినది. అక్షరపిండప్రధానమై, పంచప్పటాది తాళవియమబద్ధమై యుండును. అట్టిపాదములకొనలలోఁ బాళాంతరముచే వ్యవసిత మగుగీత మొక్కటి సర్వమునకు శీర్షప్రాయముగా నుండుటచే శీర్షమై యంతయుఁ గలసి శీర్షక మయ్యె.

"శీర్షకాణా మనియమో
భవే త్పాదవిధానతః,
నానావృత్త వినిష్పన్నం
కుర్యాద్వై శీర్షకం బుధః.
గుర్వాది రథలఘ్వాది
ర్మగ్మః సర్వలఘుస్మృతః,

చతుర్మాత్రాగణో జ్ఞేయః
　　పూర్వచ్ఛందోవికల్పనాః.
అర్ధాష్టమగణాః పాదాః
　　శీర్షకస్య భవంతి వై,
చతుర్మాత్రస్తు విజ్ఞేయో
　　యుగ్మోజాతురికైః పదైః.
శీర్షక స్త్యైకవింశత్యా
　　షడ్వింశతి పర స్తథా
అక్షరాణాం భవే త్పిండః
　　పాదే ప్యేకత్ర నిశ్చయాత్."

అని భరతుండు ధ్రువాగీతివిధానముఁ జెప్పెను. జయాశ్రయకారుఁడు గీతానిలక్షణానంతరము

"శీర్షకం గీతికా పరా"

యని సూత్రింపఁగా, భాష్యకారుఁడు,

"సైవాధికాక్షరా గీతికాపరా భవతి చేత్ శీర్షకం నామ భవతి ఏకైకవృద్ధ్యా లలితసుభద్రావిద్రుమవంశ పుష్పదంతమాలాః ఇత్యేవం నామకాని సప్తశీర్షకాణి భవంతి; తత్ర లలితస్య పాదే సప్తగణా భవంతి,అంతే గీతికా చ. ఏవం శేషకాణిశీర్షకాన్యేకైకవృద్ధ్యా జ్ఞేయాని"

అని. క్రౌంచపదములోనిగణముల మాత్రాగణములగా మార్చి యంత్యగురువు రెండులఘువు లగుచేని సీస మగును. ప్రాకృతలక్షణకారులు క్రౌంచపదమును సీసములలోఁ జేర్చిరి. ఆన్యాయము ననుసరించి కాఁబోలు, నన్నెచోడుఁడు క్రౌంచపదమునకు సీసమునకువలెఁ బూర్వార్ధప్రాసమును, ఈ త్తరార్ధపరస్పరయతియుఁ గల్పించెను. అక్కరలును, గీతములును ద్రవిడభాషలలోఁ గలవు. జీవకచింతామణిలోఁ జెక్కువిధములు నిరూపింపఁబడెను. గణవిభాగము చేయునప్పుడు ద్రావిడప్రకృతినియమముల లఘువులుగా గ్రహించినయెడల మనయుపద్రపూర్వగణము లతో నవియు భేదోషము లేక నడచుచున్నవి. తిరువాయ్ మొళ్ళి అను ద్రవిడగ్రంథమునఁ బ్రథమదశకములో సర్వతః ప్రాససీసమున కెత్తుగీతి చేరియుదాహరణము గలదు. ఇప్పుటు గ్రంథసౌలభ్యము చాలమింజేసి యుదాహరణములఁ జూపఁ జాలమైతిమి. భరతశాస్త్రపత్రికలో దీని విస్తరించి వ్రాయఁదలఁచియున్నారము.

---

# ఆహ్వానము

కొమరవోలు నాగభూషణరావు గారు.

అరుణరుచిప్రకాశితసమంచితకూ భవదీయపల్లవా
　　ధరమును వేణువందు లలితశ్రుతి మీఁటుఁగఁ జేర్చి, నల్లరాల్
గరగఁగఁ జేయు నీదుమృదు గానసుధారసవాహినీతతుల్
గురియఁగ రాదె నాపయిని, గోపకుమార! ప్రభాత వేళలన్.　　౧

తనరఁగ నీదుచెంత సతతప్రమదప్రదమా విపంచికా
స్వనమున భావగీతి కలనస్వరయుక్తిగ మేళవించి ని
న్ననయము మాధురీరసమహాంబుధి నూఁపెదనోయి! నాపయిన్
గనికరమూని యొక్కపరి గాఢపుఁబ్రేమఁ గప్పుంగలింపుమా.　　౨

వికసితమై మరందముస్రవించెడి పద్మవనంబుపై నళి
ప్రకరము సంతసంబులయ వ్రాలినభాతి మదీయమానసం
బకలుషభక్తి నీయెడనె యాశ్రయ మొంది విలీనమయ్యె నో
వికసితపద్మనేత్ర! కనుపింపవె యీమధుమాసశార్వరిన్.　　3



# కొత్తపల్లి సూర్యారావుగారు

(వెనుకటి సంచిక తరువాయి)

## పదునైదవ యంకురము

మాయిల్లు కుబేరపుష్పకము వంటిది. ఎందఱు గూరుచున్నను కుబేరుని పుష్పకములో నింకొక్కరు వచ్చినఁ గూర్చుండుటకుఁ దావు మిగిలియుండునఁట అట్లే మాయింటిలో నేమిద్దఱ మున్నపుడు మాకును సరి పోవుచున్నది. ఎవ్వరుగాని మఱి యొకరిద్దఱు వచ్చినను మాట దక్కించుచున్నది. ఇంటిప్రసంగము వచ్చినదిగనుక- అద్దె లేకుండ మాకు గృహదానము చేసిన మాప్రభువులను దీవింపవలెను. రాజకీయోద్యోగులలో నంతటి నీచదు పాయములు లేవు. వైద్యశాలాధికారులకు, పెన్షనుద్యోగులకు, సుత్తరసేవకాలయాధికారులకు, మాకు నే కలవు. తక్కినవారు డిప్యూటీకలెక్టరయినను, జడ్జీ లయినను రాఁగానే ముందు కొంపకై వెదకుకొనకుండ నుండ వీలు లేదు. కొంప వెదకుకొనుట యనఁగాఁ బట్టణములలోఁ గృహాన్వేషణమే. దుష్యంతమహారాజు ముక్కును గన్నులను మూసికొని కూర్చుండి తిండి విడిచి పరబ్రహ్మమును వెదకికొనుచున్న మునీశ్వరులంగాంచి "నమస్తస్మై కష్ట తపసే"-అన్నాఁడు-తనకుఁ గావలసినన్ని మేడలుమిద్దెలు గలవాఁడు గనుక నట్లు వారికష్టతపస్సుకు భయపడి నాఁడు. అదికాదు; కంటికి నిదురరాక, తిండిదినక, కొంపకై వెదకుకొను నుద్యోగియత్నమునకు నమస్కారమన వలయును. అన్నియు వద్దకిచ్చు నిండ్లే;యన్నియు 'కందు కం'డని పిల్చుగృహములే. ప్రాదేశమాత్రపుగదులు- వంట యింట్లు-అస్వాతంత్ర్యము - ఇక్కడ నమ్మివేయరాదు- కాళ్లు నెత్తిమీఁదఁ బెట్టుకొనవలయును-గోడలకు మేకులు గొట్టరాదు, కట్టెలతో వంటచేయరాదు-అని ప్రతిద్వారముకడఁ బల్లలే-ఒక్కనో స్వతంత్రించి గడియసేపు నిలువ నధికారమున్నదా! ఒక్కనో నొక్కవస్తు వింటివారి నడుగకుండఁ బెట్టవచ్చునా! ఒక్కచంటిపిల్ల నక్కడఁ బండుకొనఁబెట్టుటకు సెలవున్నదా! సుగ్రీవాజ్ఞ! వచ్చిన యధికారి యధికార మాయింటి యధికారియొద్దఁ బనికి రాదు. పనికిరాదు కాదు - పనికిమాలినదనిన సరియైన ప్రయోగమది. ఆయింటివలననమ్మ భాటకముతో వారి సంసారమంతయు గడచిపోవలయును? వర్షమున యిల్లు కురియుచున్నదనిన - వర్షకాలము పోనిండు బాగుచేయిం చెదమని - తెఱపిగా నున్నపుడు బాగుచేయింపుఁడనిన నిపుడు కురియుచుగదా - వర్షముకురియనిండు - కురిసెడు చోటు లిపుడు తెలియవని - గడుపుసలలు - దీపముల పన్ను, నీటిపన్ను, నాదాయపుపన్ను హెచ్చుచేసినారు- వీరింతటినుండి బాడుగకొంచెము "జాస్తియివ్వవలె" నం దురు: లేదా యిల్లు తెఱపిచేసివేయుమందురు. బంగళ్లైనను గిరాయియిండ్లలో సెంగమోటు మెవ్వరికిని లేదు. అనుభవశాలులగు కవీశ్వరులు నల్లులబాధ పడలేక మహా విష్ణువు సముద్రములోఁ బాముపైఁ బండుకొన్నాఁడని చెప్పినారు - అని వారియనుభవమునకుఁ జాలనూతము.

పాఘునుబట్టుకొని క్రిములు బాధించుచుండ దురదకుఁ దాళఁజాలక పెద్దపాములుండు కంపలలోఁదూఱి, కొంకలలోఁదొరలి బాధపడుచుండుట వారి యనుభవములో లేదు. తిరుపతికొండయొక్కనివారు శివుఁడు నల్లులబాధకే కైలాసపర్వతముమీఁదికిఁ బోయినాఁడందురు. చాకివాని బాధపడలేక భైరవుఁడు బట్టపాఱవైచెనన్నారు. అది యొక్క బాధయేకాదు. నల్లులు మొదలైనవి యొక్క గాలిపాటునఁ గొన్ని నాళ్లుండవు. ఏ పెండ్లిరద్దీలోనో కాని చాకివాండ్ర బాధ యుండదు. అనుకూనము విడువనిబాధ—అద్దెకొంపల బాధ. తాను గొన్నాళ్లీ బాధపడిపడి—యొక్క యిల్లుకట్టుకొన్నవాఁడు—అనుభవశాలి గావుననో యేమో-యొక్క భాగ మద్దెకువిడిచి-వచ్చినవారిని బాధించుట—ఆహా! కోపలత్తచే బాధపడి తనకోడలిని బాధించుటకు వెనుదీయకుండుట వంటిదేకదా! విషములోని పురుగు విషములోనే బ్రదుకవలయును. ఏమహాకవియైనను నీవిషయమై వ్రాయఁబూనినచో—మాస్నేహితులమాలమునఁ గొన్ని కొన్ని క్రొత్తవిషయము లొకటి రెండధ్యాయములు పట్టునవి తెల్పింపఁగలము.

శైలుపేరయుద్యోగి క్షేత్రకీతములోఁగొంత యద్దె క్రింద వారు మినహాయించుకొనుచున్నారని కాని, జీతము నద్దెయుఁ గలపిరేమి యాజీత మిచ్చుచున్నారనికాని— ఏమనియనిన వననిండు-వచ్చి యలమటపడకుండ నిల్లు సిద్ధముగా నుండును. తిష్ఠగుడిరివఁగాని నిష్ఠగుదురదని-దానిలోనే పురుషులు, పుణ్యములు- పెండ్లి పేరంటములు చేసికొనుచున్నారు. ఇల్లు మాకు సుమారుగా నున్నదిగాని కావలసిన గృహోపకరణములు లేవు. శరీరమున బంగారు నగలు ప్రస్తుతకాలమున నలంకారముగా నుపయోగపడుచున్నవిగాని యారోగ్యశాస్త్రప్రకారము బంగారుమీద నుండిపడునీరు శరీరమునకు నైర్మల్యమువంటిది. లోహస్పర్శ సౌఖ్యకరము-ఏయారోగ్యమునకో భూషణకో కొన్ని నగలున్నవిగాని చేతిలో వాడుకొనుటకుఁ జాలినన్ని పాత్రములు లేవు. గృహస్థులకు సమయోచితముగా నూహాలు తోఁచుచుండును. చేతికిఁ గొంత లభించినదికావున, వింకొక రిద్దఱువచ్చినఁ జాలునంతటి యన్నపుబిందె కావలయునని, మఱియొక చెంబు, వేఱొక తప్పెల, యిట్లు క్రమక్రమముగా సంగ్రహించితిమి. ఒక్కయూరిలోనుండము. పిల్లల చేతిండ్లకుఁ ద్రిప్పనట్టు-అట్టే మనలను దెప్పకొవులను మార్తుక-మాటలు మోయలేమని వారు సంశయించుచున్నను, వినాయినపు పెట్టెకంటె నాపాత్రసామాను లెక్కుడు బలువుండవని వారిని నవ్వించుకొను చాను. అపుడపుడు మాతల్లిదండ్రులు, వారితల్లిదండ్రులును గష్టప్రయాణమైనను సహించి వచ్చుచుండిరి. మా సంసారసుఖము వారికిఁ జూపింపవలయును నభిలాష పుట్టినది. ఇక్కడనుండి మూఁడవయొత్తు కలకత్తాకు. అక్కడఁ గొన్నినాళ్లే యుంటిమి. ఢిల్లీనుండుఁ గొంచెమో, గొప్పయో మే ముద్యోగవశమున నే చూచినారము-కొన్ని తావులలోని నివాసము కష్టమే యనిపించినది. ఒకప్పుడు సుఖమే యనిపించినది. మాతల్లిదండ్రులు, నత్తమామలును దీర్ఘయాత్రలు గావించిరి. ఒక్కసారి లక్ష్మి, దానిమగఁడు, నొక్కసారి గౌరి, దానిపెనిమిటియు వచ్చిరి. మొగల్ సరాలో నాశాస్త్రి పుట్టినప్పుడు మాయమ్మ వచ్చి పురుడు పోసినది. రెండవసారి మంచిస్నేహితుల సహాయముండుటచే నొక్కరిని బిలువలేదు. ఆఁడుపిల్ల-నానాయన కోరికివాఁడు కాలేదని-సంతోషమును దుఃఖమును గలిగెనవి.

మా నాయనమ్మకాలములోఁ గాశికి నడిచియే పోయినపుడు-ఒక్కొక్క ముసలిది రెండుసారులు మూఁడుసారులు నడిచివెళ్లి కాశీరామేశ్వరములు సేవించెడునది. కాశికిఁ బోయినవాఁడును గాటికిఁ బోయినవాఁడు నొక్కటియని సామెత - వచ్చిన నమ్మను: జచ్చినఁ జమ్మను. కాఁబట్టియే వార్ధకదశలోనే యాత్రలకు బైలుదేఱువారు. ఆకాలము గాదు! వారిశక్తి - వారి భక్తి, వారి యాయుర్దాయము నిప్పటివారికేది! ప్రొద్దున లేచి మూటనెత్తిని బెట్టుకొని నడచుట, సత్రములలో, సత్రములుఁ జావడులు లేనిచోటఁ, జెట్టుక్రిందఁ, జెఱువుగట్టునను వంటచేసికొని యొక్కపూటతిండి- దీక్షతో నెలలకొలఁది నడచి, క్షేత్రోపవాసములు చేసి, తీర్థయాత్రలు చేయువారు; మనమిపుడు భక్తి లేనిపూజలు-మూఁడునాళ్లలో, రొట్టెలు ఫలహారములతోఁ దిరిగివచ్చుచున్నారము. కాశికిఁ గొంతసమీపములోఁ గొన్ని దుష్టభూములున్నవి. వానిని గాశియాత్రచేసినవారు చెప్పుచుందురు అవియే అడ్డావట్టె లనునవి. అడ్డాయనుచోట సుఖము

చట్టియనుచోట దొంగలు దుష్టులు-బియ్యము మొదలైనవి దొరకకుండుట-దీనికై జనులలో వడ్డాచట్టీలను సామెత కూడ బుట్టినది. దీనికై యొక గాథకూడఁ గల్పించిరి.

అరణ్యవాసమునకు శ్రీరాముఁడు బైలుదేఱి పోయినప్పుడు, తమ్మునితో, అడ్డాలో నేమిచెప్పిన నది చేయువాఁడట-చట్టిలోఁ జెప్పిన దానిపై శ్రద్ధలేకయుం డువాఁడట. ఇది స్థలమాహాత్మ్యమై యుండునని లక్ష్మణునికిఁ దెలియకుండ నామహారాజు రెండుకొంగుల రెండి సుకమూటలు కట్టుకొన్నాఁడట. ఒకమూట యడ్డా లోనియిసుక, రెండవమూట చట్టిలోనియిసుక-ఇవి గడచి పోయినపిమ్మట కొక్కప్పుడు వినోదమునకై - నేనువిను టలో భేద ముండవచ్చును. అడ్డా-చట్టి యిందేదినించిదో యేదిచెడ్డదో-లక్ష్మణస్వామికి వెనుకపాటున నిల్చి చట్టియి సుక రెండురేణువులు పిఁప్పుమీఁదనో నెత్తిమీఁదనో విడిచి-తమ్ముఁడా యీచెట్టుక్రిందఁ గొంతసేపుకూర్చుం దము, కొంచెము నేల బాగుచేయుమా యనువాఁడట. దానికాతనికిఁ గోపమెత్తి-చాలులే-నీవలె నేనును, తల్లి దండ్రులను విడిచివచ్చితిని; నీతో నేనును గష్టము లను భవించుచునే యుంటిని. నీకుఁ గైకరాజ్ఞ కాని నాకేమి కర్మము-అంతమాత్రము నేల బాగుచేసికొని కూర్చుండ లేవా యనువాఁడట. పోనీవయ్యా, నేనే శ్రమము చేసికొని కూర్చుందును. నీవు కని పెట్టి యుందువా యనిన, నాకుమాత్రము నిద్దుర రాదా నేనును మనుష్యుఁ డనే యనువాఁడట. అడ్డాలోని రేణువులు రెండువల్ల నతఁడో-స్వామీ-మీ రేల శ్రమపడవలయును -మీ-పాద సేవకై దాసుఁడు సిద్ధముగా నున్నాఁడు. మాయమ్మ నిద్రాహారములు మాని నీసపర్యలు చేయుమని పంపినది యని వినయము చూపువాఁడట. ఇట్టిది - యడ్డావట్టిల ప్రభావము. ఆపవిత్రస్థలములలోఁ గూడ మేము గొన్ని నాళ్లున్నారము - కాని మాకట్టివి శేషము లిప్పుడట్టి కనఁబడలేదు. మాపిల్ల పుట్టలేదుగాని పెరుఁగుట యాక్షే త్రములలోనే - దీనికిని మంచిగుణములే యలవడినవి - కాలము మాఱియుండును. ప్రభుత్వబలముచే నవినయము తగ్గియుండును - స్థానబలము కావచ్చును. మనుష్యులు కొందఱు లేకపోలేదు. అట్టివా రెక్కడను గలరనితలంచి నను దలంపవచ్చును.

అక్కడఁ జిన్న మేష్టరున్నాఁడు-ఆయన కొక్కఁ డే కుమారుఁడు. చదువు సంధ్యలు లేవు. ఉద్యోగము చేయఁడు. చేసినచో రైలువేలోఁ దండ్రినిబట్టి యేదో నాల్గురూపాయలు దొరకును. తిని కూర్చుండుట - స్టేష నులు రాగములు-సంగతులు-చెప్పినపని సరిగాఁ జేయకుం డుట-పైకి మెత్తగా నేయుండునుగాని హృదయములోఁ గొంచెము మలిన మున్నది. మావారిం గాంచిన గొంచెము భయమున్నది. మూకలు పెట్టినారు. నాతో రా; స్టేష నులో గూర్చుండుము. టిక్కెట్టు వసూలుచేయుము, పోర్టరును బిలువుమని మప్పుచుండువాఁడు. తండ్రి, పాప ము, సంతోషించువాఁడు. నన్ను మర్యాదతో 'అక్కా-అక్కా-'యని పిలుచువాఁడు. నేనును జనవుగానే మన్నిం చుచున్నాను. రామారాను నేను మాతికి వెళ్లినప్పుడే తానుపబ్బు బిళ్ల పట్టుకొని స్నానమునకు వచ్చుట-వచ్చిన యాఁడువారి తో నవ్వుచు వారిబిందెలలో గూని రాగములుదీయుచు నీరు తోడిపోయుట-ఇట్లు తిరిగెనాఁడు. నేను కనఁబడినప్పుడు వెనుకకుఁ దిరిగిపోవువాఁడుగాని తనయింటఁ గిటికీలోనుం డి, యనుక్షణము మాయింటిపైపునను జూచుచుండువాఁడు. మాయిల్లేనా వానికి దృష్టిపథమున నున్నది. ఎంతో ప్రపం చమున్నది యనుకొనుచున్నాను. నే నెవ్వరితోనుఁ జెప్పలేదు. ఏమనిన నేమగునో-ఇట్టివాఁడనిన నన్నెట్టిదనునో, నీ యింటివైపునకుఁ జూచుచున్నాఁ డన్నసంగతి నీవాతని యింటివైపునకుఁ జూచుచున్నట్లు తెలిపిన దందురేమో. రాకడ యెట్లుండునోయని జాగ్రత్తగానే యుంటిని. వారింటికి మేము, మాయింటికి వారు ధారాళముగా రాక పోకలు చేయుచునే యున్నాము. ఆదినములలో రాత్రి తొమ్మిదిగంటలకు రెండుబండ్లును స్టేషనుకు వచ్చును. నీళ్లు పట్టుకొనుము. ఇంట వానితండ్రి లేఁడు. మాయింట నేనొక్కతనే. చీఁకటి రాత్రులు. నేను దీపము చిన్నది చేసికొని మెలఁకువతోనే పండుకొని యుంటిని. ఇల్లు వెడలినాఁడు- తల్లి 'ఓరీ చీఁకటిరా యెక్కడికి' కనుచునే యున్నది. 'స్టేషనులోనికని చెప్పుచు వచ్చుచున్నాఁడు. మాయింటిదొడ్డి గోడలు లేవు. ఒక్కరింటికి నొక్కరింటికి నడుమఁ గొన్ని దుండిగపుచెట్లు-దూరమెంతో యుండదు. చెప్పులు లేవు. మెల్లగా వచ్చుచున్నాఁడు. మొదటి గంట కూర్చుబండికై వాయింపఁబోయెదరు. ఆసమయ

ములో వానిదృష్టి మాయింటిమీఁదనే యున్నది. నాల్గు గజములు దాఁటెనా మాబంగాళాయరుఁ గెక్కును. కప్పకోసమో, యెలుకకోసమో యొక్కపాము దారిలోఁ బడియున్నది. త్రొక్కినాఁడు. అదియును కొట్టుపాటులోఁ గఱచుచున్నది. నేను వింటిని. దుష్టజంతువు కాదు గాని, వాని కాలికి, "బళిరా నీవు, ముందందువేసిన మిండగాఁడవు కాఁబోయెదవురా" యనునట్లు చుట్టఁ బెట్టుకొన్నది. పాపము కుఱ్ఱవాఁడు బాబా బాబా యని యఱచినాఁడు. నలుగురు దీపములతోఁ బరుగెత్తుకొని వచ్చినారు. గ్యాంగుమైను కూలివానియొద్ద నొక్క కా ఉన్నది దానింబట్టి తలయుఱికించి లాగినారు. కాటుపడినది గాని వాఁడు తప్ప హాని చేయలేదు. కొన్ని నెలలు బాధపడినాఁడు. మే మేమియు నెఱుఁగము. మా కేమియు హాని జరుగలేదు. మీవానిని ముందు ముందు జాగ్రత్తపడుచుకొనుఁడని మాత్ర మంటిమి. వారు యోగ్యదంపతులు. మమ్ముఁ జూచి చాల సిగ్గు ప[illegible]. ఇంతలో మా స్టేషనునుండి వారికి మార్పు జరిగినది. ఉన్న దినములలో వాకుఱ్ఱవానికిఁ గొంత మా వారు పని నేర్పినారు. రైలులో సాధారణముగా గుండ గొయ్యలనేవ లుందురు. వీని కొక్క చిన్నపని దొరకినది. కాని యాపని వానికిఁ దగినదియే. యొక్కచోఁ గూర్చుండునది కాదు. పని వినుమనుండఁ గొన్ని నాళ్లు శ్రమపడినాఁడు. పెండ్లియైనది. ఒక్కమార్గములో నున్న వార మగుటచే నప్పుడప్పుడు కనఁబడువాఁడు కాని కాలునఁ బుండు మానలేదు. కట్లు కట్టుచునేయున్నాఁడు. ఆకఱచినపాము క్రిల్లు [illegible].

దుష్టస్వభావులను మనుష్యప్రయత్నముచే మంచి స్వభావము గలవారిం జేయుటకష్టము. ఏవో నాలుగైదు బొప్పులుకట్టినతర్వాత యదృష్టముచేత మెట్టమొదటనో, పుట్టుచినదనో దైవమే జ్ఞానోపదేశముచేసి తిరుగనివానికిఁ గలకాలమున్దున ట్లోకబిరుద మిచ్చుచుండును. దానితో వాఁడిట్టివాఁడని చెప్పక చెప్పుచుండును. "దుష్టందూరేణ వర్జయేత్" తని యెల్లవారుఁ జెప్పుకొని తిరుగుదురు. స్త్రీలకేమి, పురుషులకేమి, దైవము జ్ఞానము ప్రసాదింపకున్న నిందపాలు గాక తప్పదు.

మే ముత్తరదేశమంతయుఁ దిరిగినారము. గొప్ప గొప్ప పట్టణములు చూచినారము. క్షేత్రములు సేవించినారము. రెండుమూఁడు భాషలు కన్యాపచ్చిగా నేర్చినారము. ఇద్దఱు సంతానము కలిగినది. కొంచెము ధనము సంపాదించుకొంటిమి. తల్లిదండ్రులు వృద్ధులైరి. ఇంక వారిసమీపమున నుండుట మంచిదియను సంకల్పము చేసినారము. సంకల్పములోఁ బని కుదర్పవలసిన చెప్పుకొనుట లేదు. మనదేశమునైపుణకు మరలవలయును. స్వదేశములోనే యీయుద్యోగము సంపాదింపవలయును. అని వారిని వారిని బట్టి బరంపురము ప్రాంతమునకు వచ్చినారము. కొన్నినాళ్లకు వాల్తేరు-విశాఖపట్టణము-ఇంతకంటె నొక్కయడుగు ముందుఁ బెట్టుటకుఁ జాలవాళ్లవఱకు నవకాశము దొరకలేదు. అక్కడనైనను మనబంధువులు, స్నేహితులు, ఓవరుసీరుగారినిబట్టి చుట్టుటకమునన సేవలు దొరకెరి. స్వదేశమునకు వచ్చినారము. బెంగలేదు గాని, యిక్కడనైన స్థిరముగా నుండఁజూచుకొనవలయునని.

ఇంతవఱకు మేమేకొండలలోఁ నడవులలోఁ బల్లెలలో నున్నను నిర్విఘ్నకముగా నున్నది. ఇంక మీఁదఁ బిల్లవాని చదువుకొఱకుఁ బట్టణముల నాశ్రయించుకొని యుండుట యావశ్యకముగా నున్నది. భగీరథప్రయత్నములు చేసినారు. చేయఁగాఁ జేయఁగా, విసరఁగా విసరఁగా నొక్కటాయి తగిలినట్లు- రాత్రులయందు నిద్ర మానుకొనుట - యేనప్పుడైనను బండి వచ్చుచున్నదని యులికిపడుట - వదలినది. నేను బిల్లలను బెట్టుకొని యొక్కచోఁ గదలకుండఁ గూర్చుండుట- వారు నెలలో సగమునాళ్లు దినముపిదప దినము ప్రయాణముచేయుట- ఇదియొక్కపని దొరకినది తెత్తెచ్చినది- రైలుప్రాదుగున నంటలును కేతిక్రింద నుందురు - ఈపని యొక్క యాఱు నెలలు కటకములోనుండి చేసిన పిమ్మట విశాఖపట్టణములోఁ గుదురుగా నుండవచ్చును. ఏమైనను నేనుమాత్రము మిక్కడనుండి కదలను మీరెట్లో కష్టపడుఁడని - విశాఖపట్టణములోనే యుంటిని.

ఏపాప మెఱుఁగను. పదేనేండ్లు కడుపులోని చల్ల కదలకుండ నుత్తరదేశములో నున్న దానను- ఏమరగాయు మక్కలో హిందీలోను, బంగాళీలోను, ఉరుదూలోను నేర్చుకొంటిని. కాని, నానేర్పెంత! ఎందును బొందినది!

తురకము రాకపోయెఁ దెనుఁగు మఱచిపోయె నను పాటి వంటిది. మాట యుత్తరాదిస్వరములోఁ బదిమాటల కాఱు మాటలు-భాషాసంకరపదములతోఁ గాలము గడపుచున్న దానను. కట్టుబొట్టుచూచినఁ దెనుఁగుదాననే కాని మాటకు నోరెత్తితినా యుభయభ్రష్టను. ఇక్కడకు వచ్చినపుడు నన్నుఁ గొందఱుస్త్రీలు పరిచయము చేసి కొనిరి. వారు, వారిసభలు, స్త్రీలు, స్త్రీలు చేయవలసిన పనులు, చేయుచున్న పనులు, తాము చేయుచున్నవి, చేయ నున్నవి ప్రసంగించుచువచ్చిరి. ఇక్కడకు రాకమునుపు నేనొక్క హిందీబంగాళీ పత్రికనుమాత్ర మప్పుడప్పుడు విప్పుచుండుదానను. సహవాసమువలన- గొంతయర్థ మగు చుండెను. ఇక్కడకు వచ్చినపిమ్మట మఱచితిని- కాని, తెనుఁగుపత్రిక లెన్నియో గలవు- ఏమి ప్రయోజనము. సంసారభారము- ఏపత్రిక చదువుదును- ఏసభకు వెళ్లుదును. మాసమాజమునకు రమ్మని మాసభకు రమ్మని నిర్బంధించువారు. నా కెక్కడితీఱుబడి. సంసారమున-వెనుక ముందు నా కెవ్వరున్నారు. మీవంటిదానవా, చదువా, ధనమా, బలమా నా కెందు కివ్విడు - ఆయుత్సాహము మొదటినుండియు నుండవలసినది. అని తప్పుకొనుచుండుదానను. నీవొక్క- సభలో నీవేయే దేశములు చూచితివో, యేదేశములోని స్త్రీ లెట్టివారో, వారు వారిచదువు, వారి నాగరకత- యుపన్యసింపుమని కోరువారు. నాకేమి తెలియును, మావారు వారు రైల్వేవారు. మమ్ము మీవంటి స్త్రీమతల్లులుగల చోటఁ జేరనీక యూరిబైట వెలిపెట్టినట్లు పాఱవైచు వారు. మాకే స్త్రీలతోను నాగరకత తెలిసికొనునంతటి పరిచయము లేదంటిని. మఱియు మా రైలువారి కేమి కోపము వచ్చినను సరియే:—మా రైలుద్యోగస్థు లోక పెద్దవిద్వాంసులు. వారిభార్యలు చెప్పవక్కఱలేదు. ఇతరులవలె నొక్క రైలుపనివారు మగవారుగాని, యాఁడు వారుగాని, కలముపట్టి యొక్కముక్క పత్రికలకు గొలుకు వారు చాల్లుముక్కలు మాటాడువా రున్నారా! మఱి యెంతసేపు - అప్పుడౌను, లైను క్లియరు, ఫస్టుబెల్లు, పాయింటు, డి. టి. యస్., ఇ. టి. యస్. భాష తప్ప ప్రపంచజ్ఞానమునకు సంబంధించినది లేదనికూడఁ జెప్పి బలిమాలితిని. కొందఱు పట్టుదలగల స్త్రీలు నామాట విని, యొద్దవనిత లిట్లున్నారు; వంగాంగనలస్థితి యిది; హిందీ సుందరుల వృత్తాంతమిది అని యిట్లొకరు చెప్పఁగా వింటి మని, తెలియవచ్చుచున్నది యని యుపన్యాసములలో చెక్కించుకొనిరి. కొందఱు నామాటలనే స్వంతముగా స్వయంపరిచయమువలె వాడికొనిరి. ఎట్లయినను నాకేమి, నాకందు బాధ యక్కఱలేదు. నా పేరు పలుకు, నన్నుఁ బది మందిలోని కెక్కింపకుండుటయే చాలు ననుకొనుచుండఁగా, వీరు రాకపోయినఁ బోయిరి. మాసమాజమునకేమైన నెలనెలకుఁ జందా యిచ్చుచుండవలయునని బాధించిరి. ఇదియుఁ గొంత మేలని యొకరిద్దఱికి చ్చెదనంటిని. తర్వాత, మాపత్రికకుఁ జందాదారుగా నుండుమని, మేము కట్టించు స్త్రీపాఠశాలకు, మేము స్థాపించు బాలికా పఠనమందిరమునకు, మేము నడుపఁబోవు సభకు, మా పుస్తకభాండాగారమునకు- ఇట్లని వేఁపుకొని నాచేఁ గొన్ని రూపాయల నెలనెలకు వ్యయపఱపించుచుండిరి. ఒక్కనాఁటి సభలో శ్రీమతి సౌభాగ్యవతి రామసుబ్బమ్మగారు, రూ. 5-0-0 అని చదువువారు. [illegible] రామసుబ్బమ్మ యొకరని-వారని, వీరని, త[illegible] క్రొత్తవా రెల్లరు నాకు స్నేహితురాండ్రయిరి.

నాకు వల్లమాలినసిగ్గు. వంకాయ లమ్మఁదెచ్చిన వాఁడు మీకు రొట్టలిన పరక యనువాఁడు, పావవా కిచ్చిన వా యనుదానను. వానిపరక నాకుఁ దెలియదు! నా పావనావానికిఁ దెలియదు. ఇట్టి నేను వారిసభలో నేమని పిల్తును. కొందఱు దక్షిణాదిస్త్రీ లున్నారు. వారొక్క రాజధానిలోనివారు గావున- ఆపద్దటికి పేరుపందాదారు లిచ్చెదుద్దు సాదువుగాఁబెట్టి రక్షించేదానికి తపులేదు. పీంద్రుపేరవారు, పీంద్రుడా క్రొత్తవాండ్రు- ఇష్టాఅమ యాశం- దానికిదా వారువారు తనిత్తవిగా యిప్పించుకొనేది. ఒకరిచేత పెట్టిపెట్టుకొనేది వంచితకాదు- వీరుకుసుపంతులు, జాస్తీదుద్దు యిచ్చినామని గట్టిక్కారి త్తవగ చూపించి సంఘుత్తలెవరని పీణు వాయాడేదానికి మాకేదు. ఇది నేను తెలుస్తాను. అని యాలోచనసభలో మాటలాడుచున్నట్లు తర్వాత నాకుఁబంపెడు సభా వృత్తాంతములోఁ దెలిసికొనుదానను.

తెనుఁగుపుస్తకములు మేము మాసమాజమునుండి ప్రతిదినముఁ బంపుచుండుము. మీకుఁ గావలసిన పుస్తకములు చదివి మూఁడునాళ్లలోఁ దిరుగఁ బంపుచుండవల

యును. దానికి దినమున కింతయని చెప్పువారు. మొదలు మొక్కు-బడిన లేదన నొక్క-దేవరకుఁ బెట్టుమని బలవంత పెట్టువారు. స్త్రీలసభలలోఁ జేరిన స్త్రీకిఁ దప్పవిగాని వారితీర్మానములు నాకంతగా నచ్చలేదు. ఱేపుసాయంకాలము సభలో సింహాచలమ్మగారు - ఈ క్రింది తీర్మానము బెట్టఁబోవుచున్నారు. ఆమోదకులు, వ్యతిరేకులును దప్పక దయచేయవలయును. వ్యతిరేకాభిప్రాయము గల వారును రావచ్చునుగాని వెంటనే ప్రతివాదములు చేయుట కవకాశమునుబట్టి, యధ్యక్షురాలి యనుజ్ఞపై సభ్యులు గానివారును మాటలాడవచ్చును. కావున దత్సభలో మనమందఱ మలంకరింపవలయునని కోరుచున్నాను. అప్పలనరసమ్మ - కార్యనిర్వాహకమంత్రి - యని యానందమ్మగారుగాఁ బత్రికలు పంచిపెట్టువారు. అందఱును బలేయని చరికలుకొట్టుకొనువారేగాని యిది యేమని యొక్కరును బలుకువారు లేరు.

తీర్మానము:—జనమును మగవారివలెఁ జెప్పులు తొడిగికొని, గొడుగువేసికొని వీథులంట నడచిన నేమి పోని- మగవారి యర్ధాంగులమైన మన కంతమాత్రము స్వాతంత్ర్యమును మగవారు మన కీయరా" అని దీనిపై రేపుసభ.

మావారు విని పకాపకి నవ్విరి. ఏమైనా మనము హాయిగా నిన్ని దినములు గడపినారము. ఇట్టిగోడవల లోని కెన్నఁడును దిగలేదు. ఇచ్చిన దిచ్చి యుంటుఁ గూర్చుండ మన్నను - దీనిపై నభిప్రాయము లిమ్మని శాఖ - మన కీయాచారములు తెలియవు. మొదట స్త్రీలకు సభలు పెట్టుకొనుటకు, నుపన్యాసము లిచ్చుటకు నెవ్వరు స్వాతంత్ర్య మిచ్చినారో వారే యీ తీర్మానమునుగూడ నంగీకరింతురు - నీవు కావలసిన బూట్సు తొడిగికొనుము. గొడుగువేసికొమ్ము. నీవు నా కర్ధాంగివి గనుక నీకు నే నీస్వాతంత్ర్య మిచ్చుచున్నవాఁడను- దేశాచారప్రకారము చుట్టకూడ వీథిలోఁ గాల్చుచు వెళ్లుము- సభలోనికి మొదటనే యిట్లు వెళ్లుటకుఁ గ్రొత్తగా నుండిన యెడల- మంచినీళ్లకు వెళ్లునపు డలవాటు చేసికొనుము- అని వేళాకోళము చేయువారు.

---

## శి వ పూ జ

ఏనుగు తమ్మిరాజు గారు

(గే య ము)

శివపూజాసమయము
చేరి కొల్తము రమ్ము
శీఘ్రముగా —తమ్ముఁడా.

శివశివ యని పూజ
కొల్చిన నిదియె
నవయుగమగు —చెల్లెలా.

చిన్నిచిన్ని పూలు
చిన్నారిపువ్వులు
చేరి కోసితె —తమ్ముడా.

బంగారుపువ్వులు
పళ్లెరంబున బెట్టి
పాటపాడెద —చెల్లెలా.

పువ్వులోపల నున్న
మవ్వంపు సిరిమొగ్గ
మర్మ మెరిగితె —తమ్ముడా.

పువ్వులోపల పుణ్య
పురుషుని గనుగొన్న
పురుషార్థమే —చెల్లెలా.

# కుక్క కాటుకు చెప్పుదెబ్బ

శ్రీ కెంపటి నాగభూషణం గారు

౧

"పలుకు, పలుకు, అంభా పలుకు
జగదంభా పలుకు
పలుకు పలుకు
అంభా పలుకవే
జగదంభా పలుకవే
కంచికామాచ్చి పలుకవే
మదురమీనాచ్చి పలుకవే
కాశీయిశాలచ్చి పలుకవే

"వెళ్లు, వెళ్లు" అన్నది వాకిట్లో ముగ్గు లేస్తున్న అమ్మన్న.

"మంచి మాటనే సెపుతానమ్మా.
నీవు తలసిన కార్యం నాకు
తెలుసమ్మా
పండో కాయో సెపు
తానమ్మా
అంభా పలుకవే
జగదంభా పలుకవే
నీమనస్సులో సంగతి
సెపుతానమ్మా
మంచిమాట యిది
యినవమ్మా.

"వెళ్లబ్బాయీ; వెళ్లమంటే నీకు కాదూ?— వెళ్లు."

"ఇంత పిడికెడు బిచ్చం పెట్టమ్మా. తల్లివి, మహాలచ్చిమివి. నూరేళ్లు వర్ధిల్లాలి..."

"ఇప్పుడేమిముష్టి, అబ్బాయీ, ఊరు తెల్లవారకముందే గిలకవాయిస్తూ తయారైనావు; వెళ్లు."





దమయంతి

చిత్రకారుడు: శ్రీ దామెఱ్ల సత్యనారాయణగారు, రాజమంత్రి.

అని అమ్మన్న అనేసరికి, ఆ బుడబుడక్కలవాడు కళ్లు కొంచెం పెద్దవిచేసి, గిలకవాయిస్తూ, మళ్లీ ప్రారంభించాడు.

"పెళ్లి, పెళ్లి, పెళ్లమ్మా, తల్లీ
నీ కీయేడు పెళ్లి అవుతుందమ్మా, తల్లీ
పలుకు, పలుకు, అంభా పలుకు
జగదంభా పలుకు,
యీయేడు యివాహ మవుతుందమ్మా తల్లీ,
మంచి గొప్ప మొగుడొస్తాడమ్మా తల్లీ,

"ఆ, ఏమిటబ్బాయి, అది? జాగ్రత్తగా మాట్లాడు."—అన్నది అమ్మన్న కొద్దిగా, భయంతో, కోపంతో....

అదివిని, బుడబుడక్కలవాడు గిలకవాయించడంమానేసి, యిట్లా అన్నాడు.

"అమ్మా, నాకు జ్యోతిషం వచ్చు. మీ ముఖం చూచేసరికి, మీకింకా పెళ్లి కానట్టు, యీ యేడు మీకు తప్పక పెళ్లి అయేటట్టు, మంచి, చక్కనిభర్త లభించేటట్టు, నాకు కనపడ్డది. నిజంగా..."

ఈమాటలు వినేసరికి అమ్మన్నకు ఆలోచన ప్రారంభమైంది. ఆలస్యం చేయకుండా, యిట్లా ప్రశ్నించింది.

"ఏమబ్బాయీ, నీకు జ్యోతిషం, తెలుసా?"

"తెలియకేమమ్మా, బాగా తెలుసు."

"అయితే, నువ్వు యిందాక నావిషయంలో చెప్పినవన్నీ నిజమవుతాయా?"

"అనుమాన మెందుకమ్మా. ఒకకానీ యీ తాటాకుల పుస్తకంలో యెక్కడో అక్కడ వుంచండి, అప్పుడు నిజం తెలుస్తుంది."

వెంటనే, అమ్మన్న కొంగునవున్న డబ్బుల మూటవిప్పి, ఒక కానీతీసి పుస్తకంలో ఒకచోట పెట్టింది. ఆగుర్తుప్రకారం తీసి, ఆబుడబుడక్కలవాడు నవ్వుతూ "చూచారా, అమ్మా, నేచెప్పినవన్నీ పూర్తిగా నిజమే. మీకీ సంవత్సరం, బహుశా మాఘమాసంలోనే, పెళ్లి అవుతుంది. మంచి, చక్కని, చదువుకున్న భర్తవస్తాడు" అన్నాడు.

అమ్మన్న విని వూరుకుంది.

"అమ్మా, మీ అదురుష్టం. ఒక పాత గుడ్డ దయసేయించండి అమ్మా, మీ గులాబు వాడిని. పోతాను".

"ఏయ్, అబ్బాయీ, యిప్పుడు పాత గుడ్డలేమీ లేవుగాని, యీ డబ్బులు తీసుకు వెళ్లు" అని అర్ధపావలా బిళ్ల వాడి కిచ్చింది. వాడు దాన్ని తీసుకొని-"మాతల్లి, మాఅమ్మ, మంచితల్లి, మాలచ్చిమి. పది కాలాలపాటు కుంకుమ రాచుకొని తిరుగమ్మా, తల్లీ" అని దీవిస్తూ వెళ్లిపోయాడు.

౨

శివావధాని గొప్ప అగ్రహారీకుడు. గ్రామంలో మంచి పలుకుబడి గలవాడు. ఏడాదికి సుమారు పాతికవేలరూపాయల రాబడి. మంచివాడనికూడా పేరు పొందాడు. ఆయన భార్యా చనిపోయి చాలాకాలమైంది. కాని మళ్లీ వివాహం చేసుకోకుండా, కూతురు అమ్మన్నను గారాబంతో పెంచుతూవున్నాడు. అమ్మన్నంటే శివావధానికి ప్రాణం. కూతు

రిని అమిత గౌరవంతో, పూలలోపెట్టి పెంచు తున్నాడు.... అమ్మన్నకుపెళ్లియీడు వచ్చింది. మంచి అల్లుడిని సంపాదించాలని శివావధానికి లోపలవున్నా, పూర్వం తాను భార్యకుచేసిన వాగ్దానం జ్ఞప్తికి వచ్చింది. అదీకాక, యింతఆస్తీ, యెవరో బయటవారికి యెందుకు పోవాలి? అందుకని, మేనరికమే యిద్దామను కొన్నాడు......మేనల్లుడు గిరిరావు యఫ్. ఏ. వరకు చదువుకున్నాడు. మంచి స్థితిపరుడే. కాని అంత అందంగా వుండడు. అయినా, అతని అదృష్టంవల్ల అమ్మన్నని అతనికిచ్చి పెళ్లి చేయడానికి నిశ్చయించాడు శివావధాని. అమ్మన్నకికూడా అది యిష్టమే. గిరిరావు, అమ్మన్న చిన్నప్పుడు చాలాకాలం ఒకచోటే పెరిగి, పెద్దవారైనారు......మాఘ మాసంలోపెళ్లిముహూర్తం. ఇప్పటికే పనులు చాలాభాగం అయినాయి. గట్టిగా నెలగూడా లేదు వ్యవధి. అంతాబాగానేవుంది. కాని, యిప్పుడొక అవాంతరం వచ్చిపడ్డది. అమ్మన్న వాకిట్లో ముగ్గులేస్తుంటే, యెవరో బుడబుడక్కలవాడువచ్చి, యెవరూ యేమీ చెప్పక ముందే, ఆమెకు యీయేడు పెళ్లి అవుతుందన్నాడు. ఆసంగతి వినేటప్పటికి, అతనెవరో, కేవలం దేవదూత అనుకొని అమ్మన్న, మరికొన్ని ప్రశ్నలడిగింది. "మంచి, చక్కని, చదువుకొన్న భర్త లభిస్తాడు" అని చెప్పాడు. ఆవాక్యం అమ్మన్న హృదయంలో నాటుకుపోయింది. వాడుచెప్పిన దానిలో ఆమెకు గట్టి విశ్వాసం. అది నిజమైతే, గిరిరావు భర్త కాడన్నమాట! అతడంత చక్కని వాడూ కాదు; అంత చదువువచ్చిన వాడూకాదు. ఆ దేవదూత, బుడబుడక్కలవాడు చెప్పింది ముమ్మాటికి సత్యం అని అమ్మన్న దృఢంచేసికొంది. వాడిమాటలు యెప్పటికైనా ఫలించితీరుతాయి. అటువంటప్పుడు, త్వరపడి, యీ మేనరికాన్ని కట్టుకోవడం యెందుకు? అమ్మన్న ఆలోచన చేసింది. భావాలమీద భావాలు, తరంగాల లాగున ఆమెహృదయాన్ని గందరగోళపరచినాయి. అయినా, తండ్రితో 'సరి' అనిమాట యిచ్చిందే? ఆయన కిప్పుడు యెట్లా యెదురు తిరుగగలదు? చిన్నప్పటినుంచి కష్టపడి ప్రాణంతో సమానంగా పెంచి పెద్దదాన్నిచేసిన తండ్రికి ఇప్పుడామె వ్యతిరిక్తు అయితేలోకమంతా యేమంటుంది? ఆలోకభయంతో, నోరెత్తకుండా మేనరికంచేసుకుంటే, బుడబుడక్కలవాడిమాటలు అప్పుడప్పుడు జ్ఞాపకం వచ్చి, జీవితాన్ని అంతాదుఃఖం చేస్తాయే? పోనీ, అందుకోసం, యీసంబంధంవద్దంటే, గిరిరావు యేమవుతాడు? వారిద్దరి చిన్ననాటి చేష్టలు, బాలసంజల్పములు, ఆటపాటలు యేమి కావాలి? చిన్నప్పటినుంచిగిరిరావు, అమ్మన్న మీదే ఆశపెట్టుకొని వున్నాడు. అట్టివాణ్ణి, యిప్పుడు విఫలమనోరథుణ్ణిగాచేస్తే, యెంతపాపం?—ఈభాగ్యానికే అమ్మన్న తన జీవితాన్నంతా యెట్లామబ్బుమయం చేసుకుంటుంది? ఆమెకేమీతోచింది కాదు. సలహా చెప్పడానికైనా యెవ్వరూ లేరు. చాలా మారులు, చాలావిధాలగా, తనే, ఆలోచించింది. తుదకు నిశ్చయించుకొంది, నిశ్చలంగా, దృఢంగా, తండ్రితో చెప్పింది, అంతా!

గిరిరావు అప్పుడే షికారునుంచి వచ్చి తోటలో చల్లగాలికి తిరుగుతున్నాడు. కొన్ని చంద్రకాంతపువ్వులు కోసి, అవిఅమ్మన్నకిస్తే బాగుంటుందా అని ఆలోచిస్తుండగా, "గిరీ, గిరీ." అని శివావధాని లోపలినుంచిపిల్చాడు. ఆపువ్వు లక్కడే విడిచి, మేనమామ దగ్గర కెళ్లాడు. శివావధాని ద్వారాన్నిపట్టుకు నిల్చున్నాడు. గిరిరావురాగానే, అతని వంకచూచి, ఊర్కున్నాడు. అప్పుడతని ముఖంలో కొంచెం విషాదచిహ్నాలు కనపడ్డాయి. అదిచూచి గిరిరావు అడిగాడు—"ఏమిటి, మామయ్యా, అట్లావున్నావు?" వెంటనే, శివావధాని, లేని ధైర్యం తెచ్చిపెట్టుకొని, యిట్లా అన్నాడు. "గిరీ, నీతో, అతికఠినమైనసంగతి ఒకటి చెప్పవచ్చానురా? చెప్పడానికి నాకునోరు రాకుండావుంది."

"ఫరవాలేదు. చెప్పు, మామయ్యా."

"నీకు అశుభం..." అని అనుమానంతో ఆగాడు.

"ఫరవాలేదు, చెప్పు పూర్తిగా."

"మరి, అమ్మన్న నిన్ను పెళ్లిచేసుకోదట!"—అని ఒకవెర్రిచూపు చూశాడు.

గిరిరావు, తొణకకుండా, బెణకకుండా "ఎందుకని?" అన్నాడు.

"ఎందుకనేమిటి? దానిముఖం చెప్పితే విన లేదు. నయానాభయాన గూడా చెప్పాను. కాని లాభం కనబడలేదు. కారణం స్పష్టంగా చెప్పదు. దానికి అట్లా తోచిందట. అమ్మా, తల్లీ అన్నాను. బ్రతిమాలాను; బాగుండదన్నాను; పరువు నష్టమన్నాను;సిద్ధాన్నమన్నాను. కాని యెన్నిచెప్పినా ప్రయోజనం లేకపోయింది. "నేనుచేసుకోను" అని మొండిపట్టు పట్టింది. తల్లిలేనిపిల్ల; దానిమనస్సు యెక్కడ నొచ్చుతుందో అని నేను కొంచెం వెనుకాడుతాను. ఏమో పోనీ, దానికర్మం దానిది........"

"అయితే ప్రత్యేక కారణం యేమీ లేదా?"

"ప్రత్యేకమేముందీ. దాని అంతరాత్మ అట్లా చెప్పిందట. పోనీ, కావలిస్తే నీవుగూడా దాన్నికలసికొని ఒకసారి మాట్లాడి చూడు, ఏమైనా లాభ ముంటుందేమో?"

"అక్కర్లేదండీ. ఈ విషయంలో నేనింకా అల్లరి చెయ్యదలచుకోలేదు. నాత్రోవను నేను పోతాను. కాని అమ్మన్న నాకు చేసిన ద్రోహాన్నిమాత్రం నేనెప్పుడూ మరచిపోలేను......అంటూ గిరిరావు వెళ్లడానికి లేచాడు.

"గిరీ, నాయనా! నేనేమి చెయ్యనురా. ఇంత పెంకెపిల్లని నేనెప్పుడూ అనుకోలేదు. మావంశానికంతా కళంకంతెచ్చే ట్టుంది... పోనీ నువ్వు......"అని శివావధాని యింకేమేమో అంటూండగానే, గిరిరావు వినిపించుకోకుండా, తిరిగిచూడకుండా, వెళ్లాడు.

౪

సంగతులన్నీ సరిగావుంటే, పెళ్లి జరగవలసినదినం అది. ఆవిషయం జ్ఞాపకంరావడం చేత శివావధాని విచారంగా వున్నాడు. ఇంతట్లో పొరుగింటి పున్నయ్య ఒకచుపుతకుని

వెంటపెట్టుకువచ్చి "ఏమండీ, మీరు మొన్నెప్పుడో మీఅగ్రహారం విషయాలు చూచేటందుకు యెవరైనా మనిషి కావాలె అని చెప్పారుగా. ఇడుగో......"అని ఆయువకుణ్ణి చూపాడు. చక్కని పచ్చనిశరీరం; నల్లనివెంట్రుకలు; పెద్దకళ్లు; మృదువైన ముఖం. చూస్తే ఆనందం కల్గింది శివావధానికి. విచారంఅంతా మరుగుచేసి ఆయువకుణ్ణి కొన్ని సంగతులు అడిగాడు.

"మీ పేరేమండీ?"

"జానకిరావు."

"వయస్సు?"

"ఇరువై యైదు."

"ఎంతవరకు చదివారు?"

"బి. యే. ప్యాసైనాను."

"వివాహ మైందా?"

"లేదు."

"అయితే. బి. యే. ప్యాసయిమీరీఅగ్రహారం విషయాలలో పనిచెయ్యడ మేమిగతి. ఏదైనా మంచివుద్యోగం............

"ఈకాలంలో అసలువుద్యోగాలువున్నాయండీ? ఫరవాలేదు. పనులన్నీ మీకు నచ్చేటట్టుగా చేస్తాను.

"పోనీ, మీరు మా యింట్లోనే వుండి మాతోపాటు భోజనంచేస్తూ మా పనులు చూస్తూవుండండి. పైనయింకేమైనా యిస్తాను.

"అవును లెండి. ఇదీ బాగానే వుంది. నాకు దిక్కెవ్వరూ లేరు. మంచి ఆలోచనే చెప్పారు." అని జానకిరావు తనసంతోషాన్ని వెలి పుచ్చాడు.

కొద్దిరోజుల్లో జానకిరావుగూడాయింట్లో ఒకడై నాడు. తాను చెయ్యవలసిన పనులన్నీ శ్రద్ధగా చేశాడు. ఇంటివ్యవహారాలన్నీ బాగు పడి వృద్ధిచెందినాయి జానకిరావు జాగ్రత్త వలన. అందుకని, శివావధానికి అతనంటే ఒక విధమైన ప్రేమ, గౌరవం కలిగింది. అతను అవివాహితుడేగా, పోనీ తనకు అల్లుడుగా అవుతే........అని ఎప్పుడైనా శివావధాని తలంచేవాడు. కాని ఆవిషయంపైకి యెప్పుడూ యెవరితోనూ అన లేదు.

తనపని యేమిటోచేసి జానకిరావు ఒక చోట కూర్చుని, యేదైనా గ్రంథం చదువుకొనేవాడు. అతను మితభాషి. క్రొత్తవారితో అసలే మాట్లాడడు. ఇంట్లోవారితో కొద్దీ; ఊళ్లో యెవరితోనూ పరిచయంలేదు. కాని, అతను త్రోవవెంబడి పోతుంటే పెళ్లికాని పిల్లలంతా వోరకి చూచేవారు. మనస్సులో యేమైనా అనుకునేవారేమో తెలియదు.

*   *   *   *

జానకిరావు తమ యింట్లో అడుగుపెట్టి అగ్రహారం మేనేజరుగా పని చేస్తున్నప్పటి నుంచీ అమ్మన్నకు అతనంటే ప్రేమ పుట్టింది. ఆబుడబుడక్కలవాడు చెప్పినభర్త యితడేనా అని సంకోచం కల్గింది. ఇతడే అని వెంటనే రూఢిచేసింది. అవును, "మంచి చక్కని చదువు కున్న" అన్నాడువాడు. ఇవన్నీ జానకిరావు వద్ద వున్నాయి. ఇతనే తన భర్తకావాలి అని అమ్మన్న మనస్సులో అనుకున్నది. కానిఅట్లాగని తండ్రితోతానే చెప్తే బాగుండ దని వూరుకుంది. అన్నిటికన్న ముందు ఉపోద్ఘాతం

కావాలిగనుక, జానకిరావుతో చెలిమి చేయడం మొదలుపెట్టింది అమ్మన్న. కాని అతను చాలాక్లుప్తంగా, మితంగా మాట్లాడేవాడు. అడిగినమాటకు జవాబు చెప్పేవాడు అంతే. అమ్మన్నకేమీ స్వాధీనమయ్యేటట్లు కనబడలేదు. అతనితో కులాసాగా మాట్లాడాలని అమ్మన్న యెన్నోసార్లు ప్రయత్నించింది. కాని వ్యర్థమైంది...జానకిరావుశివావధానిగారింట్లోనే భోజనంచేసి. అక్కడేనిద్రించేవాడు. సాధారణంగాయెల్లప్పుడూ అమ్మన్న అతన్ని చూస్తూనేవుండేది అంతకంతకు అతని ముగ్ధమోహన కళ్యాణమూర్తి అమ్మన్నను ముగ్ధురాలినిగా చేస్తోంది అతనియందుఆమెకు దినదినం ప్రేమ హెచ్చింది. అతనుమాత్రం ఆవిషయమే తలచేవాడు కాడు. ప్రేమఅంటే యేమిటో తెలియనట్టుగా నటించాడు. ఏదో మిషమీద అమ్మన్నే పలుకరించేది. అప్పుడు మాటకుమాట చెప్పేవాడు కన్నెత్తకుండా. అతను, తనను తిరిగి ప్రేమించడం లేదనేసంగతి తెలిసి, అమ్మన్న చాలాఖిన్నురాలైంది. కాని ఏమిచేస్తుంది?...ఇట్లా నెల గడిచింది. అమ్మన్నకు అతని మీదప్రేమ అంతకంతకు పొరలింది. వెనకెప్పుడో బుడబుడక్కలవాడు చెప్పిన జ్యోతిషం అనుదినం ఆమెచెవులలో ప్రతిధ్వనిస్తోంది. అదే ఆమెకళ్లకు ప్రత్యక్షంగా కనబడుతోంది. "ఇదుగో, జానకిరావే, నేను యిదివరకు చెప్పిన భర్తయితడే"—అని ఆబుడబుడక్కలవాడు గిలకవాయిస్తూ చెప్తున్నట్టు ఆమెకు స్ఫురించింది...కాని, జానకిరావుమాత్రం యేమీ తెలియనట్టుగా, యెందులోనూ జోక్యం కలుగజేసుకోకుండా, కాలం గడుపుతున్నాడు. అమ్మన్న ఆవేదన హెచ్చింది. ఆమెప్రేమవాహిని కట్టలు తెగబడి ప్రవహించింది... ఒకనాడు భోజనముందర సంగతంతా, తండ్రి చెవులో చెప్పింది. ఈఆలోచన శివావధానికి, జానకిరావుని చూడడంతోనే కల్గింది. కాని, కొమార్తె యేమంటుందో అని తటస్థంగా వూరుకున్నాడు. ఇప్పుడు ఆమే యిష్టపడ్డది. అందుకని శివావధానికి సంతోషమైంది. అంతే మంచి,వినయవిధేయుడు,సద్గుణవంతుడు, రూపసి,విద్యావంతుడు,తనఅల్లుడు కాబోతున్నాడని అతను వువ్విళ్లూరాడు...ఆవిషయం జానకిరావుతో మాట్లాడడానికి స్థిరపరుచుకొన్నాడు. రాత్రిభోజనమైన తర్వాత, శివావధాని, జానకిరావు వాకిట్లో అరుగుమీద తాంబూలం వేసుకుంటూ, కూర్చున్నారు. మాటల ధోరణిలో శివావధాని, జానకిరావు పెళ్లిప్రశంస యెత్తాడు. దానికతడిట్లా అన్నాడు.

"పెళ్లికేమండీ, ఎక్కడైనా మంచిసంబంధంవస్తే తప్పుతుందా యేమిటి?

"అయితే, యిప్పుడు పెళ్లికిసిద్ధంగా వున్నావన్నమాటే?

"కాని, మీదగ్గరకువచ్చి కనీసం నెలైనా కాలేదు. ఇప్పుడువివాహం అయితే,మిమ్మల్ని వదిలేసి వెళ్లవలసివస్తుంది. అదినాకిష్టంలేదు..."

"నన్ను యెట్లావిడుస్తావు?

"అవును. మరి, వేరేకాపురం పెట్టేసట్లయితే?"

"వేరేకాపురంలేకుండా మాయింట్లోనే వుండు.

"అదెట్లాగండీ?

"ఎట్లాగేమిటి? మాయింటిఅల్లుడవైతేసరి!

"ఏమోనండీ, మీరుచెప్పేది సరిగా తెలియడంలేదు.

"ఏమీలేదు. మాఅమ్మన్న నిన్నుప్రేమించింది-అందుకు నీవు యిష్టపడితే వివాహం చేస్తాను"—

జానకిరావుకు చిరునవ్వొచ్చింది. కాని వెంటనే ఆపుకుని ఆలోచనామగ్నుడైనాడు. కొంచెంసేపు నిశ్శబ్దంగా వున్నాడు.

శివావధాని అడిగాడు, అప్పుడు—"ఏం, జానకిరావూ; ఇంత ఆలోచన దేనికి సరేనంటే సరిపోయేదానికి? శుభం; ఏమంటావు?"

"నేను యేమనడానికీ శక్తిలేనివాణ్ని. ఇక్కడికి, సుమారు క్రోసెడుదూరంలో మా చుట్టాలున్నారు. వారిని సలహా అడిగి, మీకు జవాబు చెప్తాను." అన్నాడు, జానకిరావు.

"సరే" అని తల వూపాడు అవధాని.

తెల్లవారు జామునేలేచి, జానకిరావు, అతని బంధువులయింటికి ప్రయాణమైనాడు. తిరిగి సాయంకాలం నాలుగుగంటలకు వస్తానని చెప్పాడు.

౫

జానకిరావు వెళ్లినప్పటినుంచి, అమ్మన్న, తండ్రి మిక్కిలి సంతోషంగావున్నారు. అతను తిరిగివచ్చి 'సరే' అంటాడుగదా అని ఉప్పొంగిపోయినారు...

సాయంత్రమైంది. శివావధాని వాకిట్లో అరుగుమీద కూర్చున్నాడు. అమ్మన్న మంచి పట్టుదుస్తులు ధరించి, విలువగల నగలుపెట్టుకొని, బాగా ముస్తాబుచేసికొని ప్రణయోత్కంఠయై, వేచివుంది. ఇదిగో వస్తాడు, అదిగో వస్తాడుఅని అనుకుంటూ వారు కాలం జరుపుతున్నారు. ఇంతలో రోడ్డు చివర జానకిరావు గోచరమైనాడు. అతనితో గూడా యెవరో స్త్రీ వున్నది. వారికి ముందుగా, తోపుడుబండిలో పిల్లని కూర్చోపెట్టి, నౌకరు నడుస్తున్నాడు...బహుశః ఆస్త్రీ జానకిరావు బందుగురాలు. పెళ్ళికొమార్తెని చూడవస్తోంది అనుకున్నారు శివావధాని, అమ్మన్న. వారంత నెమ్మదిగా యింటికి చేసుకున్నారు. వారందరిని ఆదరించి కూర్చోమన్నాడు, యింటియజమాని. అంతాకలసి తివాసీ మీద కూర్చున్నారు—శివావధాని, జానకిరావు ఒక దిక్కున; అమ్మన్న, క్రొత్తగా వచ్చిన స్త్రీ మరొకదిక్కున;.

"జానకిరావూ, నీవు వెళ్లిన పని యేమైంది?" అంటూ శివావధాని సంభాషణ ప్రారంభించాడు.

జానకిరావు వెర్రినవ్వు నవ్వుతూ "ఆమె నడగండి" అని స్త్రీ వైపు చూపాడు.

"అయితే, ఆమె నీకేమికావలె?

"ఆమెయా?— నాభార్య, ఇందుమతి. ఆచిన్నపిల్ల నాకొమార్తె, మనోరమ" ఆకస్మికముగా కల్గిన ఆశాభంగముతో, అమ్మన్న నివ్వెరబోయి, నిట్టూర్పువిడిచి, తండ్రి చేతుల లోకి జరిగింది. ఆసందిగ్ధ సమయంలో, విషాదావస్థలో, ఆఉత్కృష్ట ముహూర్తంలో, "అమ్మన్నా, వియోగదుఃఖ మెట్లుండునో తెలిసిందా? నీవు చేసిన ద్రోహానికి, యిది [illegible] ద్రోహం. ఈకపట నాటకానికంతా నేనేసూత్ర ధారుణ్ణి— ఇప్పు డేబుడబుడక్కలవాడు వస్తాడో రమ్మను, అడ్డం—" అంటూ యెక్కడ నుండో, మేనల్లుడు గిరిరావువచ్చి అందరూ ఆశ్చర్యపడేటట్టుగా, అన్నాడు.—

# శబ్దభేదనము

మద్దిపట్ల వెంకటరమణయ్య గారు

మరిగెను స్థానేశ్వరక్షేత్రమున రణమ్ము;
గోరి హిందూసామ్రాజ్యంపుఁ గోర్కె—
ఏడుమార్లు చేపడిన మ్లేచ్ఛేంద్రువిష్ఠ [పండె
ఫలముఁ గుడుచుఁ బృథ్వీరాజు బందియందు
పృథులరక్తప్రవాహంబు లీఁది యీఁది
పడయఁగల్గిన యాఢిల్లిభద్రపీఠిఁ
గొలువుదీరిచె మహామదుగోరి సాహె-
బుద్ధతియు తీవి మెఱయంగ నొక్కనాఁడు
అతని కుడిప్రక్క నాసీనుఁడై వెలింగె
హైహాలీరాయనామ వీరాగ్రియుండు
సార్వభౌమునితోడ మచ్చరము చాటి
తురకకును దోడ్పడిన ప్రభుద్రోహి యతఁడు.

పాదుసా కిరుక్రేవల బారుదీరి
కూరుచుండిరి చుట్టాలు గురులు హితులు
మంత్రులును జమూపతులు సామంతు లాది
అంధునస్త్రనైపుణ్యంబు నరయు వేడ్క.

సింగపుంబోను సర్కసు రంగమునకుఁ
దెచ్చుకైవడి సేవకుల్ దెచ్చిరటకు
బద్ధుఁడైన పృథ్వీరాయ భాగ్యహీను
ఇనుపకటకటాలనవారి నిలుకఁజేసి—

ధారుణీభారధూర్వహా దక్షమయిన
భుజములందలి సంకెలల్ పుచ్చి భటులు
నిలువఁ బెట్టిరి రాజన్యతిలకు నపుడు
సాగరముభంగి ఘోషించుసభకు నెదుర—

ఆదిగంత సామంతభృత్యంబు సకల
జనులఁ దమసన్నల మసలుకొనఁగఁ జేసి
మించు సామ్రాజ్యమెల్ల శాసించినట్టి
కనులు లేవేమి యకట! యాఘనుముఖాన?

అఖిలరాజలోకంబుఁ గాదనుచు రోసి
క్రూరుఁ డగు తండ్రి కట్టడ మీఱి నడవ
నెవ్వి సంయుక్తఁ గడు భ్రమియింపఁ జేసె
నావిశాలతరళదృష్టు లేవి యిపుడు?

అర్థియనుమాట చెవిసోఁకినంతమాత్ర
నతులకారుణ్యరసతరంగితము లెవ్వి?
సాగిలంబడి రరులెవ్వి శేగురింప
ఆమనోభావ ముకురంబు లక్షులేవి?

మునుపు పలుసార్లు తన్ను గాచె ననక మలక
పెఱికి వేయించె నేత్రంబు గురియుకనులు;
తత్కృతఘ్నతాక్రౌర్య నిదర్శనములు
గుంట లచట నేర్పడె నాఁటగోలె రెండు—

వీపునను మున్నతఁడు తాల్చుతూపుఁ బొదియుఁ
గానునను వాఁడికౌక్షేయకంపుదట్టి
కట్టి యాభటు లుంచిరి కైదిచేత
నన్య లెక్కిడ లేని బాణాసనమ్ము—

బరువు పరికించి యొకమాఱు బద్ధ వంచి
అసియుఁ జాపంబుఁ దనవెకా యందునెంచె;
అతఁడు నిడుకేల నాధనుర్లతను దాల్చి
క్రాలెఁ బరవిభంజన కేళిలోలలీల—

తా నధిష్ఠించు గద్దియపైని దనరు
విమతువిభవ వినాశింపఁ గల్గమిని, దనకు
నెరియుహృది దాఁచుకష్టంబు తెరలుకతనఁ
గనులు లేకుంట మే లని కైది తేఁచె—

చిక్కియున్నను నిద్ద వహా చెక్కుదోయి,
వంకబొమలును, వెడఁదయౌ ఫాలపట్టి,
కెంబెదవి నాసతీరు వీక్షించి యతని
కనులకొఱఁతకై వగచెఁ బ్రేక్షకజనమ్ము.

ఆకొలువుకూటమునఁ బాదుసాకు నెదురఁ
బ్రేక్షకాళి కెడగ నిలఁబెట్టఁబడియెఁ
జేరువుగఁ జేరువుగ మూఁడుబారుటీలు
లంధుశబ్దవేధులకు లక్ష్యములు గాఁగ—

కొట్టవలె నంట యాగ్రుడ్డి కోల వేసి
వానిఁ దాటించి చేయునవ్వడినిబట్టి
పొందవలె నంట తనగోరిఁ బోల లేని
గోరిమన్నన విధి దాఁట నేరివశము?

భూపుదురవస్థ తిలకించి పొంగి వచ్చు
దుఃఖమెట్లో యాఁపుకొనెఁ బైకిఁ దోఁపనీక
విభుడు చెడిన, విశ్వాసంబు విడనిమంత్రి
శత్రుదుర్భేద్యతంత్రుండు ఛాందభట్టు—

తనకులాచారసరణి సుల్తానుఁ బొగడి
యొక్కపనికి నై కొలుచుచు నున్నవాఁడు,
గోరికడ రాజువిలునేర్పుగొప్ప సెప్పి
యాప్రదర్శన మొనఁగూర్చి నట్టివాఁడు—

"చూడ లేకున్న శబ్దంబుజాడఁ బట్టి
కొట్టఁ గలవు లక్ష్య మని వాక్రుచ్చె భట్టు
రాజ! యాయీటె నేసి నీప్రజ్ఞచూపు"
మనుచుఁ గోరెను బృథ్వీరాయలను గోరి—

బల్లెమునఁ బల్కు పుట్టించె భటుఁ డొకండు;
రవళిమార్గాన ధన్వి మార్గణము వదలె;
ఖంగు మంచును జవజవ గదలె నీటె;
సభ్యులెల్లరుఁ జప్పట్లు చఱచి రెలమి.

"ఏది యీసారి కొట్టు నీ యేటు చూత"
మనుచు హెచ్చరించెను గృతహస్తుఁ దురక;
"పాదుసావారి మెప్పొంది బ్రదుకు మోయి"
యని హితోపదేశము సేసె హైహాలుండు.

వెడలెఁ దోడనే నృపువింట విశిఖయుగము;
పెనఁగి యొండొండ గద్దెవైపుననుండి
నిగిడె నల్లాహరహా రాధ్వనిద్వయంబు;
క్షత్రియతురుష్కరక్తముల్ కలిసి పాఱె—

మోస మోహో యటంచును మ్రోసె రచ్చ
"హతముచేయుఁడాముష్కరు" ననుచు యోధు
"లరులఁ దెగటార్చి కృతకృత్యుఁ డైతి" ననుచుఁ
బొడిచికొని పడ్డపృథ్వీశుఁ బాదివి రంత.

"ఏఁడి ఛాందభట్టేఁడి పోనీకుఁ" డంచుఁ
ద్రొక్కటంపడుజనమును ద్రోసికొంచుఁ
గలయ వెదకిరి కొందఱు కత్తిదూసి
తెక్కపటనాటకపు సూత్రధారుకొఱకు—

తునిమి వైచిరి యంతకు మునుపె తాను
గోరి హైహాలీరాయలు కూలు టరసి
"ఎత్తుకొనసాగె, నేలిక బుణము తీఱె"
ననెడు వేడ్కఁ బ్రాణము విడిచెనట్టిధన్యు.

# ప్రతిమానాటకము

చతుర్థాంకము

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

(వెనుకటిపంచిక తరువాయి)

(అంతఁ జేటికలు ప్రవేశింతురు)

విజయ

ఓసీ! నందినికా! చెప్పు-చెప్పు. ఇప్పుడు కౌసల్యమ్మగారు మొదలుగా జనానావారంతా హాంగ్రహము చూడబోతే గాదూ బాబులు భరతులుగా రక్కడ తారసిల్లినది? దురదృష్టవంతురాలిని నే నప్పుడు వాకిలిదగ్గర ఉన్నాను.

నందినిక

ఓసీ! మేమంతా ముచ్చటగా చూచినాము బాబులు భరతులుగారిని.

విజయ

కైకమ్మగారిని బాబులు ఏమన్నారే?

నందినిక

అనడమూ లేదు ఏమీ లేదు. బాబులు ఆవిడగారిని చూడడానికికూడా సమ్మతించ లేదు.

విజయ

ఏబ్బే! ఎంతకష్టము. రాజ్య పాళ పెట్టుకొని బాబులు శ్రీరాములుగారికి పట్టము చెడగొట్టబోయి దాన్నితో తనకు వెధవరికము కూడా తెచ్చుకొన్నది; లోకానికే కీడు తెచ్చినది. దయాదాక్షిణ్యాలు లే వామెగారికి; కసుమాలపు పని చేసింది.

నందినిక

ఓసీ! విను: ప్రకృతులు తెచ్చిన అభిషేకమును పారవిడిచి రామబాబులున్న తపోవనానికే వెళ్లినారు భరత బాబులు.

విజయ

(సవిషాదముగా) ఆ! బాబులు వెళ్లిపోయినారా? నందినికా! రా! కైకమ్మగారిని చూదాము.

(వెళ్లిరి.)

ఇది ప్రవేశకము

---

[అంత భరతుఁడు, రథముతో సుమంత్రుఁడును, సూతుఁడును వత్తురు.]

భరతుఁడు

ఉ. చేర దివంబు తేఁడు తన
చేసినపున్నము వెన్నడింపఁగాఁ
బౌరజనాళి బాష్పజల
పాతము లిత్తఱి వెన్నడింపఁగాఁ
జేరెద నేనునుం గృపణ
చేష్టలు లేని తపోవనాళికిఁ

భారుణి రామనామమునఁ
దన్పెడుమాఱటచంద్రుఁ జూడఁగన్.

సుమంత్రుఁడు

ఈతఁడు! ఈరాయుష్మంతుఁడు! భరతుఁడు!

ఉ. పుత్త్రుఁడు దైత్యనిర్మథన
పుణ్యయశుం డగునట్టి తేనికిన్
పౌత్త్రుఁడు సత్త్రభోజిత స
మస్త ధనుం డగునట్టి తేనికిన్
భిత్రనువర్తి రామునకు
నెయ్యపుఁ దమ్ముఁ డితండు, వహ్వా;సౌ
భ్రాత్రముపేర్మికిం దగిన
పద్ధతినే చనుచున్నవాఁ డహో!

భరతుఁడు

ఓ నాయనా!

సుమంత్రుఁడు

బాబూ! ఇదిగో ఉన్నాను.

భరతుఁడు

పూజ్యుఁడు మాయన్న రామచంద్రమూర్తి యెక్కడ? ఆమహారాజులుం గారి ప్రతినిధి యెక్కడ? సారవంతులనన్నిదర్శన మెక్కడ? రాజ్యలుబ్ధ యగు కైకేయికిఁ బ్రత్యాదేశ మెక్కడ? సద్యశమునకు స్థాన మెక్కడ? ఆ నృపకుమారుఁ డెక్కడ? అసత్యసంరతుకుఁ డెక్కడ?

గీ. నాదుతల్లికిఁ బ్రియము నొనర్పఁ గోరి
రాచసిరిపెంపు నెవ్వఁడేఁ ద్రోచిపుచ్చె
నమ్మహాత్ముఁ డిక్ష్వాకువంశాభరణము
నాదుదైవత మెచట నున్నాఁడొ చూడ!

సుమంత్రుఁడు

బాబూ! ఈయాశ్రమపదమునఁ గలఁడు.

గీ. అందె రాముండు, సీత, మహాయశస్కుఁ
డయిన లక్ష్మణుఁడును గల రరసి కనుము
సత్యమును, శీలమును, భక్తి జగమునందు
విగ్రహము లందె నా వారు వెలయువారు.

భరతుఁడు

కనుక రథము నాఁపుము.

సూతుఁడు

బాబుల సెలవు ప్రకారము.

భరతుఁడు

(రథముననుండి దిగి) సూత! గుఱ్ఱములను విడిగా విశ్రమింపఁజేయుము.

సూతుఁడు

బాబులసెలవుప్రకారము. (వెడలెను.)

భరతుఁడు

ఓనాయన! విన్నవింపుము; విన్నవింపుము!

సుమంత్రుఁడు

కుమార! ఏమని విన్నవింతును?

భరతుఁడు

'రాజ్యలుబ్ధయగు కైకేయికిఁ గొడుకు భరతుఁడు వచ్చె' నని.

సుమంత్రుఁడు

కుమార! ఊరకుము. గురుజనాపవాద[illegible]ము నుగ్గడింపరాదు.

భరతుఁడు

మంచిది. పరదోషము నుగ్గడించ[illegible]ట న్యాయ్యము గాదు. కనుక నిట్లు చెప్ప[illegible]ము: 'ఇక్ష్వాకుకులకళంకభూతుఁడగు భర[illegible]తుఁడు వచ్చె'నని.

సుమంత్రుఁడు

కుమార! నే నిట్లు చెప్పఁజాలను. మఱియేమన 'భరతుఁడు వచ్చె'నని చెప్పుదును.

భరతుఁడు

వలదు, వలదు. పేరుమాత్రము పేర్కొనుట నాకుఁ బ్రాయశ్చిత్తము జరగని తెఱఁగుగాఁ దోఁచుచున్నది. బ్రహ్మహత్యఁ జేసినవాండ్రకుఁగూడఁ బరులచే నివేదము లేదు గదా! కనుక మీరు నిలుఁడు. నేనే విన్నవించుకొందును. ఓహోయి! విన్నవింపుఁడు, విన్నవింపుఁడు, పూజ్యుఁడును పితృవాక్యపాలకుఁడును నగు రామచంద్రమూర్తికి!

గీ. జాలిలేనివాఁడు, మేలు మఱచువాఁడు,
పామరుండు, మోటుపనులవాఁడు,
ఐన, భక్తిమంతుఁ డరుదెంచె నొక్కండు
నిలువ సెలవో? లేక తొలఁగ సెలవో?

(అంత రాముఁడు సీతాలక్ష్మణులతోఁ బ్రవేశించును.)

రాముఁడు

(విని సహర్షముగా) సౌమిత్రీ! వింటివా? ఓసి, విదేహరాజకుమారీ, నీవును వింటివా?

మ. ఈఱువుల్ ద్రుంగిన దీస్వరం బెవరి దో
కో యయ్యెడల్? మత్పితృ
స్వరముల్ బోలి వినంబడెన్; మదికి నా
శ్వాసంబు, సౌహార్దముల్
బరితోషంబును సంతరించె; మఱియుల్
బంధుత్వసందేహముల్
నెఱయించెన్; బెరయించె వీను గవకుల్
నెయ్యంబు తియ్యం బహో!

లక్ష్మణుఁడు

ఆర్య! నాకును నీపలుకునవ్వాడి బంధుజనబహుమానమును గట్టించుచున్నది సుమా! ఈ స్వరము—

ఉ. బింకము గల్గి, స్పష్టమయి,
పెద్దదియై, కలమై, మహోత్పుల
అంకెయుఁ బోలె స్నిగ్ధమధు
రంబయి, కంఠమునం దురంబునన్
జంకనిదై, స్ఫుటాంగముల
స్థానము లంటిన యక్షరంబులన్
బొంకము గాంచి, వర్ణములఁ
బ్రోవఁగఁజాలినదో యనందగెన్.

రాముఁడు

ఈపలుకుతీరు బాంధవునిదే యనుటకు సందేహము లేదు. నాహృదయమును గలఁచివైచుచున్నట్టున్నది. వత్స, లక్ష్మణా, చూడుమోయి!

లక్ష్మణుఁడు

ఆర్యుని సెలవుప్రకారము. (కదలును.)

భరతుఁడు

అన్నా! ఏమి! ఎవరును బదులుపలుకకున్నారు? కైకేయీపుత్త్రుఁడగు భరతుఁడు వచ్చెనని తెలిసికొనిరా యేమి?

లక్ష్మణుఁడు

(చూచి) అరే! ఈయన! అన్న! రామచంద్రమూర్తి! కాదు, కాదు; అన్న పోలిక!

ఉ. అన్నమొగంబుఁ బోలెఁ జెలు
వారు మొగంబు శశాంకహృద్యమై
పెన్నురమున్ సురారి శర
పీడితమౌ నృపుబొమ్మ పోల్కి నా

ప్పన్నె అకాంతి పుంజమునఁ
బొల్చు జగత్ప్రియదర్శనుండుగా
నిన్నరనాథుఁ డారయ మ
హేంద్రుఁడొకో, మధుసూదనుండొకో!

(సుమంత్రునిఁ జూచి) ఓహో! నాయన!

సుమంత్రుఁడు

ఓహో! బాబు లక్ష్మణుఁడు!

భరతుఁడు

అగును! ఈయన, అన్నగారు! అన్నా! మ్రొక్కుచున్నాను.

లక్ష్మణుఁడు

రమ్ము, రమ్ము. చిరంజీవ! (సుమంత్రునిఁ జూచి) నాయనా! ఈయన యెవరు?

సుమంత్రుఁడు

కుమార!

గీ. రఘునకుఁ జతుర్థుఁ డజునకరయఁ దృతీయుఁ
డిక్కఁ బ్రతీతుఁడౌ మీదుతండ్రికి ద్వితీయుఁ
డన్వయోద్దీపకునకు నీయన్న కీవు
వలె ననుజుఁడు చిరంజీవి భరతుఁ డితఁడు.

లక్ష్మణుఁడు

ఇక్ష్వాకుకుమార! రా! రమ్ము! వత్సా! స్వస్తి: ఆయుష్మంతుఁడ వగుము.

శా. స్పష్టానేకమహాహవాళి నసుర
వ్రాతమ్ములన్ వజ్రసం
ఘృష్టప్రౌఢశరంబులం దునిమి కీ
ర్తిం గన్న ప్రాగ్భూపులన్,
యష్టన్ యజ్ఞవితీర్ణ వైభవు రఘున్
శౌర్యాదులన్ బోలుచున్
బుష్టోత్కృష్టగుణప్రతానఖనివై
పొల్పొందు ముర్వీస్థలిన్.

భరతుఁడు

అనుగృహీతుఁడను.

లక్ష్మణుఁడు

తమ్ముఁడా! ఇక్కడ నుండుము. నీరాక నార్యునకు విన్నవింతును.

భరతుఁడు

అన్నా! అభివాదనము చేయుటకు నామన సాత్రపడుచున్నది. శీఘ్రముగా నివేదింపుము.

లక్ష్మణుఁడు

మంచిది. (చేరఁబోయి) ఆర్యునకు జయము. ఆర్యా!

గీ. నీకు నెంతయేని నెయ్యంపుఁదమ్ముండు
భరతుఁ డితఁడు భ్రాతృవత్సలుండు
అద్దమందుఁబోలె నగపడె నీఛాయ
చక్కనితనియందు సంక్రమించి.

రాముఁడు

వత్స! లక్ష్మణ! ఏమిదీ! భరతుఁడు వచ్చెనా?

లక్ష్మణుఁడు

ఆర్య! అవును.

రాముఁడు

మైథిలీ! భరతునిఁ జూచుకొనుటకు నీకనుదోయి నాయితపఱుచుకొనుము.

సీత

ఆర్యపుత్ర! భరతుఁడు వచ్చినాఁడా?

రాముఁడు

మైథిలి! అవును.

గీ. ఎఱుఁగుచున్నాఁడ నిప్పుడే యేను జలుప
నలవిగానిది నాతండ్రి నలిపె ననుచు;
తమ్ముపయిఁగూర్మి యిట్టివిధమున నుండె
కన్నకడుపుపైఁగూర్మి యెక్కఱణి దగునో?

లక్ష్మణుఁడు

ఆర్య! తమ్ముని దోడ్కొనిరమ్మని సెలవా?

రాముఁడు

వత్స! లక్ష్మణ! ఇందుఁగూడ నా యభిప్రాయము ననువర్తింప నడుగుచున్నావా? అరుగుము. సత్కరించి శీఘ్రముగాఁ దమ్ముని దోడ్కొని రమ్ము.

లక్ష్మణుఁడు

ఆర్యుని సెలవు ప్రకారము.

రాముఁడు

లేక నీవు నిలుము.

మ. ఇవతాళించిన కల్వతేకు లనఁగా
నింపారుకన్దోయి హా
ర్షవిశేషమ్మునఁ బుట్టుబాష్పజల మా
సారంబుగా జాఱ గా
రవముంజూపఁగఁ దాన యియ్యువిధ చే
రంబోవ్వఁగా కాత్మజుం
దివుటల్ దీఱఁగఁ దారసిల్లుజననీ
స్నేహంబుఁ దోఁపించుచుఁ.

సీత

ఆర్యపుత్రు లానతిచ్చినట్లే. (లేచి పరిక్రమించి భరతునిఁ జూచి) నేను లేచి చూచేయింతలో ఆర్యపుత్రులు ఇక్కడికి వచ్చినారే! కాదు కాదు. రూపుచాలిక!

సుమంత్రుఁడు

ఓహో! కోడలు!

భరతుఁడు

ఓహో! ఈమె పూజ్యురాలు జనకరాజపుత్రి!

గీ. నేల దున్నుచో నాగంటి చాలు వలన
నవతరించిన శ్రీమయ మయిన తేజ
మిది జనకభూమివిభుని యహీనపుణ్య
తపమునకు మఱియును నన్ని దర్శనంబు.

అమ్మా! అభివాదించుచున్నాఁడను. నేను భరతుఁడను.

సీత

(తనలో) రూపమే కాదు. పలుకులీరు గూడా నదియే! (ప్రకాశముగా) దీర్ఘాయుష్మంతుడవుగా నాయనా!

భరతుఁడు

అనుగ్రహీతుఁడను.

సీత

రా! నాయనా! అన్నగారి ముచ్చట తీర్తువు.

సుమంత్రుఁడు

బాబూ! ప్రవేశింపుము.

భరతుఁడు

తండ్రీ! నీ విప్పు డేమి చేయుదువు?

సుమంత్రుఁడు

గీ. అవనినాథుండు దివమున కరిగినపయి
దుఃఖితుండైన రామచంద్రునకు నాకుఁ
జొప్పడియె నిప్పటికిఁ దొలిచూపు గాన
యవల నే వత్తు ముందు నీవరుగు మన్న!

భరతుఁడు

అట్లె సరి. (రాముని జేరఁబోయి) అన్నా! అభివాదనము చేయుచున్నాఁడను—నేను భరతుఁడను.

రాముఁడు

(సహర్షముగా) రారమ్ము, ఇక్ష్వాకుకుమారా, స్వస్తి. ఆయుష్మంతుఁడ వగుము.

ఉ. దగ్గఱ కేఁగుదేరుము! వె
　　డందకవాటము తీరుపేరురం
　బొగ్గుమ; నీసుదీర్ఘభుజ
　　యుగ్మమునన్ నను నిండఁగౌఁగిటన్
　బిగ్గ గ్రహింపుమా వెలయ;
　　నెమ్మొగ మెత్తుమ; శోకవహ్నిచే
　బొగ్గులువాఱియున్న తను
　　వున్ దనియింపుమ; రమ్ము; తమ్ముఁడా!

భరతుఁడు

అనుగృహీతుఁడను.

సుమంత్రుఁడు

(చేరఁబోయి) ఆయుష్మంతునకు జయము.

రాముఁడు

హా నాయనా!

సీ. మున్ను సురాసురుల్ మిన్నంటి చండప్ర
　　చండ సంగ్రామముల్ సలుపునపుడు
　సేనతో దేవసమానవిమానము
　　నెక్కి విక్రమకేళి నేపుసూప
　నచ్చెరువంది సురాసుర 'లాతఁడే
　　యాతఁడే దశరథుఁ' డనుచుఁ బొగడ
　నెగడిన శ్రీమంతుఁడగు నమ్మహారాజు
　　నెయ్యంపు మిత్రుని నిన్ను, నాత్మ
　దేహమును త్యజించి దేవలోకమ్మున
　　నాత్మవంశ్యులయిన యవనిపతులఁ
　బితరులను ముదమున జతకూడి యిత్తఱి
　　నందుచున్నవాఁడె యాత్మసుఖము.

సుమంత్రుఁడు

(దుఃఖముతో)

మ. పరలోకంబున కేఁగ భూవిభుఁడు నీ
　　వా యీవనుల్ సేరి తీ
　భరతుండా కడుఁ గుందువాఁడె గులమా
　　ప్రాపేపులం దక్కని
　క్కరణిన్ బెక్కులు సంకటంబులకు నో
　　గ్గంజేయుచున్ నన్ను నీ
　చిరజీవిత్వము మెలువోలె నిసిరో
　　చెందించెఁ బెన్ దోషముల్!

సీత

అసలే పొగులుతూన్న ఆర్యపుత్రులను నాయన గారిమాటలు మరింత పొగిలిస్తున్నవి.

రాముఁడు

మైథిలి! ఇదిగో నిబ్బరించుకొనుచున్నాను. వత్స! లక్ష్మణ! ఉదకమోయి!

లక్ష్మణుఁడు

ఆర్యుని సెలవుప్రకారము.

భరతుఁడు

ఆర్య! న్యాయ్యము కాదుగదా! క్రమము తీరున శుశ్రూషింతును. నేనే యుదకము తెత్తును. (కలశమును గైకొని నిష్క్రమించి ప్రవేశించి) ఇదిగో ఉదకము.

రాముఁడు

(ఆచమించి) మైథిలి! లక్ష్మణుని శుశ్రూష నడలుచున్నదిగదా!

సీత

ఆర్యపుత్ర! ఈయన సేవకూడా మీరు పొందవలసిన వారేకదా!

రాముఁడు

లక్ష్మణుఁ డిక్కడనుండి శుశ్రూషించును గాక! భరతుఁడు పురమునందుండి నన్ను శుశ్రూషించునుగాక! ఇది లెస్సగదా!

భరతుఁడు

ఆర్యుఁడు నన్ను ననుగ్రహింపవలెను.

గీ. మేనిచే నిచ్చటనె నన్ను మెలఁగనిండు
కర్జములచేత నచ్చటఁ గలుగఁగలను
అన్న! నీపేరిచేతనే యఖిలరాజ్య
పాలనమ్ము నిర్వక్రమై పరఁగఁగలదు.

రాముఁడు

వత్స! కైకేయీతనయ! వల దట్లు వలదు.

ఉ. నమ్ము వనమ్ముఁ జేరుటకు
నాయన యానతిచ్చుమ్ము హేతు వో
తమ్ముఁడ! భీతి గాదు మఱి
దర్పము గాదు మతిభ్రమంబు గా
దెమ్మెయి సత్యమార్గగతి
యేచుని సంపద యస్మదీయసం
తమ్మన; కేటి కిట్లు మఱి
నల్పెద వల్పపుద్రోవఁ బోవఁగన్.

సుమంత్రుఁడు

ఇప్పు డీక నభిషేకోదక మెక్కడ నుండవలెను.

రాముఁడు

మాయమ్మగా రెక్కడ నుండవలెనని చెప్పిరో యక్కడనే యుండవలెను.

భరతుఁడు

అనుగ్రహింప వేఁడెద. ఆర్య! పుంటిపైఁ బ్రొడువ వలదు.

ఉత్సాహ.—
నన్నుతాత్మక! నీదుమాతయె
చక్కనాకును మాతయౌ
నన్న! నిన్నును గన్నయన్నిభృ
తాత్ముఁడే ననుఁ గన్నవాఁ
డెన్నరానిది మాతృదోషము
యేనియుం బరుషోక్తిన్
మున్నుఁబోలెఁ గనుంగొనంగదె
మ్రొక్కెదన్ భరతున్ ననున్.

సీత

ఆర్యపుత్ర! భరతుడు కడుజాలిగా అడుగుకొంటున్నాడు. మీ రేమి యోచిస్తున్నారు?

రాముఁడు

మైథిలి!

చ. తలఁపునఁ బాఱెడిన్ త్రిదివ
ధాముఁడు భూమివిభుండు, పుత్త్రులన్
దులయిడరాని సద్గుణము
నోహరు సీతనిఁ జూచి మెచ్చుకోఁ
గలుగకపోయె; నిట్టిగుణ
గణ్యునిఁ బుత్త్రునింగన్న పుణ్యవం
తులఁ బయిఁగూడనున్ జెడుగు
తుట్టలు చుట్టును దైవ మయ్యరో!

మ. పరితోషించితి నీయెడన్, నిజము, కా
పట్యమ్ము నీయందు లే,
దరుదెంతున్ భవదీయయోగ్యతకు లో
నైనాఁడ, నట్లయ్యు, భూ
వరుప ల్కావిటు తప్పఁ ద్రోవఁదగ ద్రో
వత్సా! భవత్సన్నిభున్
వరపుత్త్రున్ గనుఁగొన్న తండ్రినుడియున్
వ్యర్థంబు గావచ్చునే!

భరతుఁడు

ఉ. అంతము నెందు నెప్పటికి
నన్న! భవచ్ఛపథంబు? త్వత్పద
ప్రాంతమునందు నుందు నిట
నప్పటిదాఁకను—

రాముఁడు

కాదు కాదు, భూ
కాంతుఁడు సత్యవాక్సుకృత
గౌరవమందును గాక; నీవు నీ
సొంతపురాజ్య మేలుకొనఁ
జూడవయే నిదె యొట్టు వెట్టెదన్.

భరతుఁడు

అన్నా! మాటాడరాకుండ మాటాడితిరి! కాని ఒకకట్టుఁబాటున కొప్పెదరేని మీరాజ్యమును బాలింతును.

రాముఁడు

వత్స! ఆకట్టుఁబాటెట్టిది?

భరతుఁడు

నాచేత నుంపఁబడిన మీ రాజ్యమును బదునాల్గువత్సరములు గడచినపిదప మరలఁ బుచ్చుకొనఁగోరుచున్నాఁడను.

రాముఁడు

అట్లె కానిమ్ము.

భరతుఁడు

ఆర్య, వింటివా! అమ్మా, వింటివా ? నాయనా, వింటివా!

అందఱు

మే మెల్లరము వింటిమి.

భరతుఁడు

ఆర్య, మఱియొకవరమునుగూడ గోరుచున్నాఁడను.

రాముఁడు

ఏమి కోరెదవు? నే నేమేని యొసఁగవలెనా? నే నేమేని యనుష్ఠింపవలెనా?

భరతుఁడు

గీ. అన్న! నీపాదపద్మము లనుభవించు
పాదుకల నిమ్ము తలతోడఁ బ్రణతులిడి గొ
మరల నీవచ్చునందాఁకఁ బురిని వీని
కిని విధేయుఁడనై నేను పను లొనర్తు.

రాముఁడు

(స్వగతము) ఆహాహా!

క. ఇంచుకమాత్ర యశం బా
ర్జించితి నే నింతకున్ సుచిరకాలమునన్;
గొంచెపుఁ గాలమున నె యా
ర్జించెన్ భరతుండు జగతి స్థిరతరయశమున్!

సీత

ఆర్యపుత్త్ర! భరతుఁడు కోరిన తొలికోరిక ఇత్తురుగదా!

రాముఁడు

అట్లె యగుఁగాక! వత్స! కైకొనుము.

భరతుఁడు

అనుగృహీతుఁడను. (గ్రహించి) ఆర్య! అభిషేకోదకము నీపాదుకలపై నుంపఁ గోరుచున్నాఁడను.

రాముఁడు

సుమంత్రునితో నాయనా! భరతున కేది యిష్టమో అదియెల్ల జరపఁగోరుచున్నాఁడను.

సుమంత్రుఁడు

చిరంజీవి సెలవు ప్రకారము.

భరతుఁడు

(ఆత్మగతము) అమ్మయ్యా! ఇప్పటికిఁగదా—

ఉ. పౌరుల కిష్టుఁడై స్వజన
వత్సలుఁడై భువనప్రియుండ భూ
మీరమణుండు స్వర్గతుఁడు
మెచ్చు సుశీలపుఁబెద్దఁడై గుణో
దారులకున్ సహోదరుల
కాదరణీయుఁడఁ బుణ్యకీర్తివి
స్తారుఁడ సజ్జనావళి ప్ర
శంసకు నర్హుఁడ లబ్ధకాముఁడై.

రాముఁడు

వత్స! కైకేయీతనయ! రాజ్యమెట్టిదనఁగా, క్షణముగూడ ఏమఱి యుండఁదగనిది. కనుక, నీవు విజయముకై వెంటనే తిరిగి వెడలవలెను.

సీత

ఆఁ! ఆఁ! భరతు డిప్పుడే బయల్దేరి వెళ్లునా?

రాముఁడు

అతిస్నేహము వలదు. చిరంజీవి యిప్పుడే విజయముకై బయలు వెడలుఁగాక!

భరతుఁడు

ఆర్య! ఇప్పుడే వెడలుదును.

గీ. గంపెఁ డాసతోఁ పౌరులు గాచియుంద
రన్న! నిన్నుం గనుంగొన నయ్యయోధ్య
నే నిదే వేగ కొనిపోయి నీప్రసాద
మచటఁ గాన్పించి వారి నూరార్చువాఁడ!

సుమంత్రుఁడు

చిరంజీవీ! నే నిప్పు డేమిచేయవలెను?

రాముఁడు

నాయనా! మహారాజులుంగారివలె నీచిరంజీవిని గాపాడవలెను.

సుమంత్రుఁడు

బ్రదికియుంటినా యట్లే యత్నింతును.

రాముఁడు

వత్స! కైకేయీతనయ! నాముందు రథము నధిరోహింపుము.

భరతుఁడు

ఆర్యుని సెలవు ప్రకారము.

(రథ మధిరోహింతురు)

రాముఁడు

మైథిలీ, ఇటురా! వత్స, లక్ష్మణ, ఇటురా! ఆశ్రమద్వారమువఱకైన భరతుని సాగనంపుదము.

[అందఱు నిష్క్రమించిరి.]

# హృదయావేదనము

జనమంచి సీతారామస్వామిగారు

(వెనుకటిసంచిక తరువాయి)

ఉ. చుక్కల నొక్క యంబరము చూడఁగ నెంతయు నేత్రపర్వమై
చక్కఁగఁ జాటు నీమహిమ సర్వము నద్భుతలీల; నందియుం
బెక్కఁడి దింక "నాస్తికుఁడనే" నను మూఢుఁడుగూడ రాత్రి యం
దక్కజమంది నిన్ హృదయమందుఁ దలంపకయున్నె యీశ్వరా.

ఉ. న్యాయమె నీకు నన్నిటు లనారతమున్ మదిఁ గుందఁ జేయ? నీ
సాయము లేక జీవనము సల్పఁ దరంబగునొక్కొ నాకు? నేఁ
జేయఁగఁ జాలుయత్నములు చేయుట మానితినా మహాత్మ! నీ
వే యిఁక దిక్కుగాని పరులెవ్వరు లే రనుమా టెఱుంగవే?

ఉ. అర్థులు ధాత్రి గౌరవము నందుట కల్లఁట! నీవుగూడఁ బ్ర
త్యర్థులఁ జూచినట్లె భవదర్థులఁ జూచిన వింత గాదొకో
వ్యర్థము నిన్ను వేఁడుటయు నన్న మహాపయశంబు నొందఁబో
కర్థిమెయిం బ్రభూ! ననుఁ గృతార్థునిఁ జేయవె భక్తవత్సలా.

చ. పదపదరాయటంచు ధనవంతుల సేవకు లీడ్చుచుండఁగా
సదయతఁ జూడరే యనుచు సాఁగిలిమ్రొక్కుచుఁ బొట్టకోసమే
కద యవమాన మెంతయినఁ గాంచి సహింత్రు దరిద్రు లక్కటా!
ఉదరము నిచ్చి యన్న మిడ కుండుట నాయమె నీకు రక్షకా.

చ. మదము ఘటించునంత ధనమా దయ సేయకు; దైన్యవృత్తి చే
నుదరముకోస మేధనికునో యడిగించెడునంత లేమియా
కదురఁగనీకు మట్లయినగా నిను నిశ్చలభక్తినిత్యము
న్మదిఁ గొలువంగఁ జాలుదును? నాకు మఱెట్టులు సాధ్య మీశ్వరా!

ఉ. ఏ నొకటిం దలంచినపు డీవు మఱొక్కటి యాచరించిన
ట్లైన విచారమున్ విసుగునందుచుఁ దూఱితి బుద్ధిలేక నిన్;
గాని, భవత్కృతం బయినకార్యమె మేలయి చాలె నీకృపన్:
నేనె దురూహపాలగుట నిక్కము నామతి దిద్దు రక్షకా.

శా. ఎంతో కష్టము నొంది దిక్కెవరులే రీలోకమం దంచు నేఁ
జింతాంభోనిధి మున్గి కొట్టుకొనఁగన్ జిత్రంబుగా నీవు నా
వంతం దీర్చి ముదంబుఁగూర్చితివి దేవా, పెక్కు పర్యాయముల్
స్వాంతం బింకను నిన్నె నమ్మి సుఖయింపంబూనదే లెప్పుడున్?

చ. అనయము యోగిమానసములందుఁ జరించెడి నీపదాబ్జముల్
నను నిఁక ధన్యుఁ జేయుటకు నాకలుషంపుమనస్సునందుఁ గూ
డ నిలుపఁగా దయామతిఁ గడంగితివౌర! భవత్పరోపకా
ర నిరతి సన్నుతింపఁగఁ దరంబొకో యెవ్వరికైన రక్షకా.

చ. మలినపుఁగొంప నాదయిన మానస మెట్టులు నీకు నచ్చెనో
నిలయముగా నొనర్చుకొని నిత్యముఁ గ్రాలుచు నుందు వందు; నీ
యిలు పరిశుభ్రమై పరఁగ నీవె యిఁకం గడు శ్రద్ధఁ బూనఁగా
వలయును గాన నాకు నది భాగ్యకరం బగుఁజుమ్మి యీశ్వరా.

ఉ. ఆపదలైన యప్పుడు మహాతురతన్ నిను వేఁడివేఁడి సం
తాపములెల్లఁ దీరినయనంతర మించుకయుం గృతజ్ఞతన్
జూపక స్వేచ్ఛగాఁ దిరుగుచుం జెడిపోయెడి బుద్ధిహీనుఁడన్
బాపిని నన్ క్షమింపవె, కృపానిధి! యోగ్యునిఁగా నొనర్పవే.

మ. గుణరూపంబులు నీకు లేవనుచు వాక్రుచ్చుంగదా శాస్త్రముల్
నిను నేరీతిని సన్నుతింపఁగలనో నిన్నెట్లు ధ్యానింతునో
యని శంకాకులమానసుండ నగు నాయార్తిం దొలంగింపవే
నాకే మంచు నుపేక్షసేయక, జగన్నాథా, ననుం బ్రోవవే.

ఉ. ఎందుల కీజగంబు సృజియించితొ, యేమగునో యిదింక మే
మెందులకున్ ధరిత్రి జనియింతుమొ, యెందుల కేము మృత్యువున్
జెందుదుమో, మఱేమగునొ చెల్లినపిమ్మటనంచు వేఁపెడిన్
సందియముల్ విశేషముగ; నామది శాంతిని గూర్పు మీశ్వరా.

చ. పరిమితబుద్ధులం గలుగు పాపచరిత్రుల మేము దేవ, యే
కరణి ననంతశక్తియుతుఁ గల్మషదూరుని నిన్నుఁ బూర్తిగా
నెఱుగఁగ నేర్తుమయ్య; నిను నీ వొకరుండవె తెల్పనేర్తు వం
చెఱుఁగుదుఁగాని యింకెదియు నే గ్రహియింపఁగఁజాల నీశ్వరా.

చ ఇడుమలఁ బెట్టితంచు నిను నెన్నఁడు దూఱనరా మహాప్రభూ
కడుదయ నీకుఁ గల్గుటయె కారణమంచును దోఁచె వానినేఁ
బడుటకు; లోక మెట్టిదొ విపత్తులు దెల్పఁగఁజాలినట్టు లె
వ్వఁడు నెఱిఁగింపలేఁ డనుభవంబె ప్రశస్తపుటాజ్ఞ రక్షకా.

చ. పుడమిని నేడ్పుతోఁ గలుగుఁ బూరుషుఁ డంతేఁ గ్రమక్రమంబుగాఁ
గడుపునకున్ ధనంబునకుఁ గాంతకు నేడ్చుచునుండు; నిట్టు లె
వ్వడు నతిదుఃఖమే కనుచు ముక్తిపథంబున నేఁ గఁడక్కటా
పుడకలఁగాని పోవదొకొ పుట్టెను బుట్టినబుద్ధి యీశ్వరా.

మ. చలిబాధన్ దొలఁగింప నగ్నియుఁ బిపాసాపీడఁ బోఁగొట్టఁగా
జలముల్ క్షుత్తు నడంప నన్నము నవశ్యం బౌనటుల్ భక్తి కా
వలయున్ సంసరణార్తిఁ దీర్చి ముద మాపాదింపఁ, గాఁబట్టి ని
శ్చలదీక్షన్ నినుఁ గొల్చు నేర్పరిసిగా నల్పంగదే రక్షకా.

---

## బృందదేశ కేఁగుచున్నాఁడు నందుపట్టి

పండిత పురాణం సూర్యనారాయణతీర్థులు గారు

వెలితమ్మితేకులన్ గెలుచుకన్గవ నొప్పు మోముపైఁ గస్తూరిబొట్టు పెట్టి
గండుతుమ్మెదజాలు దండించు సిగలోన సొంపుగా నెమిలిపింఛమ్ముఁ జుట్టి
పులిగోరు పతకమ్ము మొదలుగాఁ గలనగల్ బాజ్జుపై వెలుఁగ సొంపుగను బెట్టి
వేల్పుటారతనాల వెల్గుగల్గిన మేనఁ బసిఁడియద్దకపు దువ్వలువఁ గట్టి
వేడ్కమెయిఁ బాడు లనపాట విన్నయట్టి - గోపికలఁ దెచ్చు పిల్లనగ్రోవి బట్టి
పొందుగా నాలఁ గావంగ బద్ధిపుట్టి - బృందదేశ కేఁగుచున్నాఁడు నందుపట్టి.

---



# నాచి

ఆంధ్ర శేషగిరిరావు గారు

[సారస్వతసమాజము]

నాచి ఆంధ్ర బ్రాహ్మణస్త్రీ; మహా విద్వాంసురాలు. ఆంధ్రులకు సుపరిచితుడును, సుప్రసిద్ధపండితుడును నైన ఏలేశ్వరోపాధ్యాయు డామెజనకుడు. ఈపండితుని నివాసస్థానము ఏలేశ్వరము. ఇది గుం[టూ]రుమండలము నందలి పల్నాడు తాలూకాకు సరిహద్దున కృష్ణవేణీమహానది కవ్వలి యొడ్డున నున్న పుణ్యక్షేత్రము. ప్రాంతిక జనులు ఏలేశ్వరమును దక్షిణకాశీ యందురు. విధ్వంసావశిష్టము లగు దేవాలయము లా గ్రామమున నేటికిని చాల గలవు. ఏటేట శివరాత్రి కక్కడ జరుగు తీర్థమునకు వేలకొలది జనులు వచ్చుచుందురు.

క్రీస్తుశకము ఏడవశతాబ్దియం దీగ్రామమున ఏలేశ్వరోపాధ్యాయుడు జీవించియుండెను. ఆతడు సంస్కృతసాహితీమండనుడు; [వే]దవేదాంగములయందు అనంత కౌశలము గడించినకోవిదుడు; ఆయుర్వేదమునందు విశేషానుభవము సంపాదించిన అభిజ్ఞుడు; వేయేల ఆతడు సమస్తశాస్త్రములను సర్వాంకషముగ నేర్చిన ప్రజ్ఞానిధి.

ఆంధ్రభూమియందు బ్రాహ్మణులలో వివాహములందు పాటింపబడుచున్న నాడుభేదములు ఏలేశ్వరోపాధ్యాయుడు కల్పించినవే. ఆతడు తనకొమరితలలో నొకయామె పరిణయమప్పుడు వరుని కులవిషయమున ప్రమాదపడియెను. అందుపై నాతడు బ్రాహ్మణసంఘములో నాడుభేదము లేర్పఱచి, యే నాడువా రానాడునందలి స్త్రీని మాత్రమే పెండ్లి చేసికొనవలయునని విధించెను. నాటి నుండి నేటివఱకును ఆ అనుశాసనము అనుశ్రుతాచారమై ఆంధ్ర బ్రాహ్మణసంఘమున వెలయుచున్నది.

ఏలేశ్వరోపాధ్యాయుడు తా నార్జించిన విద్యనంతను లోభమూని తనయందే జీర్ణము చేసికొనక శిష్యులను చేరదీసి విద్యాశిక్షణ మిచ్చెడివాడు. ఆయనయొద్ద ఎల్లప్పుడు వందలకొలది విద్యార్థులు సంస్కృతము నభ్యసించుచుండువారు. ఓరంత ప్రొద్దును ఆతని యింట సంస్కృతఘోషయే. నిరంతర మట్టి సంస్కృతఘోషనడుమ మెలగుచుండుటచే ఆతనిగృహమున స్త్రీలుసయితము సంస్కృత

మున స్వచ్ఛముగ ధారాళముగ సంభాషింప గలిగియుండిరి.

ఏలేశ్వరోపాధ్యాయునకు పురుషసంతతి లేదు. ముప్వురు తనయలుమాత్రము కల్గిరి. అందు నాచి రెండవయామె. దురదృష్టవశమున నాచి యౌవనాశామృదుపుష్పము పూర్తిగ వికసింపకుండగనే పతిని గోల్పోయి దుర్భరమగు వైధవ్యమున ఇల్లుపట్టెను. ఏలేశ్వరోపాధ్యాయుని ప్రేమార్ద్రహృదయమప్పుడు కొలిమివలె కణకణలాడి కుమిలిపోయెను. తనకుమార్తె వైధవ్యవేదన అతడు చూడలేకపోయెను. ఇంక నాజన్మమున కెట్టలును తీరని అట్టిదీర్ఘవిచారమునుండి ఆమె మనస్సుకింత మరల్చుటకై అతడు నాచిని సంస్కృతవిద్యాభ్యాసమునకు పురిగొల్పెను.

నాచి దీక్షతో సంస్కృతము అభ్యసింపనారంభించెను. నిద్రాసుఖములను మఱచి కష్టపడి చదివినను ఆమె మందమతి యగుటచే తగినప్రయోజనము లేకపోయినది. అందుమీద విద్యాప్రియయగు నాచివిచారమునకు మేరలేకుండెను. తానెట్లైన గొప్పవిద్వాంసురాలు కావలెనని ఆమె వేగిరపడుచుండెను.

నాచివలె మందమతులగువారు ఏలేశ్వరోపాధ్యాయుని ఇతర విద్యార్థులలో కొందఱుండిరి. అట్టివిద్యార్థుల జ్ఞాపకశక్తి వృద్ధినొంది వారిబుద్ధిబలము తీవరించుటకు ఔషధము కనుగొన ఏలేశ్వరోపాధ్యాయుడు ఆయుర్వేదమందలి తన అభినివేశము నంతయు వినియోగించెను. వినియోగించి 'జ్యోతిష్మతి' యను తీగెరసమును త్రాగినచో మేధాశక్తి పెంపొందునని గ్రహించెను. ఆ ఔషధ సేవవలన నాయనశిష్యులలో మందబుద్ధు లగువా రధిక మేధాసంపన్ను లైరి.

సత్వరము మహావిద్యావంతురాలు కావలెనను ఆత్యాతురతతో నాచి ఒకనాడు జ్యోతిష్మతి రసమును మోతాదు తప్పించి మిక్కుటముగా త్రాగెను. ఆరసము పరిమాణమునకు మించినచో వికటించి విషతుల్యమగు ఫల మొసగును. అట్లారసము గ్రోలిన కొద్దిసేపటికి నామెకు అవిడితాపము, విదాహము బయలుదేరెను. ఆమె ఈఆపసోపాలికి దాళజాలక పెరటిలోనున్న బావియందు దుమికెను. అం దామె ఎనిమిదిగంటలకాల మ[illegible]డెను.

ఏలేశ్వరోపాధ్యాయునకు గాని, మఱి ఎవ్వరికి గాని ఈవృత్తాంత మేమియు తెలియదు. అకస్మాత్తుగ నాచి కనిపించకుండుటచే ఉపాధ్యాయుడు ఊరెల్ల నరసెను. కాని లాభము లేకపోయినది. తుద కాతడు విసిగి వేసారి పెరటిలో నూయిచెంత చదికిలబడి వెల్లుబ్బుచున్న విచార మరికట్టజాలక 'నాచీ, నాచీ' యని బిగ్గఱగా పలవింప మొదలిడెను. అప్పటికే ఆమె చాలసేపటినుంచి నీటనున్నది కావున తాపము చల్లారి కొంచెముగా తెలివి కల్గుచుండెను. అప్పు డామెకు తండ్రిపిలుపు వినిపించినది. అందుపై నామె మాఱుకేక వైచి జరిగినసంగతి నంతయు చెప్పెను. ఏలేశ్వరోపాధ్యాయు డంత పుత్రికను బావినుండి

౧౯౨౭-వ సంవత్సరము మేనెల ౨౮-వ తేది స్ఫియరు పత్రికనుండి.



౧. ప్రాచీనమహారాణుల చిత్రములు. చిత్రము ౪.

'డిడో' అను కార్తేజియనుదేశపు మహారాణి.



౨. కుతుబుమినారు.

జి. హాంబ్రూకుగారు తీసిన యత్యద్భుతఛాయాచిత్రము. పదుమూడవశతాబ్దమున నిది నిర్మింపబడినది. దీని ఎత్తు ౨౩౮ అడుగులు. దీనికి ౩౭౯ సోపానములు గలవు. ఇందలి లేఖనములు కొన్ని మహమ్మదీయచక్రవర్తులకు సంబంధించినవి. మఱికొన్ని కొరానునుండి యుద్ధరింపబడినవి.

[౧౯౨౮ సం. సెప్టెంబరు 11 వ తేది టైమ్సుఆఫ్ ఇండియాపత్రికనుండి.]

షను గాన వారిచరిత్రను మరియొక వ్యాసమున వివరించెదను. ప్రాచీనాంధ్రుల యాదిమనివాసమును గూర్చిన చర్చయు, ఆర్యుల ప్రాచీననివాసచర్చయు నొకటే యగును గాన నది యాంధ్రులచరిత్ర కంతగా నవసరము లేదు. కాని కరూశులు గంగాతీరమునకు రాకముందు ఎచ్చట నుండిరో, యేదేశములు మెట్టిరో వీలగు నంతవరకు చెల్లడిచేసెదను. ఇదిగాక గంగాతీరమునుండి దక్షిణహిందూస్థానమునంతయు నాక్రమించిరని చెప్పితిని. దీనిని కాలవిభాగముతో చూపించుటకు గానయుగములసంకేతమును గూర్చియు, ప్రాచీనభూగోళకళను గూర్చియుగూడ పనిచేసి చెల్లడింపవలసిన యావశ్యక మున్నది. కాబట్టి ప్రాచీనాంధ్రచరిత్ర చెప్పకముందు ప్రాచీనభూగోళకళయును, యుగములసంకేతమును ముఖ్యముగా వివరింపవలసియున్నది. వాటినిగురించి మున్ముందు వ్రాయుచున్నాను.

---

# కోకిలగీతములు

కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి గారు

[illegible]ములు మెచ్చంగ దగియుండుకంఠమధురి
[illegible]మ్ము చెన్నారంగ గోకిలా, మధురగీత
మేల పాడంగబూనెద వీయరణ్య
మందు నెవ్వరు విందురు నీయాలపనము?

రాజగృహములం జెన్నారి రమ్యగతుల
ఘనులు పలికెడు పలుకుల ననుకరించి
తేటతెల్లముగా మరు తేజిపలుకి
నెవరువిందురు నీపాట నెలమిం బికమ!

రంగురంగులవేషముల్ తొంగలింప
విమలసౌధాగ్రముననుండి వినుత కేకి
పింఛమును విప్పి తగం గేకవేయందొడంగ
[illegible]నెవరు విందురు నీపాట పృథ్విం బికమ!

[illegible] తాలయములపంచ నోర్మిం జేరి
విశదశృంగారభావంబు వెలయుచుండ
నింపుమెయిం బావురము గుబాళింపంబూన
నెవరు విందురు నీపాట భువిని బికమ!

శ్రీలం దనరారువారల చెంతం జేరి
పలుకుమనురీతి గోరువంక పలుకుచుండ[illegible]
కెట్లచేమలంబట్టు నీచిన్నిపాట
నెవరు విందురు కోయిలా, యిలను జెపుమ.

పిన్నవారలు విన్న నిక వెక్కిరింత్రు
పెంకివారలు విని పెడ్డ విసరుచుంద్రు,
పాంథజనములు వినువినవలవదంద్రు
కోయిలా, యేలపాడెదు కోయటంచు?

నేన పొరపాటు పాలయి నిన్ను వెఱ్ఱి
శంకచేయంగ జొచ్చితి జంకులేక,
సరసముగం బాడుచుంట నీసహజగుణము
వినెడివారున్న లేకున్న విపినమందు.

గానరసరహస్యజ్ఞులౌ కవిశ్రేష్ఠు
లరసి నీమృదుగీతంబు నమలకృతుల
వర్ణనము చేయుచుండంగం బలువితముల
నితరు లెట్లున్న నేమి నీకేమి కొదవ?

---

# ప్రపంచరాజకీయరంగము: హిందూదేశము

నేత్రకంటి శ్రీనివాస కోనేటిరావు గారు, బి. ఏ., బి. యల్.

సహాయనిరాకరణోద్యమము గాంధి మహాత్మునిచే ప్రారంభింపబడినది మొదలు హిందూ దేశములో నల్లెడ కుగ్రామముల యందునహా ఆబాలగోపాలము రాజకీయ ప్రబోధము కడు ప్రశంసనీయముగా గావింపబడినది. మాతృదేశమున కియ్యది గాంధి మహాత్ము డొనర్చిన మహోత్కృష్టమైన యుపకారము. మరియు పూర్వమువలెముఖ్యపట్టణములయందే కాక సామాన్య పట్టణములలోగూడ రాష్ట్రమహాసభలు జిల్లాతాలూకాసభలునుగూడ జరుపబడుచు అన్ని తరగతుల ప్రజలయందును. రాజకీయపరిజ్ఞానము విరివిగా వ్యాప్తినందుచున్నది. మన దేశచరిత్రలో నిప్పుడొక నూతన యుగము ఆరంభమగుట యెల్లరకును గోచరించుచున్నది. కాంగ్రెసు మహాసభయందే కాక చిన్నసభలయందుగూడ నిటీవల దేశీయ మహాజనసభయొక్క తత్త్వమును, ప్రధానోద్దేశమును బ్రిటిషుసామ్రాజ్యాతీతమగు సంపూర్ణస్వాతంత్ర్యసంపాదనమని నిర్వచించుటకై తీర్మానము లుపపాదింపబడి కొన్నిపట్ల నెగ్గుచున్నవి. అట్టిచో ప్రపంచరాజకీయరంగములో ప్రకృతము హిందూదేశముయొక్క నిజస్థానమెద్దియో గ్రహించుట విధాయకము.

ఇందులకు గత రెండుశతాబ్దములయొక్క చారిత్రపరిణామమున సింహావలోకనముగా వీక్షించి కొన్ని ప్రధానాంశములను జ్ఞప్తియందుంచుకొనుట ఆవశ్యకము. బ్రిటిషువారు తొలుత వాణిజ్యవ్యాపారములను నడపుటకై హిందూదేశమునందు ఇతర యూరోపియుల వలెనే ప్రవేశించి తమ చాకచక్యముచే[illegible] అదృష్టబలిమిచేతను క్రమక్రమముగా[illegible]మునంతను స్వాధీనపరచుకొని సామ్రాజ్యమును సంపాదించిరి. 1757 సం॥ ప్లాసీయుద్ధము మొదలుగ 3 మైసూరు యుద్ధములు, 4 మహారాష్ట్రయుద్ధములు, 3 సిక్కుయుద్ధములు, 3 ఆఫ్గనుయుద్ధములు, 2 నేపాళదేశ దండయాత్రలు, 2 బర్మాదండయాత్రలు, మరికొన్ని చిన్నయుద్ధములును, ముట్టడులును బ్రిటిషువారికి జయప్రదముగా ముగిసినపిమ్మట బ్రిటిషుసామ్రాజ్యము హిందూదేశములో ఆసేతుహిమాచలము, బర్మాసహా, స్థిరముగా స్థాపింపబడినది. తమవలె హిందూదేశమున న[illegible] వచ్చిన ఫ్రెంచి, పోర్చుగీసు వారలస్థాన[illegible] సమసిపోయి, వివిధసంస్థానాధీశులు సామంత ప్రభువులయి, బ్రిటిషువారికి ఏకచ్ఛత్రాధిపత్యము లభించినది. 1857 సంవత్సరములో

ఉత్తరహిందూస్థానములో జరగిన సిపాయీల గొప్పతిరుగుబాటు అణచివేయబడి తత్ఫలితముగ వర్తకకంపెనీ పరిపాలనము పరిసమాప్తి కాబడి అసలైన బ్రిటిషుప్రభుత్వము వచ్చినది. తదాది హిందూదేశము "రవియస్తమించని" బ్రిటిషు సామ్రాజ్యముయొక్క ప్రతిభకు మూలాధారమై యున్నది.

హైందవసామ్రాజ్య దృఢీకరణము

కంపెనీప్రభుత్వముపోయి బ్రిటిషుచక్రవర్తిపాలనము వచ్చినప్పటినుండియు ఇండియాదేశమువలన నింగ్లాండునకు పలువిధములుగ అమితలాభము చేకూరినది. ఈస్టిండియాకంపెనీ యంతరించినను బ్రిటిషుదేశస్థుల వర్త[నిర్మాణము] ఆగిపోలేదు. హిందూదేశము తమపాలనలోనికి వచ్చినపిమ్మట బ్రిటిషువారు ఏకారణముచేనైనను మరల తమసామ్రాజ్యములోనుండి యీ దేశము వీడిపోకుండుటకు గాను ఇంగ్లండు ఇండియాదేశముల మధ్య నున్న సముద్రమార్గమంతయు తమస్వాధీనములోనికి క్రమక్రమముగా నవకాశమునుకని పెట్టి తెచ్చుకొనిరి. మధ్యధరాసముద్రమార్గమున జిబ్రాల్టరు, మాల్టా, సైప్రస్‌దీవి, సూయజుకాలువ, ఏడెన్‌పట్టణము, బస్రాపట్టణము సంపాదించినారు. ఆఫ్రికావైపున సెంటుహెలీనా, దక్షిణఆఫ్రికా, మారిషస్, సిబిల్లీస్ మొదలగు స్థానములను ఆక్రమించుకొనిరి. హిందూదేశమును సంరక్షించుకొనుటకై సూయజుకాల్వగల ఈజిప్టుదేశమును చేవచెడియున్న టర్కీసామ్రాజ్యమును లోకువజేసికొని తాము ప్రసక్తికల్పించుకొని 1882 సం॥నుండి ఆక్రమించుకొని యున్నారు. హిందూ మహాసముద్రములో అండమాన్సు, నికోబారుద్వీపములు, స్ట్రెయిట్సు సెటిల్మెంట్సు, బ్రిటిషు బోర్నియో దీవి వగైరా స్థానములను కలిగి యున్నారు. అటుపైన ఆస్ట్రేలియా న్యూజీలండు ఫిజీ మొదలగు బ్రిటిషువలస రాజ్యములే. చీనావైపున హాంకాంగు లోనగుపట్టణములను సంపాదించి తమయధికారమును నిరంకుశముగ చెలాయించుచున్నారు. మరియును హిందూదేశమునకు సరిహద్దున నున్న దేశముల విషయములో, బెలుచ్సిస్థానమును 1875-1903 సం॥లో క్రమేణ ఆక్రమించుకొనినారు. ఉత్తరముననున్న టిబెట్టు దేశము 1904 సం॥న కర్జను ప్రభువుగారి కార్యదీక్షచే లొంగదీయబడినది. పశ్చిమమున, ఆఫ్గనిస్థానమును కలుపుకొనుటకుగాను విశ్వప్రయత్నములు కావింపబడినవి. 1833,1839,1878,1919 సం॥లలో విశేషసైన్యమును, ధనమును వ్యయపరచి దండయాత్రలు సాగించినారు. కాని కృతకృత్యులు కాలేదు. దండోపాయమువలన కార్యసాధనము కానందున సామోపాయము నవలంబించి హిందూదేశపు ఆదాయమునుండి లక్షలకొలది రొక్కము ను ఆఫ్గనుఅమీరునకు సబ్సిడీయనుపేరట యేటేట చెల్లించుచు బహూకరించినారు. ఇటీవల 1919 సం॥లో యిరోపా మహాసంగ్రామము ముగిసిన వెనుక సైన్యమును దోలి కడసారి ప్రయత్నముచేసి విఫలమనోరథులైరి. ఇప్పుడు ఆఫ్గనిస్థానము బలిష్ఠమై సంపూర్ణస్వాతంత్ర్యము ననుభవించుచు విదేశరాజధానులయందు స్వకీయరాయబారపు మంత్రు

లను నెలకొల్పి ప్రపంచరాజకీయరంగములో ఘనమైనస్థానమును బడసినది.

ఈసందర్భమున నూతనముగా నిర్మింపబడుచున్న (Singapore Naval base) సింగపూరు నౌకాశ్రయమును గురించి యొకింత చెప్పవలసియున్నది. మధ్యధరాసముద్రమును సూయజుకాల్వయును తమ స్వాధీనమునందుండుటచే యూరపునుండి ఇండియా చేరువరకుగల సముద్రమార్గముపట్ల బ్రిటిషువారికి భయకారణమేమియు లేదు. కాని హిందూ మహాసముద్రమునందు-అందు ముఖ్యముగా కోరొమాండెల్ తీరముపైపునను, ఆస్ట్రేలియా నౌకామార్గమున పసిఫిక్ మహాసముద్రమునందును గొప్పయుద్ధనావ లుండుట కుపయుక్తమైన నౌకాశ్రయ స్థానము ఒక్కటియును బ్రిటిషువారికి లేకుండెను. ఈ లోపమువలన హిందూదేశమునకును, ఆసియా ఖండములో గల యితర బ్రిటిషుసామ్రాజ్యభాగములకును, నౌ కా ద ళ ము లు గ ల జాతులకు, పరస్పరయుద్ధము, రగుల్కొనినచో, నెట్టి యుపద్రవము సంభవించునదియు ఐరోపా మహాసంగ్రామము ప్రారంభించిన (1914)కొద్దిదినములకే జర్మనీవారి ఎమ్డెను నౌక (Emden) కావించిన బీభత్సమువలన సువ్యక్తమైనది. అందుచే ఐరోపా మహాసంగ్రామము ముగిసిన వెంటనే భావికాలములో యుద్ధము లెప్పట్లను తటస్థింపకుండుటకు సంకల్పము కావింపబడి తదనుగుణ్యముగ శాశ్వతపుఏర్పాట్లుకొన్ని నెలకొల్పబడినప్పటికిని బ్రిటిషు ప్రభుత్వమువారు నూతననౌకానిర్మాణయత్నములను విరమించుకొనక క్రొత్తస్కీముల ప్రకారముతమనౌకాబలమునకవకాశమును పెంపొందించుకొనుచున్నారు. ఈవిషయములో అమెరికాసంయుక్తరాష్ట్రప్రభుత్వము బ్రిటిషు జపాను ప్రభుత్వములకును జినీవాపట్టణములో నిటీవల జరగిన ప్రత్యేక కాన్ఫరన్సు భగ్నమగుట వార్తాపత్రికలలో ప్రకటింపబడినది. లేబరుపార్టీ ప్రతిఘటించినప్పటికి బ్రిటిషుప్రభుత్వమువారు దీక్షతో 10,000,000 పౌనులు ధనమును వెచ్చించి సింగపూరునందు గొప్ప యుద్ధనౌకాశ్రయమొకటి త్వరగా నిర్మాణము చేయించుచున్నారు. ఇందలి తత్త్వమేమన లోకవ్యాప్తకమగు మరొక మహాసంగ్రామము చెలరేగినచో హైందవసామ్రాజ్యమునకు భంగమురా[illegible] సంరక్షించుకొనుటకు తగు అవకాశమ[illegible] బ్రిటిషువారు నిర్మించుకొనుచున్నారు. అట్లాంటిక్ మధ్యధరాసముద్రములకు మార్గద్వారముగ జిబ్రాల్టరుపట్టణ మున్నరీతిని తూర్పున పసిఫిక్ హిందూమహాసముద్రములకు (Gibraltar of the East) సింగపూరు వెలయవలయునని సామ్రాజ్యకాంక్షామనస్కులగు బ్రిటిషువారి యాశయము. ఈసందర్భమునందు నౌకాబలయుతులగు జపానులోనగు ఇతరదేశములకు— పైకిమెట్లున్నను— అసూయ, అసంతృప్తి, కలదని వేరుగ చెప్పనక్కరలేదు.

మరియు, వాయువిమాన మార్గములు (Air routs) ఏర్పరుపబడు నిక్కాలమున యూరపునుండి తిన్నగా ఇండియాకు పోవుమార్గమంతయు తమకు చెందియుండుటకు గాను మెసపొటేమియా, పాలస్టీను ఈజిపు దేశముల

యందు మకాములను ప్రత్యేకించి నిర్మించుచున్నారు. పెరిషియాదేశములోగూడ తమ తాలూకు వాయువిమానశాల నిర్మించుకొనుటకు అనుజ్ఞకై ఆప్రభుత్వమువారితో బ్రిటిషువారు ఉత్తర ప్రత్యుత్తరములను జరుపు వర్గమువారును, మన గవర్నమెంటువారును చెప్పినచొప్పున వీరు నడచుకొనవలసినదిగాని మాతృదేశపక్షమున భిన్నాభిప్రాయమును వెలిబుచ్చదగదు. ధగద్ధగాయమానముగ వస్త్రాభరణములను దాల్చి మిరుమిట్లుగొలుపు నొక స్వదేశసంస్థానాధీశునిగూడ నాసభలో గూర్చుండుటకు మన ప్రభుత్వమువారు నియమించు నాచారము గలదు. ప్రజ్ఞావంతుడైనను ప్రజామమున నొకమహారాజు ప్రతినిధిగానుండుట హాస్యాస్పదము. నానాదేశసభావ్యయమునకై హిందూదేశము చెల్లించు విశేషమొత్తములో స్వదేశసంస్థానాధీశులేమియు భరించుటలేదని ఢిల్లీశాసనసభయందు ప్రశ్నోత్తరముగ దెలుపబడినది. అయినను సంస్థానాధీశులు తమకు కృతజ్ఞులై యుండుటకును, తమసామ్రాజ్యమునకు లొంగియున్నారని లోకమునకు వెల్లడిచేయుటకును, ప్రభుత్వమువారీయక్రమమును జేయ సాహసించుచున్నారు.

మరియు, కెనడా, ఆస్ట్రేలియా దేశములకన్న నెక్కుడుపైకమును హిందూదేశముచే నిచ్చుచున్నారు. బ్రిటిషుసామ్రాజ్యదేశములలో కెనడా 35, ఆస్ట్రేలియా 27, దక్షిణ ఆఫ్రికా 15, ఇండియా 56పాళ్లను చెల్లించుచున్నవి. స్వతంత్రదేశమగు చీనాదేశము 46, పాళ్లను మాత్రమే యిచ్చుచున్నది. ఈ అన్యాయమిట్లుండ అధికమొత్తము నిచ్చుచున్నను హిందూదేశమునకు కార్యనిర్వాహకసంఘమునందు స్థానము సున్న. ఇంతేకాక కార్యాలయపు శాశ్వతోద్యోగీయులుగ భారతీయులనిద్దరను మాత్రమె తీసికొనినారు.

కెనడాదేశస్థులు 7 గురు. ఆస్ట్రేలియాదేశస్థులు 4 గురు, చీనాదేశస్థులు ముగ్గురు కలరు. ఇందుకు హిందూదేశముయొక్క పరాధీనతయు, రాజకీయదౌర్బల్యమును కారణములని విస్తరించినిరూపించ నవసరములేదు.

ఇటీవల నానాదేశ మహాసభయొక్క యాదరణమున జరగిన ఇంటర్నేషనల్ లేబరు మహాసభకు భారతదేశము లేబరు ప్రతినిధిగా వెడలివచ్చిన సుప్రసిద్ధ కార్మిక నాయకులును విశేషించి ఆంధ్రులు నగు శ్రీయుత వరాహగిరి వెంకటగిరిగారు తమ యభిప్రాయమును పత్రికావిలేఖకునితో నిట్లు చెప్పిరి.

"నేను నానాదేశముల సాంఘికవాద నాయకులతోడను, రాజకీయవేత్తలతోడను చర్చించి సంపాదించిన యనుభవమునుబట్టి చూడ నీదేశవిముక్తియు, నీదేశీయులైన పనివాండ్ర పునరుద్ధరణమును నేస్వర్గమునుండియో యూడిపడుననియును శ్వేతజాతీయుల తోడ్పాటువలనగాని లభింపనున్నవనియును నాసోదర దేశీయులు తలంపగూడదని వినయపూర్వకముగ మనవిచేసుకొనుచున్నాను. కేవలము స్వయంకృషియును, నాత్మగౌరవప్రేమయు, స్వార్థత్యాగమును, వీనినన్నిటినిమించి దేశములోని యన్నితరగతులవారి నైకమత్యమును, మా

త్రమే భారతమాతృవిముక్తికి గారణములు కాగలవు."

కనుక పైనవివరింపబడిన వృత్తాంతము నుబట్టి, పేరునకుమాత్రము గొప్పయేకాని హిందూదేశమునకు నానాదేశమహాసభాసభ్యత్వమువలన వాస్తవమైన ప్రతిష్ఠగాని పలుకుబడిగాని లభ్యము కాలేదనుట నిస్సంశయము.

బ్రిటిషుసామ్రాజ్యపదము (British Empire) త్యజింపబడి బ్రిటిషుకామన్వెల్తు ఆఫ్ నేషన్సు (British Commonwealth of Nations) అనుపదము విరివిగా రాజకీయవేత్తలు ప్రయోగించుచున్నారు. దీనిభావమేమన:ఇప్పటివరకు భిన్నభిన్నహోదాలు కలిగియున్న సామ్రాజ్యస్థదేశములన్నియు సమానహక్కుల ననుభవించుచు ఆయాదేశపు ప్రజలు స్వపరిపాలనాధికారము నిశ్చితముగ ననుభవించుచుండుటకును కామన్వెల్తులోని అన్ని దేశములును ఐకమత్య మవలంబించి మైత్రితో మెలగుటయనియు సిద్ధాంతీకరింపబడినది. ఇది వట్టిసిద్ధాంతమే కాక క్రియలో గూడ వాస్తవమగుచో, ప్రధానమైన ఆర్థికస్వాతంత్ర్యమును (fiscal autonomy) మినహాయింపులుగాని దాపరికముగాని లేక, సంపూర్ణముగ స్వలాభాపేక్షను మనఃపూర్తిగ విడనాడి బ్రిటిషుపార్లమెంటు హిందూదేశమున కొసగవలసియున్నది. మరియు శ్వేతజాతీయులు అహంభావముతో హైందవులను కష్టములపాల్చేసి హక్కులను హరించి వెడలగొట్టదలచినచో, దక్షిణఆఫ్రికా, కెనడా, కెనియా మొదలగు దేశములపై ప్రతీకారపద్ధతి నవలంబించుటకు హిందూదేశమునకు అభ్యంతర ముండగూడదు. ఈకామన్వెల్తు విధానమును ఇంగ్లాండులో లేబరుపార్టీవారు చున్నట్లు పత్రికలలో ప్రకటింపబడినది.

ఇక, బ్రిటిషుసామ్రాజ్యములో హిందూదేశమునకుగల స్థానమెద్దియో చర్చింపవలసియున్నది. స్వరాజ్యోద్యమమునకు ప్రత్యుత్తరముగా దేశపరిపాలనమునకు సంబంధించిన సంస్కరణముల నిచ్చి ప్రజా ప్రతినిధులు పూర్వముకన్న నెక్కుడుగ గల్గిన శాసనసభలను నెలకొల్పియున్నారు. ప్రస్తుతస్థితిగతులనే నిరూపించుట యీ వ్యాసోద్దేశము గావున రాజకీయ సంస్కరణముల పూర్వచరిత్రను గురించియు వాని పరివర్తనమును గురించియు దెలుపుట అనవసరము. ఐరోపా మహాసంగ్రామము ముగిసిన వెంటనే అధికార రహితమైన సంస్కరణములుమాత్రము ప్రసాదింపబడినవి గాని స్వాతంత్ర్యచిహ్నము లయిన సంపూర్ణములగు హక్కులెవ్వియు నొసగబడ లేదు. కాని ఐరోపామహాసంగ్రామము ముగిసిన వెంటనే ముందెన్నడును యుద్ధములు లేకుండుటకుగాను "నానా దేశ మహా సభ" (League of Nations) యని జినీవాపట్టణములో గొప్పకార్యస్థానమును గలిగిన యొక నూతన ప్రపంచసంస్థ 1920 సం॥లో సృష్టింపబడినవిషయ మెల్లరకును దెలిసియున్నది. అందులో మెంబర్లుగ ప్రపంచమందలి అన్ని ఖండముల ముఖ్యదేశములు కలవు. బ్రిటిషు

సామ్రాజ్యములో నిండియాకూడ నొకప్రధాన వ్యక్తియని లోకమునకు సూచించుటకై, కెనడా, ఆస్ట్రేలియా, దక్షిణఆఫ్రికా దేశములతోపాటు హిందూదేశమునుగూడ నొక అసలుమెంబరుగ బ్రిటిషువారు చేర్పించినారు.

### నానాదేశమహాసభ: హిందూదేశము

నానాదేశమహాసభాసభ్యత్వము వలన హిందూదేశముయొక్క హోదా యేమైన ప్రపంచరాజకీయరంగమునందు హెచ్చినదా యను విషయము నిర్ణయింపవలెను. హిందూదేశమునకు వ్యయ మధికమును ఇంగ్లాండు దేశమునకు ఫల మధికమును గాని, హిందూదేశమునకు లాభమును ప్రయోజనమును బొత్తిగా లేదని కొన్ని సందర్భములవలన స్పష్టమగుచున్నది. గతసంవత్సరమున మాడరన్‌రివ్యూ పత్రికాధిపతి శ్రీయుత రామానందఛటర్జీగారు ఆహ్వానింపబడి నానాదేశమహాసభా వృత్తాంతమును స్వయముగా గనిపెట్టుటకు జనీవాపట్టణమునకేగి ఆసభాచర్యలను దిలకించియుండిరి. ఈమహాసభకు నిజముగా చిత్తశుద్ధి లేదనియు, ఇదివరకే సత్త్వసంపన్నులగు బ్రిటిషు, ఫ్రెంచి, ఇటలీ, జపాను మొదలగు ప్రభుత్వములకు ద్విగుణీకృతముగా బలమును పలుకుబడిని హెచ్చుచేయుచు దార్ఢ్యములేక పేదస్థితిలోనున్న చీనా మొదలగు పూర్వదేశములకు సహాయముగాని, న్యాయముగాని, జరుగుటకవకాశము మృగ్యమనియు వారభిప్రాయమిచ్చియున్నారు. అధికసంఖ్యాకులుగా నున్న శ్వేతజాతులమాట నెగ్గునుగాని ఆసియాఖండవాసులమాట చెల్లుట కవకాశము లేదు. పరదేశాక్రమణవాంఛ యింకను గొప్పప్రభుత్వములను వీడలేదు. కావున మాండేట్సు (Mandates) అను క్రొత్తపేరుతో పరిపాలనా విధానము నేర్పవలెనను మిష చెప్పి వీరు నూతనప్రదేశములను ఆయాప్రజలను ధిక్కరించి తమ యధికారమునం దుంచుకొనుచున్నారు. బ్రిటిషువారు తూర్పు ఆఫ్రికా, మెసపొటేమియా వగైరా దేశములను, ఫ్రెంచివారు సిరియావగైరా దేశములను గ్రహించినారు. ఇట్టి నానాదేశమహాసభలో హిందూదేశమునకేమియు పలుకుబడియుండదని వేరుగ జెప్పనక్కరలేదు. మన దేశము స్వతంత్రదేశము గాక బ్రిటిషుసామ్రాజ్యస్థదేశమగుటచే తత్ప్రతినిధులు స్వతంత్రముగ నేవిషయమును మహాసభలో చర్చకు దెచ్చుటకు వలనుపడదు. దక్షిణఆఫ్రికా, కెనడా ప్రభుత్వములవారు మనభారతీయులపట్ల కలిగించుచున్న కష్టములను అధర్మప్రవర్తనమును బ్రిటిషువారు ఈసభలో విచారణకు రానీయరు.

సంగతి యిట్లుండ హిందూదేశప్రతినిధులను బ్రి టి షు ప్ర భు త్వ ము వా రు ప్రజాభిప్రాయమును దలపెట్టక తృణీకరించుచు తమకు నచ్చినవ్యక్తులను నియమించుచున్నారు. కావున హైందవప్రజాపక్షమున దేశాభిప్రాయమును వాక్రుచ్చుహక్కు వారికి లేదు. ఈసంవత్సరము మనదేశపు ప్రతినిధులకు నాయకునిగ బెంగాల్ గవర్నరుగానుండి ప్రజాందోళనమునకు పాత్రుడై నిష్క్రమించిన లిట్టనుప్రభువును దొరతనమువారు నియమించినారు. సి. పి. రామస్వామిఅయ్యరుగారుగూడ

నొక ప్రతినిధిగ నున్నారు. బ్రిటిషు మంత్రి ఆమోదించి తదనుగుణ్యముగ అనిబిసెంటు గారి ప్రోత్సాహమున పార్లమెంటుసభలో బిల్లును చర్చకై తీసికొనివచ్చుటకు యత్నించుచున్నారు. తత్ఫలిత మెట్లుండునో చెప్ప వలనుగాదు.

స్వరాజ్యమును గోల్పోయి, రాజకీయ రంగమునందుమాత్రము, వెనుకబడియుండెను గాని ఇతరవిషయములలో హిందూదేశమునకు ప్రాముఖ్యము విశేషముగ గలదు. హిందూదేశముయొక్క ప్రకృతిసంపద, నైసర్గికభాగ్యము అపారమైనది. లోకములో నిదియొక ఖండమని చెప్పవచ్చును. సకలసస్యములను పండించుచు, నెల్లలోహరాజములను గనులలో గలిగియున్నది. కొన్ని పదార్థములకు ప్రపంచమంతలో హిందూదేశమొక్కటియె యుత్పత్తిస్థానమై విరాజిల్లుచున్నది. లోకమునందంతటిలోను, మానవకోటికి ముఖ్యాహార పదార్థమగు వరిపంటపండించుటలో హిందూదేశము అగ్రస్థానము వహించుచున్నది. బ్రిటిషు సామ్రాజ్యములో పండింపబడుచున్న గోధుమపంటయంతలోనుదాదాపు 50°/。 హిందూదేశములో నుత్పత్తియగుచు లోకమునకు సప్లయికాబడుచున్నది. ప్రపంచకపు కాఫీపంటలో 73°/。 హిందూదేశము పండించుచున్నది. తేయాకు 58°/。 తయారగుచున్నది. ప్రత్తిపంటలోగూడ హిందూదేశమునకు ప్రధానస్థానము కలదని వేరుగ జెప్పనక్కర లేదు. గోనెసంచులను తయారుచేయుటకు వలయు జనపనార (Jute) ఒక్కహిందూదేశమే యుత్పత్తిచేయుచున్నది. హిందూదేశములో పండింపబడుచున్న వస్తుసముదాయము హైందవప్రజలకే కాక వ్యవసాయసౌకర్యములేని పాశ్చాత్యదేశ ప్రజలకు ఆహారమును సప్లయిచేయుచున్నది. దేశములో క్షీణించిపోయిన పరిశ్రమలన్నియు తిరిగి పునరుద్ధరింపబడుచున్నవి. కావున భావి అభివృద్ధినిగురించి భారతీయులు నిరాశ జెందనక్కరలేదని పాశ్చాత్య రాజకీయ వేత్తలే నుడువుచున్నారు. దేశబంధు చిత్తరంజనదాసు గారికి దృగ్గోచరమైనట్లుఆశియాఖండవాసులు సంఘీభావమును పెంపొందించుకొని లోకాధిపత్యమును కొనసాగింప నుద్యుక్తు లగుచున్న శ్వేతజాతీయుల విజృంభణము నరికట్టు పరిస్థితులు వచ్చినచో, ప్రస్తుత రాజకీయరంగము క్రొత్తరూపమును దాల్చును. నేడు చీనాదేశములో దినదినము జాతీయపక్ష సంఖ్య అభివృద్ధియగుచు పాశ్చాత్య విదేశీయుల పన్నాగములు నిష్ప్రయోజనములగుచున్నవి. చీనాదేశపువిజయము ఆశియాఖండమునందంతను ప్రతిధ్వనించుననుటకు సందేహములేదు.

హిందూదేశమునకు స్వాతంత్ర్యము నెంతవరకు వృద్ధిచేయవచ్చునో సిఫారసుచేయుటకు రాయలుకమిషను నియమింపబడి కొలదికాలమున నీదేశములో తత్కార్యక్రమము నుపక్రమింతురని వార్తాపత్రికలన్నియు చాటుచున్నవి. అఖిలభారతకాంగ్రెసుకమిటీ వారును హిందూదేశమపేక్షించు రాజకీయ స్వరూప మిదమిత్థమని వివరములతో దెలుపు కాన్‌స్టిట్యూషను నొకదానిని తయారుచేయించి రాబోవుకాంగ్రెసు మహాసభలో

చర్చించుటకు గతసమావేశమునందు తీర్మానించియున్నారు. ఈకాంగ్రెసు ప్రణాళిక రాయలుకమిషనువారికి ప్రజాభిప్రాయమును నిశ్చితముగా బోధించుట కనుకూలపడుననుటకు సందియము లేదు. ఈజిప్టుదేశమునకు బ్రిటిషుపార్లమెంటుచే మిల్నరుకమిషను విచారణనిమిత్తము పంపబడినప్పుడు, జగ్లులుపాషా నాయకత్వమున, వాదములను పెంచుకొనక ఆదేశప్రజలు తమనిశ్చితాశయములను వెల్లడిపరచి తుదకు కమిషన్ విచారణను బహిష్కరించి, కృతకృత్యులై విజయముగాంచిరి. భారతీయులుగూడ మతకలహములను, కులకక్షలను రాజకీయ విషయములపట్ల కట్టిపెట్టి దేశనాయకులు స్వీయమనఃస్పర్థల నుపసంహరించుకొని సంపూర్ణైకమత్యభావముతో నీసమయమున ప్రవర్తించినగాని దేశమున కేమియు లాభము చేకూరదు.

---

## సోదరీ సందేశము

శ్రీ శేషాద్రిరమణకవులు

వేదయుగమున శ్రుతులఁ గల్పించి యంత
రస్థమగు భావములనెల్ల రాజసభలఁ
సాటి యశమునుగన్న స్త్రీజాతి నేఁడు
వెనుకఁబడెనయ్యొ విద్యావివేకములను.

కార్యదీక్షయు విజ్ఞానకౌశలంబు
నాత్మవిశ్వాసమును స్వతంత్రాభిరతియు
నాతికెన్నండు తొలఁగెనో నాఁటనుండి
పారతంత్ర్యంబుతోఁ గ్రుంగె భారతంబు.

యముని గెలిచినసావిత్రి ననుకరించి
పేరుగాంచిన కాంత లున్నారుగాని
సత్యవంతునితోఁ బోల్ప సాధ్యమైన
పురుషజాతికిఁ గటకటా కఱవు గలిగె.

మగనిచితి పుష్పశయ్యగా మదిఁ దలంచి
తెంపుమై దూఁక నుఱుకు సాధ్వీపవిత్ర
సాహసాణువె పూరుషజాతికున్న
నస్వతంత్రతకలుగునే హైందవులకు

మతము వేషము భాషయు మాటువడినఁ
బాపకాలంబునను బరివర్తనంబు
నంతరింపని యీమాతృజాతికతన
పురుషజాతికి రాకున్నె పూర్వమహిమ.

భోగపాత్రంబులుగ మనంబునఁ దలంచి
యేఁడువారల నరికట్టు నంతవఱకు
అల్పసత్త్వలు పారతంత్ర్యాభిరతులు
విగతసత్త్వలు పూరుషు లగుట నిజము.

సడలిసీరైన పాండవ శౌర్యపటిమ
ద్రౌపదీపరాక్రమముననె ధన్యమయ్యె
స్వల్పసంతుష్ట పూరుషజాతిపెంపు
శీలవతులగు కాంతల చేతఁగలదు.

సోదరీమాతృదేశ నిస్తులవిభూతి
స్నేహపరిపూతమైన నీచేతగలదు
అతులవిజ్ఞాన మార్జించి యాత్మసదృశ
మహితతేజులఁగనుమ నమస్కరింతు.

# కర్ణాటకము

హిందూదేశమునందలి బ్రిటిషుసామ్రాజ్యమునుగూర్చి
మేజరు ఇవాన్సుబెల్లుగారు వ్రాసిన లేఖలలో 3-వ లేఖ

[3-వ సంపుటము ౧౨-వ సంచిక తరువాయి]

## 3-వ భాగము

వేలూరి రామమూర్తిగారు

ఇందు అజీముద్దౌలా ఒక స్వతంత్రప్రభు వనియు, బ్రిటిషువారి విరోధుడనియు చెప్పబడినది. ఒకరి తరువాత నొకరు వంశపారంపర్యముగ నవాబులు పాలించిన ట్లున్న తెలుపబడినది. ఆతనిహోదాకును, ఆతనిపూర్వుల హోదాకును ఎట్టిభేదమును ఉన్నట్లు లేదు. మఱియు, ఆతడు, ఇరువురికి సంబంధించిన వ్యవహారములలో ఫోర్టుసెంటుజార్జిప్రభుత్వమువారితో సంప్రతించుచుండినట్లుగూడ చెప్పబడియెను. కాని లార్డుహారిసు నవాబు సామంతుడనియు, ఎప్పుడైనను ఆత్మహక్కులను ప్రభుత్వము లాగివేయవచ్చుననియు చెప్పుచున్నాడు.

లార్డుడాల్హౌసీ తనమినిటునందు (౧-వ శీర్షికలో) ఇటుల వ్రాసెను:—"లార్డు వెలస్లీ ఒకచెంత అయోధ్యానవాబు మొదలగు ఇతరరాజులతో సంధిచేయుచు, ఆసంధులు వారితోడను, వారివారసులు, ఉత్తరాధికారులు ననువారితోడనుగూడ చేయుచున్నట్లుదాహరించుచు, యిచట అజీముద్దౌలాతో నొక్కడితోడనే సంధిచేసి, అందు వారసుల, ఉత్తరాధికారుల మాటయే ఉదాహరింపలేదు. అందువలన ఆసంధి అజీముద్దౌలా జీవితేమువరకుమాత్రమే చెందునట్లు ఆతడుద్దేశించెననుట నిశ్చయము." పీలయన, "లార్డువెలస్లీ కారణము లేక ఏపని చేయడు."౧ ఔను, నిజమే: ఒకమోసకృత్యమునకై సంధి గాథపదముల నుపయోగించునట్టివాడు కాడు. వెలస్లీ; బ్రిటిషువారి ఆధిపత్యమును నెలకొల్పుటకై నిశ్చయించి పట్టుదలతో నున్నట్టివాడు;అత్యాశాపరుడు;దర్పవంతుడు. కాని, వాలాజావంశీయులయొక్క హక్కులయెడల తనకుగల గౌరవాదరణములనుగూర్చియు,వారిని "దయాదాక్షిణ్యములతో౨ చూడవలె" నను, అభిప్రాయమునుగూర్చియు అనేకతూర్లు తెల్పుచునే దొరకిన తప్పుడు త్రోవలనెల్ల త్రొక్కి క్రొత్తసంధిలో కొన్నిమాటలను కుత్సితముతోడ చల్లగా జారవిడుచుటవలన ఆవంశము యొక్క వారసత్వపుహక్కును మాయము చేయునట్టివాడు మాత్రము కాడు.

లార్డువెల్లస్లీగారి దృష్టిపథమున రెండుద్దేశము లుండెను. మొదటిదియు, ముఖ్యమైనదియును కర్ణాటకరాజ్యపు సివిలుమిలిటరీపరిపాలనస్వాధీనమగుట. ఈపనిని సాధ్యమైనంత సౌమ్యముగా కానిచ్చి, దానికి పరస్పరాంగీకారముమీదనే జరిగినట్లు పైపూతను పూయుట రెండవది. అజీముద్దౌలాతోగాని, ఆలీహుస్సేనుతోగాని స్వకీయము, లేక జీవితాంతమువరకగుసంధిని చేయుట సాధ్యమని ఆతడు తలంచినట్లు ఎచ్చటను సూచించలేదు. ప్రకటితపత్రముల నిదర్శనమునుబట్టి తెలునంతవరకు ఆతడట్టిప్రయత్నము చేయనైనను ఊహింపలేదు. వాస్తవ

౧. Carnatic Papers, 1860—P. 48.

౨. Wellesley's Despatches, Vol. ii, P. 59; and Carnatic Papers, 1860—P. 33.

మునకు, నబాబుహస్తములనుండి రాజ్యపాలనము లాగుకొనుటకై ఓపికమై పన్నుగడను—మొదట ఆలీహుస్సేను యొక్క ఔరసతను గూర్చి నిష్కారణములగు శంక ప్రారంభమై టిప్పుసుల్తానుగారి రికార్డ్లనుండి బయటకు బలవంతముగ తీయగల్గిన అపరిపాకఫలితము (నబాబులరాజద్రోహపునేరము) వరకు—వేయుచున్నంత కాలము లార్డువెలస్లీ మొత్తముమీద వాలాజావంశపు హక్కులను ధిక్కరింపలేదు. కాని ఏనియమములేకయే, ఆవంశీయులకు ఒక ప్రత్యేకవ్యక్తిని ఉత్తరాధికారిగా సహాయము చేయుటకై[౨] ప్రభుత్వమువారు బాధ్యులుకారని మాత్రము సమర్థించుచున్నాడు. అందులకు ఆలీహుస్సేను యొక్క ఔరసతను ధిక్కరింపగల్గు మరియొక హక్కుదారు ఉండవచ్చుననియు, అప్పుడు ఆలీహుస్సేనునకు మనము సాయమొనర్పవలసి యుండుననియు, అట్టితరిని అతనిపై మనయిష్టవచ్చిన షరతులను మనము విధింపవచ్చుననియు మొదలగు సాకులు చెప్పెను. తుదకు వాలాజావంశము అతనికుమారుడును చేసినట్లు వారికై వారోపింపబడిన ద్రోహమునుబట్టి వారి ఉత్తరాధికారివద్దనుండి చాలినంత హామీకోరుటకు అధికారమున్నదని నెపము చూపెను.

ఆలీహుస్సేనును ఒకపద్ధతికి ఒప్పించుటలో ఏమాత్రమును కష్టమున్నట్లు వారూహింపలేదని స్పష్టము. లార్డువెల్లస్లీకి లార్డుక్లైవు ఇట్లు వ్రాసెను: "ఆలీహుస్సేను తనపుట్టుకనుగూర్చి అనుమానమును, అతని జనకుడని చెప్పబడు నబాబుయొక్క ద్రోహమువలన ఆపాదించిన సింహాసనాధిష్ఠానార్హతయు గల్గిన పరిస్థితులలో తాను రాజ్యమునకు రావలెనన్నచో, తానుఒప్పుకొనితీరవలసెడు ఈ షరతులను నిరాకరించునంతగా బుద్ధిహీనుడై, భ్రష్టుడై పోవునని మీరును, నేనును అనుకొనియుండలేదు."[౩] కాని వాలాజావంశములో నెవ్వరును అతనిహక్కును సందేహించి కాని, అతని ప్రతిపక్షులై కాని లేరు. ఆతడు షరతులను నిరాకరించెను. ఇక కంపెనీవారి పన్నుగడ సరిగా నడువకపోయెను. ఆతడు ఒప్పుకొనియే యున్నట్లయితే, ఏఅపవాదము ఉండెడిదికాదు. అదియునుకాక, అతని పూర్వులపై నారోపించిన ద్రోహపు నేరమున్ను బహిరంగముగ ప్రకటన మయ్యెడిది కాదు. ఆతడు ధైర్యముగ నిరాకరించుటచే లార్డుక్లైవు అజీముద్దౌలాను పోటీగా నిలువబెట్టవలసి వచ్చెను. ఈ అక్రమపు చర్యను వాలాజావంశమువా రందరును అసమ్మతిని దృఢముగా వెలిబుచ్చిరి. అపుడు తనచర్యను సమర్థించుకొనుటకై క్లైవుగారు ఇంతకుముందు నేనుదాహరించిన ప్రకటనను, కావించి "అందు సంధిషరతులను, అతని పూర్వులు సాక్షాత్తుగా భంగపరచుటను గూర్చియు," కర్ణాట రాజ్యమున ఆంగ్లేయహక్కులను కాపాడుటకై "యింకను తగినంత పూచీ" నిచ్చుటకు నబాబు కుమారుడని చెప్పబడు వాతడు (ఆలీహుస్సేను) ఖండితముగ నిరాకరించుటనుగూర్చియు తెలియజేసెను.

టిప్పుసుల్తానుగారి రికార్డ్లనుండి రాజద్రోహపునేరము దొరకక పూర్వము లార్డువెలస్లీ ఆలీహుస్సేను యొక్క పుట్టుకనుగూర్చిన సంశయమును ఊహామాత్రముగ చెప్పినను, అదిసంపూర్ణమునకు దైవవశమున కలసివచ్చెను. ఈనాటకముచివరవరకు ఈసంగతియే ఎల్లప్పుడును ఉదాహరింపబడుచుండెను. ఆలీహుస్సేనునుగూర్చి ఎప్పుడు చెప్పినను, "కొడుకు అని తలంపబడినవాడు" అనికాని, "కుమారుడని చెప్పబడినవాడు" అనికాని యుపయోగింపజొచ్చిరి. లార్డువెలస్లీ ఉత్తరువులపంపిన మొదటి యుత్తరములో చెప్పినట్లే యీనాటకాంతమువరకును,

౧. Ante, P. 62.

౨. నబాబు ఎవరినైనను ఉత్తరాధికారిగ నియమించుచో, అతనిహక్కు వివాదస్థముగాని, సందేహాస్పదముగాని అయియున్నయెడల అట్టివానిని సింహాసనాధిష్ఠితుని చేయుటకుగాని, సాయముచేయుటకుగాని సంధి ప్రకారము పూచీ ఏమాత్రమును కంపెనీపై మోపజాలదు.

౩. Wellesley's Despatches, Vol ii, P.551

ఉత్తరాధికారి యగుటకు అలీముద్దౌలాకే ఎక్కువహక్కుగలదని అదేపనిగ సూచింపబడియెను.౧ ప్రకటితపత్రములయొక్క ధోరణినిబట్టి శ్రీరంగపట్టణములోని పరిశోధనలు అసలు జరిగియుండకపోయినను యీనాటకమే అప్పటికిని జరిగియుండెడిదని తెలియును. మొదట మనము అతనికి తెల్పిన షరతులను నిరాకరించినంతమాత్రముననే అలీహుస్సేనును బహిష్కరించి, అబహిష్కరణమును, అతనిగూర్చి చెప్పబడిన ఆయనార్హతనుబట్టి సమర్థించెడివారము. అలీముద్దౌలాను ఆతనికున్న వారసత్వపు హక్కుప్రకారమే సింహాసనమునం దుంచి, యీమైత్రిసంధిని ఆతనికి మనము కావించిన సాయమునకు ప్రతిఫలముక్రింద విధించెడివారము. లార్డువెలస్లీ పన్నాగములయొక్క న్యాయమును, నైతిక తార్కిక వాదముల పొందికను సమర్థించుటతో నా కేమాత్రమును పనిలేదు. మన విషయమున జోక్యము కలుగచేసుకొను అలీముద్దౌలాకు వారసత్వపుహక్కే ముఖ్యమయిన కారణ వ[illegible]స్లీ సూచించిరి. అట్టివిషయములో ఏబదిఏండ్లు అయినతరువాత సత్యవిరుద్ధముగ ఈ అలీముద్దౌలాకు వారసత్వపు హక్కులు లేనట్లు లార్డుహారిసు చెప్పుటకుగాని, లార్డు వెలస్లీ "కారణములేనిదే ఏదియును చేయుడుకావున," అతడు బహిరంగముగను, ప్రత్యేకముగను దృఢపరచి నూతనజీవమిచ్చిన ప్రాతసంధులలోనికొన్ని భాగములను కపటముగను, గూఢముగను రద్దుపరుప నెంచియుండునని లార్డుడాల్హౌసీ యుక్తిగా సూచించుటకుగాని వీలులేదు.

అయితే, అలీముద్దౌలా, ఆతని పూర్వులయొక్క హోదా ఆస్తి రాజ్యములందు ప్రతిష్ఠాపింపబడుటవలనను, ప్రాతసంధులలో ననుకూలమై స్నేహపూర్వకమగు షరతులను నూతనాధికార మిచ్చి స్థిరపరుచుటచేతను అలీముద్దౌలాయొక్క వారసుల వంశపారంపర్యపు హక్కులకు పూచీపడునట్లు ఇంతవరకును చూపి, అప్పటి[illegible]ములలో ఆవారసత్వపు హక్కులకు విరుద్ధ[illegible] సూచనగాని, జాడగాని దొరకునేమోయని వెదకి[illegible] అట్టివేవియు కాన్పింపలేదు. ఇక, అప్పటి సమకాలికపు పత్రములలోను, ఇటీవలి పత్రములలోను ౧౮౦౧-వ సంధితరువాత, నవాబుయొక్క హోదా వంశపారంపర్యముగా నెంచబడెనని రూఢియైన స్పష్టమగు ఉద్యోగీయపు టంగీకారములే యున్నట్లు చూపించెదను.

ఈ పనిచేసితీరవలయునను బాధ్యత నాకేమియును లేదు. ఏలన "కారణము లేకుండా ఏపనియుచేయని" లార్డువెలస్లీయే "వారసులు, ఉత్తరాధికారులు" అనియొసిమాటలను సమ్మతించునట్లు లేకపోవుటవలన అక్రమమును, రహస్యమును అగు కొంతఅవకాశము తీసికొనవలెనని ఎంచియున్నప్పటికి, లేక యింతకంటెను ప్రశాంతత చేకూరిన అనుకూలపుసమయమున ఇకముందు రాబోవు గవర్నరుజనరలు ఈ అవకాశమును ఉపయోగించి తనమనోరథమును తీర్చుకొనవలెనని తలంచినప్పటికి; అట్టిఅవకాశము స్పష్టముగా ఏ అంతర్జాతీయన్యాయశాస్త్రముప్రకారముగాని, ఏరాజనీతి న్యాయప్రకారముగాని సమర్థనీయము కాదు. ఇటుల డాల్హౌసీ వెల్లస్లీపై ఆరోపించవనింద న్యాయముగాదు. కాని ఒకవేళ లార్డువెలస్లీ అట్టి నిందకుపాత్రుడన్నను, అతను కావించినది నిష్ప్రయోజనమని ఎంచవలెను. పోనీ, వెనుకటి సంధులయందలి అనుకూలపుషరతులు ఈ క్రొత్తసంధియందు "పునరుద్ధరింపబడి, స్థిరపరుప"బడకపోయినను, ఈష్టుయిండియా కంపెనీవారికిని, నవాబుగారికిని (వంశ

౧. ఉమ్దత్ ఉల్ ఉమ్రా తనకుమారుడని చెప్పుఆవ్యక్తియొక్క పుట్టుకను సంబంధించి అనేకములగు నిందలున్నవి. ఏమైననేమి, యీయువకునిజనని యొకతక్కువజాతిదనియు, నవాబు ఆమెను పెండ్లిచేసుకొననేలేదనియు స్పష్టము. అమీరుల్ ఉమ్రాయొక్క కొమరుని (తండ్రి రాజ్యమునకు వచ్చిన అలీముద్దౌలా) యొక్క హక్కులకు ఈతడు సింహాసనము నధిష్ఠించుటవలన గొప్పఅపాయమని, అలీముద్దౌలా కున్న హోదానుబట్టి ఆతనియందు గౌరవముగల యెల్లరకును తోచును" అనియు, యింకొకసందర్భమున "నవాబుకుమారుడని సామాన్యముగ వ్యవహరింపబడువాడు" అనియు నున్నవి. (Wellesleys Despatches,Vol.ii, P.249-251.)

"ఏదైనను వారసత్వపుహక్కు ఉన్నట్లయితే అది అలీముద్దౌలాకే చెందుననియు, ఆ నవాబు కుమారుడని చెప్పబడు అలీహుస్సేనును రాజ్యమునకు రానిచ్చుటవలన మహమ్మదీయులలో అసహ్యతగలిగి అట్టిది జరుగకుండుటకు ప్రయత్నములు జరుగవలెనియు గవర్నరుజనరల్ తలంచెను." (Carnatic Papers, 1860 P. 27.)

మునకును) ఇదియే మొదటిసంధియనుకొన్నను "అతని పూర్వులహోదా, ఆస్తి రాజ్యములందు అజీముద్దౌలాను ప్రతిష్ఠాపించు"ననుమాటలే నైజాము, డిల్లీ పాదుషా, బ్రిటిషుచక్రవర్తులచే నొప్పుకొనబడి, కంపెనీవారి రాజకీయపుచర్యల కంతకును ఆధారభూతమై, కంపెనీవారి యొక్క రాజ్యమునకంతకును ప్రధానకారణమై, స్వతంత్రప్రభువులహోదాగౌరవములయొక్క సహజలక్షణమై తనరునట్టి వంశపారంపర్యపుహక్కు ఉన్నదను టకు చాలినంత యంగీకారములై యున్నవి. కాని నిజమునకు, అజీముద్దౌలాయొక్క వారసులకు హక్కును లేకుండ జేయవలెనను నుద్దేశము లార్డువెలస్లీ కేమాత్రమును లేదు.

వెలస్లీప్రభువు కోరినదెల్ల కర్ణాటకముయొక్క సివిలుమిలిటరీపరిపాలనమును శాశ్వతముగ తమహస్తగతము కావించుకొనుట. ౧౭౯౨ సం.రం సంధివలన తమకు నేర్పడిన హక్కుల నాధారముగా గొని వాలాజాగారును, ఉమ్దత్ ఉల్ ఉమ్రాయును గట్టిపట్టుదలతో నామార్పునకు ఒప్పుకొనరైరి. వారియుత్తరాధికారులతో నూతనసంధి చేసుకొనుసందర్భమున ఈ షరతులను విధించుటకు బహిర్గతమయినదని చెప్పబడినవారల ద్రోహపరిశోధనము తగినకారణముగా వెలస్లీప్రభు వెంచెను. ౧౮౦౧ సం. సంధివలన లార్డువెలస్లీ కోరినదెల్లనంతియే. వాలాజావంశముపై విధింపబడిన శిక్షయంతయు నంతియే.

ప్రాతసంధులలోని అనుకూలపుషరతులకు పునః శ్శక్తి నిచ్చి స్థిరపరచుటనుగూర్చి తెలుపు రెండవషరతు యొక్కబలము ఆసంధిలో నీపదములు లోపించినను తగ్గదు. లార్డువెలస్లీ రహస్యముగా మనస్సులో నెంతదాచుకొనినను, అందువలన ఈసంధిలోని మొదటిషరతు వలన అజీముద్దౌలాకు కలుగజేయబడినట్టియు, ఇంతవరకు కర్ణాటకనవాబులైన అతనిపూర్వులవైనట్టియు హోదా రాజ్యములయొక్కబలముతగ్గుటగాని, మార్పుచెందుటగాని కానేరదు. అట్లు మనస్సులో రహస్యముగా దాచియుంచినదేమైన నున్న యెడల, ఆతనియొక్క వ్రాతలలోనేమి, ఉత్తరములలోనేమి, అర్థానియొక్క జాడగాని, సూచనగాని యుండుకరదైనను కావరాదు ఒకవేళ అతడు స్వయముగా వ్రాయకున్నను, నిశ్చయముగా అతడు చూచి సమ్మతించినదియొక్క పత్రమునందు అజీముద్దౌలాకు ౧౭౯౨ సం.రం సంధివలనగలిగిన లాభములన్నియు అతని వారసులకును చెందజేయబడు నని స్పష్టముగా వ్రాయబడియున్నది.

ఇందు నే నుదాహరించిన పత్రము ౧౮౫౮లో నే ప్రకటింపబడియెను. డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్‌గారి సప్లిమెంటరీ డిస్పాచియందు ౧౭౯౮ నుండి ౧౮౦౫-వ పుటవరకు నున్నది. అయ్యది ౧౮౦౬ లో పార్లమెంటుసమావేశము పూర్తియయినతరువాత హిందూదేశము నందలి వెల్లస్లీ ప్రభువుయొక్క ప్రభుత్వమునుగూర్చి యాదాస్తు (Memorandum) గా వ్రాసినదట. ఇండియాహౌసు, బోర్డు ఆఫ్‌కంట్రోలు కార్యస్థానములోని సరియయిన తేదీలు, మొత్తములు, వేసి పూర్తిచేయబడినట్లు తెలియుచున్నది. అర్ధానిని వెల్లస్లీ ప్రభువుయొక్క పరిపాలనా సక్రమత్వనిరూపణార్థమును, మంత్రివర్గము యొక్కవిషయపరిచయార్థమును వెలస్లీసోదరుడగుడ్యూక్ ఆఫ్ వెల్లింగ్‌టన్ తయారుచేసెను. ఆపత్రమును వెలస్లీ ప్రభువు పరిచూచి, సావధానాంగీకారము ఇయ్యనిదే అతడు తయారుచేసెననుట, అసంభావ్యమేకాక అసాధ్యముకూడను. ఇందలివ్రాత పెక్కుప్రదేశములందు వెల్లస్లీయొక్కశైలిని బోలియున్నది. అతడు స్వయముగా వ్రాసి సంతకము చేసిన సెంటుప్రమాణమని మనము తలంతుమో అంతగా అందలివాక్యములు అతని యభిప్రాయము నుగ్గడించుచని మనమెంచుటలో తప్పేమియు లేదు.

ఉమ్దత్ ఉల్ ఉమ్రాగారి మూర్ఖపుపట్టుదల వలన గలిగినకష్టములగూర్చియు, టిప్పూసుల్తానుతో జరిపిరని చెప్పెడు ఆయుత్తరములవలన నిర్బంధము చేయుటకై చిక్కినఅవకాశమునుగూర్చియు వివరించి, అతడు కర్ణాటకమునందు కల్గినపరివర్తనముగూర్చి యిట్లు వర్ణించినాడు:—"'ఆసంభావిత పుత్రునికి' శ్రీరంగపట్టణమందు కనుగొన్న విషయము (టిప్పూసుల్తానునకు వాలాజా, అతనిపుత్రుడు జాబులువ్రాసినట్టి విషయము)గూర్చియు, ఈవిషయ పరిశోధనలపై బ్రిటిషువారికి గల్గిన అభిప్రాయములనుగూర్చియు, యికముందు కర్ణాటకమునందు వారుప్రయోగింపనెంచు పద్ధతులగూర్చియు తెలియజేసిరి.

కాని క్రొత్తపద్ధతిని అతఁడొప్పుకొనక నిరాకరించెను. ఒకవేళ అట్టిపద్ధతు లేర్పడి అతఁడే రాజ్యమునకువచ్చినను, అతఁడు తనజనకుని ఉత్తరాధికారి కాగలహక్కు ఇంకను నిస్సందేహము కాకపోవుటచేతను, కర్ణాటకమందు ప్రశాంతి యేర్పడుటకై నవాబువంశమువారు ఆక్రొత్తఏర్పాటును ఒప్పుకొనితీరవలసియుండుటచేతను లార్డుక్లైవు, ఆలీహుస్సేనును త్రోసిపుచ్చి, మహమ్మదాలీ రెండవపుత్రుని కుమారుఁడును, ఉమ్దత్ ఉల్ ఉమ్రాయొక్క తమ్ముని తనయుఁడును అగు అజీముద్దౌలాను ఆస్థానమునందుంచ నిశ్చయించెను. తుదకు ఈ అజీముద్దౌలాయును, అతని వారసులును ఆరాజ్యమునికి రాఁదాయమున నయిదవ పాలును చేకొనుచు, తమ హోదాగౌరవములను గలిగియుండునట్లేర్పాటు చేయఁబడెను.

ఈరీతిగ క్లిష్టమును, స్పష్టమును అయిన యీ ప్రకటనమును చూచినచో వెల్లస్లీయొక్క యుద్దేశమును గూర్చి సందేహించుటకు కవకాశ మేమాత్రమును ఉండఁజాలదు.

అజీముద్దౌలా రాజ్యమునకువచ్చి మూఁడుసంవత్సరము లాయెను. అప్పటికింకను ఆ ౧౮౦౧సంధియొక్క మూలోద్దేశములును, ఆసంధికి మొదటగా నుద్దేశింపబడిన అర్థములును అప్పటి పెద్దయుద్యోగస్థుల మనస్సులో నింకను స్పష్టముగ నిలిచియుండును. అప్పటి మదరాసు గవర్నరు లార్డువిలియంబెంటిక్ అజీముద్దౌలా కొకజాబు వ్రాయుచు, సందర్భవశమున మామూలుపద్ధతిగా నవాబుగారిహోదాయొక్క వంశపారంపర్యపు లక్షణమును సూచించుచు, "మీరు కాకపోయినచో, సెయిఫ్ ఉల్ ముల్కుగారి పెద్దకుమారుఁడు హక్కుదారుఁ డయియుండును. అట్టి అతనికి ఈవలయు పింఛనును తగ్గించుట నా కిష్టము లేదు." అని వ్రాసెను.

అజీముద్దౌలా ౧౮౧౯-వ ఆగస్టు ౯-వ తేదీని మరణించెను. అతనికి కొందఱు పుత్రు లుండిరి. వారిలో నవాబు అజముజా ప్రథములు. ౧౮౧౯ అక్టోబరు ౨౦న గవర్నరుజనరల్ కు మద్రాసుగవర్నరు ఇట్లు వ్రాసెను: "గవర్నరుజనరల్ గారును, వారికార్యనిర్వాహకవర్గమువారును ఇదివరలో ౧౮౦౧ లో నవాబుతో మనము కావించినసంధియందు కర్ణాటకరాజ్యసింహాసనము తనకును ఔరససంతతికి కూడ చెందునట్లు రూఢిచేయబడియె నన్న యంశమును మీరు తెలిపియున్నచో చాలా బాగుండెడిది. ఆసంధి కావింపబడిన యుద్దేశమునుబట్టియు, అద్దానియొక్కయు, ఆకాలమునందే వేరొకచో కావింపబడిన ప్రకటనలయొక్కయు ధోరణినిబట్టియు మేముకూడ అట్టిఅభిప్రాయమునే పడుచున్నాము. ఇప్పుడు నవాబు అజముజాగారు ఆసంధియందు పాల్గొనినట్లే రొంపలసియుండుటచే ఆసంధియొక్క షరతులను అంగీకరించుచు లాంఛనముగ నొకపత్రము నిచ్చు టుచితమని తలంచుచున్నాము."౧ అతనికి జవాబిచ్చుచు గవర్నరుజనరలగు మార్క్విసు హేస్టింగ్సు, "౧౮౦౧ లో అతని తండ్రితో కావించిన సంధియందు ఈతఁడుకూడ 'క్రియకు' పాల్గొనె"నని౨ తోఁచుటచే అట్టిపత్రముగాని, క్రొత్తసంధిగాని అనవసరమని వ్రాసెను. అందుచే ౧౮౨౦ ఫిబ్రవరి ౩-వ తేదీని అజముజాను సింహాసనమెక్కించిరి. "అతఁడు కీర్తిశేషుఁడగు తనజనకునికి వంశపారంపర్యపు వారసుఁడై సింహాసనమెక్కినందులకు" గవర్నరాతని నభినందించెను.

౧౮౦౧ సం. రం సంధికి తరువాత జరిగిన యీ వ్యవహారమును గూర్చి డాల్హౌసీప్రభువు కావించిన వ్యాఖ్యానము కేవలము అసత్యము, కుత్సితమును అని నా అభిప్రాయము. అతఁడు (తనమినిటులలో ౯-వ సీరిస్ యందు) "అజీముద్దౌలాగారి మరణమునకు వెనువెంటనే ౧౮౦౧ సం. రం సంధిని పునరుద్ధరింప లేదు. అటుతరువాత ఎప్పుడుగాని అట్లు తిరిగి చేయలేదు. అంతకు పూర్వ మొక సంవత్సరమున ఇండియాప్రభుత్వమువారు అద్దానిని పునరుద్ధరించుటకు నిరాకరించిరి. అందుచే ౧౮౦౧ సం. రం సంధి అమలులో లేదు. అజీముద్దౌలాగారి మరణానంతరం ఆసంధి రెవరిని బాధింపనేరదు."౩ అని వ్రాసెను. ఆసంధి పునరుద్ధరింపబడలే దనుట నిజము.

౧. Carnatic Papers 1860, P. 35.
౨. Ditto, P. 40.
౩. Ditto, P. 48.

అట్లు కావించుటకు ఇండియా ప్రభుత్వమువారు నిరాకరించుటయు నిజమే. కాని, ప్రభుత్వమువారు డాల్హౌ [illegible]లంఛినట్లు, ఈసంధిని పునరుద్ధరింపకుండుటకు కార[illegible], ఆసంధి చెల్లకూడదనియు, ఇప్పుడు చెలామణి కావించుటకు ఇష్టము లేదనియు కాదు; అది యింకను అమలులోనున్నట్లు వాకొంచుటచేత మఱియు డాల్హౌసీ చెప్పినట్లు, ఆసంధి మహమ్మదాలీగారికిమాత్రమే చెందుటచేతకాదు: ఆతని కుమారుడు ఉత్తరాధికారి (అగు అజీముజా యీ రాజ్యము నధిష్టింప నంగీకరించినంతమాత్రమున) క్రియకు ఆసంధియందు పాల్గొనినవాడగుటచేత అనవసరమని లేదని అసంగతము, నిష్ప్రయోజనము అగుటచేత గాదు: ఇదివరలోనే అమలులో నుండుటచే పునరుద్ధరించుట అనావశ్యకమని. ఆ అగ్రజుడు కూడ తనతండ్రి చేసుకొనిన సంధిలో పాల్గొన్నట్లేయని లార్డుహేస్టింగ్సుగా రుపయోగించిన యీపదములు అజీముద్దౌలావంశముయొక్క సమష్టిహక్కు బాధ్యతలనుగూర్చి, అందు ముఖ్యముగ కుటుంబయజమానియు, ప్రతినిధియు అగు నతని ప్రత్యేక బాధ్యతలను గూర్చి, తెల్పును. అట్లు కానిచో ఆపదములయం దర్థము లేనేలేదు.

౧౮౫౫లో జరిగిన వ్యవహారమునకు లార్డుహారిసు గూడ అపార్థము చెప్పుచున్నాడు. "అజీముద్దౌలావరకే యీసంధి సంబంధించినది. ఈవిషయము మదరాసుప్రభుత్వమువారికి ౧౮౫౫ లో అంతనిస్సందేహముగ తెలిసియుండుటచేతనే వారు అజీముద్దౌలా మరణానంతరము ఇండియా ప్రభుత్వమువారికి వ్రాయుచూ, ఆసంధినిబట్టి ఆనబాబుగారి యుత్తరాధికారి నెవ్వరిని ఆసింహాసనమెక్కుటకైనా నంగీకరించు నధికారము తమకు ఇండియాప్రభుత్వము ఇవ్వలేదని తెలియజేసిరి."[౧] అని అతడు వ్రాసెను. (౧౩-౧౮ శీర్షిక మినిటు). వారు అప్పుడు ఇండియా ప్రభుత్వమువారికి తెలియజేసినది సరిగా [illegible] కానేకాదు. ఈరెండుప్రభుత్వములవారికి జరిగిన ఉత్తరప్రత్యుత్తరములనుండి సరియయిన వాక్యములను నిదర్శనముగా వీరిద్దరును చూపలేదు. పోనీ, మదరాసుప్రభుత్వమువారట్లు వ్రాసిరని వీర నెడిమాటలను బట్టియయినను వాలాజా తంజీయులలో నెవరైన నొకరు చనిపోయినననబాబుగారివారసుడు కావచ్చు ననువిషయమునుగూర్చి మదరాసు ప్రభుత్వమువారుగాని, ఇండియాప్రభుత్వమువారుగాని సందేహించినట్లు లేదు. అనగా రాజ్యపు వారసత్వమునుగూర్చి సందేహమే లేదు. కాని మదరాసు ప్రభుత్వమువారు, ఎవరు రాజ్యమునకు రావలెను, ఏపద్ధతిమీద రావలెను అనిమాత్రమే అడిగిరి. ఆవంశములో ఫలానివారిని నిర్వివాదముగ ఉత్తరాధికారిగా నంగీకరింపు నధికారము తమకు ఈబడలేదనిరి. అందువలననే యిండియాప్రభుత్వమువారి యుత్తరువుల ను కోరిరి. నబాబును ఏర్పరుచుటలో వారు దయాదాక్షిణ్యములను చూపుటనుగూర్చి ఆయుత్తరములం దెక్కడను కానరాదు. ఆహోదా వంశపారంపర్యమైన దగునా కాదా యనువిషయమున యిరుప్రభుత్వములకునుసందియమే మాత్రమును లేకుండెను. కాని ఉన్న సందేహమెల్ల నొక్కటియే: అదియేమన, ఆవంశములో నొకనబాబు [illegible]యినంతనే మఱియొకరు, "ఆపూర్వపు సంధిషరతులను ఒప్పుకొనుచు, ఒకపత్రమును వ్రాసియిచ్చిరయే రాజ్యమునకు వచ్చునట్లు"[౨] ఏర్పరుపదగినహక్కు ౧౮౦౧ లోని వ్యవహారమునుబట్టి బ్రిటిషు ప్రభుత్వమువారికిగలదా యనునదియే. ౧౮౦౧ సం. ౩౧ సంధివలన ఆవంశమునకు హక్కుగలసంగతినిగూర్చి మద్రాసుప్రభుత్వమువారు అనుమానింపలేదు. కాని ఔరససంతతియాతడే రాజ్యమునకు రావలెనా, లేక ఆసంధిని పునరుద్ధరింప నక్కరలేకయే, అతడును ఆతనిజనకునివలెనే ఆసంధిషరతులచే బద్ధుడగునా యనియే సందియము వొడమెను. కాని ఇండియాప్రభుత్వమువారికిమాత్ర మట్టిశంకలు లేక, ౧౮౦౧ సం. ౩౧ సంధి పూర్ణముగా అమలులోనే యున్నదని నిరాఘాటముగా తెలిపిరి. తదనుసారముగ, చనిపోయిన నబాబుగారి జ్యేష్ఠపుత్రుడే రాజ్యమునకు వచ్చెను. ఆతని (అజీముద్దౌలాయొక్క) కుమారుడే మరియొకడు యథావిధిగా నిప్పుడు రాజ్యమునకు రాగోరుచున్నాడు. అతని నెట్లు త్రోసివేయగల్గుదురు? అగ్రజుడు, ఇంటికి పెద్ద యయినంతనే,

౧. Carnatic Papers, 1860—P. 10.
౨. Carnatic Papers, 1960—P. 35.

ఆసంధియందెట్లు పాల్గొనినవాడయ్యెనో ఆతనివెనుకయింటికి పెద్దయయిన ఆతని తమ్ముడును అటులనే కావలెను.

అజముజానవాబు ౧౮౨౫ నవంబరు ౧౨ న చనిపోయెను. ౨౩ డిసెంబరునాడు అజముజాయొక్క కొడుకగు నవాబు మహమ్మద్ గౌస్ ఖాన్ ఉత్తరాధికారియని ప్రభుత్వము ప్రకటించెను. ఈసందర్భమునందుకూడ దయాదాక్షిణ్యము మాట రేమియు లేదు.

౧౮౨౯ జనవరి ౧౪-వ కోర్టు ఆఫ్ డైరక్టర్లు మదరాసు ప్రభుత్వమువారికి ఒక యుత్తరము వ్రాసిరి. అందు, "ప్రస్తుతనవాబు మృత్యనంతరము తరువాతివారసుడు"[౨] అజీముజా యగునను విషయము నాధారముగాగొని, మదరాసు ప్రభుత్వమువారు కావించిన కొన్నిపనులకు వారు సమ్మతించిరి. బ్రిటిషు ప్రభుత్వమువారితో ఈమధ్య నాతడు కావించిన యుత్తరప్రత్యుత్తరముల ...మున ఆతనికి ఏర్పడిన హోదానుబట్టియు, ప్రస్తుతనవాబుగారితో వారికిగల సంబంధమున్ను "ఆతనితరువాతరాజ్యమునకురాగలస్థానమునందుండుటనుబట్టియు"[౩] ఆతని పేరును న్యాయస్థానాధికారముమండి తొలగింపబడిన పెద్దమనుష్యులపేర్ల జాబితాలో గవర్నరు లార్డు...లుగారు ౧౮౪౩ సం.రంలో చేర్చిరి. మహమ్మద్ ఘౌస్ ఖాన్ నవాబుగారి మరణమునకుపూర్వము, ఉద్యోగపురీత్యాను,ఇతరత్రమకూడ, ఈతడు రాజ్యమునకు రాదగినవారసుడని అందరును ఆదరించిరి. గతనవాబు చనిపోవునరకును తనవారసత్వపు హక్కునకు అభ్యంతరము కల్గునని అజీముజాకు ఎవ్వరును తెలుపలేదు. అంతవరకును వంశపారంపర్యపు హక్కు గలదనియే, తాను నవాబు వలదుననియే తలంచియుండెను. మహమ్మద్ ఘౌస్ నవాబుగారు ౧౮౫౫ అక్టోబరు నె. ౭-వ మృతినొందెను. ఆతనిపినతండ్రియు, అజీముద్దౌలా నవాబుగారి రెండవకుమారుడును అయిన అజీముజా మహమ్మదీయ న్యాయశాస్త్రము ప్రకారము (ఇంగ్లీషున్యాయశాస్త్రములోవలెనే) తన అన్నకుమారుని ఉత్తరాధికారినని వాదించుచున్నాడు. ఆతని నెట్లు త్రోసివేయగలరు? తనతండ్రితోనే పరిష్కరింపబడిన ౧౭౯౨ "సంధి స్థిరపరచుచున్న" ౧౮౦౧ సం. సంధిషరతులనుబట్టి రాజ్యాగ్రజుడనని వాదించుచు, కర్ణాటకమునకు శాస్త్రరీత్యా ప్రభువు, "న్యాయ... ఉత్తరాధికారియు" నైన అజీముజాను ఈస్టిండి... కంపెనీ ఎట్లు వదలించుకొనగలదు?

౧౮౦౧ సం. సంధి అయినతరువాత ఏబది నాలుగేండ్ల యీమధ్య వంశపారంపర్యపుహక్కును ఆ వంశము వదలుకొనను లేదు, కోల్పోవను లేదు సరిగదా, ఎవ్వరు 'లేదు' అని ఆక్షేపించియైనను ఉండలేదని నేను ఈపైన నిరూపించియున్నాను. గవర్నరు జనరులలో లార్డువెల్లస్లీ మొదలుకొని లార్డుడల్హౌసీవరకును,మదరాసు గవర్నరులలో లార్డుక్లైవుమొదలుకొని హారిసువరకును అందఱును ఈవంశపారంపర్యపుహక్కును ఒప్పుకొని సమర్థించియుండిరి.

ఇక, వాలాజావంశము వారు తమకర్ణాటక రాజ్యస్వాతంత్ర్యప్రభుతను ఒకరిపరము చేయనులేదు, బ్రిటిషుగవర్నమెంటు సంపాదింపను లేదని నిర్ధారించెదను. ౧౮౦౧ సంధివలన ఏరాజ్యభాగమున్ను వారిరాజ్యమునకు చేర్పబడలేదు. స్వాతంత్ర్యప్రభుత్వము కంపెనీ స్వాధీనము కావింపబడలేదు. మార్పబడినదల్ల సివిలుమిలిటరీపాలనమే. ౧౮౦౧ సం. రం సంధివలన రాజ్యభవనమునకు మినహా పాలనాధికారముఅంతయు వారివంశము నుండి తొలగింపబడినది. ౧౮౦౧ సం. రం సంధివలన గొప్పమార్పు గావింపబడినను, అయ్యది ఆసంధిషరతులలో నుదాహరింపబడినదానికి మించి కావింపబడలేదు. ఇట్టి షరతులను గల్గినసంధి యిది యొక్కటియే కాదు. ౧౮౦౧ లో నవాబు అజీముద్దౌలా కంపెనీకి తనకర్ణాటకరాజ్యముయొక్క "సివిలుమిలిటరీ పాలన"మంతయు నిచ్చివేసినట్లే, ౧౮౫౩ లో హైదరాబాదు నైజాము, బీరారును, తదితరములగు కొన్నిపరగణాలను బ్రిటిషు ప్రభుత్వమువారి "ప్రత్యేకపు పరిపాలనకై" యిచ్చి

---

౧. Ditto, P. 15.

౨. Ditto, P. 9.

సెను.౧ ఈరెండుసంవత్సరములయందును అంతటితో వారివారి భూభాగములను ఇచ్చివేయుటగాని, రాచకీయపుహక్కులను వదలుకొనుటగాని జరుగలేదు. బీరారు నవాబేనే, కర్ణాటకమునుగూడ ఒకట్రస్టుగా౨ (ప్రత్యేకపాలనకై, లేక యొకనియమిత కాలోపయోగము నిమిత్తమై నమ్మకముమీద స్వాధీనము చేయబడినదిగా) కొన్ని షరతులమీద పొందితిమే కాని సర్వహక్కులతోను పొందలేదు. ఇప్పుడు మనము బీరారును ఏలుచున్నట్లే కర్ణాటకమునుగూడ ఒకట్రస్టుగా నేలుచున్నామే కాని యింకేషరతులపైనను గాదు. అట్టి షరతులేవియైన నున్ననో, అవి ఏవి?

౧౮౬౧ సం. రమునుండి ఇప్పటివరకును కర్ణాటకమునంతనుగాని, అందలి యొకభాగమునుగాని ఏవిదేశీయ ప్రభుత్వమునకును స్వాధీనము చేసియుండుటకు వీలులేదు. బీరారును ఎట్లు స్వాధీనము చేసియుండజాలమో అట్లే ...డు కర్ణాటకమునుగూడ స్వాధీనము చేయజాలము. ...యప్రభుత్వమునకును; ఆరాష్ట్రపాలనమునకు సంబంధించిన హక్కులు ఇవ్వజాలము. బ్రిటిషుప్రభుత్వము ఎప్పుడైనను తనకు హక్కు కాగలదని నిరూపించినదని కాని, వాదించినదనికాని చెప్పజాలము. ఏబదిఏండ్లు అవిచ్ఛిన్నపు సివిలుమిలిటరీ పరిపాలనము చేయుటవల్ల తనకును, కర్ణాటకస్వాతంత్ర్యప్రభువునకును ఎట్టిసంబంధము గలదో తెలుసుకొనజాలనంత గ్రుడ్డిదై యున్నది కంపెనీ. అతిముద్దులాన బాబున్ను, ఆతని పుత్రుడును, పౌత్రుడును, ఈస్టుఇండియాకంపెనీవారి పెన్షనుదారులు కారు, మిత్త్రులు.

లార్డుహారిసు తనమినిటులో తుదకిట్టి ఆశ్చర్యకరమగు అభిప్రాయమును వెలిబుచ్చినాడు: "ఆయిరుపక్షములు ఫలాని ఫలానిహోదాయందున్నవని నిర్వచించుట కొంచెముకష్టమేమో కాని, ఆహోదాలు వ్యవహారములో ఎట్టివైనదిమాత్రము నిస్సందేహముగా తెలుపవచ్చును. గౌరవనీయమగు ఈస్టుఇండియాకంపెనీ సర్వాధికారియై యుండ, వాలాజావంశము సామంతస్థితియందుండెను."౩ ఆసర్వాధికారిఅను సంధిగ్ధార్థకపదమువల్ల కంపెనీవారి రాజ్యాధికారమును, దేశపుమొత్తముమీదపలుకుబడియు, వాలాజాబాబుగారి పాలనాంతకాలమునకు ఆనబాబుగారి యధికారముపైగూడ అధికమైనంతగా వృద్ధిపొందినదనే అర్థము సూచింప నాతడుద్దేశించియున్నట్లయితే, సరియే; కాని నే నూహించినట్లుగా, కంపెనీ తానొకసర్వాధికారప్రభువై, నబాబును ఒకసామంతునిగ, తనపాలెగానిగ నుండు నీచస్థితియందుంచె ననుఅర్థము ఆపదమువల్ల లార్డుహారిసు సూచింప నెంచినచో అది కేవలముతప్పు.

(సశేషము)

౧. Parliamentary Papers, Nizam's Debts, 1854, P. 144. ౧౮౮౩ లో సింధియాకూడ కొన్నిపరగణాల నీవలెనే యిచ్చివేసెను. Vol. of Treatises 1856; P. 92.

౨. ౧౮౦౧ జూలై ౩౧-న లార్డుక్లైవు బహిరంగప్రకటనయందు ఈ మాటలనే యుపయోగించెను: "ప్రస్తుతపు ఒడంబడికనుబట్టి కంపెనీయొక్క పరిపాలనమునకు మార్పబడిన యీ అనతిక్రమణీయపుట్రస్టును చేకొనుచు, కంపెనీపరిపాలనమునకు సంతోషముతో, ఏమాత్రము అరమరలేకుండ, విధేయులై వర్తింపవలయునని కర్ణాటకరాజ్యప్రజను గవర్నరు కోరుచున్నాడు." — Carnatic Papers 1861, P. 105.

౩. Carnatic Papers 1860, P. 12,

# ఇల్లాలి వేడుకోలు

మంగిపూడి వేంకట శర్మ గారు

సంగీతంబున సాహితీగరిమ మించఁ నేర్చునో చాతురీ
రంగల్లీలల సౌకుమార్యమున మీరఁ గల్గునో రూపరే
ఖంగందర్పకళారహాస్యసరసజ్ఞ ప్రజ్ఞలఁ గెల్చునో
బంగారంబని దానిఁగూడుదురొ? చెప్పఁ రాదె ప్రాణేశ్వరా!

కంగారేటికి నేను చెంగటికి రాఁగఁ లేచిపోఁజూతు రీ
బంగారంబునుబోలు కాపురమెటుల్ పాడయ్యెనో చూడుఁడీ
శృంగారంబుల రాశియంచు మదియోజింపంగ బోలుఁగా గటా!
యంగారంబులరాశి వేశ్యపయి మీ కాశేల ప్రాణేశ్వరా!

ఎదురాడఁ గద మీకు నెన్నఁడును న న్నేమన్న మీ కంటికిఁ
పదరానఁగల వేశ్య నెల్ల గవయఁ సైరించితిఁ గాదె మీ
పదరాజీవములొత్తి నిచ్చలు మహాభాగ్యంబుగా నెంచితిఁ
గద రారమ్మని యొక్కమారయిన క్రీగంటఁ నన్నుఁ జూచి భా
వ దురాశాజనితాప తాపమును దీర్పఁ రాదె ప్రాణేశ్వరా!

ధనముల్ పోయెను పోయె జీవధనముల్ ధాన్యమ్ములుఁ వస్తువా
హనముల్ పోయెను దివ్యఖండములు మాన్యక్షేత్రముల్ పో
యెను లక్ష్మీనిలయంబు దివ్యభవనంబీపాటికైనఁ ధనాం
గనలఁ మానఁగ బుద్ధిపుట్ట దిది నాకర్మంబె ప్రాణేశ్వరా!

వదనం బెత్తి మెఱుంగ రెన్నఁడును నేవామాక్షి కన్పించినఁ
బెదవుల్ విప్పి మెఱుంగ రెన్నఁడును నేబింబోష్ఠి ప్రశ్నించినఁ
బదముల్ నిల్పి మెరుంగ రెన్నఁడును నా పుత్రశ్రేణి గేహంబులఁ
దుదకి ట్లబ్బెను తుర్కబాస యిది నాదోషంబొ? ప్రాణేశ్వరా!

---

# వెలనాటి చోడవంశావళి—కేయూరబాహుచరిత్రము

మల్లంపల్లి సోమశేఖర శర్మగారు

మంచెనకవి వ్రాసిన కేయూరబాహుచరిత్రవల్ల వెలనాటిని పాలించిన చోళరాజుల యొక్కా వారిమంత్రులయొక్కా వంశానుక్రమము కొంతవరకు తెలుస్తుంది. కేయూరబాహుచరిత్రమునకు కృతిపతిఅయిన నండూరి గుండమంత్రి వెలనాటి చోళమంత్రుల వంశములోవాడే. అందువల్ల మంచెనకవి తన ప్రబంధములో కృతిపతి వంశమున్ను, ఆకృతిపతికి అధిపతులైన వారి వంశమున్ను కూడా వర్ణించినాడు. మంచెనకవి చెప్పినదానిని బట్టి ఉభయుల వంశానుక్రమములూ సంబంధములూ ఈక్రిందిరీతిగా తెలుపవచ్చును:

చోడవంశము — గుండమంత్రివంశము

గొంకవిభుడు — మంత్రి — కాశికాన్వయుడు నోవిందపల్లెపెగ్గడ

రాజేంద్రచోడుడు — మంత్రి — కొమ్మన

పృథ్వీశరాజు — మంత్రి — కేతన

కేతన కుమారులు: కొమ్మన, మల్లన, భీమన =పోలమ

భీమన కుమారులు: కేతన, కేతన, గుండమంత్రి (కృతిపతి)

మంచెనకవి చెప్పిన ఈపైవిషయాలు శాసనాలవల్ల ఎంతవరకు సమన్వయము అవుతవో చూడామని వెలనాటిచోళుల శాసనాలు పరిశీలింపగా అందులో కొంచెము తేడా ఉన్నట్టు తోచినది. మనకు ఇంతవరకు తెలియవచ్చిన వెలనాటిచోళుల శాసనాలనుబట్టి రాజేంద్రచోడరాజునకు మంచెనకవి చెప్పినట్టు పృథ్వీశరాజనేకుమారుడు ఉన్నట్టు కనిపింపదు. అందువలన ఈవిషయమును సవిమర్శగా పరిశీలించుదామని ఈవ్యాసము వ్రాస్తున్నాను.

వెలనాటిచోళులశాసనాలుచాలాదొరకినవి. కొంచెముంచ మించుగాఅవిఅన్నీ శిలాశాసనాలే. వాటినిబట్టి వెలనాటిచోళుల సిసలైన వంశవృక్షమూ నిర్ణయించవచ్చును: ఆవంశములోని రాజులు ఎవ్వరెవ్వరు ఎప్పటినుండి ఎప్పటివరకు పరిపాలించిరో నిర్ణయించవచ్చును. వెలనాటి చోళవంశవృక్షమును పరిశీలిస్తే అందులో గొంకరాజు, చోడరాజు అని పేర్లు పెట్టుకొన్నవారు ఒకరికంటె ఎక్కువమంది ఉన్నట్టు తెలుస్తుంది. అందువలన పృథ్వీశుని తండ్రి అని మంచెనకవిచెప్పిన రాజేంద్రచోడుడు వెలనాటి చోళరాజులలో ఎన్నవవాడో ఎప్పటివాడో ముందు తేల్చవలసి ఉంటుంది.

ఈరాజు లందరికి రాచరికము సంప్రాప్తమైనది కులోత్తుంగచోడుని నాటి నుండియే. ఈవంశములోని గొంకరాజునుపతడు తనకు

యుద్ధములో చేసిన సహాయమునకు సంతుష్టి జెంది కులోత్తుంగ చోడరాజు అతనికి పట్న హాస్రావనీమండలాధిపత్యమును ఇచ్చెనని ఒకా నొక శాసనములోని ఈ క్రింది శ్లోకములో కలదు.

> సంగ్రామసాహాయ్య సుతుష్టచిత్తాత్
> శ్రీరాజరాజ ప్రభవాన్నృపేంద్రాత్
> యః పట్నహాస్రావనిమండలాధి
> పత్యం సమాసాద్య చిరం భునక్తి.

ఈవిషయమే ఇంకొక శాసనములో ఇట్లు చెప్పబడి ఉన్నది:

> (శేషాః) గోంక మహీపాలః
> పాలయన్నంధ్రమండలమ్
> శ్రీకులోత్తుంగ చోడాజ్ఞాం
> దధాసేప్పృథుకం ఋశా.

ఈపైవిషయాలనుబట్టి వెలనాటి వారికి ఈ రాజ్యాధిపత్యము గోంకరాజుతోనే ప్రారంభ మైనదని గట్టిగా చెప్పవచ్చును. గోంకరాజు అనే పేరుగలవారు ఇతని పూర్వులలో ఎవ్వ రూ లేరు గనుకనున్ను, మండలాధిపత్యము వహించినవాడు గోంకరాజని పై శ్లోకాలలో చెప్పబడి ఉండడమువల్లనున్ను రాజయిన మొదటి గోంకరాజు ఇతడే అని నిశ్చయింప వచ్చును. శాసనావళినిబట్టి వెలనాటివారి వంశానుక్రమము ఈ క్రిందిరీతిని కనిపిస్తుంది:

(మొదటి) గోంకరాజు (భార్య) సబ్బాంబిక
|
(మొదటి) చోడరాజు (భార్య) గుండాంబిక
|
(రెండవ) గోంకరాజు (భార్య) సబ్బాంబిక
|
(రెండవ) చోడరాజు

ఈ రెండవ చోడరాజు పరిపాలనము పూర్తి అయ్యేవరకే వారిరాజ్యము మంచి ఉన్నత దశలో ఉండినట్టు తెలుస్తుంది. అటు తరువాతి కూడా వెలనాటివారి పరిపాలనము ఉన్నప్ప టికీ క్షీణదశేకాని అభివృద్ధి లేదు. అందువల్ల వెలనాటి వంశానుక్రమాన్ని వర్ణించిన పెద్ద పెద్ద శాసనాలన్నీ చాలావరకు రెండవచోడ రాజుతోనే అంతమవుతూ వచ్చినవి. శాసనా లనుబట్టి వెలనాటివారి వంశానుక్రమము ఎట్లు తెలియవచ్చినదో అట్లే ఆ వంశములోని ఆయారాజుల పరిపాలనకాలముకూడా తెలి యవస్తున్నది. వెలనాటివారిశాసనాలన్నీ తహ వేలువేసి పరిశీలిస్తే పైనిచెప్పిన రాజులలో ఒక్కొక్కరి రాచరికము ఎన్నెన్నేళ్లో, ఎప్పటి నుంచి ఎప్పటివరకో ఈ క్రిందిరీతిని తెలుస్తు న్నది.

(౧) వెలనాటి మొదటిగోంకరాజు
క్రీ. శ. ౧౦౭౬—౧౧౧౭(?)వరకు(౪౧ సం.లు)
(శ. ౯౯౮–౧౦౩౯(?))

(౨) వెలనాటి మొదటిచోడరాజు
క్రీ. శ. ౧౧౧౭—౧౧౩౬ వరకు (౧౯ సం.లు)
(శ. ౧౦౩౯–౧౦౫౮)

(౩) వెలనాటి రెండవ గోంకరాజు
క్రీ. శ. ౧౧౩౬—౧౧౬౩ వరకు (౨౭ సం.లు)
(శ. ౧౦౫౮–౧౦౮౫)

(౪) వెలనాటి రెండవచోడరాజు
క్రీ. శ. ౧౧౬౩—౧౧౮౧(?)వరకు(౧౮ సం.లు)
(శ. ౧౦౮౫—౧౧౦౩) (?)

వెలనాటి మొదటి గోంకరాజు మొదటి శాసనము క్రీ. శ. ౧౦౭౬ నాటిది. అతనిశా సనాలు క్రీ. శ. ౧౧౧౬ వరకు మాత్రమే

కనిపిస్తూఉన్నవి; కాని అతడు క్రీ. శ. ౧౧౧౭ వరకు రాజ్యంచేసినట్టు పైన చెప్పబడ్డది. ఇందుకు కారణం లేకపోలేదు. మొదటి గొంకరాజు కొడుకైన మొదటి చోడరాజు మొదటి శాసనం క్రీ. శ. ౧౧౧౯ నాటిది కనబడుతున్నది. అందులో '(శ్రీ)కులోత్తుంగ చోడయదేవ మహారాజుల విజయరాజ్య సంవత్సరములు ౨ శ్రాహి శ ౧౦౪౧' అని ఉన్నది. ఈకులోత్తుంగ చోడయదేవరాజులు వెలనాటి కులోత్తుంగచోడరాజు కాడనుటకు వీలులేదు: ఆశాసనమునందు చెప్పబడిన రాజు వెలనాటి భూపతి అయినా కావలెను లేదా వెలనాటి వారికి అధిపతి అయిన కులోత్తుంగచోడుడు అయినా కావలెను. చాళుక్యచోడుడయిన విక్రమచోడునియొక్క కొడుకుపేరుకూడా కులోత్తుంగచోడుడే కావున అతడే యాతడనడానికి వీలులేదు. ఎందువల్ల అనగా విక్రమచోడుడు శాసనాలవల్ల క్రీ. శ. ౧౧౧౮ మొదలు ౧౧౩౫ వరకు పరిపాలిస్తూ ఉన్నట్లు తెలుస్తుంది. పైనిచెప్పిన శాసనము క్రీ. శ. ౧౧౧౯ నాటిదగనుకనున్ను, కులోత్తుంగచోడయదేవరాజులది గనుకనున్ను అది విక్రమచోడునిది కాని, అతని కొడుకైన కులోత్తుంగచోడునిది కానికాదు. అది విక్రమచోడుని తండ్రిఅయిన కులోత్తుంగచోడుని దందామా ఆ రాజు క్రీ. శ. ౧౦౭౦ మొదలు ౧౧౨౦ వరకు పాలించి ఉండడముచేతనున్ను, ౧౧౧౯ వ సంవత్సరము రెండవవిజయరాజ్య సంవత్సరమని శాసనమునందే చెప్పబడి ఉండడముచేతనున్ను అతని దిన్నీ కాదు. అందువలన అప్పటికాప్రాంతమును పాలించుచుండినవారు వెలనాటివారే అవడముచేతనున్ను, మొదటి గొంకరాజునకు చోడదేవరాజు అనేపేరు గల కొడుకు ఉండడముచేతనున్ను ఆ శాసనము తప్పక వెలనాటి మొదటి గొంకరాజు కొడుకయిన మొదటి చోడరాజుదే అని నిశ్చయింపవచ్చును. అయినట్టయితే శాసనమునుబట్టిఅతడు క్రీ. శ. ౧౧౧౭ లోనే రాజ్యానికి వచ్చినట్లు చెప్పవలసి ఉంటుంది. ఇందువల్లనే వెలనాటి మొదటి గొంకరాజు క్రీ. శ. ౧౧౧౭ వరకు రాజ్యముచేసినట్లు చెప్పబడ్డవి. అట్లు చెప్పడానికి ఇంతకు తక్క వేరుకారణము లేదు.

ఈ వెలనాటివారిలో చోడరాజులకు కులోత్తుంగచోడరాజనిన్నీ, కులోత్తుంగరాజేంద్రచోడరాజనిన్నీ, వీరరాజేంద్రచోడయరాజనిన్నీ పేరు లున్నట్టు శాసనాలవల్ల తెలుస్తున్నది: ఇట్లే గొంకరాజులకు వెలనాటి రాజేంద్రచోడ గొంకరాజనిన్నీ, రాజేంద్రచోడ గాంగేయరాయుడు అనిన్నీ, కులోత్తుంగచోడ గొంకరాజనిన్నీ పేరులున్నట్టుకూడా తెలుస్తుంది. వెలనాటివారికి రాజ్యాధిపత్యము రాజేంద్రచోడ నామాంతరముగల కులోత్తుంగచోడునివలన వచ్చినదగుటచేత ఈరాజులు భక్తిపూర్వకముగను, కృతజ్ఞతాపూర్వకముగను—రాజేంద్రచోడ, కులోత్తుంగచోడ—అనే ఆ రాజుపేరు తమపేర్లముందర చేర్చుకొని ఉందురని నానమ్మకము. గొంకరాజుల పేర్లముందు, చోడరాజుల పేర్లముందు ఆపేర్లు కనబడడానికి ఇదేకారణము. ఈచోడశబ్దము ఈ వంశపురాజులలో అందరిపేర్లముందూ కన

బడడమువల్లనే ఈవంశమువారికి వెలనాటి చోడులని చరిత్రలో ప్రసిద్ధి కలిగినది: ఈసంబంధమొక్కటే తప్ప చోడులకూ వీరికీ ఏవిధమైన యితరసంబంధమూ కనబడదు: ఈవంశమువారికి ఆంధ్ర దేశములో వెలనాటి గొంకరాజులనిన్నీ ప్రసిద్ధి కలదు.

వెలనాటి రెండవగొంకరాజు శాసనాలు క్రీ.శ. ౧౧౩౨ నుంచి కనబడడము చేతనున్న అతనితండ్రి అయిన మొదటిచోడరాజు శాసనాలు క్రీ. శ. ౧౧౩౨ నుంచి కనబడక పోవడమువల్లనున్ను మొదటిచోడరాజు ౧౧౩౨ వరకు పాలించినట్టున్ను, అటుపిమ్మట గొంకరాజు పరిపాలనము ఆరంభమైనట్టున్ను చెప్పబడ్డది.

రెండవగొంకరాజు శాసనాలు క్రీ. శ. ౧౧౬౧ వరకే కనిపిస్తూఉండడముచేతనున్న అతనికొడుకయిన రెండవ చోడరాజు శాసనాలు క్రీ. శ. ౧౧౬౩ కు పూర్వము క్రమమైన వరుసలో కనబడకపోవడము చేతనున్న రెండవచోడరాజు ఏలుబడి క్రీ. శ. ౧౧౬౨ లో ప్రారంభమైనట్లున్ను, రెండవ గొంకరాజు పరిపాలనము అప్పటికి అంతమైనట్లున్ను పైన చెప్పబడ్డది.

శాసనాలవల్ల మనకు ఇన్ని విషయాలు తెలిసినా పృథివీశరాజు తండ్రి అయినరాజేంద్ర చోడరాజు మొదటి చోడరాజో రెండవచోడరాజో మనకింకా తెలియలేదు. ఈవిషయము తెలుసుకోవడానికి బాపట్ల భావనారాయణ స్వామివారి ఆలయములో ఉన్న శిలాశాసనం ఒకటి అనుకూలపడుతుంది. అది గోవిందన ప్రెగ్గడకొడుకు కొమ్మనామాత్యునిది. ఆ శాసనములో గోవిందనప్రెగ్గడ వెలనాటి గొంకభూవిభునిమంత్రి అనిన్ని, కౌశికాన్వయుడనిన్ని వర్ణింపబడుటచేతను, శాసనము వేయించిన కొమ్మనామాత్యుడు గోవిందనప్రెగ్గడ కొడుకే అవడముచేతను ఆగోవిందనకొమ్మనప్రెగ్గడలు గొంకరాజేంద్ర, చోడభూపతుల మంత్రులని మంచెనకవి వర్ణించిన గోవిందన కొమ్మన ప్రెగ్గడలు అయి ఉండడానికి ఏవిధమైన సందేహమూ లేదు. ఈశాసనమున శకవర్ష సంఖ్య తెలుపబడి ఉన్నది. గొంక,రాజేంద్ర చోడరాజులకాలను మనకు ఇదివరకే తెలిసిఉండడముచేతనున్న శాసనకాలముకూడ తెలుస్తూ ఉంనుటచేతనున్న, గోవిందనకొమ్మన ప్రెగ్గడలెప్పటివారో, వారి అధిపతు లెప్పటివారో, వారు వెలనాటి వంశరాజులలో ఎన్నవవారో ఇవన్నీ ఆశాసనమునుబట్టి మనం తెలుసుకోవచ్చును. అందువల్లనున్న అది తెలుగున గద్యపద్యాత్మకముగా ఉండడము చేతనున్న పాఠకుల ఉపయోగం నిమిత్తము దానిని ఇప్పటివర్ణక్రమంలో దిగువ ప్రకటిస్తున్నాను.

ప్రతిబింబము తీసిన కాగితాలలో కొన్ని పోయి నకలు మళ్లీ సరిచూసుకొని సవరించుకోవడానికి వీలులేక పోయినందువల్ల అక్కడక్కడ కొన్ని కొన్ని అక్షరాలు చదవడములో పొరపాటులు ఉండవచ్చు. అందుకు పాఠకులు మన్నింపవలసిం దని వేడుకొంటున్నాను.

## శాసనమూలము *

(పద్యములు)

శ్రీరమణీయవక్షుఁడు వశీకృతలోకుఁడు విప్రవంశవి
స్తా[రా]కారణుండు విలసద్గుణభూషణుఁ డిష్టలోక ర
క్షాకరుఁడుత్తమోత్తముఁడుగౌశికగోత్రుఁడుఁగొమ్మశౌరి ధ
ర్మాకరపుత్రుఁడ పెరుమగూరిపురీశుఁడు ధన్యుఁడున్న తిన్

ఆవసుధాసురేశ్వరున కన్వయరత్నము
గొమ్మనాంబకున్
భూవినుతుండు విప్రకులభూషణుఁ
డుద్భవమయ్యె గొంక ధా
త్రీవిభుసంధివిగ్రహి యతిస్థిరచిత్తుఁ
డమాత్యరత్నమా
గోవిందన (?) వంశవర్ధనుఁడు
గోత్రపవిత్రుఁడు పాత్రుఁడున్నతిన్.

గుణనిధుఁ డయ్యమాత్యనిధి
గోయన పెగ్గడ కంబుజాస్య యం
బుజహాదనాక్షి గేరిమకుఁ
బుత్రుఁడుగౌశికగోత్రుఁ డంబుజో
దరపదభక్తియుక్తుఁడు ప్రతాప
దినేశుఁడు గొంకధారుణీ
శ్వరునకు సంధివిగ్రహి ప్రసన్న
మనస్కుఁడు గొమ్మఁ డిమ్మహిన్.

రమణీయ ధనదపురవర
మ సరఁగ నిజరాజధాని యయ్యుండఁగ నక
రము నెల్లూరును లోఁబుగఁ
గ్రమమెుప్పరఁగ నేలె బాహుగర్వము వెలయన్.

వననిధిపరివృత మహిఁగల
యనఘశివాలయములెన్ని యందందులఁ గాం
చనకలశంబులు వెట్టిన
యనఘుఁడగు గొంకధారుణీశ్వరుచేతన్.

అనుపమమగు భండారము
ననఘుంబగు సంధివిగ్ర[హంబును ధరఁ] బె
క్కనియోగంబులుఁ దేజము
నొనరఁగొనిపడసిన యమాత్యగొమ్మఁడు వృత్తిన్

శరగజఖేందుసంఖ్య శక
కాలములొప్పగ భావపట్టనం
బరగ నఖండదీప మతి
భాసురలీల వెలుంగనిల్పె వి
స్తరమతిఁ దల్లిదండ్రులకు
ధర్మముగా శశితారకంబుగా
గురుభుజుఁ డిద్ధవిక్రముఁడు
గొమ్మన పెగ్గడ ధన్యుఁడున్నతిన్.

(గద్యము)

స్వస్తిశ్రీ శకవరుష[ంబు]లు ౧౦౮౫ గు నేఁటి యుత్తరాయణ నిమిత్తమున స్వస్తి సమస్తప్రశస్తి సహిత శ్రీమన్మహామండలేశ్వర కులోత్తుంగచోడ గొంకరాజుల శ్రీమతు సంధివిగ్రహి గొమ్మన పెగ్గడ గమ్మనాటిలోని భావనారాయణ దేవరకు నఖండదీపము దమతండ్రి సంధివిగ్రహి గోవిందన పెగ్గడకుఁ దమతల్లి గేతసానికి ధర్మముగా నిల్పి బ్రమ్మనబోయినికొడుకు నామునబోయినివసమున నాచంద్రార్కస్థాయిగా నిచ్చిన మేఁకలు గొఱియలుఁ ౫౦ వీనిం జేకొనినామని బోయండు పుత్రపౌత్రికము నిత్య మానెండు నేయి దీపంబునకుఁ బోయంగలవాఁడు.

ఈ శాసనమువల్ల

(౧) గోవిందనమంత్రి 'పెరుమగూరిపురీశుడు' అని తెలుస్తుంది. అది 'పెరుమగూరో' 'పెరువంగూరో.' పెరువంగూరు కొన్ని చాళుక్య శాసనాలలో వస్తుందని జ్ఞాపకము. ఏదైనా కాని ఆ పేరుగల ఊరు ఇప్పుడెక్కడా కన

---

* కొంతకాలముక్రిందట నేను బాపట్ల వెళ్లినప్పుడు ఈ పెద్ద శాసనానికి వేరువేరు చిన్న చిన్న కాగితాలమీద విడివిడిగా ప్రతిబింబము తీసినాను. కాని వాటిలో కొన్ని కాగితాలు పోవడమువల్ల దానిని ఇప్పుడు ప్రతిబింబముతో సహా ప్రకటించడానికి వీలు లేకపోయినది. ప్రతిబింబము తీసినవెంటనే ఈ శాసనమును చదివి వ్రాసినాను. దానినకలే ఇది.

బడదు. గోవిందనమంత్రివంశమువారు మొదట 'పెనుమ(?)గూరి' వారనిన్నీ, అతనితరువాతనే గుండమంత్రినాటికే ఆవంశమువారికి—నందూరికి వెళ్లుటవల్లనో ఏమో—నందూరివారనే యింటిపేరు వచ్చిఉండుననిన్నీ చెప్పవచ్చును.

౨. గోవిందనప్రెగ్గడ భార్యపేరు 'కేతమ' అని తెలుస్తుంది.

౩. గోవిందన ప్రెగ్గడకొడుకు కొమ్మనామాత్యుడుకూడ తండ్రివలెనే మొదట గొంక విభునకే మంత్రిగ—సంధివిగ్రహిగ—ఉండెనని [torn]స్తుంది.

[torn]. శాసనము ౧౦౮౨-వ శకవర్షము [torn]గా క్రి. శ. ౧౧౬౦ నాటిది అవడముచేతనున్నూ, వెలనాటిరాజులు ఎవరెవరు ఎంతెంతకాలం పాలించినదీ మనకు ఇదివరకే తెలిసి ఉండడముచేతనున్నూ అందులో చెప్పబడ్డ గొంకరాజు రెండవగొంకరాజు అని తెలుస్తుంది. ఇందువల్ల కొమ్మనామాత్యుని తండ్రి గోవిందనప్రెగ్గడ ఒక్కడే కాకుండా కొమ్మనామాత్యుడుకూడా కొంతకాలం రెండవ గొంకరాజును కొలిచినట్లున్నూ, అతనికి మంత్రిగను, సంధివిగ్రహిగాను ఉన్నట్లున్నూ తెలుస్తుంది. ఇది కేయూరబాహుచరిత్రమువల్ల తెలియని కొత్తవిషయం. కేయూరబాహుచరిత్రములో కొమ్మనామాత్యుని అధిపతి అని చెప్పబడ్డ రాజేంద్రచోడుడు రెండవ గొంకరాజుకొడుకైన రెండవ రాజేంద్రచోడుడని సులభముగానే తెలుసుకోవచ్చును: ఈశాసన ప్రబంధవిషయములు రెంటిని సమన్వయించి చూడగా కొమ్మన కొంతకాలము రెండవ గొంకరాజునకును, అటుపిమ్మట అతనికొడుకు రెండవ రాజేంద్ర చోడరాజునకును సంధివిగ్రహిగా ఉండెనని తేలుతుంది.

౫. ఈ రెండవ గొంకరాజు కాలములో వెలనాటివారిరాజ్యం 'నకరము' (ముఖలింగ నగరము) మొదలు 'నెల్లూరి'వరకు వ్యాపించి ఉండినట్లు తెలుస్తుంది; అనగా వేగినాడు, వెలనాడు, పాకనాటిలో చాలాభాగమే కాకుండా కళింగరాజ్యములో చాలాభాగముకూడా—దాదాపుగా అంతా- రెండవగొంకరాజుకాలంలో వెలనాటివారి ఏలుబడిక్రింద ఉన్నట్లు స్పష్టమవుతున్నది. ౬. ఈ రెండవ గొంకరాజు వెలనాటివారిలో చాలా ప్రసిద్ధుడు. మంచి ప్రతాపవంతుడున్నూ, సమర్థుడున్నూ కూడాను. ఈతని తండ్రికాలంలో పశ్చిమచాళుక్యులు తూర్పు తీరపు తెలుగు దేశమును ఆక్రమించుకొని జయించి దాన్ని కొంతకాలం పాలించినారు. ఈ రెండవ గొంకరాజు వారిని అందరినీ 'గోదావరీసంగరము'లో ఓడించి దేశాన్ని పరప్రభుత్వంలోనుంచి విడిపించినాడు: మహాతేజస్సంపన్నుడై కళింగము జయించినాడు: చాలా యశస్వంతుడు: శివపాదశేఖరుడు.

ఇంతవరకు విషయమంతా బాగానే ఉన్నది: కాని ఇంతవరకు అసలు తేడా—పృథివీశరాజు రాజేంద్రచోడుని కొడుకు అవునో కాదో—తేలలేదు. ఆవిషయమును గురించి పరిశీలించుదాము. వెలనాటి రెండవచోడరాజు తరువాత ఎవరు రాజ్యానికి వచ్చినారు అన్న



౧. హైందవనర్తకి.



౨. మహమ్మదీయనర్తకి.



3. పాశ్చాత్యనర్తకి (౧)



౪. పాశ్చాత్యనర్తకి (౨)

[౧౯౩౪ సెప్టెంబరు 'మనోరమ' నుండి.]



౫. యశోదాకృష్ణులు.

చిత్రకారుడు : శ్రీమానికొండ రామారావుగారు, బందరు.

విషయము విచారణీయాంశము. రెండవ చోడ రాజు శాసనాలు క్రీ. శ. ౧౧౮౧ వరకే కనిపిస్తున్నవి. రెండవచోడరాజు తరువాత శాసనాలు కనిపించిన వెలనాటి భూవరుని పేరు పృథివీశభూపతి. ఇతని శాసనాలు క్రీ. శ. ౧౧౮౬ మొదలు ౧౨౦౭ వరకు కనబడుతున్నవి. అవి ఇతనికి పూర్వపు రాజుల శాసనాలవలె ఈవంశమువారికి రాజధాని అయిన 'ధనదుప్రోలు'-(ఇప్పటి చందవోలు, రేపల్లెతాలూకా)-ప్రాంతమున గాక విశాఖపట్టణ మండలమునను, ఆ ప్రాంతములను గనబడుటచేత పృథివీశ్వర దేవ మహారాజుల కాలమునగాని, అతనికి పూర్వుని కాలమునగాని పరరాజాక్రమణమువల్ల వీరికి వెలనాటి రాజ్యము దక్షిణమున సంపూర్తిగా గాకపోయినను కొంతవరకైన పోయియుండు ననిన్నీ, అందువల్లనే ఈ వంశమువారి శాసనాలు గోదావరినదికి ఉత్తరపుదేశమున గనబడడము తటస్థించెననిన్నీ ఊహింపవలసి ఉంటుంది.

పృథివీశ్వర దేవ మహారాజులకును, అతనికు పూర్వపు వెలనాటి రాజులకును గలసంబంధము తెలిపేశాసనాలు అంతగా లేవు. ఒకటి రెండుమాత్రమే కలవు. వాటిలో పృథివీశ్వరుని పిఠాపురము శాసనము ముఖ్యమయినది. [illegible]ండవ కులోత్తుంగ చోడ దేవరాయల శాస[illegible]లపిదప వెలనాటివారి సంపూర్ణవంశావళిని తెలిపేశాసన మిదే. ఇది శకవర్షము ౧౧౦౮ నాటిది: అనగా క్రీ. శ. ౧౧౮౬ లోనిది. ఈ శాసనమున వెలనాటివంశము మొట్టమొదటి నుండి రెండవచోడరాజు వరకు వర్ణింపబడ్డపిదప ఆతనిభార్యయైన అక్కాంబిక యిట్లు కీర్తింపబడినది:

> విద్యుల్లతేవ జగతీతల సంచరిష్ణు
> రానందదాశశికలేవ సతాన్ని తాంతః
> అక్కాంబికేతి తరుణీజనరత్నభూతా
> జాయా ప తస్య జగతీపతిస త్తమస్య.

ఈ దంపతు లిరువురికి గొంకరాజు జనియించినట్లు ఆశాసనములోని ఈ క్రింది శ్లోకమువల్ల తెలుస్తున్నది.

> జాత స్తాభ్యాం శివాభ్యామివ సకలజగద్రక్షణైకాంతదక్షః । సాక్షాద్దేవః కుమారస్స
> కలనృపకలాకోవిదో గొంకభూపః...

అందువల్ల రెండవచోడరాజునకు అక్కమాంబవల్ల (మూడవ)గొంకరాజు పుట్టినట్లు నిశ్చయము. ఈతడు 'కొండపడుమటి' రాజవంశములోని జాయమాంబ అనే ఆవిడను పెండ్లాడెను. ఈవిషయమే ఈ క్రిందిశ్లోకములో కలదు.

> యా పర్వతాపరమహీనృపవంశదుగ్ధ
> రత్నాకరా దుదభవ జ్జగతాంధవాయ।
> పద్మాలయేవ హరిపాదపరో జభక్తా
> జాయాంబికా నిఖిలసంపదవాప్తిహేతుః...

ఈమూడవ గొంకరాజునకును, జాయమహాదేవికిని పృథివీశ్వర దేవ మహారాజు జనియించినట్లు ఈ క్రిందిశ్లోకమువల్ల తెలుస్తున్నది.

> తాభ్యాం శ్రీ పృథివీశ్వరః స్వయమివా శేష
> క్షితేః కారణం। దేవః శ్రీ పృథివీశ్వరో (౭)
> జని జనప్రస్తూయ మానోదయః...

ఈపృథివీశ్వర దేవమహారాజు తండ్రికి '(శ్రీ)కులోత్తుంగ మన్మగొంకరాజు' అనేపేరు కూడా ఉన్నట్టు ఆశాసనంవల్లనే తెలుస్తుంది.

ఈపై శాసన విషయాలనుబట్టి చూస్తే మంచనకవి కేయూరబాహు చరిత్రలో రాజేంద్రచోడుని కొడుకు పృథివీశరాజు అని చెప్పిన విషయము సరియైనదిగా కనబడదు. అందువల్ల అది సవరించుకోవలసిన విషయము.

రెండవ చోడరాజుకొడుకైన మూడవ గొంకరాజు శాసనాలు ఇంతవరకు కనబడ లేదు. ఒకటిరెండు కనబడినా అవి అతనివి ఔనో కాదో, అవి ఏసంవత్సరమునాటివో సందేహముగా ఉన్నది. ఈ మూడవ గొంకరాజు శాసనాలు కనబడకపోవడానికిన్నీ, క్రీ.శ. ౧౧౮౧–౧౧౮౬ సంవత్సరాల మధ్య అసలు వెలనాటివారి శాసనాలే కాన్పించక పోవడానికిన్నీ కారణం కనుక్కోవలసి ఉంటుంది.

---

# స్వర్భంగము

(నాలుగవ సంపుటము, ఎనిమిదవ సంచిక తరువాయి)

ముసలికంటి హనుమంతరావు గారు

క్షనివానిం దివి సైతా
నను పరమవిరోధి యిట్టులాడఁగఁజొచ్చెన్
వినువారు దద్దిరిలఁగాఁ
గ్వణదతివాగ్జృంభణప్రగల్భత దోఁపన్.

కావే యాతండ వయో!"
పైవర్ణ్యం బకట! యెంత వైరూప్యంబో
భావము శకలము లగు ది
వ్యావాసమునాటిని న్వయస్య! తలఁచినన్.

కావే యాతండవు నీ
వావేళ కడింది సఖుఁడవై విజయేచ్ఛా
భావోత్సేకత ధీరత
నీవేళను మత్సఖత్వ మెడపవు వెతలన్.

తెల్ల మెగా వేయన్నతి
పల్లటిలఁగ నెట్టి గోతఁ బడితిమొ మించెా
బల్లిదుఁడై యుగ్రాస్త్రపుఁ
జెల్లుఁబడి యెవం డెఱుంగుఁ జేడ్పడు దనుకన్.

తనువిలసనంబు మాఱిన
నెనయు మనోనిశ్చయంబు నేవయుఁ గలనై
నను మాఱునె యనుతాపం
బనుమాటయుఁ జన్నె యింత పోవడియైనన్.

ఇంతియుకా కెంతఁగనే
వంతలు పటువిజయి రుషను బన్నఁదొడఁగినట
సుంతయు మాఱునె మది సా
మంతా! సత్యాగ్రహాగ్ని మండుచు నుండన్.

తత్పరిపాలన మొల్లక
మత్సరులై వాని దివిని మార్కొను వేళ
తత్పూర్ణశక్తి నూఁపిరి
మత్పదగులు దివ్యతనులు మఱి మాఱుదు

పోఁగాక జయము, పోవదు
గాఁగల సర్వం బజయ్యమగు నుదిబింకం
బీఁగని ప్రతిక్రియాస్మృతి
లోఁ గని దృష్టంబు తెగనిరోఁతయు నింకన్.

నిలుచుట నే నజితుఁడనై
యలరుట యగుఁగాక యజయ మన వేఱగునే
బల మొంచిన వ్యథ నించిన
తలమే నన్నొంచు విభవదర్పం బొందన్.

ఈభఁ జభయమునఁ దనరా
జ్యాభావము దలఁకువాని నడుగుట పడి దై
వాభుఁగ నైచ్యమె కాక ప
రాభవలజ్జాకరంబు రాలుటకంటెన్.

కావున జయ మత్పరివశ
తావిధిని నిరంకుశప్రతాపమును దవిం
గావించు భవ్యశాత్రవు [దగున్.
తో వల దొడఁబాటు పగయె తోరముగఁ

సురబలదివ్యశరీరము
లలుగనియవి విధికృతాప నాలము కతనన్
విరవకితన మెచ్చెను నం
గరకుశలతఁ దీసిపోము గానఁ బగ తగున్.

ఎంచ విజయాశ మించఁగ
వంచననో బలసమగ్రపంచకముననో
పంచమరిపు ననవరతము
నొంచగ నిశ్చయ మొనర్ప నొప్పును మనకున్.

అని కంఠోక్తిగ బీరము
లను త్రిదివద్రోహి నిస్పృహావేశమునన్
జనితార్తివహ్నిఁ గ్రాఁగుచు
నన సంగడికాఁడు పలికె నాతనితోడన్.

సమరోన్ముఖగణముఖమున
నమరస్థిరనాథు నిర్భయత భయగతులం
దెమలించి తత్ప్రభుత్వము
క్రమముననో, విధినో, భాగ్యకారణముననో.

జరుగురహస్యము హృద్గో
చరముగ నొనరించు దేవ! సర్వగణేభ్యా!
పరికించుచు ననిఫలమును
బరితాపము నొందుచుంటి బహుకాలముగన్.

శోకదముగఁ బాటు, త్రిపా
స్తోకముగాఁ జేటు, దివము తూలెను బలముల్
భీకరమగు నాశనమును
నాకశ కవకాశ ముండు నంతకుఁ గుడిచెన్.

తొలఁగెఁ బ్రభ, సుఖావస్థయుఁ
గలితామితదుర్దశాగ్నిఁ గాలె నయిన హృ
ద్వలనము దోసి లొగ్గదు
పొలుపారును సంగబలము పునరాగతమై.

కాని మనపోంట్లరణమునఁ
జానొత్తఁగ లాతివాఁడు చాలునె? కానన్
వాని నిక సర్వశక్తునిఁ
గా నమ్మకతిర దెంత కటకటఁబడినన్.

ఆరణవిజయుఁడు మనబల
పౌరుషముల నుంచు టెంచ, బాధానుభవం
బోరిచి, తత్క్రోధమహా
క్రూరానలమునకుఁ దృప్తి గూర్పనొ, కాదేన్.

# భారతీయ మహిళామండలి



౧౯౨౨-౨౩ వ సంవత్సరమున చెన్నపుర విశ్వవిద్యాలయ పట్టప్రదానమహోత్సవసమయమున పట్టములను పడసిన యువతీమణులు





౨. మిస్. పి. పారిజాతముగారు, బి. ఏ.

మె క్షయరోగనివారణప్రచారమునకు డైరెక్టరుగనుండిన క్టరు పి. పార్థసారథినాయుడుగారి కుమార్తె. ఈమె చుకున్న పతకములను, సంఘమొక బహుమానమును బడసినది. యుడి తెగకు చెందిన స్త్రీలలో నీమెయే ప్రథమ పట్టభద్ర.

మిస్. సీతాదేవదాసుగారు

న్యాయమూర్తి దేవదాసుగారి పుత్రిక. ఈమె కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయమున మహమ్మదీయ న్యాయశాస్త్రము నభ్యసించి యందు దీక్షరాలై చెన్నపురమున న్యాయవాదవృత్తి నవలంబింపనున్నది.



## భారతదేశజనసంఖ్య-ఆహారోచితధాన్యములు

౧౯౫౪ సెప్టెంబరు 'మోడర్న్ రివ్యూ' పత్రికయందు శ్రీ సి. యన్. చటర్జి, (యమ్. ఆర్. ఏ. యస్.) అనువారు వ్రాసిన వ్యాసమునుండి:

"భారతదేశము వ్యవసాయప్రధానమైన దేశము. వ్యవసాయమువలననే తనప్రజలను పోషించుకొనవలసియున్నది. లక్షలకొలది పెరుగుచున్న ప్రజలయొక్క భుక్తికి సరిపడ ధాన్యరాసులను తానే యుత్పత్తి కావించుకొనవలెను. యూరపుఖండముతో పోల్చి పరికించుజేని భారతదేశమున పరిశ్రమలు సున్నయనియే చెప్పవలెను. పరిశ్రమలవలన నితరదేశములకన్న మిన్నగా నాహారపదార్థముల నుత్పత్తి కావించుకొనగల స్థితికివచ్చుటకు పూర్వము కేవలము వ్యవసాయజన్యములైన ధాన్యరాసులవలన తనప్రజలను పోషించుకొనవలసిన సమస్యను భారతదేశ మెదుర్కొనవలసియున్నది. అట్టి యుత్పత్తియగు ధాన్యరాసు లన్నిటిప్రజల భుక్తికి సరిపోవునా, పోవా యను విషయము నిట పరిశీలించెదము. ౧౯౫౧ జనాభా లెక్కలను పరీక్షించి లెక్కవేయగా కల్పింపబడిన జనసంఖ్య తెలియుచున్నది:

| | సంఖ్య |
|---|---|
| ౧౫ఏండ్ల వయస్సుపైబడిన పురుషులు | ౯౯,౭౩౨,౦౯౬ |
| " " స్త్రీలు | ౯౪,౬౫౮,౦౮౮ |
| " " లోబడిన పిల్లలు (స్త్రీలు, పురుషులు) | ౧౬౪,౪౫౩,౩౦౮ |

| | టన్నులు |
|---|---|
| కావున ప్రతిపురుషునికి దినమునకు ౨ పౌనులచొప్పున కావలసిన ఆహారపదార్థములు | ౩౩,౨౮౮,౩౬౫ |
| ప్రతిస్త్రీకిని ఒకటి ముక్కాలు పౌనువంతున | ౨౮,౦౪౪,౧౮౯ |
| ప్రతిపిల్లవానికి ౧ పౌను వంతున | ౨౦,౮౪౨,౨౧౯ |
| మొత్తము భారతదేశప్రజల ఆహారమునకు కావలసిన ధాన్యములు | ౮౧,౯౬౪,౪౬౨ |

ఇక ౧౯౦౦ మొదలు ౧౯౨౨ వఱకు సరాసరి ఒక్కొక్క సంవత్సరమున నుత్పత్తియగు ధాన్యవిశేషములు:

టన్నులు
(* మిలియనులసంఖ్యలలో)

| | ఉత్పత్తి | విదేశములకు ఎగుమతి |
|---|---|---|
| వరి | ౩౨.౩ | ౨.౨ |
| గోధుమ | ౯.౮ | ౧.౩ |
| బార్లి | ౩.౩ | |
| జొన్న | ౮.౨ | |
| సజ్జ | ౩.౫ | |
| రాగి | ౩.౨ | ౧.౧౦ |
| మొక్కజొన్న | ౨.౫ | |
| ఉలవలు | ౪.౯ | |
| ఇతరధాన్యములు | ౧౦.౫ | |
| మొత్తము | ౮౬.౦ | ౪.౫ |

అనగా ఒకసంవత్సరమునకు నికరముగు ధాన్యముల ఉత్పత్తి సరాసరిని ౮౬.౦-౪.౫=౮౧.౫ మిలియనుల టన్నులు.

* మిలియను=పదిలక్షలు.

మొత్తము ఉత్పత్తిలో ఈ క్రింద తగ్గింపు

| | | |
|---|---|---|
| పదివాళ్లు అనగా | ౬.౬ | మిలియనుల టన్నులు |
| పశువులకొరకు | ౧౩.౨ | ,, |
| విత్తులకు | ౨.౦ | ,, |
| విదేశములకు ఎగుమతి | ౪.౫ | ,, |
| మొత్తము | ౨౬.౩ | |

మినహాయింపవలెను.

కాబట్టి భారతదేశమున సరాసరి యొక్కసంవత్సరమునకు ౪౧ మిలియనులకు పైబడిన జనులకు భుక్తికి ఉపయోగపడు ధాన్యవిశేషములు ౭౬.౦–౭౮.౩= ౪౮.౭ మిలియనుల టన్నులుమాత్రమే లభించుచున్నదని తేలినది. అనగా భుక్తికి కావలసిన ధాన్యములలో నూటికి నలువదిపాళ్లు తక్కువగా లభించుచున్న దనుట.

దీనినిబట్టి భారతీయులకు కడుపునిండ తినుటకు అన్నము లేదని స్పష్టముగను, తప్పనిసరిగను నిశ్చయింప వలసియున్నది. గణితశాస్త్రవిధుల ననుసరించి లెక్కించుట కేని ముగ్గురిలో నొకడు పస్తుండవలెను; లేకతనకు వలసిన మూడుమారుల ఆహారములలో నొకమారే భుజింపవల యును అని తేలుచున్నది. ఈదౌర్భాగ్యపుస్థితియే భారతీయుల శరీరబలముల అభివృద్ధి నానాటికి క్షీణించుచుండుటకు కారణ మగుచున్నది."

మఱియు భారత దేశమున నానాటికి పెరుగుచున్న జనసంఖ్యను, క్షీణించుచున్న ఆహారోపయోగధాన్యవిశేషముల యుత్పత్తినిగూర్చి మఱికొంతచర్చించుచు యీదుస్థితి తొలగుటకు వ్యవసాయవర్ధనం తానవనిరోధము, స్వరాజ్యప్రాప్తి, అల్పప్రజగల దేశములకు భారతీయులు వలసపోవుట అను నీమూడును మార్గములని చెప్పి తుదకు

"తన యధికారముక్రింద మెలగుచున్న ప్రజల యిట్టి కష్టతరమగు స్థితిని నివారించి వారి దారిద్ర్యమును తొలగించుటకు ఇంతయేని పూనుకొనని ప్రభుత్వము తనకు నాగరికత మజిరిపదని చెప్పుకొనుటనీతికాదు. భారతదేశమునకు జెందిన యీసమస్య రాజకీయరంగమున నెల్ల ప్రపంచమునకు సంబంధించినదియేకాక భీతిదాయకమును గూడ నగుచున్నది. మన దురదృష్టవశమున భారతీయ నాయకుల దృష్టియందు రాజకీయసమస్యలు ప్రధా[illegible] నమును, సాంఘికార్థికసమస్యలు తరువాతిస్థా[illegible] ఆక్రమించినవి. ఇకనైనను నాయకులందఱు మెలకు[illegible] భారతదేశముయొక్క యభివృద్ధి వినాశములకు మూలసూత్రమయిన యీఆహారోత్పత్తిసమస్యను బరిష్కరింప త్వరపడెదరుగాక!"

అని ముగించినారు.

---

## ప్రాచీనమహారాణుల చిత్రములు

### చిత్రము ౪

### డిడో అను కార్తేజీయను దేశపు మహారాణి

ఉత్తరఆఫ్రికాఖండమున క్రీ. పూ. ౮౫౦ సం.ల ప్రాంతమున నీకార్తేజీరాజ్యమును స్థాపించి అతివైభవముతో పరిపాలించిన యీమహారాణి ఫోనీషియనుల తెగకు చెందినది. ఆవైభవము నీచిత్రము సూచించుచున్నది. ఈపట్టణమును రోమనులు విధ్వంసము చేసిరి. ఈరాజ్యముయొక్క ప్రాచీన వైభవచిహ్నము లప్పుడు నిప్పటికిని గలవు.

---

## అమృతసరమునందలి బంగారుగుడి

దీనినిగూర్చి ౨౩-౮-౨౭ నాడు వెలువడిన ఆంధ్రపత్రికా సాంవత్సరానుబంధమున గలదు.

ఇందు 'గ్రంథసాహె' బను సిక్కులమతగ్రంథముగలదు—సిక్కులు, ఇతరులును నానాదేశములనుండి యేతెంచి యీపవిత్రస్థానమునగల యీపవిత్రగ్రంథమునుదర్శించి తత్సారమును గ్రోలుచుందురు.

చిత్రవివరము:

1. "సింహద్వారము చెంతనున్న అరుగు.

2. స్త్రీలు స్నానముచేయుటకై పాలరాతితో కట్టినగది.



3. వీధిగుమ్మమువద్దనుండి గుడివఱకుగల నీటిపై నున్నవంతెన.

4. గుడియొక్క ముఖ్యద్వారము.

5. గుడివెనకనున్న అమృతోదకముగల చిన్న కోనేరు.

6. ఈభాగ (గుడిపైభాగ) మంతటను బంగారు రేకులు తాపఁడియున్నవి."

బొడ్డపాటి సీతాబాయి"

---

## చదువురానివారు

ఆంధ్రభారతి ౨-వ సంపుటము, ౬-వ సంచికనుండి.

| దేశము | సంవత్సరము | నూటికి చదువురాని వారి సంఖ్య |
|---|---|---|
| జర్మనీ | ౧౯౧౦ | ౧.౦౩ |
| హాలండు | ౧౯౧౦ | ౩.౦ |
| ఫ్రాంసు | ౧౯౧౦ | ౮.౪ |
| బెల్జియము | ౧౯౧౦ | ౭.౯ |
| ఇటలీ | ౧౯౧౧ | ౩౦.౬ |
| ఇండియా | ౧౯౨౧ | ౯౨.౦ |

---

## గార్హస్థ్యశాస్త్రము-స్త్రీవిద్య

శ్రీమతి సరోజిని మెహతా బి.ఏ., ఇట్లు వ్రాసిరి: మనోరమాపత్రిక మహిళాంకమున

ప్రస్తుతకాలమున మనదేశములో స్త్రీవిద్యవిషయమున లెస్సగా ప్రచారము జరుగుచున్నది. పురుషుల విద్యాభ్యాసములో నగపడుచున్నట్టులే స్త్రీవిద్యలో గూడ కొన్నిదోషము లగపడుచున్నవి. విద్యాలయములలో విద్యను ప్రాప్తిచేసికొని వచ్చుచుండెడి నవయువకులయందు చారిత్రత, సభ్యత, వ్యవహారదక్షత మొదలయిన-ఆవశ్యకవిషయము లెట్లు అభావముగుచున్నవో అట్లే యువతులయందును గృహకృత్యనిర్వహణము, శిశుపోషణము మొదలయిన-ఆవశ్యకవిషయములు పూర్తిగా అభావము లగుచున్నవి.

పల్లెటూరిబడులలో జరుగుబాలికలవిద్య లేనిదానితో సమానమే యగుచున్నది. బాల్యవివాహప్రచార మధికముగ జరుగుచుండుటచే సామాన్యముగా బాలికల

విద్యాభ్యాసమునకు తగిన-అవకాశమే లభింపకున్నది. కొన్ని పెద్దపెద్దపట్టణములలో స్త్రీవిద్యాభ్యాసమునకు మంచియవకాశ మున్నది. అక్కడ మాతృభాష మిడిల్ స్కూలువఱకును చాలమంది స్త్రీ లభ్యసించుచున్నారు. కొన్నిపట్టణములలో బాలికల కాంగ్లవిద్య నేర్చుకొనుట కవకాశ మున్నది. ఎన్నో స్కూళ్లు, కాలేజీలు, గురుకులములు, మహావిద్యాలయములు బాలికల విద్యాభ్యాసమునకై స్థాపింపఁబడియున్నవి కాని, ఎందును గార్హస్థ్య శాస్త్రమునుగూర్చి తగినయేర్పాట్లు లేవు. ఆంగ్లపద్ధతిని ఆంగ్లపాఠశాలలలో విద్య నభ్యసించు బాలికలు పాశ్చాత్యస్త్రీలమాదిరి ఫేషనులలోనే లగ్నచిత్త లయి పోవుచున్నారు. వారికి దేశీయభాష, దేశీయవేషము, దేశీయవర్తనముకూడ బొత్తిగా నిష్టము లేకున్నది. అనఁగా వారు పూర్తిగా దొరసానులనే అనుకరించుచున్నారు. గార్హస్థ్యశాస్త్రాభ్యాసమువంక బాలికలతలిదండ్రులకు ధ్యానము లేదు. శిక్షావిభాగాధికారులు సయితము ఈవిషయమున తమకర్తవ్యము నాలోచింపకున్నారు. కనుక హైందవబాలికలు, ఆవశ్యకమయిన గార్హస్థ్య శాస్త్రపద్ధతిని బొత్తిగా నెఱుఁగనివా రయిపోవుచున్నారు.

పూర్వకాలమున, అనఁగా, ఈప్రకారమయిన విద్యాభ్యాసపద్ధతి మనదేశములో ప్రచారములో లేనపుడు బాలికలు తమయిండ్లలోనే పెద్దలసాయమున చదువుట, వ్రాయుట నేర్చుకొనుచుండెడివారు. ఆకాలమున ధార్మికగ్రంథములు పఠనపాఠనములయందుండుట చేతను తమవిచారములను ఉన్నతముగాను, పవిత్రముగాను చేసికొనుచుండెడివారు. గార్హస్థ్యశాస్త్రము తాలూకుశిక్ష వారికి తమయిండ్లలోనే వ్యావహారికరూపమున తమతల్లులవలన స్వాభావికముగానే లభించుచుండెడిది. ఆకాలపుస్త్రీలకు చదువుట, వ్రాయుట ముఖ్యకర్తవ్యము లయియుండలేదు. మఱియేమన? సతులు సాధ్వులగుట, గృహకృత్యములలో నెప్పుగా నేర్పరు లగుటయే అవశ్యకర్తవ్యముగా నాలోచింపఁబడుచుండెడిది. అది నిజముకూడను. గార్హస్థ్యముతాలూకు లోపలి భారమును వహించుటకే పరమాత్మ స్త్రీజాతిని సృజించియున్నాఁడు. అంతియేకాని పురుషులతోపాటుగానే బయటి-ఆందోళనలో పడి కొట్టుకొనుటకు కాదు. ఇట్లనుటవలన స్త్రీలు బాహ్యాందోళనములలో కొంచెమేనియు పాలుగొనరా దనుట మాతాత్పర్యము కాదు. స్త్రీలు తమముఖ్యోద్దేశ్యమును గార్హస్థ్యముతాలూకు లోపలియేర్పాటువిషయమునకే తెలిసికొందురుగాక యనుటయే మాతాత్పర్యము. పురుషుఁ డెంతమాత్రము గార్హస్థ్యముయొక్క లోపలివ్యవహారములలో పాలుగొనఁజాలకున్నాఁడో అంతమాత్రమే స్త్రీలును బాహ్యాందోళనలో పాలుగొనుచుండవలయును. స్త్రీజాతిని, పురుషజాతిని సృజించినపరమాత్మ తనలోపలి-బయటి సృష్టిరచనయొక్క యుద్దేశ్యము నిట్లే పూర్తి చేసినాఁడు.

ప్రకృతకాలమున బాలికలకు బాల్యమునందు విద్యాలయములలో శిక్షను పొందుటలోనే కడచిపోవుచున్నట్లగపడుచున్నది. వారికి నియమితములయినపుస్తకములు చదువుటకే కావలసినంత-అవకాశము లభింపకున్నది. ఇట్లుండఁగా నిఁక నింటిలోనిపనిపాట్లనుగూర్చి నశిక్ష వారి కెట్లు లభింపఁగలదు? సుశిక్షితలును, వ్రాఁతకోఁత లెఱిఁగినవారును అగు ప్రకృతకాలపు నవయువతు లంతగానే కాదు, కొంతగానైనను గృహకృత్యనిర్వాహణమునందు నేర్పరులు కాకుండుట కిదియే కారణము. పూర్వకాలమున హైందవకన్యకలు తమతమయిండ్లలో తల్లులు మొదలగువారి గృహకృత్యములలో బాల్యమునుండియు సాయపడుచుండెడివారుగదా! కనుకనే అప్పటి యొప్పులాఁడులకు గార్హస్థ్యశాస్త్రముతాలూకు వ్యావహారికశిక్ష సహజముగానే లభించుచుండెడిది. కాని, ప్రస్తుత మట్లనుట కవకాశ మేది? ప్రస్తుతము బాలికలు విద్యాలయములలో విద్య పూర్తిచేసికొని బయటికి వచ్చుటయే తడవుగా వారికి పెండ్లియగును. వెంటనే వారు గృహిణీపదమును ధరించుచున్నారు. బాల్యమంతయు విద్యాలయములలోనే కడచిపోవుటచే గృహ్యశిక్ష లభింపదు. ఇపుడు గృహిణీకర్తవ్యమును వారేప్రకారముగ నిర్వహింపఁగలుగుదురు? కనుకనే అత్తవారి యింటికి వెళ్లి వారు కష్టపడవలసినవా రగుచున్నారు. అత్త, ఆఁడుబిడ్డలు, తోడికోడండ్రు మొదలగువారిచెప్పుడుమాటలచేత మాటిమాటికిని వారికి మానసికమయిన

చేసిన నమర్థింపవలసి వచ్చుచున్నది. ఈయీ కారణముల చేత నట్టివారికి గృహస్థాశ్రమములో శాంతిగాని, సంతోషముగాని, సుఖముగాని లేకపోవుచున్నది. విద్యాలయములలో నున్నతవిద్య నభ్యసించిన కొందఱు యువతులు పెండ్లిచేసికొనుటకే యిష్టపడకున్నారు. వారు బ్రదికియున్నంతవఱకును తమ్మును "కన్య" అనిపించుకొనుటలోనే గౌరవ మున్నదని యాలోచించుచున్నారు. మఱి కొంతమంది యువతులు క్షణికమయిన ప్రేమప్రవాహములోపడి అసమపురుషసంబంధము నంగీకరించుచున్నారు. అట్టివారికి తలిదండ్రుల - ఆజ్ఞతోను, సమ్మతితోను అవసరమే లేకున్నది. అట్టివారి జీవితము క్షణికమైన ఆ ప్రేమప్రవాహము తాలూకు పొంగు తగ్గిపోఁగానే అసమదాంపత్యము తాలూకు స్వరూపము ప్రకటమయి బ్రదికియున్నంతవఱకును కలహాలతోను, అశాంతితోను కడచిపోవుట సంభవించుచున్నది. కాఁగా, గార్హస్థ్యము తాలూకు స్వర్గీయసుఖమునుండి వారు [illegible]గా వంచితులే అగుచుందురు. పాశ్చాత్యవిద్యాభ్యాసమువలనఁ గలిగెడు దోషములలో ఇది యొకటి, ప్రస్తావవశమున నిచట నుల్లేఖింపవలసి వచ్చినది. కాని ముఖ్యమయిన దోష మేమనఁగా, ఆంగ్లవిద్యాలయములలో విద్య నభ్యసించెడిస్త్రీలకు గృహకృత్యనిర్వహణజ్ఞానము బొత్తిగా ఉండనే ఉండదు. ఇదియే ముఖ్యముగా ఆలోచింపవలసినవిషయము. ఏమిటందురా? ఏకన్యకలు ముందుముందు గృహిణీపదమును ధరించి మాత లగుదురో, ఏబాలికలు ముందుముందు తమకొడుకుల భార్యల కత్తలగుదురో, ఎవరియోగ్యతాయోగ్యతల పయిని హైందవగృహస్థుల సుఖదుఃఖములు సర్వవిధములను ఆధారపడియుండునో, అట్టివారి విద్యాభ్యాసము విషయమున ఇంతగా నిర్లక్ష్యము చూపఁబడుచుండుటయే, ఇది మనశిక్షాప్రణాళికతాలూకు దోష మని మే మెంచెదము. దోష మెవరిదో అగుఁగాక! కాని, ఈదోషమును తొలఁగించుట ముఖ్యకర్తవ్య మనకతప్పదు. ప్రస్తుతకాలమున, వ్రాఁతకూఁత లెఱిఁగినకన్యక వివాహితయై తన అత్తవారియింటికి వెళ్లినప్పుడు, అచ్చటిపెద్దస్త్రీలు "దీనికి గృహకృత్యనిర్వహణజ్ఞానము లేదు" అని తప్పెంచుచుందురు. వంటచేయుటలోఁగాని, ఇతరమయిన గృహకృత్యనిర్వహణములోఁగాని యేమాత్రమయినను ప్రమాదము తటస్థించినచో దాని అత్తగారు, ఆఁడుబిడ్డ, తోడికోడలు మొదలగువారు, "చాలును. ఈపాటికి చాలించు. ఆఁ. అన్నియు నేర్చుకొన్నావు. ఇది కుర్చీలో కాళ్లు పాఱఁజాచుకొని కూర్చుండి పుస్తకాలు చదువుట కాదు." అని యేమేమో సాధింపుమాటలాడుచుండుటయే కాక పైపెచ్చు స్త్రీవిద్యనుసయితము నిందించుచుందురు. అంతియే కాదు: ఆపిల్ల తల్లిదండ్రులకుకూడ నాలుగుకుంచెల తిట్లు బహుమాన మిచ్చుచుందురు. వా రాడుచుండెడి మాటలవలన దానిహృదయము జల్లెడవలె చిల్లులు పడిపోవుచుండును. అది రాత్రి యేకాంతము లభించినచో నవయువకుఁడయిన తనపెనిమిటియొద్దను నిక్కమును తనదుఃఖమును వెళ్లఁబోసికొనుచుండును. వాఁడు ప్రేమగలవాఁడయినచో తానును ఏడ్చుచుండును. అట్లుకాక పశుప్రాయుఁడయినచో భార్యను మఱింత గద్దించుచుండును. ఏమైనా అగుఁగాక. ఇప్పుడు చెప్పవచ్చిన దేమనఁగా, ఎంతవఱకు ప్రకృతకాలపుస్త్రీవిద్యలో గార్హస్థ్యశాస్త్రము తాలూకు శిక్షకూడ సమావేశపఱుపఁబడదో అంతవఱకును ఈ పరిస్థితులు చక్కఁబడవనుట నిశ్చయము.

కాని, గార్హస్థ్యశాస్త్రమునుగుఱించి యింతవఱకును మాతృభాషలో ఉపయుక్తగ్రంథములు విద్యాలయపఠనీయములు లేనేలేవు. ఆంగ్లభాషలో "డొమెస్టిక్ ఎకానమీ, డొమెస్టిక్ సైయన్సు"లపై నున్న పుస్తకములు హైందవకన్యకల కుపయోగింపనవి కావు. అవి పాశ్చాత్యస్త్రీలగార్హస్థ్యవిధి కనుకూలించునవిగా వ్రాయఁబడియున్నవి. కాఁబట్టి, మనకు మనగార్హస్థ్యవిధి కనుకూలించుపుస్తకములు మన మాతృభాషలో వ్రాయఁబడవలెను. అవి పఠింపఁజేయవలెను. అప్పుడు గాని మనబాలికలకు గార్హస్థ్యశాస్త్రజ్ఞానము లభింపదు.

అజంతా చిత్రములు. ౧

గుహాలయము ౧౭



యువరాజదంపతులు పురవీథుల నేగుట

ఈచిత్రము పదునేడవ గుహాలయమున వసారాగోడయొక్క లోభాగమున నున్నది. కుడిప్రక్కనే నందునది యొక్క రాజభవనములోని మంటపము. రాజు సతీమణిని అంకతలమున నిడికొని సేవకుడొక డందిచ్చుమధువును సేవించుచున్నాడు. రాజదంపతు లిరువురునొక పర్యంకముపై నాసీనులై యున్నారు. వారిముందు ఎడమప్రక్క నొకకు తాంబూలపేటికయును. కుడిప్రక్క నొకకుబ్జుడు నిష్ఠీవనపాత్రమును గొని పిడముగానున్నారు. మంటపము వెనుకద్వారమునకు పటాచ్ఛాదనము కట్టబడియున్నది. అంతఃపుర బహిఃప్రదేశమున యువరాజదంపతులు రాజసౌభాగ్యములగు ఛత్రములతో నూరేగుచున్నారు. వారి పురోభాగమున నొకపరివ్రాజకుడు ఉత్సవాడంబరముల కసూయపడుచున్నాడో యనునట్లు పెడమొగముతో నిలుచుకొనియున్నాడు. వానిచేతి పై రాగులుధరించు సంకకొయ్య కలదు. చిత్రమున కెడమవైపున నొకద్వారము సమర్పబడియున్నది. ఆద్వారము దాటినయెడల రెండవచిత్రమున వర్ణింపబడినవీథికి రాగలము. చిత్రపరిమాణము 7'-9" × 4'-2"



అన్నప్రదానము. ౧
గుహాలయము ౧౭

ఈచిత్రము, పైనివర్ణింపబడిన చిత్రముయొక్క ఎడమప్రక్క దానియొక్క తరువాయిదై యున్నది.

ఇందు శ్రీదల కన్యాప్రదానము చేయుట కడుస్వభావోచితముగ చిత్రింపబడియున్నది. ఇది యువరాజసంపత్యున్నా

సందర్శమున చేయబడుచుండు అన్నప్రదానమే యయి యుండును. ఇందనేకులు, అంధులు, మూకులు, అంగవిహీనులు నగువారు భిక్షము గ్రహించుటకై గుంపులు గూడియున్నారు. పైభాగమున నొకపందిటిలో నాకీనులై అయిదుగురు భిక్షులు కలరు. వారిపాదములవద్ద అన్నపాత్రములు కలవు. క్రింద నిరువురు స్త్రీలు భిక్షులకు అన్నము నిచ్చుటకై లేచియున్నారు. వారికి క్రింద నొకడు అన్నపుకావడిని గొనివచ్చి దింపబోవుచున్నాడు. చిత్రమున క్రిందిభాగమున రెండశ్వము లున్నవి. వాటిప్రక్క నొకడు బీదలకన్నము నిచ్చుచున్నాడు. ఇట్టి స్వభావోచితచిత్రముల చిత్రించుటయందు జౌచిత్యపోషణ ఆజంతా చిత్రకారుల కుగ్గుపట్టిన పగ్గయియున్నది.

కొ. నరసింహాచారి.

---

## భిన్నభిన్న దేశముల బుద్ధవిగ్రహములు

౧౯౨౭ సం. సెప్టెంబరు నెల ౨౫ తేది "టైమ్సు ఆఫ్ ఇండియా" పత్రికనుండి.

బుద్ధుని జ్ఞాపకచిహ్నములుగ భిన్నభిన్న దేశ వస్త్రాలంకారములతో నిర్మింపబడిన బుద్ధవిగ్రహముల సంఖ్య యాభగవానుని యుపదేశములు పెక్కు దేశములయందు వ్యాపించెననుటను తెలుపుచున్నది. కాని యా దేశముల యందు నిర్మింపబడిన విగ్రహములన్నియు మూడువిధములుగనే—అనగా కూర్చున్నట్లు, నిలిచియున్నట్లు, పడుకొనియున్నట్లు—ఉన్నవి.

మొదటిది—కాళ్లను సిద్ధముగా నుంచుకొని వ్రేలికొనుపులను బొటనవ్రేలు తాకునట్లుగా వంగియున్న వ్రేళ్లుగలచేతులను జోడించుకొని యున్నట్లుండునది. ఈ వైఖరియే ధ్యానముద్ర. మఱియొకటి— ఎడమచేతిని ఒడిలో వెలకిలసాచికొని, కుడిచేతివ్రేళ్లు భూమిని జూపుచున్నట్లు సాచి పైకాలిమీద నుంచుకొనియున్నట్లున్నది. ఇది బుద్ధుని బుద్ధత్వప్రాప్తిని సూచించునది. భగవానుని బుద్ధత్వప్రాప్తికి భూమిని సాక్షిగ చూపుచున్నది చేయి. బుద్ధుని విగ్రహములు చాలవఱకీవిధముగనే యుండును. బర్మాలో నన్నియు నిట్లేయున్నవి.

నిలుచుకొనియున్న విగ్రహము బుద్ధు డుపదేశించుచుండుటను సూచించును. ఇది ఉపదేశముద్ర: అనగా రెండుచేతులను పైకిసాచికొని, లేక కుడిఅరచేతిని వ్రేళ్లతోకూడ పైకిసాచియు ఎడమఅరచేతిని వ్రేళ్లతో కూడ క్రిందికిసాచియు నుండుట. ఇందు మొదటిది క్రోతలించుకయేని భీతిలనవసరము లేదనుటను, రెండవది క్రోతలకు అభీష్టముల నొసగుటయును సూచించును. చిత్రమునందలి ఎడమవైపున కొట్టకొసనున్న చిత్రమున చూపుడు వ్రేలు బొటనవ్రేలును స్పృశించుచున్నట్లున్నది. ఇందు ముద్రచక్కగా చెక్కబడినది. చేతియొక్క బొటన



వ్రేలు, ఆకాశభూతమును (దైవమునకు చేరువనున్న దానిని) తక్కిన నాల్గువ్రేళ్లను క్రమముగా వాయ్వగ్న్యప్పృథివీభూతములను, రెండువ్రేళ్లు స్పృశించియుండుట దైవాత్మలసన్నిహితత్త్వమును సూచించుచున్నది.

నిలుచుకొనియుండునట్లు చెక్కబడిన పెక్కువిగ్రహములకు పద్మాకారముగల పీఠముగలదు. బుద్ధుని పాదములు భూమిని స్పృశింపకూడదను కారణమున పద్మము నధిష్ఠించెనా యనుటను బౌద్ధేతిహాసములయం దారయవలయును. పండుకొనియుండు విగ్రహములు శాంతిముద్రను సూచించునవి.

---

## కృష్ణుడికి మీసాలున్నవా?

వేలాల రామకృష్ణారావు గారు ఇట్లు వ్రాయుచున్నారు:

మొన్న సెప్టంబరు భారతిపత్రికలోపడ్డ కృష్ణవేషం తాలూకు ఛాయాచిత్రం చూచేసరికి కదేమిటో కాని నాకో విచిత్రమైనమార్పు దాన్లోవున్నట్టుగాతోచింది. ఏమిటామార్పు? దాన్లో స్పష్టంగా మీసాలుకనబడ్డాయి ఇదేమిటబ్బా! పూర్వం ఎవళ్లూ యిలాగవేషం వేసేటప్పుడు కృష్ణుడిపాత్రకి మీసాలూ గడ్డాలు పెట్టుకోలేదే! ఆధారం సందర్భం అదీకొంచెం ఆలోచించాలి.

మొదట పురాణాలూ, ప్రబంధాలూ చూద్దాం. కృష్ణుణ్ణివర్ణించినప్పుడల్లా నీలిరంగువాడు, ఆజానుబాహువు, అని ఏవో చెప్పేరుకాని మీసాలు, గడ్డాలు ఊసు ఎవళ్లూపోలేదు. ముంగుర్లు నల్లగా తుమ్మెదరెక్కల్లాగవచ్చి మొహంమీదపడుతున్నాయని రాయడమే కాని మీసాలమాటే లేదు. అంచేతే కృష్ణుడూ అనేసరికి మీసాల్లేని, నీలివ్యక్తి, పిల్లంగోలుతో కూడా ఎదుట మనకి కనపడతాడు. మీసాలున్నమాటే, తలపేఅసలుం డదు. మీసాలంటే అందర్లాగా కృష్ణుడికేమో కాని అందమేలేదు.

రవివర్మ, చిత్రకారుల కందరికీ పితామహుల్లాంటివాడుకదా—అతనిచిత్రాలు నే చాలాచూసేను. కాని ఒక్కబొమ్మలోనూ మీసము లేదు. అది చిన్ననాటిబొమ్మలేమో అనుకుందామంటే అలాక్కూడా అనడానికి వీల్లేదు. కొన్ని పెద్దవాడైన తరువాతివే ఉన్నట్టున్నాయి. కాని వేటిలోనూ మీసాలు కనబడవు. పోనీ ఈఅవతారాలన్నిట్లకీ ముఖ్యకారకుడు, పీడిలాంటివాడుకదా విష్ణుమూర్తి. వాడికైనా మీసము లేనేలేదు. ఎవళ్లకీ లేని నాలుగుచేతులున్నాయి, శంఖంమొదలైన అక్కరలేని ఆయుధాలున్నాయి, అంతేకాని మీసాల్లేవు. మరి కారణం ఏమిటోకాని కృష్ణుడికి మీసాలుండిన పాపాన్నవడూ పోలేదు. పాపం! వాళ్లేమిటి చేసేరు. పురాణాలు తీసేరు; ఆవర్ణనకి మక్కికి మక్కి పెట్టినట్టు శుభ్రంగా బొమ్మవ్రాసేరు; లోకానికి సమర్పించేరు. పోనీ భావకవిత్వంలా కొత్తగా యిలాంటిమార్పు చిత్రకళలోకూడా జరిగిందా అని కొంచెం చూసేను. వాటిలో మీసాలుంటాయేమో కాని నాకింకా అంతఅవకాశం లభించలేదు. మీయిష్టం. మీసాలున్న బొమ్మచూపెట్టి అదికృష్ణుడి బొమ్మఅని చిన్నపిల్లడితో చెప్పినా నమ్మతాడనుకోను. లోకంలో ఆకృష్ణ నారూపం పాంజేరు. ఇక దాన్ని గింజరుతిన్నా కన్నా తప్పించలేము.

ఇదో కొత్తఫేషన్ కాబోలు; యిప్పుడుకృష్ణుడికి మీసాలొచ్చేయేమో అనుకున్నానుకాని నాటకాల్లో మరెవళ్లైనా యిలా వేషంవేసేరా? ఏమంటే అది ఒకఫేషన్. ఇప్పటినాటకాల్లో సంగతీ సందర్భం అక్కరలేదులెండి. హిందూరాజు కోర్టులో ఇంగ్లీషుడేన్సింగు, హైనాపాటలు. ఇంతాచేస్తే జర్మనీవేషాలు. అలాంటిదాన్లోనైనా కృష్ణుడు, మీసాలతో ఉన్నకృష్ణుడు, ఇదివరకు రంగస్థలంలోకి రాలేదు. హైందవమహాజన హృదయాంతరంగంబులకూడా అట్టిరూపం గోచరించడం లేదు. అట్లు గోచరించడం ముమ్ముందుకూడ జరగడం కష్టమే అనుకుంటూ, పురాణాలలో కానీ, చిత్రాల్లో కాని ఎక్కడా మరి కృష్ణుడికి మీసాలు లేనట్టైనా? పాపం! యుగజన్మం ఎత్తికూడా మీసాలు కృష్ణుడికి ఎందుచేత లేకపోయేనో! కారణం అదీకొంత ఉంటుందనుకుంటూ.—నాకుమాత్రం అదేమిటో తెలీదు. నలుగురూకొత్త విషయాలు రాస్తూ వుంటే 'నలుగురితోటిపాటు నారాయణా' అని నేను కూడ ఈవ్యాసం రాసేను. ఇక కృష్ణుడికి మీసాలు నిజంగా ఉన్నాయో లేవో అందరు కలిసి లాగడానికి

ప్రయత్నించాలి. ఏదో స్వీకరిస్తే బొమ్మలలో వర్ణనలో కూడా విశాలకి ప్లేసివ్వవచ్చును. ఇందరును ఏ పండితు లున్నారు. ఇన్ని సముకులు అవీ వున్నాయి. వారంతా దీన్ని గురించి పెతికితే నా శ్రమ సార్థకమవును.

---

## చారులీలావిలాసము-కృతికర్త

మానిడిపల్లి వెంకటకృష్ణశర్మ గారు ఇట్లు వ్రాయుచున్నారు:

చారులీలావిలాసమునుగూర్చి శ్రీయుత మానవల్లి రామకృష్ణకవిగారు గతజూలై మాసపు భారతియందు ప్రస్తావించిరి. అందు:

'రాజకులావతంస' పదము క్షత్రియత్వమును సాధించునని తలంచుచు, కాళభూపతి నెల్లూరుపనుమ సిద్ధిపంక్త్యలలోని తిరుకాళభూపతియనియు, రెండుశతాబ్దములక్రిందట రచనమనియు వ్రాసియున్నారు. ఇందలి నిజమిట్లుక్రింద వివరింతును.

చారులీలావిలాసము అత్యంతశిథిలమగు వ్రాతప్రతిని ధురాంతకమునకు సమీపమునగల గ్రామమున మాబంధువునింట చిక్కెను. ఆ వ్రాతప్రతిని దెచ్చి చెన్నపురియందు దపుకుంటిన (1927 సంవత్సరము) కీర్తిశేషులగు వంగూరు సుబ్బారావుగారి చేతికిచ్చితిని. అప్పుడే అతడు ఆంధ్రపత్రిక సారస్వతానుబంధమున ప్రకటించియుండెను. ఆంధ్ర గ్రంథపరిశోధకమండలి వారు గ్రంథమునుగూర్చి శోధింతునని యిచ్చితిని. శ్రీ మా. రామకృష్ణకవిగారీ గ్రంథమునుజూచిరేని యిప్పుడు వ్రాసి యుండురనుకొనుచున్నాను.

2. చారులీలావిలాసకృతికర్తయగు కీ. శే మారు పెద్ది చెంగల్వరాయ కవిగారు నామాతామహికి మేనమామ. ఈకవి భరతశాస్త్రమునందు కడుంగడుసమర్థుడు. భారతిలో లిఖింపబడియాకవికి చేర్చియుండు విద్యలన్నింటియందేగాక మంత్రశాస్త్రమున నితడు పెట్టినది భిక్షమట.

ఈకవికడ కెందరో వేశ్యకన్యలు భరతము నేర్చి ప్రఖ్యాతినందిరి. శెయ్యారుశారదాంబయను 60 సంవత్సరములవయసుగలవేశ్య—చెంగల్వరాయకవిగారి ప్రియశిష్యురాలింకను జీవించియున్నది.

ఈశారదాంబ పచ్చికుండపైన భరతనాట్యము సేయుటకు నీకవికడ నేర్చుకొని జమీందారు ... ముఖమున నర్తనమొనరించి యున్నది.

చారులీలావిలాసముగాక ఇక్కవి మరికొన్ని కృతులను, పాటలను, రచించియున్నట్లు తెలియుచున్నది. మాయింట్ల నాతని పాటలమాత్రము కొన్ని పాడుచున్నారు. అష్టపదులవలె నిందు కొన్ని కష్టతరములై నకీర్తనలుకలవు. చాటుపద్యములు పండితులనోళ్ళకాలదిగనున్నవి.

3. కవిగారు చెంగల్పట్టుజిల్లా మధురాంతకము తాలూకాలోని శెయ్యారుగ్రామవాసులు. ముగ్గురన్నదమ్ములలో నితడు ద్వితీయుడు. మాపెదతాతను చేరదీసిన తరువాత మా మేనమామగారియింట గతించెను. చెంగల్వరాయకవి తనయిరువదిరెండవయేట చారులీలావిలాసమును విరచించెనట. ఈడ కీకవి డెబ్బదిసంవత్సరములు బ్రతికి వికారిసంవత్సర మాఘశుద్ధ ద్వాదశి కవివ... నాడు బ్రహ్మపదమేగెను.

4. కృతిభర్త క్షత్రియుడు కాడు. శెయ్యారు జమీందారగు తిరుకాళత్తి ముదలారిగారు. కృతికర్తయే యితనికివిద్యాభ్యాసముచేసి రసికశేఖరునిగ నొనరించెను. కృతిభర్తయగు తిరుకాళప్పముదలారిగారి పౌత్రుడు అదేపేరుగలతాతడు నాల్గుసంవత్సరములనాడు శివసాయుజ్యముపొందెను.

5. చెంగల్వరాయకవిగారి చరిత్రము, కృతులు సంగ్రహించుటకు ప్రయత్నించుచున్నాను. త్వరలో నా ప్రయత్నము నెరవేరునని విశ్వసించెదను.

శ్రీ రామకృష్ణకవిగారుగాని, మరియితరులుగాని, ప్రయత్నము సేయుదురను అపేక్షతో యీ చిన్న లేఖను ప్రచురించుచున్నాను.

---

## కాశిలోని యాలయములు, ఘాటులు

'మనోరమ' సెప్టెంబరుసంచికలో శ్రీయుత శ్యామలాల్ భైరవలాల్ మేత్, యం.

ఏ., యల్. యల్. బి. గారు వ్రాసిన వ్యాసమునుండి.

### ఆలయములు

కాశిలో సందుసందునను శివాలయములే. ధనికుఁడగు ప్రతిహిందువునకును కాశిలో దేవాలయము గట్టింపవలెనన్న కోర్కె కలుగుచుండును గాఁబోలు; కనుకనే యిన్ని దేవాలయములు వచ్చియుండును. కాని యిన్నిటను శ్రీవిశ్వనాథుని ఆలయమే ప్రథమస్థానముఁ బడయును. ఇప్పటికట్టడము ఇండోరుమహారాణి అహల్యాబాయి కట్టించినది. గోపురమునకు వేసిన బంగారుకప్పు పంజాబుకేసరి మహారాజా రణజిత్‌సింహుఁ డొసఁగినది. ద్వారము ప్రవేశించుటతోడనే రొమ్ముట మండపము, కుడిప్రక్క దేవాలయమును గోచరించును. నేల పాలరాలతో నింపియున్నది; అందొకరసికుఁడు రూపాయలనదికించెను. నాలుగువైపులను అంగణములున్నవి. అక్కడ కూర్చుండి భక్తజనులు విశ్వనాథస్వామిని భజించుచుందురు. కాశీనాథుని దేవాలయ మగుటచే నిచట జనసమూహ మెప్పుడు నుండును. కాని యేదైన గొప్పపర్వము వచ్చినచో సమ్మర్దము హెచ్చును.

సమీపముననే ఒకవైపు జ్ఞానవాపియను బావి యున్నది. అందలి నీటితో నొక్కసారి ఆచమనము చేసినచో జ్ఞానోదయ మగును. రెండవవైపు అన్నపూర్ణాదేవి యాలయ మున్నది.

'ఆర్సీఘాట్' నకు సమీపమున దుర్గాదేవి యాలయ మున్నది. దానిసంటియొక తటాకమున్నది: దానిని దుర్గాకుండ మందురు. 'విశ్వేశ్వరగంజి' బజారునద్దఱ భైరవనాథుని యాలయ మున్నది. భూతప్రేతాదులయందు నమ్మకముగల జను లిచట గుంపులుగనుందురు. అంగణమున భైరవభక్తు లనేకులు భస్మముతోను, తాయెతులతోను, కూర్చుండియుందురు. కంపెనీతోఁపునకు సమీపమున పెద్దగణేశదేవాలయమున్నది. ఘాటుచెంత బాలా, జహీర్, భోంసలా దేవళములును చూడఁదగినవి.

చౌఖంభావద్ద వల్లభాచారుననుయాములకుఁ జెందిన గోపాల దేవాలయ మున్నది. అస్సీఘాటునందు జైనదేవాలయములును, సారనాథునందు బౌద్ధమఠమును వెలయుచున్నవి. సాక్షివినాయకుని యాలయము, బిందుమాధవస్వామి యాలయము, సంకటాదేవికోవెల మున్నగున వన్నియును దర్శింపఁదగిన స్థలములు.

ఇవన్నియు బహిరంగ దేవాలయములు. ఇవిగాక యందఱును వెళ్లుటకు వీలులేని రహస్యాలయములు గూడ ననేకము లున్నవి. ఈ ఆలయములకడ నన్నసత్రము లెన్నియో యున్నవి: ఇక్కడ ప్రతిదిన మొక నిర్ణీతసంఖ్య కీడల కన్నదానము జరుగుచుండును.

### ఘట్టములు (ఘాటులు)

'వరుణ' మొదలు 'అస్సీ'వఱకును చక్కనిఘట్టము లున్నవి. సాయంకాలమున డఫ్రినువంతెనపై నిలిచి, కాశీపట్టణముమీఁద దృష్టిపారించినచో, అస్తంగతుఁడగుచున్న సూర్యుని కాంతియందు నదీతీరమందలి యాలయముల శిఖరములును, మసీదుల మీనారులును అతిమనోహరముగఁ గన్పట్టుచుండ, నెంతసేపైనను చూచుచుండవలె ననియే బుద్ధి పుట్టును.

రాజఘాట్:—ఇక్కడనే పీపాలవంతెన మొదలగును. తొలుత నిచట విజయనగరము రాజదుర్గ ముండెడిది. కనుకనే దీనికి 'రాజఘాట్' అను పేరు వచ్చినది. సమీపముననే గంగావరుణాసంగమ మున్నది. ఇచ్చట మహావారుణీపర్వమున గొప్పయుత్సవము జరుగును. ఇక్కడకు కొంచెముదూరముననే 'కాపిలధార' యను స్థలమున్నది. ఇక్కడ 'ఆదికేశవు'ని యాలయ మొకటి యున్నది.

ప్రహ్లాదఘాట్:—విష్ణుభక్తాగ్రేసరుఁడగు ప్రహ్లాదుని పేర నీఘట్టము వెలయుచున్నది.

నయాఘాట్:—బాబూ నరసింహదాసు లను నాయన దీనిని నిర్మించెను.

త్రిలోచనఘాట్:—ఈఘట్టమును, ఇచ్చటి యాలయమును పూనావగరపు బాలాజీగారు నిర్మించిరి. ఈ ఘట్టమును గూర్చి యొకచిన్నకథ యున్నది: విష్ణువు మహాదేవునిఁ బ్రసన్నునిఁ జేసికొనుటకై యిచట కఠినముగ తపశ్చర్య గావించెనట. ఒకవేయి తామరపువ్వుల నర్పింప నెంచి, ఒకపువ్వు తక్కువకాఁగా తననేత్ర మొకటి తీసి యర్పించెను. దానితో శివుఁ డత్యంతసంప్రీతుఁ

పైయాలో జనమును దన మకుటమునే తాల్చెను. కను కనే యాకేదు(త్రిలో చనుట జయ్యెను.

**శీతలాఘాట్ :—** శీతలాదేవి పేరుమీద నీఘట్ట మేర్పడెను.

**గయాఘాట్ :—** పూర్వకాలమున నిచట గోవులకు నీరుపెట్టెడివారు. (హిందీలో 'గాయ్' అనగా 'గోవు'.)

**లాల్ ఘాట్ :—** గోపీమనోహరుని క్రీడల స్మరణార్థ మీఘట్టమునకు 'లాల్ ఘాట్' అను పేరు పెట్టఁబడినది. (హిందీలో 'లాల్' అనఁగా 'ప్రేమాస్పదమైన' యనియర్థము.)

**పంచగంగాఘాట్ :—** ఇది ఆమేరుపతి రాజామానసింహునిచే నిర్మితమైన ఘట్టము. గంగ, యమున, సరస్వతి, కిరణ, ధూతపాపాయను నైదునదులు నిందుఁగలయుచున్నవి. ముగలపాదుషా షాహజహానుని యాస్థానకవీశ్వరుఁడగు జగన్నాథ పండితరాయలు తాను ప్రేమించిన లవంగియను యవన సుందరీమణిని దన ప్రభువు నడిగి పడసి, యామెతో సరసము నెఱపుటచే బ్రాహ్మణు లాతనిని వెలివేసిరి. అంతటఁ దననిర్దోషిత్వమును ఋజువుచేయుట కాతఁ డీతావుననే కూర్చుండి యొక్కొక్క శ్లోకమున కొక్కొక్క మెట్టు చొప్పున గంగాదేవి సేఁబది రెండు మెట్లు పయి కెక్కించి గంగోదకమున పవిత్రస్నాన మాచరించెను.

**లక్ష్మణబాలాఘాట్ ;—** ఇది సింధియారాజు నిర్మించినది. ఈఘట్టమునకు (ప్రక్క)ని లక్ష్మణబాలాదేవి యాలయ మున్నది.

**రామఘాట్ :—** దాదాపు రెండు శతాబ్దములకు పూర్వము జయపూరు మహారాజు దీనిని నిర్మించెను. శ్రీరామనవమి కిచ్చట నుత్సవము జరుగును.

**అగ్నీశ్వర ఘాట్ ;—** పూనా పేష్వాలలో గుట్టతుదివాఁడగు బాజీరావు దీనిని నిర్మించెను.

**భోంసలా ఘాట్ :—** నాగపూరు పుర భోంసలారాజు దీనిని క్రీ. శ. ౧౭౯౫ లో కట్టించెను.

**గంగామహాల్ ఘాట్ :—** ఈరేవును, దీని పైఁగల కట్టడమును కాశీనగరపండితుఁడు బేనీరామ్‌జీ కెందినవఁట. బేనీరామ్‌జీ భోంసలా రాజావారి వకీలు, ఒకతోఁటను, రు. ౧౦౦౦౦౦ ల రొక్కము ఇచ్చి రాజావారు గంగామహాలు తీసికొన్నారఁట.

**సింధియా ఘాట్ :—** క్రీ.శ. ౧౮౩౦ సం. న గ్వాలియరు మహారాణీ బైజాబాయి దీనిని గట్టింప నారంభించెను.

**మణికర్ణికా ఘాట్ :—** ఇది మహారాణీ అహల్యాబాయి కట్టించినది. ఇచ్చట మణికర్ణికయను గుండ మున్నది. కాశీఖండములో నిది చక్రపుష్కరిణి యని పేర్కొనఁబడినది. దీనిపొడవు ౬౦ అడుగులు, లోఁతు ౩౦ అడుగులు. దీని యొడ్డున క్షేత్రపతుండ మొకటి యున్నది.

**శ్మశానఘాట్ :—** ఇది అయోధ్యనవాబు సఫ్‌దర్‌జంగ్ కడ నుద్యోగియగు లాలా కాశ్మీరీమల్ కట్టించినది. ఇది యేర్పడి ౧౮౬ వత్సరము లయినది.

**లలితాఘాట్ :—** దీనిమీఁద రాజరాజేశ్వరీదేవి కోవెల యున్నది.

**మీర్ ఘాట్ :—** ఇది మీర్‌రుస్తుమ్ అలీ కడ కార్యనిర్వాహకుఁడగు మనసారాము అనువాఁడు కట్టించినది.

**మానమందిరఘాట్ :—** ఆ మేరు పతి రాజా మానసింహుఁడు దీనినినిర్మింపఁజేసెను.

**దశాశ్వమేధఘాట్ :—** ఈస్థలమున బ్రహ్మ పదియశ్వమేధయాగములను జేసెను.

**అహల్యాబాయిఘాట్ :—** ఇది మహారాణీ అహల్యాబాయి కట్టించినది.

**మున్షీఘాట్ :—** దీనిని నాగపురపుదివాను మున్షీ శ్రీధరనారాయణదాసు కట్టించెను. (మున్షీ అనఁగా విద్వాంసుఁడు.)

**చౌసతీఘాట్ :—** బంగాళాదేశపురాజాది, గజపతి దీనిని నిర్మించెను. దేవీదాసును వల్లలో నేరము

ట్కై అఱువదినలుగురు యోగినులు కాశీ వచ్చిరి; కాని దేవీదాసు లొంగలేదు. ఇచ్చట అఱువదినాల్గు దేవుల గుడి యున్నది. (చౌసఠ్ అనగా అఱువదినాల్గు.

రాజాఘాట్:—ఇది పేష్వాప్రతినిధియగు రాజావినాయకరావు పీర్పఱించినది.

హరిశ్చంద్రఘాట్:—ఇచ్చట హరిశ్చంద్ర చక్రవర్తి కాటికాపరితనము సెలపెను.

హనుమాన్ ఘాట్:—దీనిపైని హనుమంతుని గుడి యున్నది.

శివాలాఘాట్:— దీనిని రాజా బలవంత సింహుని కోశాధిపతి వైజనాథమిశ్రుడు నిర్మించెను.

తులసీఘాట్:— దీనిపైని తులసీదాసు గుడియున్నది. ఇచ్చట నేవారు నివసించెడివారు. ౧౬౮౦ సం.లో నిచ్చటనే వారు స్వర్గస్థులైరి. వారిపాదుకలిప్పటికి నిచ్చట నున్నవి.

రలామిశ్రఘాట్:— ఇది రలామిశ్రుడు కట్టించెను.

అస్సీఘాట్:— దీనిపైని జైనులమందిరము లున్నవి.

---

## వృక్షములు హెచ్చుకొలది వర్షము హెచ్చుగ వర్షించును

జయకర్ణాటక ౧౭-వ సంపుటము, ౧౦-వ సంచికనుండి—.

పశ్చిమహిందూదేశమున కొన్నిసంవత్సరములకు పూర్వము వర్షము అపరిమితముగ కురియుచుండెడిది. [illegible]త అచ్చట పెద్దపెద్దకర్మాగారములు నెలకొనుట [illegible] అచ్చటనున్న చెట్లనన్నింటిని నఱికి ఆకర్మాగారముల కుపయోగించుచు వచ్చిరి. అచ్చట చెట్లు తగ్గుకొలది వానయు తగ్గజొచ్చెను. ప్రపంచమునం దెచ్చటగాని—మరుభూములయందు సైతము—చెట్లున్నచోట్ల తదితర స్థలములయందుకంటె వాన అధికముగ కురియుచున్నది. ఇప్పటికి ౬౦ సంవత్సరములకు పూర్వము ఈజిప్టునందలి నీలునదియొడ్డున సంవత్సరమునకు ౬ దినములు మాత్రమే వాన కురియుచుండెను. తరువాత ఆనదీతీరమున క్రమముగ యూకలిప్టస్ చెట్లను వేసి పెంచ మొదలిడిరి. ఆచెట్ల సంఖ్య పెరుగుకొలది వాన అధికముగ కురియుచు అర్ధమము సంవత్సరమునకు ౧ముక్కాలు నెలకాలము ఇప్పుడు వానకురియుచున్నది. ఉత్తరఆఫ్రికా ఖండమునందలి ఆల్జీరియాదేశమున వాన చాలతక్కువగ కురియుచుండెను. మూడవనెపోలియను లక్షలకొలదిగ వృక్షముల నాటఁ జేయించెను. తదాది మూడుపంతులు వాన అచ్చటనే కురియుచున్నది. ఇదియంతయు తెలిసియే జర్మనీలో వృక్షములను పెంచువిషయమున ఎక్కువ జాగ్రత వహించి కట్టుదిట్టములు చేసియున్నారు. అచ్చట ఒక చెట్టును నఱికివేసినచో దానిస్థానమున మఱియొకదానిని నాటి పెంచి పెద్దదానిని చేయువరకు నఱకినవాడు జాగరూకతతో పూచీపడియుండవలెనని ప్రభుత్వపుటాజ్ఞ కలదు—"లోకరహస్య"

---

## ఎవడు బ్రాహ్మణుడు?

౧౯౩౬వ సంవత్సరపు మైసూరు ఆర్కియాలాజికల్ రిపోర్టులో శ్రీమాన్ అత్తా తిరువెంకటాచార్య స్వామిగారియొక్క శిష్యులొక్కరు 'జాతి యనగా నేమి' అను విషయమును గుఱించి వ్రాసిన సంస్కృతపత్రమున కాంగ్లానువాదము ప్రకటింపఁబడినది. అందు వారిట్లు నుడివిరి:

బ్రాహ్మణు డెవడు? బ్రాహ్మణత్వము ఆత్మనిష్ఠమా? దేహనిష్ఠమా? జాతిప్రధానమా? జ్ఞానము ప్రధానమా? సద్గుణములవలనగాని, సత్కార్యములవలనగాని బ్రాహ్మణత్వమును బడయుజనునా?

బ్రాహ్మణత్వ మాత్మనిష్ఠమైనది కాదు.

పీలయున: ఆత్మ సృష్ట్యాదినుండి పెక్కు దేహముల నాశ్రయించియున్నది. మున్ముందును పెక్కుశరీరముల యందు వాసముచేయగలదు. ఆత్మ కాశ్రయములైన శరీరములు వివిధరూపముల నున్నను ఆత్మ ఏకరూపముననే యుండును.

బ్రాహ్మణత్వము దేహనిష్ఠమును గాదు.

ఏలయన: బ్రాహ్మణునకును, తదితరజాతులకును దేహనిర్మాణమున నిట్టిభేదమును లేదు. ఎల్ల శరీరములకును జన్మవృద్ధిక్షయములు గలవు. వయఃపరిమాణాదులును ఎల్లరకు సమానములే.

జ్ఞానము కేవలము బ్రాహ్మణులసొత్తు కాదు. బ్రాహ్మణులమాత్రమే జ్ఞానసహితులు కారు. పెక్కురు బ్రాహ్మణేతరులు సైతము సుజ్ఞానులుగ నున్నారు.

బ్రాహ్మణులు సజ్జనులును, తదితరులు దుర్జనులును గారు. ఎల్ల జాతులయందును సద్ధర్మపరాయణులు గలరు.

ఇక బ్రాహ్మణు డెవడు? ఆత్మస్వరూపమును గుర్తెఱిగినవాడు. ఆత్మ త్రైగుణ్యరహితము; [illegible]యము; దుఃఖము, శ్రమ, జర, మృత్యువు, క్షుత్తు, తృష్ణలను లేనిది; కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్య విరహితము; సచ్చిదానందము; సర్వాంతర్యామి; పరిపూర్ణము నైన దను విశ్వాసముగల యాతడే బ్రాహ్మణుడు.



# విషాదగీతి

ప్రవిమలానందడోలికాగ్రములలోన
ప్రకృతిలలితాంగి నూతనప్రభల నొంది
భవ్యపుష్పాళితో వనప్రాంత మెల్ల
వింతవింత సోయగము గన్పట్టినపుడు;

లలితసుమనోజ్ఞమాధురీలహరితోడ
చిగురుకొమ్మలపై నెక్కి చిన్నపికము
మృదుమధురనవ్యసంగీతమంజుగీతి
నాలపించెడిని ప్రశాంత వేళలందు;

వెల్లివిరిసిన యానందవిమలవారి
ప్రకృతి నిజరూపు జూపించి పాఱునపుడు;
కాంత! ఏలనో? నామనోగగనసీమ
నలముకొనసాగెను విషాదజలధరములు.

గగనతలమున నున్నతనగములందు
చారుశారదశర్వరీచంద్రునందు
మినుకుమినుకను తారకాగణములందు
కోరదగినట్టి కోయిల కూతలందు
నవ్యదివ్యామృతంబులే లేవులేవు.

రోదసీకుహరంబు మార్మోగురీతి
సాగి వినిపించెనేమొ విషాదగీతి;
సచ్చిదానందరూపుని సర్వమయుని
విశ్వమోహనమూర్తిని వేదవేద్య
సంస్తుతపంకేరుహాంఘ్రుల నాత్మ దలచి
సకల మేమఱియుండెద స్వామికృపను.

'అమల' గ్రంథకర్త్రి.




## గౌతమధర్మసూత్రములు

అనువాదకులు, ప్రకాశకులు: బ్రహ్మశ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు. క్రౌను ౧ పేజీల సైజున ౧౬౦ పుటలుగల గ్రంథము. దీని వెల గ్రంథమాలికా చందాదారులకు రు ౧-౮-౦, ఇతరులకు రు ౨-౦-౦.

విదేశసంస్కారవ్యామోహమున దగుల్కొని భారతదేశము స్వీయమాహాత్మ్యమును, గౌరవమును నానాటికి గోల్పోవుచున్నది. భారతదేశమునందలి యెల్ల జాతులును స్వధర్మములను వీడి పరధర్మముల నవలంబించి క్రమముగ క్షీణించుచున్నవి. ఎల్ల జాతులయందును ఉత్తమ మనబరగి సద్ధర్మసదాచారములకు బుట్టినిల్లయి, అనంతమహిమాస్పదమయి యొకనాడు వెలయుచుండిన బ్రాహ్మణ్య మీనా డనార్యమై పరాభవము పాలగుచున్నది. స్వధర్మానభిజ్ఞతయే యీదురవస్థకు గారణము.

ఆయాజాతుల ధర్మములను వివరించు నార్యవాఙ్మయ మనంతముగ వెలయుచున్నను సంస్కృతభాషయం దుండుటచేత నది యాభాషయందు జ్ఞానములేనివారి కించుకయేని బోధపడజాలకున్నది. ప్రస్తుతవిద్యావి[illegible]న నార్యవాఙ్మయబోధనమునకు దావులేదు. దేశ[illegible]తనమే నిర్బంధము కానపుడు, సంస్కృతభాషయందున్న యార్యవాఙ్మయముమాట చెప్పనేల?

ఇక నార్యవిజ్ఞానవ్యాప్తి యెట్లు కాగలదు? భారతదేశము స్వీయప్రాచీనౌన్నత్యమును మరల నెట్లు వడయగలదు? దీనికిగలమార్గ మొక్కటియే: ఆర్యవాఙ్మయగ్రంథములకన్నింటికిని దేశభాషలయందు సుబోధములగు ననువాదములు బయలుదేరుట. శిష్టాచారసంపన్నులగు పండితు లీపనికి నడుముకట్టి పూనుకొనవలెను. సంపన్నులగువా రాయనువాదములను బ్రచారమునకు వచ్చునట్లు చేయవలెను. ఇట్లు గట్టిప్రయత్నములు జరిగినచో మున్ముందొకనాటికైన భారతదేశము తనప్రాచీనౌన్నత్యమును బడయగలదని విశ్వసింపదగును.

సంస్కృతాంధ్రభాషాకోవిదులగు శ్రీ ఆదినారాయణ శాస్త్రిగారు ఈగౌతమ ధర్మసూత్రముల నాంధ్రీకరించి, ముద్రణాదులకగునవ్యయమును తామే భరించి యిట్లు గ్రంథరూపమున వెలువరించి యాంధ్రలోకమునకు మహోపకారము గావించి మార్గదర్శకులైరి. వీరి యీపట్టుదల యెంతేయు మెచ్చదగినది. విఘ్నశతముల నెదుర్కొని వీరిదివరకు నాంధ్రీకరించి ప్రకటించిన వాత్స్యాయన సూత్రములు వీరిపట్టుదలకు మఱియొక తార్కాణము.

మానవులు జన్మించినది మొదలు మరణించువరకు జాతులను, ఆశ్రమములను, దేశకాలములను అనుసరించి తమజీవితమును స్వధర్మనిష్ఠమును, సన్మార్గప్రవణమును, సుఖమయమును గావించుకొనుటకు వలసినవిధులను ఆర్యవాఙ్మయమున ధర్మశాస్త్రగ్రంథములు బోధించుచున్నవి. ధర్మశాస్త్రగ్రంథములలో నెల్ల నీగౌతమధర్మసూత్రము లతిప్రాచీనములు, నత్యుత్కృష్టములు నైనవి. వీనిని పూజ్యపాదులగు గౌతమమహర్షి సూత్రించినాడు. దీనికితరువాత ఆపస్తంబ, బోధాయన, కాత్యాయనాదులు మఱికొన్ని ధర్మశాస్త్రగ్రంథములను రచియించిరి. ఈ గ్రంథము లొక్కొక్కటియు నొక్కొక్కశాఖకు జెందినవా రనుసరింపవలసిన ధర్మములను జెప్పునవి. ఈ గౌతమధర్మసూత్రములు ఛాందోగ్య (సామవేదీయ)

శాఖవా రాచరింపవలసిన ధర్మకర్మకాండముల విధానమును వివరించుచున్నవి.

ఈగ్రంథమును దా మాంధ్రీకరించుటయందు తమకుగల విశ్వాసమును శాస్త్రిగా రిట్లు పేర్కొన్నారు:

“మొత్తముమీద ఆర్యసంఘముయొక్క ప్రాచీన పరిస్థితులను ఈగ్రంథము చక్కగా మనకు ప్రదర్శించు చున్నదనుట నిస్సందిగ్ధ మగువిషయము. కావున నిందలి ధర్మములను, విధానములను తూచాతప్పకుండ నీకాలమున నాచరణకు గొనివచ్చినను రాకున్నను ఇప్పటి మనవారు మనప్రాచీన సంఘముయొక్క ఆదర్శములను, పద్ధతులను ఒక్కమాఱు సంస్కరించుటకైనను ఇట్టిగ్రంథములు ఈ కాలమున కత్యంతము నావశ్యకము లని మావిశ్వాసము. కనుకనే మేమీపనికిబూని మాయోపినమట్టునకు ఇట్టి గ్రంథములను సమూలములుగను, సవ్యాఖ్యలుగను సాధ్యమైనంతవఱకు విషయవైశద్యములను గల తెలుగువివరణముతోను మాసోదరులగు నాంధ్రదేశీయులకు ప్రచురించి నివేదించి సేవచేయందలంచితిమి.”

మఱియు నాంధ్రీకరణమున దా నుపయోగించిన గ్రంథములను, అవలంబించినమార్గమును ఈక్రిందివిధమున సూచించినారు:

“ప్రకృతము ప్రకటింపబడు నీగౌతమధర్మసూత్రమునకు వ్యాఖ్యానము వ్రాసినవాడు హరదత్తాచార్యుడు. ఈయనవ్యాఖ్యానముగాక దీనిపైని మస్కరీయభాష్య మని మఱియొక వ్యాఖ్యయును, రుద్రదత్తుని లఘుటీకయును ఇంకను ఒకటిరెండు గద్యవ్యాఖ్యానములును గలవు. వీనిలో మొదటిదగు హరదత్తాచార్యుల వ్యాఖ్యానమును మితాక్షరతో వంగమహారాష్ట్రాంధ్రులును, మస్కరిభాష్యముతో మైసూరివారును, మూలసంస్కృతగ్రంథములను ప్రకటించియున్నారు. తక్కినవి ఇంతవఱకును అముద్రితములు. వీనినుండి ఈగ్రంథమునం దచ్చటచ్చటగల విశేషము లిందు కూర్పబడినవి.”

లభించిన యవకాశమును బోగొట్టుకొనక యాంధ్రసోదరు లీయుత్కృష్టగ్రంథసారమును గ్రహించి తత్ఫలితముగ తమజాతీయతను నిలువబెట్టుకొన ప్రయత్నించుటయే శ్రీశాస్త్రిగారిప్రయాసమునకు బరమప్రయోజనము.

గ్రంథాంతమునందలి ప్రకటనమునుబట్టి వీరు కౌటిలీయార్థశాస్త్రమును, ఇంకను ఎన్నియో అర్థశాస్త్ర సాహిత్యాలంకార కథా గ్రంథములనుగూడ ననువదించి తమ ఆర్యభారతీగ్రంథమాలికయందు ప్రకటింపను తలంచుచున్నది. వానిలో మున్ముందు వెలువడనున్న కౌటిలీయార్థశాస్త్ర మిదివఱకు వీరాంధ్రీకరించి ప్రకటించిన రెండుగ్రంథములకన్న మూడింతలు పెద్దది. రాజకీయార్థిక ప్రపంచములయందు చక్కని పరిచయమును సంపాదించుకొనుట కీగ్రంథపఠనము పరమావశ్యకము.

కావున సహృదయులు, సుసంపన్నులు నగు నాంధ్రమహాశయులు ఇదివఱకు శాస్త్రిగారు ఆంధ్రలోకమున కొనర్చిన మహోపకారమునకు మాఱుగా నర్థశాస్త్రప్రకటనభారమును తాము వహించి యీగ్రంథము నచిరకాలమున వెలువడునట్లుచేయు టెంతయు నుచితము. మఱియు శాస్త్రిగారు స్థాపించియున్న గ్రంథమాలికకును తగురీతిని సాహాయ్యమునరించి వీరి యార్యవాఙ్మయ పునరుద్ధరణ ప్రయత్నమునకు దోడ్పడ నొప్పును.

శ్రీశాస్త్రిగారి ప్రయత్నము నిర్విఘ్నముగ కొనసాగునట్లు పరమేశ్వరు డనుగ్రహించుగాక!

గ్రంథమునుండి మచ్చునకు కొంత:

“౨౭౩ సూ. మిథ్యావచనే యాప్యోదణ్డ్యశ్చసాక్షీ.
[౨-౮-౨౩.]

హరదత్తమితాక్షరా.—ఏవ మదృష్టవిషయే దోషముక్త్వా దృష్టవిషయే సాక్షిణో దండమాహ—మిథ్యేతి—మిథ్యావచనే దృష్టే సాక్షీ యాప్యో గర్హ్యః—సర్వైరయ మసంవ్యవహార్య ఇతి. దండ్యశ్చ రాజ్ఞా. అత్ర మనుః—శ్లో. లోభాత్ సహస్రం దండ్యస్తు మోహాత్పూర్వం తు సాహసమ్. భయా ద్ద్వౌ మధ్యమౌ దండ్యౌ మైత్ర్యాత్ పూర్వం చతుర్గుణమ్. కామా ద్దశగుణం పూర్వం క్రోధా త్తుత్రిగుణం పరమ్, అజ్ఞానా ద్ద్వేశతే పూ[ర్ణే] బాలిశ్యా చ్ఛత మేవ తు, కూటసాక్ష్యంతు కుర్వాణా[న్త్రీ]న్వర్ణాన్ ధార్మికో నృపః, ప్రవాసయే ద్దండయిత్వా బ్రాహ్మణంతు వివాసయేత్—ఇతి. విష్ణుః—శ్లో. కూటసాక్షిణాం సర్వస్వాపహార ఉక్త శ్చోపజీవినాం చేతి.

ఆంధ్రవివరణము:—ఈవిధముగా కంటికగుపడక—సాక్షికథనముపైననే యాధారపడినటువంటి విషయ

## బుద్ధుడు తపస్సుచేసిన బోధివృక్షముయొక్క శాఖ

ఇది సింహళద్వీపమున అనురుద్ధపురంబున నున్నది. రెండువేల సంవత్సరముల వయస్సు.

మహాత్తర
ఈనాడు
జిల్లుచున
బానిని



బుద్ధగయలో బుద్ధుడు పూర్వుండి తపస్సుచేసి బోధివృక్షముయొక్క ఒక కొమ్మ క్రీస్తుపూర్వము ౦౬-వ సం. లో బుద్ధమతమునకు ప్రథమశిష్యుడగు దేవానాంప్రియాతిస్స' రాజు కాలములో సిలోన్ ద్వీపమునకు అశోకునికుమారుడగు మహింద్రావలన తేబడి అనురుద్ధపురమునందు నాటబడెను. ఆశాఖ ఇప్పుడు వచ్చుచున్న వేలకొలది యాత్రికులనుబట్టియు, పవిత్రత గ్రహింపనగును.

ఈ వృక్షముయొక్క చరిత్ర బహు మనోహరముగా నుండును. ఈవృక్షమునుగురించి పెక్కు గ్రంథములు వ్రాయబడినవి.

---



మాతంగుల పెండ్లి

చిత్రకారుడు : శ్రీనత నరసింహంగారు, శశి ... శ్రమము, గుంట

# గ్రంథములు

ఈ క్రింది గ్రంథములను వందనములతో నందుకొంటిమి.

**నేనే దొంగను:**—గ్రంథకర్త: జొన్నలగడ్డ వేంకటరాధాకృష్ణయ్య గారు. క్రౌను ౩౨ పుటలున్నవి. వెల ౭ అ. ప్రకాశకులు: జయశంకర్ అండుకో., చాకలపేట, మదరాసు.

ఇదియొక చిన్న నవల. చదువుట కింపుగానే యుండును. ఇంక చెప్పుడో పాత్రలు పరిణతము లగునను నాస అడుగడుగునకును పొడముచు తుదకు ఫలింపక కథ నొక మబ్బులో వదలివేయును. రచయిత యింకను శ్రద్ధతో రచింపవలసినది.

**తరుణహిందూ దేశము:**—లాలాలజపతిరాయిగారి 'యంగ్ ఇండియా'కు అనువాదము. అనువాదకులు: ఖండవల్లి రాజారావుగారు. 'దండోరా—పుస్తకము ౧.' క్రౌను ౨౨౨ పుటలు. వెల రు. ౧. శ్రీ సీతారామాంజనేయముద్రాక్షరశాల, రాజమహేంద్రవరము.

దీని మాతృకకు నిషేధ విధానమునే ప్రభుత్వము వారు తొలగించినారు. ఇది రాజకీయ సారస్వతమున నొక యమూల్యగ్రంథము.

**హిమ్మత్సింగు:**—గ్రంథకర్త: వారణాసి లక్ష్మీనారాయణగారు. ఇది భారతీగ్రంథమండలి ద్వితీయ కుసుమము, సత్తెనపల్లి. క్రౌను ౨౬౮ పుటలు. వెల రు. ౧.

ఇది యొక నవల. కథయందలి చమత్కారమును, రచనయందలి నేర్పును, గ్రంథము పూర్తియగువఱకు చదువవలెనను నుత్సుకత నిలుపుచుండును.

**సోమనాథ వెల్లటూరుగారి ఆంగ్లగ్రంథములు:**

The Dreamer (ది డ్రీమర్):—క్రౌను సైజు, ౧౧ పుటలు. ఆంధ్ర ప్రింటింగ్ వర్క్సు, మచిలీపట్టణము.

New Flowers (న్యూఫ్లవర్సు):—క్రౌను ౨౫ పుటలు. శారదా ప్రెస్, మచిలీపట్టణము.

**సర్వార్థసంగ్రహము:**—క్రౌనుసైజు ౨౧౬ పుటలు. వెల రు. ౨. గ్రంథకర్త: ఆయుర్వేదాచార్య ఉపాధ్యాయుల సూర్యచింతామణిశాస్త్రి మంత్రి.

**ఎల్లమందకోటీశ్వరశతకము** ... జు ౨౦ పుటలు. వెల ౩ అ. గ్రంథక... పిచ్చయ్య శర్మగారు, తొండపి, సత్తెన...

**తత్త్వదీపిక:**—క్రౌనుసైజు ... వెల ౬ అ. గ్రంథకర్త: మహోపాధి వేంకట... ఈగ్రంథము వలయువారు 'హిందూ అ... గ్రంథనిలయము, ఇంటూరు, గుంటూరుజిల్లా యవలెను.

**ఉత్తమస్త్రీలు (మొదటిభాగ...** క్రౌనుసైజు ౭౮ పుటలు. వెల ౭ అ. బుక్కపట్టణము రామానుజయ్యగారు- ౨౮, స్పర్ వీథి, దేవాంగపురము, ప్రాతచాకలపేట,

**శ్రీపాపవినాశనశతకము:**— సైజున ౩౮ పుటలు. గ్రంథకర్త: కొత్త జ... రిగారు రజితముద్రాక్షరశాల, తెనాలి.

**ధర్మసామ్రాజ్యము:**—డెమ్మీ... పుటలు. ఆంధ్రప్రచారిణీగ్రంథమాల, ౫౦. ... గ్రంథకర్త: విద్వాన్ గంటి జోగిసోమయా... ఏ., యల్. టి. వలయువారు ఆంధ్రప్రచా... లాధికారులకు, పిఠాపురము (తూర్పుగోదావ... వలెను.

**శృంగారసంధ్య:**—(గద్యపద్యాత్మ... శికాపురాణాంతర్గతము) డెమ్మీసైజు ౧౭౦... వేగుచుక్క గ్రంథమాల, ౨౫. వెల రు. ౧. గ్ర... భాగవతుల నృసింహశర్మగారు, వేగుచుక్క ... ధపతి, బ్రాహ్మణపెద్దవారివీథి, బరంపురం, గంజా...

**పురాణకథలు (మొదటిభాగము...** క్రౌను ౮౬ పుటలు. వెల ౪ అ. గ్రంథకర్త: వెంకటకృష్ణారావుగారు. ప్రకాశకులు: స్టూడె... డ్సు, బరంపురం.

...ర్మప్రశ్నోత్తరావళి (ప్రథమ ...—డెమ్మీ ౩౦ పుటలు. వెల ౪ అ. ...కుడు: కె. మార్కండేయశర్మగారు, ఎడి ...ప్రకాశిని, పూనమల్లి హైరోడ్డు, బృందా ...ను, మదరాసు.

...స్త్రాకళ్యాణము :—డెమ్మీ, ౧౬౩ ...రు. ౧-౪-౦. గ్రంథకర్త: కాకరపర్తి ...శాస్త్రిగారు. ఈ ప్రబంధము కాకినాడ ...శాలయందు ముద్రితమైనది.—కాకినాడ.

...న్నరాజచరితము :—డెమ్మీ ౧౧౭ పుట ...ల తెలియదు.) రాజకథావళి, ౧. గ్రంథకర్త: ...రామకృష్ణకవిగారు, యం. ఏ. 'ఈగ్రంథము ...వారు రాజమహేంద్రవరము చింతామణిముద్రా ... మానేజరువారికిగాని, లేక చెన్నపట్టణము ...వీధి ౩౬౭ నంబరు గృహమున, కా. వెంకట ...శాస్త్రులవారికి గాని వ్రాసి తెప్పించుకొనవచ్చును.'

...రెడ్డికులనిర్ణయచంద్రిక :—గ్రంథకర్తలు: ...మునకపులు, శతావధానులు; శ్రీమాన్ పెద్దనం ...టకృష్ణకవిగారును. పరిశోధకులు: కావ్యకంఠ ...శాస్త్రిగారు. క్రౌను సైజు ౧౫౨ పుటలు గలవు. ...౪-౦. గోలకొండముద్రాక్షరశాల, హైద ...రాబాదు.)

...యోగసారము సంపుటములు ౧, ౨, ...గ్రంథకర్త: కొలనియాది గణపతిదేవుడు. వెల ... రు. ౧-౪-౦. బ్రహ్మశ్రీ విద్వాన్ ముది ...ంగశాస్త్రిగారి తాత్పర్యముతోసహా. శైవ ...గ్రంథమాల, వరంగల్.

...రామగానము :—గ్రంథకర్త: మహావాది ...న్నము. ౧౬. చిన్నిపుటలు. వెల అర్ధణా.

...రామగీతం :—(సంగ్రహరామాయణం):- చి... ౧౬ చిన్నిపుటలు. చిదంబరగ్రంథమాల, ...పోష్టు, గుంటూరుజిల్లా.

...విలాపరచన :—గ్రంథకర్త: కావ్యతీర్థ మద్దు ...వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు, ప్రధానాంధ్ర ...పండితుడు, మునిసిపల్ హైస్కూలు, నంద్యాల. క్రౌను ...సైజున ౭౭ పుట లున్నవి. వెల ౧ అ.

శ్రీగోదాదేవి స్తవము:—గ్రంథకర్త: శ్రీమ... దాసూరి మరింగంటి వెంకట నరసింహాచార్యులుగారు. డెమ్మీ ౩౨ సైజున ౧౩ పుట లున్నవి. శ్రీరామవిలాస ముద్రాక్షరశాల, పాలకొల్లు, ప. గోదావరి.

భీష్ముడు:—గ్రంథకర్త: పాణకా పిచ్చిరెడ్డి గారు. ఇది 'ఇబ్సను' గారు రచియించిన 'బ్రాండు' అను నాంగ్లనాటకమున కనువాదము. క్రౌను సైజున ౩౦౨ పుట లున్నవి. వెల రు. ౧. ఆంధ్రగ్రంథమాల ౯ ... కుసుమము. ఆంధ్రగ్రంథమాల, ౭, తంబుచెట్టివీధి, మదరాసు.

హిందూబాలా :—గ్రంథకర్త: రెంటాల వేంకట సుబ్బారావుపంతులుగారు, బి. ఏ., బి. యల్. గ్రంథ విస్తారకుడు: మల్లాప్రగడ రామచంద్రరావు పంతులు గారు, బి. ఏ., బి. యల్. డెమ్మీసైజు ౪౩౨ పుటలు గలవు. ౩ వ కూర్పు. వెల రు. ౮. విక్టోరియా డిపో, మైలాపూరు, మదరాసు.

భగవద్గీత (ద్వితీయషట్కము):—బ్రహ్మ శ్రీ చిల్లరకొండ రామారాయ కవివిరచిత భావార్థ ప్రకాశవ్యాఖ్యావిలసిత శ్రీశాంకరభాష్య సమేతము. పండితప్రకాండ సూర్యనారాయణ శ్రీరులుగారు పరిశో ధించినది. దీని వెల రు. ౨. ప్రకాశకులు: కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు, ఆంధ్రపత్రికాధిపతి, ౭, తంబుచెట్టివీధి, మదరాసు.

ఆంధ్రహృదయము :-గ్రంథకర్త: న. వేంక టరత్నముగారు, ఆనందనికేతనము, ఏలూరు, పశ్చిమగో దావరి. క్రౌను సైజు ౬౭ పుటలుగల నవల. వెల ౮ అ.

విశ్వాసము:—గ్రంథకర్త: వేటూరి ప్రభా కరశాస్త్రిగారు. క్రౌను ౧౪ పుటలుగల ఖండకావ్యము. వెల ౩ అ. ఇది భారతి అక్షయసంవత్సర మార్గశీర్ష మాస సంచికనుండి పునర్ముద్రితము. వలయువారు 'మేనేజరు, మణిమంజరి - ౧౧౫, వెంకటరంగంపిళ్లె వీధి - ట్రి... కేన్, మదరాసు' అని వ్రాయవలెను.

కుంద:—గ్రంథకర్త: నాళము కృష్ణరా... గారు, రాజమండ్రి. క్రౌను సైజు ౧౧ పుటలుగల ఖండ కావ్యము. ఇది ఆంగ్లకవి టెన్నిసను రచియించిన 'గోరా' అను కావ్యము ననుసరించి వ్రాయబడినది. దీనివెల ౧ అ.

316

# సాభిప్రాయ విశేషములు

## ...్య పాశ్చాత్య సంస్కారములు

...యుగము ధర్మప్రతికూలమైన దుఃఖ
...గముగను వర్ణింపబడినను కలియుగము,
...దను కృతయుగ ధర్మము ప్రత్యక్ష మగు
...ండును. శూర్పణఖా రావణాదులవలెను
...తారాములును పుట్టుచుందురు. పాశ్చాత్యుల
...తికలత్వమువలెను ప్రాచ్యుల యాధ్యాత్మిక
...త్యమును వికసించు చుండును. కార్యము,
...సంకల్పము పరస్పరాశ్రయమును గలిగియున్న
...వి. మంచియును, చెడుగును మిశ్రమ రూపము
...నను గోచరంబగుచున్నవి. శుద్ధ స్వరూపము
...నను గోచరంబగుటలేదు. కార్యము భావము
సమానాశ్రయములేకను సంక్షోభము గలుగు
చున్నది. పాశ్చాత్యుల కార్య ప్రతిష్ఠకును,
ప్రాచ్యుల భావప్రతిష్ఠకును సంయోగ వియో
గములు గలుగుచు సంరంభము గలుగుచున్న
...ది. నెల్సను; నెపోలియను, రాకుఫెల్లరు,
...లిస్టరు, మార్కోని మొదలగువారి ప్రతిష్ఠ
పాశ్చాత్య ప్రపంచమునకు మహానందమును
...గ జేయుచున్నది. శ్రీరాముడు, శ్రీకృ
...ష్ణుడు, ధర్మజుడు, బుద్ధుడు, జనకుడు, శంక
...రుడు, చైతన్యుడు, వివేకానందుడు, తిలకు,
...బోసు, గాంధిమహాత్ముడు మొదలగువారి
ప్రతిష్ఠ ప్రాచ్య ప్రపంచమునకు మహానంద
...దాయకము. వర్తమానకాలమునందు పాశ్చా...

ప్రతిష్ఠ ప్రపంచావృతమై ప్రళయ రూపమ...
దాల్చుచున్నది. పాశ్చాత్యసైన్యములు, ...
ఫిరంగులు, రైఫిలులు ప్రపంచమునంతను ...
వరించినవి. వారి నౌకలు, యుద్ధ నౌక...
సముద్రము నావరించినవి. వాయువిమాన...
లును, వాయువార్తలును ఆకసము నా...
మించు చున్నవి. పరదేశాక్రమణము, ...
ద్రవ్యోపభోగము దురహంకారమును బెం...
చు నాత్మనాశనమును జేయుచున్నవి; దేహా...
మానము పెచ్చుపెరిగినది. ఆత్మవివేక మ...
మించుచున్నది. తెల్లతోలుమీదను, తె...
సంస్కారముమీదను గల యభిమానమ...
క్రైస్తవధర్మముమీదను గాని, మానవధర్మమ...
మీదను గాని కలుగుకున్నది. దురాశాదుర...
మానములు స్వాత్మనాశనమునకును, పరనా...
శనమునకును వినియోగపడుచున్నది. పాశ్చా...
త్యసంస్కారము దేహేంద్రియాదులను విష...
యోపభోగములందు లగ్నము చేయుచు నగ్ని...
జ్వాలలరీతిని ప్రజ్వలింపజేయుచున్నది. అగ్ని...
జ్వాలలు సకలమును దగ్ధముచేయుచున్న...
రూపము బలిష్ఠముగను, సుందరముగను గన...
పడుచున్నను సత్త్వము సన్నగిలుచున్నది. పా...
శ్చాత్య సంస్కారము గలుగజేయుచున్న సం...
క్షోభము పరమానర్థములకు మూలమగుచ...

...శ్చాత్యుల యుద్ధపర్వమునకు శాంతికపర్వ
మును సహజముగను గలుగుచున్నది. ప్రాచ్యుల
...ద్రావస్థకును ప్రబోధావస్థ సహజముగను
గలుగుచున్నది. పాశ్చాత్యులును, ప్రాచ్యులును
...రహంకార విషాదములను విడిచి ఆత్మ
...న్మరణమును జేయుట ప్రపంచశాంతికి శ్రే
...స్కరముగ నున్నది. శ్రీయుత శాంతి
...మమూర్తిగారు మన్నారుగుడియందు
...చ్యపాశ్చాత్య సంస్కారముల విషయమై
...సిన యుపదేశము హృద్యమై, జ్ఞానోదయ
...నకు సాధనంబుగ నున్నది. నదీప్రవాహ
...మును పూరించి ప్రకృతిని చైతన్యప్రదము
చేయుటకు వాననీరును, కొండమంచు నీరును
ప్రయోజనకరములుగ నున్నవి. నదిని పూరిం
...వడివిధమునందును, రూపమునందును, వేగము
...ందును, కాలమునందును భేదమున్నను, వాన
...రును, కొండమంచునీరును నదీప్రవాహోప
...యోగములకు సమాన ప్రయోజనములను
గలుగజేయుచున్నవి. భారతీయులు నిశ్చేష్టతను
విడిచి కార్యపరతంత్రులై, వసంతోదయమును
జేయుట ప్రయోజనకరముగ నుండగలదు.

*  *  *  *

స్టాట్యూటరి కమిషను

స్టాట్యూటరి కమిషనును నియమించుట
...లుకకుగాను కొండను త్రవ్వినటు లున్నది.
బ్రిటీషు రాజ్యాధికారుల దురభిమానమును
వారి ప్రసంగములును, సభ్యుల నిరూపకము
లును, వారి ధిక్కార తిరస్కారములును విశ
దము చేయుచున్నవి. లోకమునందు సర్వజ్ఞ
...త్వము సర్వాధిపత్యము బ్రిటీషు ప్రభుత్వ

స్వత్వముగ నున్నది. భారతీయుల స్వరా...
ర్హతను బ్రిటీషుపార్లమెంటు, బ్రిటీషు...
రులు నిర్ణయింపగలరు. ప్రాచీన సభ్యత్వ...
గలిగి స్వరాజ్యమును ననుభవింపవలసిన భా...
యుల కీవిషయమై ప్రమేయము లేదని ఏక...
ముగను తెల్లదొరలందరును వాదించుచు...
రు. పార్లమెంటు బాధ్యత, భారతీయుల విశ్వ...
లు తెల్లదొరలను మాత్రమె నియమించు...
గారణములు. ప్రభుత్వములోని గుట్టును...
బెట్టకుండుట కిది కారణము గానచ్చును...
నిష్పాక్షికమైన విచారణకు మాత్రము...
ణము గాజాలదు. వాదదౌర్బల్యమును...
వారి కోపావేశము విశదము చేయుచున్న...
అన్ని పక్షముల భారతీయులు విచారణసం...
మును బహిష్కరించుటకు నిర్ణయించ...
బ్రిటీషు నిర్ణయమునందలి యన్యాయము...
వెల్లడిచేయుచున్నది. సౌమ్యస్వభావము...
పండిత మదనమోహనమాలవ్యగారు బహి...
ష్కరణమునే కాకను పన్నులనిరాకరణము...
నయితము బోధించుచున్నాడు. కాంగ్రె...
పక్షము బహిష్కరణమును బోధించుట స...
జమైనను, మితవాదపక్షము, స్వతంత్రపక్ష...
జస్టిసుపక్షము బహిష్కరణమును బోధించు...
తెల్లప్రభుత్వమునకు విపరీతముగను గనుప...
చున్నది. స్టాట్యూటరి కమిషనును నియమిం...
చుటయందు జూపిన వేగిరపాటే దానివి...
మునకు దృష్టాంతముగ నున్నది. పార్లమెం...
భారతీయుల నిరసనభావమును నిర్లక్ష్యము చే...
నది. యథేచ్ఛముగను ఉపసంఘమును నియమిం...
చినది. వారు చేయగల నిర్ణయములును సర్వ...



సియున్నవి. అన్ని పక్షములవారును నేక
ముగను బహిష్కారఘోషను ప్రతిధ్వనిం
చుచున్నను, బ్రిటీషు రాజ్యనీతిజ్ఞుల తంత్ర
ఫలము దురూహముగ నున్నది. దేశము
స్వదేశ శకునపక్షులు బయలుదేరినవి. సర్
ప్రాద రెడ్డినాయుడుగారి పక్షము సహకారము
బోధించుచున్నది. మహమ్మదీయులందు
రు సహకారమును బోధించుచున్నారు.
ఆత్మగౌరవముగల భారతీయులందరును బహి
ష్కారమును బోధించుచున్నారు. సంకల్పిం
న బహిష్కారము సాధ్యముగాదని నిరాశ
ందుట పౌరుషహీనముగ నుండగలదు. భార
ములు దృఢసంకల్పముతో బహిష్కార
ానమును సాగించిన వెంటనే ఫలము గలు
క పోయినను వర్తమాన కాలమునందు నా
న బీజములకు సత్ఫలము కాలాంతరముననును
లుగగలదు. బహిష్కారమును ఫలవంతము
యులకు విదేశవస్త్ర బహిష్కారమును,
స్వరాజ్యవిధాన నిర్మాణవిధానమును పరమ
సాధనములుగ నుండగలవు. ఈ మాసాంతము
నను చెన్నపురియందు గూడనున్న భారత
ాతీయమహాసభ స్వరాజ్యవిధానమును, బహి
ష్కారవిధానమును నిర్ణయించి ప్రజలను కా
ాపరశంత్రులను జేయునని నమ్ముచున్నాము.
ందర్భములం దనంతపురమునందు గత
ముునం దాంధ్రరాష్ట్రీయ మహాసభ
న తీర్మానము కాంగ్రెసునందు విచారణ
ార్యముగ నున్నది.

* * * *

ఆంధ్రమహాసభలు

అనంతపురమునందు గూడిన యాం
మహాసభలు సర్వతోముఖమైన యాంధ్ర
వికాసాభిలాషను విశదము చేయుచున్న
శ్రీయుత దండు నారాయణరాజుగారు
ష్ట్రీయసభ కధ్యక్షతను వహించిరి. శాస
సభల విషయమై వారు చేసిన విమర్శనమ
శాసనసభ్యులకు వారికర్తవ్యమును విశదమ
చేయుచున్నది. శాసన సభ్యులు వారి శ
సామర్థ్యములను సభలయందు నిరర్థకమ
చేయుటకన్నను ప్రజాక్షేమమునకై వినియో
గించుట సమంజసము. సభ్యులు వారి స్థలమ
లను ఖాళీగ నుంచవలయునని ఆంధ్రరాష్ట్రీయ
సభ చేసిన తీర్మానమును కాంగ్రెసుసభ్యులును,
నితర సభ్యులును గౌరవించుట ధర్మము
నున్నది. ఆంధ్రత్వాభ్యుదయమున కాంధ్ర
రాష్ట్ర నిర్మాణావసరమును శ్రీయుత హాట్
[illegible] స్వామి గారున
విశదము చేసిరి. ఆంధ్రమహాసభ అనంత
మునం దిపుడు రెండవసారి గూడినది. అనం
పురవాసులు రెండు సమావేశములందున
ఆంధ్ర రాష్ట్రనిర్మాణము నామోదించి వా
గాఢమైన దేశాభిమానమును విశదము చేసిరి
ఆంధ్రవిశ్వవిద్యాలయ విషయమై వర్ధిలిన భేదా
భిప్రాయములును దైవానుగ్రహమునను నం
మును బొంది, విజ్ఞానవికాసమునకు సాధనంబైన
ఆంధ్రవిశ్వవిద్యాలయ మచిరకాలముననే ఏర్ప
డుటకు భగవంతు డనుగ్రహించుగాక! సంగీత
సభాధ్యక్షులు శ్రీయుత రాళ్లపల్లి అనంత
కృష్ణశర్మగారు చదివిన వ్యాసము భావము

యందును, భావయందును, విషయవివరణము నందును ప్రశస్తముగ నున్నది. ఆంధ్ర మహా జను లీవ్యాసమును పఠించి వారికి సహజమైన సంగీతస్వభావము నభివృద్ధిచేసి యానందమును బొందుదురుగాత! ఆంధ్రమహాసభలను జయ ప్రదముగను నిర్వహించిన అనంతపురము సోదరు లాంధ్రమాతయొక్క ఆశీర్వచనము లను బడయుదురు గాత! స్వరాజ్యమునకు నిర్మాణవిధానము నిజమైన సాధన గ నున్న విధమును గాంధిమహాత్ముని యుపదేశములు, సంచారక్రమము విశదము చేయుచున్నవి.

* * * *

గాంధిమహాత్ముని సంచారము

మహాత్ముడు గంజాము మండలమునందు సంచారమును జేయుటకు 1 వ తేదిని మద్రా సునుండి బయలుదేరిరి. ప్రతిస్టేషను నందును వేలకొలది ప్రజలు మూగికొని మహాత్ముని ... సందర్శించి పరమానందమును బొందిరి. మహా త్ముని దర్శనలాభమునను సంతసించి భక్తి

పూర్వకముగ కానుకలను సమర్పించిరి. గా మహాత్ము డాడంబరము లేని ధర్మాత్ము వారి ధర్మోపదేశములు దుస్సహాములుగ డును. మహాత్ముడు వెళ్లినచోట్లను ఖద్దరు ధనమును గోరుచుండును. అయినను ప్ర విసుగు చెందక వారికి యథాశక్తిని కల నర్పించుచున్నారు. ప్రజలకు మహా పట్లనుగల భక్తివిశ్వాసములు భారతీయ సహజమైన ధర్మసంపత్తికి నిదర్శన నున్నవి. గుప్తశాఖ విలేఖరులు ప్రజానీ బులందును, దానధర్మంబులందును గల ప్ర మును గ్రహించి మహాత్ముని ధర్మ గ్రహించుటకు వివేకమును బడయుదు నమ్ముచున్నాము. గంజాముమండ లును, నితరాంధ్రులును గాంధిమహాత్ముని చూపుచున్న భక్తివిశ్వాసములు విజయ ... లతోపాటు నిర్మాణ కార్యరూపమును టకు పరమేశ్వరు డనుగ్రహించు గాత

Edited and Published by K. NAGESWARA RAO, at the Andhra Patrika Press, No.7, Thumbu Chetty Street, G

అనువాదము ప్రశంసనీయముగ నున్నది. అనువదించుటకు సాధారణముగా నసమ్మపడని సందర్భములఁగూడ చక్కని జాతీయములఁ సొంపుగ నతుకొన్నవి. భావానుగుణమగు శైలి యుపయోగింపఁబడినది. ప్రయోగదోషములు మాత్రము కొన్ని గలవు కొన్ని కొన్ని హిందీపదముల నట్లువాడుటయే బాగుగ నున్నది. 'పెంచుటగాని, తగ్గించుటగాని లేక మూలమునకు సాధ్యమగునంతవఱకు సరియగు తెనుఁగుఁ జేసితిని' అని యనువాదకులు పీఠికలో వ్రాసినది సరిగా నున్నది. మీ రిందు పద్యములు వ్రాయక, జంగు పీడి వచననాటకమును వచననాటకముగనే యనువదించిరి. వర్తనసమయమున వేశ్యలు పాడు నొక్కపాట మాత్రము హిందీలో నున్నది. కథకుఁగాని, పాత్రములకుఁగాని సంబంధించిన చక్కనిపాట లన్నియు తెలుఁగు జేయఁబడినవి.

లం 'అతిదీర్ఘములుగ నున్నవనియు, పద్యములు లేవనియు శ్రీయుత ద్విజేంద్రలాలు రాయిగారి నాటకముల నంతగఁ బ్రదర్శింప మనవా రింకను జంకుచున్నారు, సాహిత్యవర్మకోవిదు లగు విద్వద్వరులుమాత్రము చదివియు వానిఁ దెలుఁగుఁజేయుచు ఆంధ్రభాషాయోష కొక క్రొత్తయందముఁ గూర్చుచున్నారు' అని అనువాదకులు పీఠికలో వ్రాసినది సత్యముగ నీగ్రంథము పట్ల వర్తింపఁగలదు.

ద్విజేంద్రుని నాటకముల యాంధ్రానువాదములు కళాశాలా తరగతులయందుఁ బఠనీయగ్రంథములుగా నుంపఁదగును.

ఈపుస్తకములు వలయువారు శ్రీయుత గ్రంథకర్తగారికి 'మార్కెట్టువీథి, రాజమండ్రి, తూర్పుగోదావరి' యని వ్రాసి పొందఁగలరు.

## గోపాలుడు

ఇది సి. కుమారస్వామినాయుఁడు అండ్ సన్సువారు ప్రచురించినది. క్రౌను సైజు ౬ పుటలు. వెల ౬ అ.

చూచి చూచుటతోడనే ముద్దుగొల్పు చక్కని జ్ఞానసంపాదనకుఁ దోడ్పడును. ఇందు ముఖచిత్రి కలర్ క్రింద శ్రీకృష్ణునివృత్తము సంగ్రహముగఁ బడినది. మొదట సపరివారుఁడైన శ్రీమన్నారాయణుని చిత్రి మున్నది. ఇందు చిన్నవి, పెద్దవి, బొమ్మలు నున్నవి. శ్రీ. వి. నరసింహారాయుఁడు గారు పీఠికలో 'దీనిని ప్రాథమికపాఠశాలలలో సామాన్యపఠనగ్రంథముగ నుపయోగింపవచ్చు'నని వ్రాసిరి.

వలయువారు 'సి. కుమారస్వామి నాయుడు అండ్ సన్స్, చెన్నపురి' అని వ్రాయవలెను.

---

# గ్రంథపరిచయము

ఈ దిగువ జేర్కొనిన గ్రంథములను వందనపూర్వకముగ నందుకొంటిమి

**ఆముక్తమాల్యద** (ప్రాచీనాంధ్ర ప్రబంధము) బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రి విరచిత సంజీవనీవ్యాఖ్యాన మేతము. రాయలు ౮ పేజీల సైజు ౮౦౦ పేజీలసంపుటము. క్యాలికో బైండు వెల ౮-౦-౦

**ద్రౌపదీవస్త్రాపహరణము** (ఏదంకముల నాటకము):—కర్త: మల్లాది అచ్యుతరామశాస్త్రి గారు. పేజీలు ౧౫౪. వెల రు. ౧. ప్రకాశకులు కొండూరి సుబ్బారావుగారు, బుక్ సెల్లర్సు, భీమడోలు, పశ్చిమగోదావరి.

**సురభి** (ఖండకావ్యములసంపుటము) కర్త: బుక్కపట్టణము తిరుమల నరసింహాచార్యులు. పేజీలు ౮౦. వెల ౦-౮-౦.

వలయువారు ప్రకాశకుల పేర వ్రాయవలెను.

వలయువారు 'ఆంధ్రా బుక్ డిపో, ౪౫, బందరు వీథి, జి. టి. మద్రాసు' అని వ్రాయవలెను.

**మహాభారతయుద్ధము** (ఆరంకములనాటకము):—కర్త: కవిరాజ శ్రీపాద కృష్ణమూర్తి

# తుఖారాం సాధు

(శ్రీశివాజీమహారాజును నుతించుట)

జి. జాషువ గారు

మ. శివరాజా! ప్రతిభావిభాకర! శహాజీనందనా! దీనబాం
ధవ! హిందూధరణీశుభంకర! మహాత్మా! సద్యశశ్చంద్రికా
ధవళీభూతదిశావకాశ! రిపుకాంతాసూత్రవిధ్వంసనో
త్సవకేళీపరతంత్ర! నీ కిదె నమస్కారంబు వీరాగ్రణీ!

శా. ఆటోపంబున నీజయోన్నతిని దేవావాసము ల్పొంగి ఘం
టాటంకారముల న్నుతించెడి, మరాటాత్మాపతీ! దేవతా
కోటు ల్నీటు నటించెడిఁ దివి, దిశాకుడ్యంబుల న్నేఁటికే
దాఁటు న్నీవిజయంబు సూరినుతసాంద్రఖ్యాతి నూరేఁగుమీ

సీ. నీబాహువులు నిల్వ నీడలయ్యెనుగదా, పొలుపొందు మాధరాపుణ్యవతికి!
నీకత్తి మొనమీఁద నిలిచియున్నదిగదా, పరరాజశరనిధి బాడబంబు!
నీజయధ్వజకోటి నెగడుచున్నదిగదా, యరిదుర్గభర్మహర్మ్యములమీఁద!
నీగుఱ్ఱపుంగిట్ట నించుచున్నదిగదా, గెలుపుమొక్కలకుఁ బాదులనుదిశలఁ!
ద్వాధనుశ్మేఘమున సంపవానఁగురిసి-నిండుకీర్తిపంటఁ బండింపుమయ్య!
కలియుగంబునఁ బగతురక్కసులనుతెవిు-రఘుపతివిగమ్ము రాజమార్తాండ నీవు!

సీ. వెలయింపవే! కంచువిగ్రహంబులకంఠభాగాలఁ జెంగల్వ బంతులాట
తొలఁగింపవే! జగద్ధావణప్రదమైన గోమాతృకల పాఁడుగొంతుకోఁత
నిలుపవే! దాయమన్నీల ఱొమ్ములమీఁద లీలమై కఱకు బల్లెములముద్ర
సాగింపవే! రణస్థలముమగ్గములందు సరిలేని విజయవస్త్రముల నేఁత
కలన వెన్నిచ్చి పాఱుమున్కరులచేతి-యంపగమికింకఁ ద్రుప్పుఁబట్టింపుమయ్య,
తివిరి నీచేతి చల్వ పందిళ్లనీడ-సుధ బాలింపుమోజ! శివాజిరాజ!

---

# సాభిప్రాయ విశేషములు

శ్లో. వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునన్దన,
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయో౽వ్యవసాయినామ్.

పిపీలికాది బ్రహ్మపర్యంతము గల విశ్వము కాలప్రవాహమునందు మహాయాత్రను జేయుచున్నది. ఈమహాయాత్రయందు సృష్టిస్థితిలయము లనవరతమును నాద్యంతములు లేక సంప్రాప్తము లగుచున్నవి. ఎప్పటికప్పు రంభాంతములు గోచరంబు లగుచున్నవి. ర్యారంభమునందును, కార్యాంతమునం ను సంతృప్తి గలుగకున్నది. పెద్దవిషయము ందును, చిన్నవిషయములందును విషాదావస్థ మానముగ నున్నది. ముఖ్యముగను నిర్వ్యా రపరాయణులకు బుద్ధిభేదము గలుగు న్నది. అసంప్రేక్ష్యకారిత్వమున కాశలు ండును. పనిలేనివానికి తప్పులను వెదకుట కాశములు గలవు. భారతీయుల వర్తమాన షాదస్థితి సకలవిధములను నిరాశాజనకముగ న్నది. చీటికిమాటికి వ్యక్తులయందును, ఘములందును పక్షములయందును కలహకా ములు వృద్ధినిబొందుచున్నవి. నా కాయ ము, నా కారోగ్యమను భావము సంతృప్తిని గజేయక, పరపీడనము, పరద్వేషము దలగు భావములు ప్రబలుచున్నవి. స్వాభి నమునకును, కులాభిమానమునకును, స్థలా మానమునకును గల ప్రాబల్యము ధర్మాభిమానమునకును, ఆదర్శాభిమానమునకును గలుగకున్నవి. ఏయుపాయముచేతనైనను తన పట్టు తన మేలు నెగ్గిన దిగ్విజయముగ నున్నది. ఈవ్యత్యాసము సహాయనిరాకరణోద్యమ నిర్గమానంతరము బాగుగ గనుపడుచున్నది. ఉత్తరమునందు హిందూమహమ్మదీయ విద్వేషములు, దక్షిణమునందు బ్రాహ్మణ బ్రాహ్మణేతర విభేదములు దేశమునందంతటను గలుగజేసిన తీవ్రాభిప్రాయభేదములు ప్రజాహృదయమును నిర్వీర్యముచేసినవి. ప్రజాహృదయము నావరించిన మాంద్యమును బోగొట్టి భద్రమును వెలయించుటకు కార్యములు ప్రయోజనకరములుగాని సిద్ధాంతములు ప్రయోజనకరములు గావు. అవ్యవసాయ పరాయణులైన భారతీయుల చిత్తవృత్తి బహుశాఖలయందు లగ్నమై కల్లోలమునకు గారణంబగుచున్నది. ఒకే స్వల్పప్రయోజనము గలుగజేయుచున్న సంక్షోభము భారతీయుల నిస్సహాయస్థితిని విశదము చేయుచున్నది. యూనియనులు, బోర్డులు, పరపతిసంఘములు, మ్యునిసిపాలిటీలు, ఉద్యోగములు, పదవులు, విద్యార్థి వేతనములు, విద్యాలయములు, శాసనసభలు వికాససాధనములు గాక కలహకారణములై ప్రజా

శక్తిని క్షీణింపజేయుచున్నవి. కాంగ్రెసుప్రతిష్ఠ క్షీణించినది. కాంగ్రెసుసంఘములే లేని స్థలములు గలవు. పనిలేనివారందరును నాక్షేపణలతోను, అంతఃకలహములతోను కాలయాపనమును జేయుచున్నారు. ఈ సందిగ్ధావస్థయందు తరణోపాయము యథాశక్తిని సకల జనులును కార్యదీక్షను గైకొనుటయందు గలదని గాంధిమహాత్ముని ఖద్దరు ప్రచారము విశదము చేయుచున్నది. ఇతరసాధనలందు భేదాభిప్రాయము లున్నపుడు భేదాభిప్రాయము లేని ఖద్దరుసాధనమునందు ప్రజాలక్ష్యము నేల లగ్నము చేయజాలమో తెలియకున్నది. ఆడంబరాధికారములులేని ఖద్దరునందు ప్రజానాయకుల లక్ష్యమును లగ్నము చేయుటకు గాంధిమహాత్ముని కార్యదీక్ష భగీరథప్రయత్నమునవలెను ధర్మారాధ్యముగ నున్నది. సుభాసుచంద్రబోసు సత్యేంద్రచంద్రమిత్రగారులు గ్రామపునర్నిర్మాణమును బోధించుచున్నారు. ఇదియే కాంగ్రెసు నిర్వహింపవలసిన కార్యవిధానము.

* * * *

గాంధీమహాత్ముని కార్యదీక్ష

గాంధిమహాత్ముని 59 వ వర్ధంత్యుత్సవములు గతించిన భానువాసరమునందు దేశమునందంతటను శ్రద్ధాభక్తులతో జరుపబడినవి. అసహాయోద్యమము స్తంభించినను, సత్వరస్వరాజ్యముసంప్రాప్తముగాకపోయినను, ప్రజలకు గాంధిమహాత్మునిపట్లగల యపారమైనభక్తిని వారి ఖద్దరు విజయయాత్రలు చెప్పక చెప్పుచున్నవి. మహాత్ముని విజయ
మునకు వారిత్యాగము, సత్యప్రియత్వమ
కార్యపరత్వము గారణంబులుగనున్నవి. గాం
గారి నిరంతర మానవసేవాపరాయణత్వ
వారి మహత్త్వమును వెల్లడి చేయుచున్న
గాంధిమహాత్ముడభ్యసించిన ధర్మసాధన వా
దైవసంపన్నుని జేయుచున్నది. మహాత్ము
కార్యములు సత్యాశ్రయమును గలిగి భగ
దర్పితంబు లగుచున్నవి. బాలబాలికలు, స్త్రీ
పురుషులు, బ్రాహ్మణబ్రాహ్మణేతరులు, ప్రాచ
పాశ్చాత్యులు మహాత్మునకు జేసెడి యర్చ
ములు వారి సుగుణసంపత్తిని వ్యక్తము చేయ
చున్నవి. మహాత్మునిసందర్శనలాభము గలు
జేయుచున్న బ్రహ్మానందము మహాత్ముని దివ
మహిమను విశదము చేయుచున్నది. ప్రజల
గాంధిమహాత్మునిపట్ల గల భక్తిని సార్థకమ
చేయుటకు గాంధిమహాత్మునివలెనే ఖద్ద
భక్తిపరాయణులై ఖద్దరుసేవను జేయుట ధర
ముగనున్నది. ఖద్దరుసేవ దేశసేవకును, మాన
సేవకును సాధనమై, స్వరాజ్య మప్రయత్న
ముగ సంప్రాప్తము గాగల విధమును మహ
త్ముని నిత్యజీవయాత్ర విశదముచేయుచున్నద
మహాత్ముని యుపదేశములను, ధర్మారాధ
మును నాదరించుచు భారతీయులు వ్యవసాయ
పరాయణులై కామితార్థములను బడయుట
పరమధర్మముగ నున్నది. పరమేశ్వరుడు గాం
మహాత్మున కనేకవర్ధంతులను ప్రసాదించి వా
శాంతిసందేశమును సార్థకము చేయుగాత!

* * * *

ఖద్దరు దీక్ష

గాంధిమహాత్ముని ఖద్దరుఘోష మందగతిని సర్వత్ర వ్యాపించుచున్నది. మునిసిపలుసంఘములు ఖద్దరుధ్వనిని జేయుచున్నవి. మైసూరుసంస్థానము ఖద్దరును గృహపరిశ్రమ చేయుటకు ప్రయత్నములను జేయుచున్నది. మైసూరుమహారాజు, మంత్రి, ఉద్యోగస్థులు ఖద్దరునకు ప్రోత్సాహము నొసంగుచున్నారు. గతమాసమున తమిళనాడునందు లక్ష రూప్యములు ఖద్దరునిధికి వసూలైనవి. తిరుపూరుఖద్దరు తమిళనాడునందును, నితరప్రాంతములందును విశేషమైన వ్యాపకమును గాంచుచున్నది. తిరుపూరుఖద్దరునిర్మాణమునందును, విక్రయమునందును వ్యాపకమును బొందుచున్నది. తమిళనాడునందువలెను ఆంధ్రదేశమునందు ఖద్దరు వ్యాపకమును బొందకుండుట సంతాపకరముగ నున్నది. ఆంధ్రదేశమునందు మంచిఖద్దరు తయారగుటకు వీలున్నను విక్రయమున కవసరమైన ఖద్దరు తయారగుట లేదు. ఖద్దరును తయారుచేయుట కవసరమైన ధనము లేకున్నది. జిల్లాలయందు ఖద్దరు సంఘము లీయవలసిన బాకీలను చెల్లించుటకు నాయకులు నిర్లక్ష్యము చేయుచున్నారు. అఖిలభారత చరఖా సంఘమునకు చెల్లించవలసిన బాకీ వాయిదా సమీపించుచున్నది. వరి బాధ్యతను వారు నిర్లక్ష్యము చేయుచున్నారు. ఈ యరాజక సమయమునందు కోర్టులు శరణ్యములుగ నున్నవి. ఇప్పుడైనను ఎవరిబాధ్యతను వారు గ్రహించి బాకీల నిచ్చి ఆంధ్రులగౌరవమును గాపాడుటకు పరమేశ్వరు డనుగ్రహించుగాక!

గాంధిమహాత్ముడు మార్చిఏప్రిలు మాసములందు ఖద్దరు నిధి కాంధ్రదేశమునందు పంచారమును జేయుటకు నిశ్చయించినటులు తెలియుచున్నది. తమిళనాడునందు శ్రీయుత సి. రాజగోపాలాచార్యులు గారు చక్కని ఏర్పాటులను జేసి లక్షరూప్యములను వసూలు చేసిరి. ఆంధ్రదేశము తమిళనాడుకు వెనుకబడక ఆత్మగౌరవమును గాపాడుకొను నని నమ్ముచున్నాము. ఖద్దరుపనులవలెను కాంగ్రెసుపనులును మందగమనమును జేయుచు దేశావ్యాప్తమైన మాంద్యమును విశదముచేయుచున్నవి.

* * * *

కాంగ్రెసు సంస్థలు

కాంగ్రెసుపనులు మందగమనమును జేయుచున్నవి. అనేకప్రదేశములందు కాంగ్రెసు సంస్థలు లేవు. కొన్నిస్థలములం దైనను పేరునకుమాత్రము గలవు. గంజాము, కడప మండలములనుండి రాష్ట్రీయ సంఘమునకు సభ్యులనామములైనను చేరియుండ లేదు. కాంగ్రెసు పనులందువలెను ఖద్దరు పనులందును నీమండలములు వెనుకబడియున్నవి. ఈమండలములందుగల దుస్థితియే యితర రాష్ట్రములందును గలదు. గౌహతితీర్మానమే శేషించియున్నను కార్యాచరణము దుస్తరముగ నున్నది. మండల సంఘములందు జేయబడుచున్న తీర్మానములు కాంగ్రెసుసభ్యుల చిత్తవృత్తిని విశదము చేయుచున్నవి.

5.5.1927

# విషయానుక్రమణిక


రఘురీతరణము—మద్దిపట్ల వేంకటరమణయ్య గారు ... ...
యామునస్మృతి—మక్కపాటి వేంకటరత్నకవి గారు ... ...
భాషాసంప్రదాయములు—శ్రీపరవస్తు వేంకటరామానుజస్వామి గారు ...
బంగారుఫలము—అధికార్ల సూర్యనారాయణరావు గారు ... ...
ఉత్తరరామచరిత్ర—అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ... ...
సందేశము—శ్రీమతి టి. సరస్వతి గారు ... ... ...
మనుచరిత్రములోని కొన్ని చారిత్రక విశేషములు—అడవి శంకరరావు గారు
శరద్రమ—తి. వ. నారాయణస్వామి గారు ... ... ...
కాళిదాసకవి కార్తికేయభక్తుడు—సి. శివయ్యశాస్త్రి గారు ... ...
వేమన తారావళి—శ్రీరంగంపల్యాన్ చక్రవర్తి రఘునాథాచార్యులయ్యవార్లుగా
పుష్పాంజలి-సురేశ్వరాచార్యు లెవ్వరు?—మానవల్లి రామకృష్ణకవి గారు
నిశ్చింత—దీపాల పిచ్చయ్యశాస్త్రి గారు ... ... ...
వినోదవిమర్శము—వేటూరి ప్రభాకరశాస్త్రి గారు ... ... ...
పన్నా—కొత్త జగ్గయ్యచౌదరి గారు ... ... ... ...
ఆనందకందము—క్రొత్తపల్లి సూర్యరావు గారు ... ... ...
సోలమన్ చక్రవర్తి—నాళము కృష్ణారావు గారు ... ... ...
శృంగారం—పూడిపెద్ది వెంకటరమణయ్య గారు ... ... ...
ఆదిమాంధ్రకన్య—కాట్రావులపల్లి రామమూర్తి గారు ... ...
పరాకాష్ఠ—శ్రీ శివశంకరశాస్త్రి గారు ... ... ...
దీపావళి—యస్. వి. రామమూర్తిగారు ... ... ...
దారిద్ర్యము—పండితారాధ్యుల నాగభూషణము గారు ... ...
గజదొంగ—పా. వి. రాఘవరావు గారు ... ... ...
శ్రావణాశ్రువులు—పెనుమర్తి వేంకటరత్నము గారు... ... ...
లక్ష్మీరామేశ్వరము—నరహరిసెట్టి వెంకటరత్నము గారు ... ...
రాగాతిశయము—దుగ్గిరాల పల్లంరాజు, పానుగంటి చిరంజీవిరావు గార్లు
శ్రీమతత్రయాచార్యులు—తిరుక్కోవలూరు మహాస్వామి శ్రీ కుమార
ఆది వరహాచార్యులు గారు ... ... ... ...
పాంచాలీమానసంరక్షణము—పిశాచెర్ల రామకృష్ణయ్య గారు ...

గవానుడు-శిష్యమండలి—శరణు రామస్వామి చౌదరి గారు ... ౯౭-౧౦౦

పెట్టు పుట్టింటిసాధ్వి—వారణాసి సూర్యనారాయణశాస్త్రి గారు ... ౧౦౧

యము—రాజావాసిరెడ్డి శ్రీదుర్గాసదాశివేశ్వర ప్రసాద్ బహదూర్ గారు ౧౦౨-౧౦౭

ము—మొసలికంటి హనుమంతరావు గారు ... ... ౧౦౭-౧౦౮

శనము—భాగవతుల దక్షిణామూర్తి శాస్త్రిగారు ... ... ౧౦౯-౧౧౪

ము—సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి గారు ... ... ౧౧౪

ప్రవర్మకంబకాయశాసనము—మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు ... ౧౧౫-౧౩౦

అన్నపూర్ణాస్మృతి—శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగారు ... ౧౩౧-౧౩౫

మ్—విద్వాన్ కవితిలక కంచనపల్లి కనకమ్మ గారు ... ... ౧౩౫

హృదయము—పంచరత్నములు-గొట్టి సూర్యనారాయణశాస్త్రిగారు; కురుక్షేత్ర-
జొన్నలగడ్డ వెంకటకృష్ణారావు; శ్రీయుత లక్ష్మీకుంభరామ్‌గారు
—[వెం. నా.] ౧౩౬-౧౩౭

-ఆత్మోపదేశము—భాగవతుల నృసింహశర్మగారు ... ... ౧౩౮-౧౩౯

-హరితకృతము ... ... ... ... ... ౧౩౯

సంపు:—అమెరికనులు నేరస్థులను పెట్టు చిత్రహింస; ఇందిరా మహారాణిగారి ఆట-
పాట-వేటు; భారత శాసననిర్మాణసభయందు రాష్ట్రీయులకు గల ప్రాతి
నిధ్యబలము; భారతీయుల ప్రాణము, విశ్వాసియులమానము; ఫ్రాన్సుపోల్లలో
పంపోష్యకులు; రోడ్లపై మేకులు లేకుండచేయుపద్ధతి; మద్రాసుబిడ్డల మద్ద
రాలు; ఫిలిప్పైనుదీవులలో కార్యరూపమైన విద్యాభ్యాసము; వితన్యకు
ములు; ఈగలు; స్త్రీలకు ఇంటియందే విద్యనుకేర్పుట; అజంతా చిత్రములు. ౧౪౦-౧౫౧

స్వీకృత గ్రంథములు, పత్రికలు ... ... ... ... ౧౫౨-౧౬౫

అభిప్రాయ కీర్తనములు— ... ... ... ... ... ౧౬౬-౧౭౨


# చిత్రములు


త్రివర్ణచిత్రములు:—విశ్వామిత్ర తపోభంగము; భైరవరాగము.

సాధారణ చిత్రములు:—ఉమర్ ఖయ్యామ్; మృగతృష్ణ, కూపపరిసరము, ప్రాచీన
లోహపరిశ్రమ చిత్రములు ౯; ఘంటసాల రాధాకృష్ణయ్యగారు-కబీరుపాత్రము,
స్వతీసభ-నెల్లూరు; కీ. శే. మాగంటి అన్నపూర్ణాదేవి, కీ. శే. కట్టా పాపయ్యశాస్త్రి
వ్‌లావా' అనునర్తకి, ౧౯౩౬-వ సంవత్సరపు పాశ్చాత్యకన్య; శ్రీ మామిడిపూడి
గయ్యగారు, సర్ ఆర్. వెంకటరత్నం నాయుడుగారు, మిస్ స్లేడుకన్య; శ్రీయుత
కరరామ్‌గారు, మిస్ కేథరైన్ మేయో, శ్రీ రోబిన్ చటర్జీగారు, ఇతరచిత్రములును.



విశ్వామిత్ర తపోభంగము

చిత్రకారుడు: శ్రీ వరదా వెంకటరత్నముగారు, రాజమండ్రి

చెన్నరాష్ట్ర శాసనసభయందు కాంగ్రెసు జస్టిసుపక్షముల సంయోగమువలనను గలిగిన ఫలములలో శతాంశమైనను బయటను గలుగలేదు. రెండుపక్షములవారును యథాప్రకారము స్వపక్షమాత్రను జేయుచున్నారు. బ్రాహ్మణేతరపక్షము మంత్రిపదవులను నిరాకరించునపుడు కాంగ్రెసునందు జేరి కాంగ్రెసు సత్యాదర్శమును సార్థకము చేయుట ప్రయోజనకరము. జస్టిసుపక్షనాయకులు కాంగ్రెసు సంఘములందు తాము సభ్యులుగ జేరినంత మాత్రమునను సంతృప్తిని బొందక కాంగ్రెసు నిర్ణయములను సాధ్యము చేయుటకుదల పడుట యుక్తముగ నుండును. చెన్నపురియందు జరిగకాలమున నే డాక్టరుఅన్సారిగారి యధ్య … క్రిందను 42 వ కాంగ్రెసు కూడ నున్న … అన్సారిగారి యభిప్రాయ … లెటులున్నను … వలసిన భారము ప్రజానాయకులమీదను, ముఖ్యముగ తమిళనాడు ప్రజానాయకులమీదను గలదు. వారీభారమును నిర్వహించి కాంగ్రెసుప్రతిష్ఠను గాపాడుదురని నమ్ముచున్నాము. నాయకులు నిస్సారములైన శాసనసభలనుండి వారి లక్ష్యమును నిర్మాణకార్యవిధానమునకు మరల్చుట శ్రేయస్కరము.

* * * *

హిందూమహాసభీయ సంయోగము

సిమ్లాయందు గూడిన హిందూమహాసభీయ నాయకుల సమావేశము సార్థకము గాకుండుట సంతాపకరము. హిందువుల మేళ … కోసంరక్షణము నేడు పుట్టినవి గావు. చిరకాలమునుండి వచ్చుచున్న సమస్య వర్తమానకాలమునను ప్రచండ రూపమును దాల్చుటకు గారణములు రాజకీయములుగాని మతవిషయములు గావు. హిందూ మహాసభీయ విభేదము లన్నియును సాం…క ప్రాతినిధ్యమునకును, పదవులకును సంబంధించియున్నవి. ఇది బహిరంగ, రహస్యమైనను విషయనిర్ణయము సాధ్యము గాకున్నది. హిందూ మహాసభీయసంఘము లుద్రేకపూరితములై క్రూరకార్యములకు గడంగునపుడు శాంతిమార్గము నిరర్థకమగుచున్నది. హత్యలు, దౌర్జన్యములు సంకల్పసిద్ధికి నిరర్థకములని నాయకులు ప్రజల … యందు దుద్బోధమును గలుగజేసి దేశశాంతి … గాపాడుట … గాంధి మహా … తమ్మను తెలుపునటులు తీవ్రమైన … భవము గలుగక ప్రజలయందు జ్ఞా … ము గలుగుట యసంభవముగ నున్న … ర్ష్వభేదములు, కాంగ్రెసుదౌర్బల్యము … వర్గాధికారమును దృఢతరము … రాజ్యాంగ సంస్కరణములను దూర … యుచున్నవి.

* * * *

రాజ్యాంగ సంస్కరణములు

భారతీయుల నిస్సహాయస్థితి నిరం … కారవర్గమున కానందమును గలుగ … చున్నది. ఏస్వల్పలాభమైనను యంత్రీక … కాలవాలమగుచున్నది. రాజ్యాంగ … ణముల యవసరము తగ్గిపోవుచున్నది. … రణసంఘమునకు సంబంధించిన వ … నిరాశను దినదినాభివృద్ధిని జే …

విచారణాసంఘము 1928 వరకును నేర్పడదని యును, ఆసంఘములో భారతీయులకు సంబంధ ముండదనియును వదంతులువ్యాపించుచున్నవి. భారత రాజ్యాంగముల విషయమై భారతీయు లకు సంబంధ[illegible]ము లేక నెవరికిసంబంధముండునో బర్కెనుహెడు ప్రభువునకు దెలియును గాని యితరులకు దెలియదు. రాజ్యాంగ సంస్కార ణము లెటులున్నను సైనికమంత్రి సర్ లెవిం గు వర్ట్రింగ్టనుగారి యోగమనము సైనిక పాశ బంధమును దృఢతమము చేయునున్నది. భరత ఖండమునందు శాశ్వతముగను బ్రిటీషు సైన్య మును నిర్మించుట భారతదేశమునకు హృద యశల్యమై స్వరాజ్యమును స్వప్నరాజ్యమును చేయగలదు. [illegible]వలెనే భారత [illegible] [illegible]సమును బ్రిటీషు రాజ్యాంగమునకు స్వా[illegible] [illegible]నపుడు భరతవర్షమునకు నిరంతరము స్థిరశరణ్యముగాని స్వాధీనస్థితి సాధ్యము వర్తమాన నిస్సహాయస్థితియందు భార[illegible] లు తమ యసమ్మతిని దెలిపి సంతసింప ముందురు గాని కార్యమును సాధింప [illegible]ు. దేశహితైక పరాయణు లందరును కలిసి, బెజంటమ్మగారలవలెను తదేకదీక్షతో [illegible]యుట ధర్మముగ నున్నది.

* * * *

బెజంటమ్మ

[illegible]ంటమ్మగారి మానవసేవాపరత్వము, [illegible]శము, వాక్పటుత్వము, కార్యపరా[illegible]ము వారికి ప్రపంచరంగమునం దున్నత స్థానమును గలుగ జేసినవి. బెజంటమ్మగారు పాశ్చాత్యసంజాతయైనను భారతీయ సమాజ ముతో సంపూర్ణైక్యమును బొందినది. బెజం టమ్మగారివలెను మత సాంఘిక రాజకీయ ధర్మములందు భారతీయ సంస్కారమును బడ సిన పాశ్చాత్యులింకొకరు లేరని నిర్ణయము గను జెప్పవచ్చును. ఎనుబదేండ్లు నిండినను నవయావనోత్సాహముతో నవయుగ సందేశ మును వ్యాపింపజేయుటకును, భారత స్వాతం త్ర్యమును బడయుటకును బెజంటమ్మగారు చేయుచున్న ప్రయత్నములు భారతీయుల నుత్సాహవంతులను జేయుటకు జాలియున్నవి. గత శనివారమునాడు ప్రపంచమునం దంత టను దివ్యజ్ఞానసమాజములు జరిపిన వర్ధం[illegible] త్సవములు బెజంటమ్మగారి ప్రతిభను విశదము చేయుచున్నవి. శ్రీమ[illegible] వర్ధంత్యుత్సవముల ననుభవించు[illegible] సిద్ధిని బడయుటకు పరమేశ్వరుడనుగ్రహించు గాత! భారతీయులు గాంధి, బెజంటమ్మగారల వర్ధంత్యుత్సవముల యమూల్య లాభములను గ్రహించి దేవీనవరాత్రి పుణ్యకాలమునందు దీక్షాపరాయణులై స్వరాజ్య విజయములను బడయుదురు గాత!

భారతీయులు దుర్గాపూజను, సరస్వతీ పూజను, ఆయుధపూజను జేసి విజయధ్వజము లను బూని కామ్యార్థములను బడయుదురు గాత!

---

[illegible]ted by K. NAGESWARA RAO at the Andhra Patrika Press, No.7. Thumbu Chetty

...ణమునందు వర్ణింపఁబడినది. నందిమల్లయ్య ...య్య కవిద్వయముచే నాంధ్రీకరింపఁబడిన ...రాణమునుండి కొన్ని పద్యముల నుదాహరించు ...:

...త్యంతఘోరమూర్తులు మహా
హాలాహలజ్వాలధూ
...మ్రశూల్ భుజదండహిండితకుఠా
రప్రాసఖడ్గార్గళా
...ప్రాతముతోడ వెల్వడిరి రు
ద్రక్రూరగాత్రంబునన్
...కూశ్మాండాగ్ని వరః పిశాచఘనర
క్షోభూతవేతాళముల్.

పడపడ నార్చుచున్ దిశలు
బీఁటలువాఱ నదల్చి రుద్రుపై
...డచిన నమ్మహారథుఁడు
నవ్వుచు భూతపిశాచకోటిఁ జూ
...చుఁ జని వేయుఁ జొచ్చెఁ దప
ముల్ ధరణిం బడి వాతలింపఁగా
...డుసులు గుండ్లు దుండ్లు శవ
ముల్ పుఱియల్ పఱియల్ ముఖస్థలిన్.

ఈ దండంబున భూతపి
శాచంబులు దైవదేవసైన్యంబులు నా
రాచములు ముంప భూతపి
శాచములుం దఱుమ దేవసైన్యము విఱిగెన్.

విఱిగినఁగని ముఖశాలకు
నుఱికి వసుంధర వడంక నొండొరుఁ గడవం
బఱమచుఁ బందులు పటపటఁ
గొఱుకుచు నారుద్రసైనికులు దౌర్త్యమునన్. *

పురాణములందు భూతాసురయుద్ధములు, దేవా...యుద్ధములు చాల వర్ణింపఁబడినవి. భూతాసురయుద్ధములలో తారకాసురయుద్ధము, త్రిపురాసురసంహారము ముఖ్యమైనవి. వీనిలో కుమారస్వామియు (రుద్రుని కుమారుఁడు), భూతనాయకుఁడగు రుద్రుఁడును పాల్గొని యుండిరి. ఇది యటుండ నిచ్చి ప్రస్తుతాంశమునకు వత్తము. భూతగణనాయకుఁడు రుద్రుఁడు. ఈగణము లందు గణవిశేషములు చాలఁగలవు. ఒక్కొక్కగణము నకు ఒక్కొక్క గణనాయకుఁడు గలఁడు. అట్టి గణనాయ కులలో వీరభద్రుఁ డొకఁడు, ఇతఁడు సింహముఖగణ నాయకుఁడు. నందికేశ్వరుఁ డొక గణనాయకుఁడు. † ఇతఁడు ప్రమథగణాధిపతి.

## విఘ్నేశ్వరుఁడు-గణపతి

వినాయకుని నామములు అమరకోశమునం దిట్లీ యఁబడినవి:

'వినాయకో విఘ్నరాజ ద్వైమాతురగణాధిపాః
(అ)ప్యేకదన్త హేరమ్బ లమ్బోదర గజాననాః.'

ఇందు 'గణాధిపః' అను నామము మనకు ముఖ్యమైనది. దీనినిబట్టి యితఁడు కూడ నొక గణనాయకుఁడని తెలియు చున్నది. ఇతఁ డేగణనాయకుఁడో స్పష్టముగఁ దెలియ పఱుచుటకు నాకాధారములు సరియైనవి గన్పట్టలేదు. కాని యీక్రిందివిషయమును బట్టి వీరభద్రుఁ డెట్లు సిం హముఖగణనాయకుఁడో ‡ వినాయకుఁడుకూడ నట్లేగజ ముఖగణనాయకుఁడని నాకుఁ దోఁచుచున్నది. వరాహ పురాణమునందు వినాయకుని జన్మవృత్తాంతము గమని పుఁడు. చదువుటకు మనోహరముగా నుండుటకై ము ఖ్యమైన పద్యములఁ గొన్నిటి నీక్రింద నుదాహరించు న్నాము:

సీ. పలుమాఱు సోమరి చలిగాలి సోఁకునఁ
గదలెడు నీలాలకములు చూచి
తోలుకారు క్రొమ్మెఱుంగులవంటి రుచులు మం
డట వెనవల్లు నేత్రములు చూచి

* వరాహపురాణము, పంచమాశ్వాసము దక్షాధ్వరవిధ్వంసఘట్టము చూడుఁడు. పద్యములు 106–125 వఱ

† 'గణః సింహముఖో నామ వీరభద్రపురోగమః.' —మార్కండేయపురాణ

'గణేశ్వరపతిం దివ్యం రుద్రతుల్య పరాక్రమమ్, సనత్కుమారో భగవాన్ అపృచ్ఛ న్నందికేశ్వరమ్.' —మార్కండేయపు

‡ సింహముఖగణనాయకుఁడు అనఁగా నితని యనుచరు లందఱు సింహముఖు లని తెల నుది. దీనికి విపరీతార్థము తీయ సంకల్పించరాదు.

ఇది మనవారు పడెక్కి గొప్ప పొరపాటుగా గన్పట్టు చున్నది. *

పర్గిటార్ (Pargitar) పండితుఁడు పిశాచపద మొకప్పుడు జాతిపరముగా నర్థమై క్రమక్రమముగా దయ్యమువరముగా నర్థము వాడుకలోనికి వచ్చినట్లు వ్రాయుచున్నాఁడు. మనకు పర్గిటార్ సాక్ష్య మక్కఱ లేదు. మనగ్రంథములే మనకు పైవిషయము వేనోళ్ళఁ జెప్పుచున్నవి. విద్యాధరాదులు దేవయోనులని జాతిపద ముగా గ్రంథములు వాకొనునప్పుడు మన కొక పాశ్చాత్య పండితుని నిర్వచనమే వేదవాక్యముగా నెంచుకొనవక్కఱ లేదు. రుద్రుఁడు భూతజాతి నాయకుఁడనియు, రుద్రుఁడే గణదేవతలలో నొక్కఁడని వక్కాణింపఁబడినప్పుడు ఈ భూతజాతి గణములుగా విభజింపఁబడి యుండెనని యు, నీభూతగణముల కధిపతి రుద్రుఁడనియు గొంచెము యోచించి చూచిన విశదము కాఁగలదు.

## భూతజాతి-గణములు

భారతదేశమునందు భూతజాతివారు ఆదిమనివా సులుగాఁ గన్పట్టుచున్నారు. వీరి ప్రశంస బ్రహ్మాండపురా ణమునందును, మార్కండేయ పురాణమునందును గన్పట్టు చున్నది.

బ్రహ్మాండపురాణమునందలి యీక్రింది శ్లోకముల మనింపుడు.

........తతః క్రోధాత్ క్రోధాత్మనో వినిర్మితాః
వ కపిశే నోగ్రాః తే భూతాః పిశితాశనాః
భూతత్వా త్తే స్మృతా భూతాః
..........
ప్రజాః సృజేతి వ్యాదిష్టః బ్రహ్మణా నీలలో
సోఽభిధ్యాయాసతీం భార్యాం నిర్మమే చా
నాధికాన్ న చ హీనాంస్తాన్ మానసే నా
సహస్రం చ సహస్రాణాం అసృజత్ కృత్తివ
తుల్యాన్ వాత్మనా సర్వాన్ రూపతేజోబ
పింగలాన్ సనిషంగాంశ్చ కపర్దీ నీలలోహితాన్
..........
అన్నాదాన్ పిశితాదాంశ్చ ఆజ్యపాన్ సోమ
..........
భూతా విజజ్ఞో భూతాంస్తు రుద్ర స్యానుచరా
..........
...బ్రహ్మచాధిపతిం దదౌ
సర్వభూత పిశాచానాం గిరీశం శూలపాణినమ్.*

మార్కండేయపురాణములో నొకచోట
'చతుర్థకా భూతగణాయ ఏవ
తత్ర స్థితా యేఽఖిల భూతసంఘాః.'
అని చెప్పబడినది.† కాన వీరు రుద్రానుచరుల వీరీదేశమునందు (ఆర్యావర్తప్రాంతమునందె యు స్థిరనివాస మేర్పరుచుకొనిన ఆదిమనివాసులనియు, గరికులనియు, వీరిసంఘము గణములుగా విభ బడెననియు స్పష్టమగుచున్నది.

దక్షయజ్ఞవిధ్వంసావసరమున రుద్రాను భూతపిశాచగణములు తమనాయకునికిఁ జేసిన సహా

*" Powerful races of hostile character are often mentioned such as Dana tyas, Rakshas, Nagas, Dasyus. Some of these are practically civilized w ers were rude and savage and were sometimes cannibals. These races w uced to subjection and barbarous practices repressed and as they came un influence of Aryan civilization, these names became opprobrious, until at len y cease to possess any ethnological force and turned into purely evil appellations the word 'Asura' and all became synonymous with the meaning 'demon'. This proc gone on continuously thus Pichachis (పిశాచి) was originally the name of a tribe a mately turns tomean an impost goblin." Ancient Historical Tradition, Page: 2

† పై శ్లోకములు శ్రీ పరవస్తు లక్ష్మీనరసింహస్వామిగారు రచించిన (Ancient Indian Trib The Bhutas అను గ్రంథమునుండి తీసికొనఁబడినవి. అష్టాదశపురాణములను బాగుగా పఠించి వాని నెఱింగినవారిలో శ్రీనరసింహస్వామిగారు మొదటివారుగా పరిగణింపవలసియున్నది. పర్గిటార్ (Ancient Historical Tradition) ఈ భూతజాతినిగుఱించి ప్రశంసించి యుండుగా మునందలి భూతప్రశంస గుఱించి యుండలేదు.

మొత్తంమీద రాజుకంఠానికి పడ్డది వురి. అతని మనస్సులోమాత్రం నారదునిమాట యథార్థమని నమ్మకముంది. పైగా గురుకులవాసం చేసేరోజుల్లో క్షీరకదంబుడిదగ్గిర తాను కూడా ఈయర్థాన్నే వినియున్న విషయం జ్ఞాపకంకూడా వచ్చింది. అయితే స్వస్తిమతికి ఇచ్చినవాగ్దాన మేమి, పర్వతుడిమీద వుండే అభిమానం [...]ం అతన్ని అన్యథాగా ఒప్పుకోని పోతున్నవి. కాబట్టి అతడు ఏదీ పాలుపోక చాలాసేపు తంటాలుపడి మర్నాడు తీర్పునట్లుగా సభవారికి చెప్పి ఏలాగో బహులాగు ఆనాటికి సభను ముగించాడు.

అయితే మాత్రం తప్పుతుందిగనకనా. మర్నాడు యథాప్రకారం సభ కూడింది. సభవారంతా తొలినాటి వివాదం తీర్చాలసిందని కోరినారు. వసురాజు సత్కారాదు లయినతర్వాత తీరుస్తా నన్నాడు. సభ కాదని పట్టుపట్టింది. పట్టదా మఱి?-ఏమంటే లోకం ఎవర్ని గొప్పగా భావిస్తుందో కార్యకాలమందు వారి యనుష్ఠా[...]ంచడం సహజమే కదా. కాబట్టే పెద్ద లన్నారుకదా—

† "సర్వవిద్వీతరాగో యో
ధర్మం బ్రూయాన్మృతం వ్రజేత్
ప్రామాణ్యతో యతః పుంసో
వాచః ప్రామాణ్య మిష్యతే—అని.

—వసునేమి

వసురాజు ఇంతవఱకూ ధర్మపక్షపాతి అని పేరు పొందాడుకాబట్టి ఆయనమాటను ఇట్టికాలంలో ప్రజలు నిరీక్షించడం ఒకవిధంగా ధర్మమే. కాని నెగ్గించుకొనే యోగ్యత అతను సంపాదించుకోవలసి యున్నది. ఈ విధంగా సభ పట్టుపట్టేసరికి వసురాజు ధర్మనిర్వాహణం చేసుకోలేక మోహానికి గురియై పోయాడు. వెంటనే నారదుడి మాటకంటే పర్వతుడిసిద్ధాంతమే ని[...]దనిన్నీ తాను దివ్యసింహాసనంలో వుండి చెప్ప[...] అదే అందఱికిన్నీ అంగీకరించదగ్గదనిన్నీ చెప్పివే[...]సాడు మఱి. పెద్దలు ఇందుకనే అన్నారు

‡ "మన్యే న ప్రాయశః స్తేషాం
కర్ణౌ శ్చ హృదయాని చ
యై రభ్యాసే గురో శ్శాస్త్రం
సంశ్రుతం నావధారితమ్—అని.

—ఆచార్యసుందరుం[...]

ఈవిధంగా వసురాజు చెప్పే చెప్పడంతో సభంత హాహా-యని నివ్వెఱపాటు పొందింది. తో[...] నారదుడు లేచి అన్నాడుగదా—"రాజా ధర్మం [...] వదలనివాడవు. నీవే ఇట్లు సంప్రదాయవిజ్ఞా[...] త్రోసివేస్తే ఇక ఇతరుల సంగతి ఏమని చెప్ప[...] అయితే ప్రస్తుతం నీవు లోకానికి అంతకూ ప్రమా[...] వున్నావుకదా. ఇట్టి నీయందు గల సద్భావం [...] లేక దుర్భావం గానీ లోకానికి తెల్పవలసింది [...] దేవతే కదా! అయితే వేదాలు సద్విద్యలూ [...]దాయవేత్తలూ చెప్పే ధర్మదేవతయే లోకంలో ఆ[...] బ్రహ్మమూ వ్యాపించియుంటే-నీవున్నూ ధర్మాన్ని [...]సరించకుండా వున్నా వని నేను చెప్పేమాట స[...] అయితే అందుకు ఫలంగా నీదివ్యసింహాసన మా[...] క్షణంలో బ్రద్దలై పోవుగాక"-అని శపించినా[...]టనే పటపటమని ఆసింహాసనం బ్రద్దలై భూ[...] పోయి వసురాజు అధఃపాతాళాన పడిపోయి[...]

* "తస్మాత్ప్రాణక్షయే చాఽపి
కష్టకోటినిధాయకం,
అసత్యవచనం సద్భి
ర్న వాచ్యం శుభ మిచ్ఛుభిః.—బ్రహ్మద[...]

† సర్వవేత్త యనీ, వీతరాగుడనీ ప్రసిద్ధిగాంచినవాడు సత్యముగా చెప్పినదే ధర్మమని ప్రజలు విశ్వసి[...] ఏమంటే,ఎంతటి గొప్పమాటకైనా దాన్ని చెప్పేవాడిగొప్పతనాన్ని పట్టేకదా ప్రామాణ్యంకూడా సిద్ధిస్తూవుం[...]

‡ ఎవ్వరు గురుశుశ్రూషాపూర్వకంగా సంప్రదాయవిరుద్ధంగా శాస్త్రపాఠము చేయరో, చేసినా[...] వారిమాటయందు అపనమ్మక ముంచుకొని దానిని ప్రమాణంగా తీసికొనజాలకుందురో అట్టి వారి [...] చెవులలోగాని, హృదయాలు హృదయాలలోగాని లెక్క—పొందుట లేమాత్రం తగివుండదని తలుస్తాను.

* కాబట్టి ప్రాణాలు ఎగిరిపోయ్యే స్థితి వచ్చినా, అది ఎంత లాభకరమై వున్నా అసత్యమును సత్పురు[...] శుభకామన గలిగియుండే ఎవ్వరుకూడా ఎప్పటికీకూడా చెప్పనే చెప్పరాదు. ఏమంటే అసత్యవచనంకంటే మి[...] కష్టకోట్లను గల్గించేవస్తువు లోకంలోమఱి ఎక్కడా ఇంతవఱకూ లేదు. ఇటుపై నుండదు.

తర్వాత నారదుడు లోకపూజితుడైనాడు. అది మొదలుకొని ఆయన జైనధర్మవ్యాప్తికై విశేషించి కృషిచేసి, సమ్మతను లేకొంతికాలానికి గిరికటమునే రాజ్యం పాలించి చివర రోజుల్లో విరాగియై, మునియై క్రమంగా సర్వార్థసిద్ధిపదవిపొంది విరాజిల్లినాడు. నిజమే. జైనధర్మంవల్ల సాధింపరానిది వుందా? కాబట్టే నారదుణ్ణి గురించి పెద్దలు ఇల్లా ప్రశస్తిని చెప్పినారు:

శ్లో. జిత్వా సర్వకువాదినో దృఢతరః శ్రీనారదో...
శ్రీమత్స్వరాజేంద్రశాసన మహా సింధోర్లసచ్చంద్ర...
ధృత్వా సారతపః ప్రసిద్ధమహిమా సర్వార్థసిద్ధిం...
స శ్రీమాన్ ద్విజవంశమండనమణిః కుర్యాత్...
మంగళ...

ఇది జైనుల పవిత్రకథలయందు 8 వది వసుర... కథ ముగిసినది.



# పాములాడు

కవికొండల వేంకటరావుగారు, బి.యే.బి.యెల్.

(గీతిక)

సీ-బిచ్చమెత్తే నాగసారము
ఇచ్చనాడుచున్నాది?
పుచ్చపూల వెన్నెల—నీ
ఇచ్చిచూపుచున్నాది?
ఆప్రక్కకూకుడుండి
తో—పలుకులాడుతూ వుంటూ
చాపలల్లుకుంటూ
మా—పల్లెకొచ్చే పిల్లంట్రా!
చిప్పచేత పుచ్చుకొని
యీధియీధి తిరుగాడే
బొట్టెడంట్ర బొంతమీద
నిదరపోతు సెదరకుంట?
నీయిల్లు వాకిలేదర?
ఈయిక్కగాన్ను సెట్టునీడ
తీసివేసె గుడిసెర?—ఓ!

పాములాడ! పాములాడ!
పట్టుపట్టు నాగసారము
పట్టుర యింకొక్క పాలి:—
బుట్ట చిలువ వేసుకు నువ్వు
పట్టెడు బియ్యంబు నడుగు
చట్టెయాడునపుడు కసరి
కొట్టినాడ కొట్టినాడ.
అట్టిపాటె యిపుడు నీవు
గుట్టుగ నీహాయిబాడ
గొప్పపాట లాగుతోంచు
పుట్టత్రాచు దోబూచు
లాడించేవు చింతకాడ!
పాములాడ! పాములాడ!
పట్టుపట్టు నాగసారము
పట్టర యింకొక్కపాలి.

# మీకు మేలైన సువాసనగల అత్తరులు కావలెనా?

ఉత్తమమైన అత్తరులకు రాజని పిలువబడు **ఆటోదిల్‌బహార్‌ను** వుపయోగించుడు




కొన్ని బిందువులను మీ చేరుమాలుపై చిలికినతోడనే యింపగు, పుష్పసంబంధమగు సువాసన నీచుట్టుపట్లవ్యాపించును.

ఇంతటిరమ్యమైన, మనోహరమైనవాసనను నీవు బజారులో కొను యితర అత్తరులలో పొందజాలవు.

'ఆటోదిల్ బహార్' అను పేరును యిపుడు జ్ఞాపకమునకు తెచ్చికొనుడు. దానిని ఒకమారుపయోగించుడు. దాని మనోహరమైన, శాశ్వతమైన సువాసనసతత్వయత్వమును చెందుదువు.

| | | | | |
|---|---|---|---|---|
| ½ ఔన్సు | బుడ్డి | వెల | రు. | 2–0–0 |
| ¼ | ,, | ,, | రు. | 1–4–0 |
| 1 డ్రాము | ,, | ,, | రు. | 0–12–0 |
| మాదిరిసీసా | | ,, | రు. | 0–2–0 |
| సువాసనగలకార్డులు | | | రు. | 0–1–0 |

వి. పి. చార్జీలు ప్రత్యేకము

కొనునపుడు దయచేసి 'ఆటోదిల్ బహారు' అను పేరును జాగ్రత్తగా పరిశీలించి కొనుడు. అన్నిచోట్లను అమ్మబడును.

సోల్ ఏజంట్లు:—

ఆంగ్లో యిండియన్ డ్రగ్ అండు కెమికల్ కంపెని,

285, జుమ్మామసీదు బజారు, బొంబాయి.

---

# లుగాని, తీపులుగాని, ఏవైననుసరియే తొలగింపవచ్చును



ఏల నొప్పులవలన బాధపడవలెను. ఆ నొప్పులు తలయందైననుసరే, దేహ ...ట్లనైననుసరియే, నడుమునొప్పి, వాయువునొప్పులు, పడిశెము, గొంతు ...ొప్పులు, కీళ్లనొప్పులు, నాడినొప్పులు, బెణుకునొప్పులు, మొదలగు ...రియే, తప్పక త్వరలో

'అడమేన్స్ సైప్రెన్ సాల్వ్'

...మ్పును. ఇది వుపశాంతికరమగు అంజనము కాదు. ఇది చాలా ... ఇది చాలా విలువగల ఓషధులచే తయారుచేయబడినది. దీనిచే ...పోయి తక్షణమే నిన్ను ఆనొప్పియొక్క బాధనుండి తొలిగించును. ...భపడిరి.

...బుడ్డి 1 కి రు. 1–0–0. వి. పి. చార్జీలు ప్రత్యేకము.

...ాధనివారిణి ఫలమును కనుగొనుటకు యీ క్రింద పేర్కొనిన అంగడినుండి 2 అణా...ొనవచ్చును.

. బి. పారెక్, 259, చైనాబజారు, మద్రాసు.

...గ్లో యిండియన్ డ్రగు అండు కెమికల్ కంపెని,

285, జుమ్మామసీదుబజారు, బొంబాయి.

# ఏల మీరు కామినియాతైలమునుమాత్రమే వాడవల

(రిజిష్టరు చేయబడినది)




ఎందుకనగా:

కామినియాతైలము వెంట్రుకలకు చాలలా

కామినియాతైలము వెంట్రుకలు ఊడిపోవు

కామినియాతైలము వెంట్రుకలు పొడవు గాను కాంతిగాను తోడ్పడును.

కామినియాతైలము సువాసనతైలము మా అయితే వెంట్రుకల కావలసిన ఓషధు గలవు.

కామినియాతైలము పుర్రెకు చల్లదనమును డకు విశ్రాంతి నిచ

చదువుడు, ఆలోచింపుడు, • ఆర్డరున

కలకత్తాలోనున్న ఫార్వర్డుపత్రిక తెలిపినది:—"ఆంగ్లో ఇండియన్ డ్రగ్ అం మికల్ పంపబడిన అత్తరులు, వాసనతైలములు విభజింపబడి, పరీక్షచేయబడుటవలన అందులో హానికర లేదని రుజూవుపరచబడినది. కామినియా వాసనతైలమునందు మనోహరమైన అత్తరు చేర్చబడిన చలువను గలిగించును."

పి. యు. ఆర్. కార్వెల్లో, ఎస్. ఏ. సర్జను, పెరా ద్వీపమునుండి వ్రాసినది:— "కా మిక్కిలి మంచిదనియు, తృప్తికరమైనదని నిస్సందేహముగా కనుగొంటిని. ప్రత్యేకముగా దు త్వరలో గుణమును గలిగించును. ప్రస్తుతము వాడుచున్న నా రోగులకందరికిని దీనిని శిఫార్సుచే

బుడ్డి 1 కి ధర రు. 1_0_0 వి. పి. ఖర్చులు రు. 0_

బుడ్లు 3 కి ధర రు. 2_10_0 ,, ,, ,, 0_

